ప్రాచీనభారతవర్ష

మహర్షులచరిత్రలు



ము ష్యా క్ర మ ము

ము వేంకటేశ్వరులు ఎం. వీ.

920.034
VEN

C.I

920.034
VEN
N-11810

AUTHOR వేంకటేశ్వరులు, ఇలపాము
వేంకటేశ్వరులు

TITLE మన దేశపు వింతలు విశేషాలు

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

విషయసూచిక

విషయము.	పుటసంఖ్య.
1. అంగిరోమహర్షి	
1. జననము	1
2. తపోనిరతి	3
3. వివాహము	3
4. సంతానము	5
5. అంగిరసుఁ డగ్నియగుట	6
6. చిత్రకేతుననుగ్రహించుట	9
7. తీర్థయాత్ర	13
8. అగ్నిని ఋషిపత్నులను శపింపుట	18
9. బ్రహ్మవిద్యాబోధ	20
10. అంగిరస్స్మృతి	23
11. అంగిరసుల మహాన్నత్యము	25
12. అథర్వవేదములో అంగిరసులు	27
13. బ్రాహ్మణములలో	28
14. ఉపనిషత్తులలో	32
15. అనుబంధము	167
2. అరుణిమహర్షి	
1. స్తుతి	33
2. జననము	33
3. తపస్సు	34
4. అరుణినిషాద సమావేశము	34
5. బెబ్బులి మ్రింగఁజూచుట	36
6. బెబ్బులి శాపవిమోచనము	36
7. నిషాదుని గటాక్షించుట	37
8. గృహస్థజీవనము	38
9. పుత్రునిగర్వ ముడుపుట	39
10. బ్రహ్మజ్ఞానోద్బోధము	39
3. ఔర్వమహర్షి	
1. స్తుతి	46
2. జననము	46
3. ప్రళయతపము	49
4. బ్రహ్మచర్యవ్రతము	51
5. హిరణ్యకశిపు ననుగ్రహించుట	53
6. పుత్రినిగని వివాహముచేయుట	54
7. దుర్వాసుని శపించుట	56
8. సగరవంశమును గాపాడుట	57
9. సర్వధర్మములు తెలుపుట	59
10. గృహస్థధర్మములు	60
4. కండుమహర్షి	
1. స్తుతి	62
2. తపోనిరతి	62
3. ఇంద్రుఁడు ప్రమ్లోచననుబంపుట	63
4. ప్రమ్లోచన చేఁజిక్కించుకొనుట	65
5. కండుఁడు పశ్చాత్తప్తుఁడై మరల తపమొనరించుట	67
5. కణ్వమహర్షి	
1. స్తుతి.	69
2. మంత్రద్రష్టృత్వము	69
3. ఆశ్రమము	70
4. కారుణికత్వము	72
5. శకుంతలంగాంచి పెంచుట	72

విషయము.	పుటసంఖ్య.
6. శకుంతలావివాహము	73
7. శకుంతలకు వరమిచ్చుట	75
8. కాణ్వధర్మశాస్త్రము	77
9. కణ్వస్మృతి	169

6. కర్దమమహర్షి

1. స్తుతి	78
2. జననము	78
3. బ్రహ్మనియోగము	78
4. తపస్సు	79
5. హరి కర్దమునకు వరమిచ్చుట	80
6. కర్దముని వివాహము	80
7. సంసారయాత్ర	81
8. యోగబలము	82
9. మోక్షమునందుట	84

7. కాశ్యపమహర్షి

1. స్తుతి	86
2. బ్రహ్మవరము	86
3. పరీక్షిత్తు గాపాడఁబోవుట	87
4. తక్షకకాశ్యపసమాగమము	88
5. సిద్ధకాశ్యపసమాగమము	89
6. కాశ్యపస్మృతి	95

8. గర్గమహర్షి

1. స్తుతి	98
2. కృష్ణబలరాములకు జాతకర్మాదు లొనరించుట	99
3. శ్రీకృష్ణుని స్తుతించుట	103
4. రామకృష్ణుల కుపనయనము చేయుట	104
5. కార్త్యవీర్యార్జునుని మేలు కోరుట	105
6. గర్గునకుఁ గాలయవనుఁడు కలిగినవిధము	105
7. గర్గసంహిత	106

9. గౌరముఖమహర్షి

1. స్తుతి	108
2. పుణ్యాశ్రమము	109
3. దుర్జయుఁడనురాజు ససైన్యుఁడై వచ్చుట	110
4. విష్ణువు మణియిచ్చుట	111
5. దుర్జయుఁడు మణికొఱకు యుద్ధము చేయుట	112
6. మార్కండేయునిబోధ గాంచుట.	113
7. సాయుజ్యప్రాప్తి	116

10. జడమహర్షి

1. స్తుతి	117
2. జననాదికము	117

11. జాబాలిమహర్షి

1. స్తుతి	131
2. జననము	131
3. దేవతలవలన బ్రహ్మజ్ఞాన మందుట	132
4. గురూపదేశము	133
5. జాబాల్యుపనిషత్తు	133
6. జాబాలి శ్రీరాముని రాజ్యము చేయుమనుట	138
7. జాబాలిబుతంభరసంవాదము	140

విషయము.	పుటసంఖ్య.
12. మతంగమహర్షి	
1. స్తుతి	144
2. జననము : బాల్యము	144
3. పూర్వజన్మజ్ఞానము	145
4. తపోనిరతి	145
5. సాంసారికజీవనము	147
6. ప్రియంవదుఁ డను గంధర్వుని శపించుట	149
7. మతంగమహేంద్రసంవాదము	149
13, 14. శంఖలిఖిత మహర్షులు	
1. స్తుతి	154
2. జననము	154
3. తపస్సు	155
4. లిఖితుని యపరాధము	156
5. లిఖితుఁడు సుద్యుమ్నుని శిక్షింపఁ బ్రార్థించుట	158
6. సుద్యుమ్నుఁడు లిఖిత మహర్షి చేతులు గొట్టించుట	161
7. లిఖితుఁడు మరల చేతులు గాంచుట	161
8. లఘుశంఖస్మృతి	163
9. శంఖస్మృతి	163
10. లిఖితస్మృతి	164
11. శంఖలిఖితస్మృతి	165
15. అనుబంధము.	**166**
1. అంగిరస ధర్మశాస్త్రము	167
2. కణ్వస్మృతి	169

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R I.
Acc. No.

అంకితము



౧

శ్రీమద్భారతవర్షపూర్వబుషిసచ్ఛీలంబు మాహాత్మ్యమున్
నీమంబున్ దపమున్ శమంబు దమమున్ విజ్ఞానముం గన్నని
ష్కామిశ్రేష్ఠ! గురూత్తమా! పరమవిజ్ఞానప్రదీపా! కృపా
శ్రీమాన్యా! కయికొమ్మ మత్కృతి మహాశీర్వర్షివై హర్షివై.

౨

విమలపథంబుఁ జూపి కను విప్పయినాఁడవు దాన నేను సం
తమసములెల్ల నుగ్గయి నితాంతసుఖప్రదదివ్యదృష్టియే
యమరుటఁ జేసి సర్వమున నారయుచుంటిని నిన్నె; నీయెడన్
గమలభవాండకోటులను గాంచఁగఁ జాలుచునుంటి సద్గురూ!

3

పరమకృపాకటాక్షములఁ బర్వఁగఁ జేసి మహార్ష భారతా
మరకృతి గద్యకావ్యముగ మమ్మఁ దరింపఁగఁ జేయుకోసమై
గురువర! ప్రాయఁ జేసితివి కోటినమస్కృతు లయ్య! దేవ! నీ
సురుచిరసత్కృపాలహరిఁ జొక్కెద నిక్కృతిఁ గైకొనంగదే!



ఓమ్.

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

మూడవ భాగము

అంగిరో మహర్షి



బ్రహ్మమానసపుత్రవరుఁడై బుషీంద్రులఁ
దలమానికంబుగా వెలసె నెవఁడు?
అగ్నిహోత్రపదంబు నవలీలఁ గైసేసి
నిర్వహించె నెవండు ధూర్వహుఁ డయి?
ఆదర్శగార్హస్థ్య మనుపమానతఁ దాల్చి
యెవ్వండు నిజవంశ మెసఁగ నిల్పె?
త్రిజగంబులం గలతీర్థంబులం జూచి
వర్ణించె నెవ్వఁ డవ్వానిమహిమ?

బ్రహ్మవిద్వర్యుఁడును జగద్భారవహుఁడు
నయి యెసంగెను స్మృతి సంచయంబు నెవఁడు?
మనకుఁ గృప నట్టి యంగిరోమునిని భయము
భక్తి యెసఁగఁగఁ గొల్తు శుభమ్ము లెసఁగ.

జననము

శ్రీవిష్ణుమూర్తి నాభికమలమునుండి జన్మించిన బ్రహ్మదేవుఁడు సృష్టికార్యమునఁ దనకు సహాయులుగా నుండు రను నుద్దేశముతోఁ గొందఱు మానసపుత్త్రులను గాంచెను. తనముఖమునుండి యాతఁడిచ్ఛామాత్రమున నొక సుపుత్త్రుని గాంచి యాతనికి 'అంగిరసుఁ' డను నామకరణము చేసెను. పిమ్మటఁ బరమేష్ఠి తన బహుకాల తపోమహిమమునఁ దనపుత్త్రుఁ డగు నంగిరసుఁడు ముల్లోకములను

బ్రకాశింపఁ జేయు దివ్యతేజస్వి యగు నట్లనుగ్రహించి, 'వత్సా! నీవు లోకసంగ్రహార్థము మహోతప మొనరింపుము. నీవు నామానసపుత్త్రి లలో మూఁడవవాఁడవు. నీవు నాదయకుఁ బాత్రుఁడవై నేఁ గోరిన యపుడు వచ్చి నేను జెప్పినపను లెల్ల నిర్వహించుచు లోకసంరక్షణ మొనరింపుము. నీవు సుగుణఖని యగు నొకసుందరిని బరిగ్రహించి వంశవర్ధన మొనరింపఁ గలవు. మఱియు నీ వగ్నికల్పుఁడవై విశ్వ విఖ్యాతి నార్జించి వెలుఁ గొందుదు" వని తెలిపెను. అంగిరసుఁడు బ్రహ్మకు నమస్కరించి "తండ్రీ! సమస్తలోకములకు సృష్టికారకుఁడ వగు నీపం పొనరింప నేను సంసిద్ధుఁడను. లీలామాత్రముగా నీవు మ మ్మిటులు సృజించి మాచేఁ బనులుగొనునట్లు కాననగుదువు కాని, కమలాసనుఁడ వగు నీ వొనర్పఁజాలనిది కలదే? నినిచ్ఛాతుకవాత్సల్య లక్ష్మికిఁ దావలమైన నా యీజన్మము పరమధన్యముకదా!" యని యాతని మదికెక్కఁ బలికి యతని యానతిఁ గొని తపోగమనుఁ డయ్యెను. *

---

* ఇది భారతమునఁ గలకథ. ఈతని జన్మకథ ఐతరేయబ్రాహ్మణమున నిట్లు కలదు: ప్రజాపతి యగు బ్రహ్మ సరస్వతిని సృజించి యామెసౌందర్య మున కచ్చెరువంది యామెనే తనయాలిగాఁ బరిగ్రహించి యామెతోడి సం భోగ సుఖ మనుభవించెను. వినూతనమగు నాసంభోగ సనుయమున నాతని వీర్యము నేలపైఁ బడెను. ఇది తెలిసి దేవతలు పరుగున వచ్చి యగ్నిదేవుని సాయమున నాబీజ ప్రదేశమును గాపాడుచుండ నగ్నిదేవుఁ డానందాతిశయ మునఁ బ్రజ్వరిల్లెను. ఆయగ్నిదేవుని యంగారములనుండి యాబీజము పెంపారి బాలాకృతిని ధరించెను. ఇతఁడే అంగిరసుఁడు. (ఐతరేయబ్రాహ్మణము 3-34) ఈకథయే స్వల్పభేదముతో శతపథబ్రాహ్మణమునను గలదు. 4-5-1-8.)

గోపథబ్రాహ్మణమున. అంగిరసుని జన్మవృత్తాంత మిట్లు కలదు: వరుణ దేవుఁ డొకప్పుడు దేవతలకోరిక ననుసరించి మహోతపస్సు చేయఁ దొడఁగెను. ఆతని తీవ్రతపస్సువలనఁ గలిగినశ్రమ కారణముగా నాతనిశరీరమునుండి దివ్య రస ముద్భవించెను. ఈవిధముగా వరుణుని యంగము-దేహము-నుండి యుద్భ వించినరసమే మానవాకృతిఁ గాంచి యంగిరసుఁ డయ్యెను. ఈయంగిరసుఁడు మహోతపశ్శాలియై 'అంగిరసవేదము'నకు ద్రష్ట యయ్యెను.

(గోపథబ్రాహ్మణము 1, 1, 7-8.)

తపోనిరతి

అంగిరసుఁ డిట్లు తండ్రిచే నియోజితుఁడై పరబ్రహ్మ స్వరూపమును గుర్తెఱుఁగుటకుఁ, బాంచభౌతికమైన దేహమునఁ దగులు మమకారపరంపరల మటుమాయ మొనరించుటకు, నింద్రియాశ్వముల విచ్చలవిడిఁ బోనీయక యుత్తమశిక్షణ మొసంగి యదుపాజ్ఞలలో నుంచుకొనుటకు సరోత్తమమైన తపోనిష్ఠలోఁ బెక్కేండ్లుండి సర్వశక్తిమయుఁడు సర్వేంద్రియ నిర్జితుఁడునై యాతఁడు సర్వేశ్వర సదృశుఁ డన వెలుఁగొందుచుండెను.

తండ్రి యగు బ్రహ్మదేవునికృపచేతనే యంగిరసునకు దివ్య తేజము పుట్టుకతోడనే లభించెను. నిష్ఠాగరిష్ఠుఁడై యాతఁ డొనరించుచున్న మహాతపస్సువలన నాతఁ డింకను దేదీప్యమానముగా వెలుఁగొందుచుండెను. ఆతనితపశ్శక్తివలన నాతనికి సర్వశక్తులు లభించుచున్నను నాతఁ డిసుమంతయైన గర్వము నందఁ డయ్యెను. సర్వలోకప్రకాశమానమగు నాతని తేజోవిశేషమునను నతనికిఁ దపో విరమణదృష్టి పొడమదాయెను. నిరంతరతపోధ్యానామృతమునఁ జుబ్బనచూఱ లాడునాతనికిఁ దపోవ్రతవిరమణమున నిచ్చపుట్టదయ్యె నన్న నచ్చెరు వేమున్నది? లుబ్ధదృష్టితో సర్వ మార్జించుటవలనఁ గలుగుసంతోషముకన్న సర్వత్యాగమువలని సంతోష మెంతయుత్కృష్టము! దేహబంధుమమకారమునకును దానిని దగ్ధ మొనర్చు నచంచలతపోనిష్ఠకును నెంతదప్పు!

వివాహము

ఈప్రకార మంగిరసుఁడు తపోమూలమున మహర్షిత్వ మందఁగని విజ్ఞాననిధియు వివేకఖనియునై యనేకములగు వేదమంత్రములకు ద్రష్టయు బహుముఖము లగు ధర్మములకు శాసకుఁడునై విలసిల్లుచుండెను.

అంతకుమున్నే విశ్వసృష్టికై బ్రహ్మచే నియోగింపఁబడి కర్దమ ప్రజాపతి సరస్వతీనదీతీరమునఁ బదివేలసంవత్సరములు దివ్య తప మొనరించి విష్ణుమూర్తి కటాక్షముచే కళ, అనసూయ, శ్రద్ధ, హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి యను తొమ్మండ్రు కూఁతుండ్రను, కపిలాచార్యుఁడను పుత్త్రుని నిజసతియగు దేవహూతి యందుఁ గాంచెను. కాలక్రమమున నీతనికూఁతులు త్రిలోకసుందరులు, సర్వలోక సద్గుణసంపన్నలు, మహాశక్తిప్రభావాన్వితలు నయి యుక్తవయస్సుఁ గాంచి వివాహయోగ్యలై కమలాకరమున విలసిల్లు పద్మములవలెఁ గర్దమప్రజాపతిగృహమున కత్యంత శోభాయమానలు కాఁజొచ్చిరి.

అంతఁ గర్దమప్రజాపతి సుతలకుఁ దగినపతుల నన్వేషింపఁ దలంచి, తనదివ్యదృష్టిచే మరీచి, అత్రి, అంగిరసుఁడు మున్నగు బ్రహ్మర్షులే తన కల్లుం డ్రగుట బ్రహ్మలిఖితముగాఁ గని, తా నొర్చు కన్యాదానమును స్వీకరించి తన్ను ధన్య నొనర్పుఁడని తగినవారిని మరీచి, అత్రి, అంగిరసుఁడు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, భృగుఁడు, వసిష్ఠుఁడు, అథర్వుఁడు నను నవబ్రహ్మలను బిలువనంపెను. కర్దముని యాహ్వానమును మన్నించి యాఋషులు విచ్చేసిరి. అంగిరో మహర్షి కూడ నీతరుణముననే కర్దమగృహమునకు విచ్చేసి యాతని కన్యను బరిగ్రహించుట కంగీకరించెను. అంతఁ గర్దముఁ డమితానంద మున దేవహూతీసహితుఁడై మరీచికిఁ గళను, అత్రి కనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హవిర్భువును, పులహునకు గతిని, క్రతువునకుఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠున కరుంధతిని, అథర్వునకు శాంతిని నొసఁగి నిజకులాచారానుసారముగ నిరుపమవైభవముతో నఖిలదేవర్షి సంఘములు నిర్మలవేదమంత్ర నినాదములు నింగిముట్టింప వివాహము నొనరించెను. సర్వలోకసంపూజ్య

ములగు వీరివివాహములకు విచ్చేసిన సర్వర్షి సర్వదేవసంఘములు వీరి నాశీర్వదించి వెడలిరి. దేవహూతీకర్దములు కూఁతుల నల్లురతో సంభావనాసంభావితులం జేసి, యనశ్వరమగు నాత్మానందసింహాసన ముల నధిష్ఠించి యజరామరత్వమునందను, అత్యంతపవిత్రజీవనమున నఖిలలోకముల కాదర్శప్రాయులు కాఁగను, అఖిలలోకప్రతిభాశాలు రగు పుత్త్రులను, అత్యుత్తమ పతివ్రతాశిరోమణులగు పుత్త్రికలను గాంచి వంశాభివృద్ధినందింపను, ఆశీర్వదించి వారివారియిండ్లకుఁ బంపివేసిరి.

ఈవిధముగా నంగిరో మహర్షి శ్రద్ధను ధర్మపత్నిఁగా గ్రహించి యత్తమామల యమోఘాశీస్సులతోఁ దనయాశ్రమమునకు విచ్చేసి గృహస్థజీవనము నద్భుతముగా నిర్వహింపఁ దొడంగెను.

సంతానము

బ్రహ్మజ్ఞాని యగు నంగిరసుఁడు విద్యావినయ వివేక సౌశీల్య యగుశ్రద్ధయుఁ బరమపవిత్ర దంపతులై చేసినసంసారయాత్ర మోక్ష లక్ష్మిని జేరుటకుఁ జేసినసప్తవ్యాహృతియే కాని నలసారమువంటి సామాన్య సంసారయాత్ర మాత్రము కాదు. కాల కర్మములకు నిం ద్రియవాంఛా ప్రవృత్తులకు వా రతీతులై నియమధనమును, నిగ్రహ సంపదను, నిరుపమతపోనిధులను వారు సంసారయాత్రలో సంపాదిం చుకొనిరి. ఈశ్వర ప్రియములు సర్వేశ్వరోద్దిష్టములు నగు పవిత్ర కార్యములలో నిమగ్నులై, జగమంతయు నీశ్వరమయముగాఁ గనుచు, మనోవాక్కాయకర్మములు పరమేశ్వర పాదాంబుజముల యందే నిశ్చలముగా నిలుపఁ గలిగి, నిత్యానందాబ్ధిలో వా రోలలాడు చుండిరి.

ఇట్లు గృహస్థజీవనమును సైతము తపోమయజీవితముగా నిర్వహించుచు అంగిరసుఁడు పరమేష్ఠి యగు తన తండ్రియాదేశమును శిరసావహించి తనధర్మపత్ని పతివ్రతాతిలకము నగు శ్రద్ధయందు బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనసుఁడు, బృహన్మంత్రుఁడు, బృహద్భానుఁడు, బృహస్పతి యను నేడ్గురు పుత్రులను; భానుమతి, రాక, సినీవాలి, ఏకానేక, అర్చిష్మతి, హవిష్మతి, మహామతి యను నేడ్గురు పుత్త్రికలను గాంచెను.* వీరిలో బృహత్కీర్తియే యుతథ్యుఁడను నామాంతరమునను బృహజ్జ్యోతియే సంవర్తుఁడను మఱియొక పేరఁ బిలువఁబడుచుండెడివారు. కాలక్రమమున నంగిరసుని పుత్త్రికలకు బహుపుత్రులు వారిపుత్రులకుఁ బుత్రులు నెందఱో జనించుటచే నాతనివంశము తామరతంపరయై విశ్వమంతయు నలముకొనెను. అంగిరసునిపుత్రులను పౌత్రులను బ్రపౌత్రులను గూడ అంగిరసు లనియు, అంగిరులనియు, ఆంగిరసు లనియు శ్రుతిస్మృతిపురాణములు పేర్కొని యున్నవి.

వీరిలో అయాస్యుఁడనువాఁ డొకమహర్షియై యనేక వేదమంత్రములకు ద్రష్ట యయ్యెను. ఆతనినే అయాస్యాంగిరసుఁ డని పిలుతురు. ఈతని సంతతివారే అయాస్యులు. ప్రస్తుతము గౌతమస గోత్రులు అంగిరస, అయాస్య, గౌతము లనుత్రయార్షేయులు. ఈవంశమునకు మూలపురుషుఁ డైన బ్రహ్మర్షి అంగిరసుఁడు.

అంగిరసుఁ డగ్నియగుట

పూర్వ మొకప్పుడగ్నిహోత్రుఁడు దేవతలపైఁ గోపించి తన విధ్యుక్తధర్మములు నిర్వర్తింప మాని రహస్యముగ నేకాంతవాస

---

* కాని, అంగిరసునకు ఉతథ్యుఁడు, బృహస్పతి, సంవర్తుఁడు అను మువ్వురుకొడుకులు. గుణాశ్రయ యోగసిద్ధి. యనుకూఁతురు మాత్రమే పుట్టినట్లు భారతము ఆదిపర్వము (౩ ఆ. ౬౬) నఁ గలదు.

మున నొకయడవిలోఁ దపస్సుచేయుచు నుండఁదొడఁగెను. అప్పుడు దేవత లీవిషయము బ్రహ్మకుఁ దెలిపి నిత్యకృత్యముల కాటంకము కలు గకుండుటకై ప్రతివిధాన మేదైనఁ గావింపుమని కోరిరి. అంత, బ్రహ్మ దేవుఁ డాలోచించి యగ్నిదేవునికన్నఁ దేజస్వియు నుత్తమవ్రతసంప న్నుఁడు నగు అంగిరసుఁడే యగ్నికృత్యములు నిర్వర్తింపఁగలఁ డని యూహించి యామహర్షి యాశ్రమమున కేతెంచెను. శ్రద్ధాంగిరసు లాతని నతి శ్రద్ధాభక్తులతోఁ బూజింప నాతఁడు వచ్చినపనిఁ దెలిపి యనంతతపోబలమున మహాతేజస్వియై యెల్లలోకములను బ్రకాశింపఁ జేయు నంగిరసు నగ్నిపదమున నిలిపి యగ్నివిధులెల్ల నిర్వర్తింప నియమించెను. అంగిరసుఁడు వినయమున నంగీకరించి యాతనిని వీడ్కొలిపెను.

అప్పటినుండి యంగిరసుఁడే యగ్నియై దేవతలకు సర్వలోక ములందును జరగుయజ్ఞములనుండి హవ్యభాగములను మోసికొని పోయి వారి యాదరగౌరవముల కెంతయో పాత్రుఁడై యగ్నిలేని లోపమును జక్కఁగాఁ బూరించి యాతనికన్న మిన్నగా నన్నిపనులు నిర్వర్తించుచుండెను. ఇట్లుండ నంగిరసుని ప్రభావసంపన్నతచేఁ దన పేరు జనులు విస్మరించుట నెటింగి యగ్నిహోత్రుఁడు తన యవివే కమునకు వగచి యిఁక నేమటినచోఁ దన నామరూపములే నశించి పోఁగల వని భయపడి మరల నిజస్థానమును గైకొన నరణ్యమునుండి దేవలోకమునకు విచ్చేసెను. కాని, యంగిరసుఁ డత్యద్భుతముగాఁ దనపనులను నిర్వర్తించుచు దేవతలకుఁ బ్రీతిపాత్రుఁడు నత్యంతతేజో విలసితుఁడునై యుండుటఁగాంచి మిక్కిలి వెఱఁగంది యాతనిముందు నిలువనైన నిలువలేక తేజోవిహీనుఁడై తిరిగి వనభూముల కేఁగ మఱలెను. ఆతనిని గాంచిన యంగిరసుఁడు సగౌరవముగాఁ బిల్చి "మహాత్మా! చరాచరప్రపంచమున కంతకును భుక్తిముక్తిప్రదాతవు

నీవు. నీవు లేనిచో బ్రపంచ మొక్కఱుణమైన నిలువఁగలదా ? మహా తేజస్వివై ననీవు నీకార్యము లొనర్చుచు లోకసంరఱుణ మొనరిం పుము. నీవు లేనికారణమున బ్రహ్మచే నియోజితుఁడనై యీ కార్య ములు నేను చేయుచున్నాను. కాని, నీతో నే నణుమాత్రము సరి పోలను. నీయగ్ని పదవిని నీవే స్వీకరించి నన్నును లోకములను గట్టా ఱింపు" మని వేఁడుకొనెను.

సర్వశక్తి సంపన్నుఁ డైనను నంతవినయగరిమ వివేకబుద్ధి కనఁబఱచిన యంగిరసునకు భయభక్తులతోఁ బ్రణామము లొనరించి యగ్నిదేవుఁడు 'మహర్షి! నీతేజోగరిమవలన నాయూరుఁ బేరు లన్నియు నశించినవి. ముల్లోకములందు నీప్రభావ మనంతముగా నలముకొన్నది. అగ్నిస్థానమున సర్వశక్తి సంపన్నుఁడవగు నీవే యుం డవలయునుగాని తేజోవిహీనుఁడనగు నేనుండ నర్హుఁడను గాను. మఱి నీవు కాదు కూడ దందువేని నీవు ప్రథమాగ్నివై యుండి నాకు రెండవ యగ్నిస్థానము నొసంగుము. అంతియే కాని నిజముగా నీకంటె నెన్నఁడును మిన్నఁ గాఁజాలని నన్ను నీవట్లు కోరుట ధర్మ ముకా"దని పలికెను. అందుల కంగిరసుఁడు 'దేవా! కాలకర్మవశ మున నొక్కొక్కప్పు డెంతవారైనఁ దేజో విహీను లగుచుందురు. కాని, యచిరకాలముననే వారు మరల నిజప్రభావము నందఁగలరు. క్రోధకారణమున నీవిట్లు కొంతకాలము తేజోహీనుఁడ వైన నైయుండవచ్చును. అంతమాత్రమున నీనైజప్రభావము శాశ్వతముగాఁ గొఱవడదుకదా! కావున, నీవే ప్రథమాగ్నివై యథాపూర్వముగా నీవిధుల నిర్వర్తించి లోకహితము చేయుము. మఱి యిఁక గాదు కూడ దందువా నన్నుఁ బుత్రవాత్సల్యమున రెండవ యగ్నిస్థాన మున నిలుపుము. నీకు విధేయుఁడనై నీయాజ్ఞలను శిరసావహింతు"

నని చెప్పెను. అందుల కగ్నిదేవుఁడు వల్లె యని తాను బ్రథమాగ్ని స్థానమున నిలిచి యంగిరోమహర్షిని ద్వితీయాగ్నిస్థానమున నుంచి యాతని మహానుభావత కనురూపముగా నాతనిపుత్రుఁ డగుబృహస్పతికి సంభావనపూర్వకముగాఁ దృతీయాగ్నిస్థానము నొసంగి వారిరువురను దనతోడివారి నొనర్చుకొనెను.

ఇట్లు సర్వోత్కృష్ట మగుతపోధ్యానలబ్ధతేజోబలమున నంగిర సుఁడు సకలజగత్పావన మగునగ్నిదేవతాస్థానము నంది వెలుఁగొందు టయే కాక తనపుత్త్రుఁ డగుబృహస్పతికి నట్టిస్థానమును సంపాదించి యది వంశక్రమాగత మగునట్లు చేసికొనెను.

అంగిరసుఁడు చిత్రకేతు ననుగ్రహించుట

తొల్లి శూరసేనదేశమును చిత్రకేతుఁ డనురాజు పరిపాలించు చుండెను. ఆతఁ డైశ్వర్యమున దేవేంద్రునిఁ బోలి, తుమాదిసుగుణం బుల కాటపట్టయి, ప్రజారంజకముగ రాజ్యమేలుచుండెను. గుణమండ నుఁడు, అంచితకీర్తి కాముఁడు నగునాతనికిఁ దారుణ్య మదనతురం గులు, కందర్పవిజయఖడ్గలతలు, మదనమోహనమంత్రదేవతలు, పంచశిలీముఖునిబండెకత్తెలు ననఁ జెలువొందు కోటిమంది నలినాక్షులు భార్య లుండిరి. ఆతఁ డమితకీర్తివైభవములతోఁ జెలువారుచుండియుఁ గోటిమందిభార్యల నేలుచుండియు సంతానమునుమాత్రము కనఁజాల డయ్యెను. రూపము, ప్రతాపము, భోగము, యౌవనము, యోగ్య వర్తనము, దిగ్విజయము, సత్యము, కీర్తి, సతులు మున్నగునైశ్వర్య ము లెన్నియున్నను నాతనికి సంతతిలేనిదుఃఖమును మాన్పఁజాల వయ్యెను. ఇట్లు నిరంతర దుఃఖమానసుఁ డైనచిత్రకేతునిపై దయగొని యొకనాఁ డంగిరసుఁ డీతనియింటికి విచ్చేసెను.

చిత్రకేతుఁ డంగిరోముని కెదురేఁగి యాతని కతిథిసత్కారము లనేకము లొనరించి యుచితాసీను నొనర్చి భార్యాసహితుఁడై యాతని నెంతయో సేవించెను. అంగిరసుఁ డాతని కుశల మడిగి "రాజా! రాజ్యచక్ర మంతయు నీయధీనమేకదా? పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము, మహత్తు, అహంకారము–అను నీ యేడింటిచేతను సంరక్షితుఁ డగుజీవునివలె అమాత్యజనము, జానపదులు, దుర్గములు, ద్రవిణము, సంచయము, దండము, మిత్రము అనుసప్తవిధప్రకృతులచేతను సురక్షితుఁడవై ప్రకృతిపురుషులపై సమస్త భారమును విడిచి నిర్మమత్వమున నిరుపమరాజ్యసుఖము లనుభవింతువుగదా? మఱియు భార్యలు, ప్రజలు, మంత్రులు, భృత్యులు, పౌరులు, జానపదులు నీకు వశవర్తులై యున్నారుగదా? ఏమిది! సర్వమును గలిగినసార్వభౌముఁడ వయ్యు నీముఖమున దుఃఖచిహ్నములు తాండవ మాడుచున్న వేల!" యని యడిగెను. చిత్రకేతుఁడు "మహర్షీంద్రా! మీతపోబలమున మీ కెఱుఁగరాని దేమున్నది?" యని తలవాల్చి యూరకున్నఁజూచి యంగిరోమహర్షి సర్వముఁ దెలిసి దయాళువై యారాజుచేఁ బుత్రకామేష్టిఁ జేయించి యజ్ఞశేషము నాతని ప్రథమభార్య పట్టమహిషి యగుకృతద్యుతి యనునామె కొసంగి "దేవీ! నీకు పుత్త్రుఁడు కలుగును. అతని వలన నీవు సుఖ దుఃఖము లనుభవింతు" వని చెప్పి వెడలిపోయెను.

తరువాత, కృతద్యుతి గర్భమును ధరించి నవమాసములు నిండినంత నొకకుమారునిఁ గాంచెను. చిత్రకేతుఁ డపరిమితానందము నంది కృతస్నాతుఁడు సకలభూషణ భూషితుఁడునై సుతునకు జాతకర్మాదు లొనరించి సర్వవర్ణములవారిని మహా దానముల రంజింపఁ జేసి సుఖముండెను. ఆకుమారుఁడును దినదిన ప్రవరమానుఁ డగుచుండ రాజు సుతునిగన్న కృతద్యుతియందే బద్ధానురాగుఁడై యుం

డెను. ఇది గని మిగిలినభార్య లసూయచెంది రాజునకుఁ గృతద్యుతి యందిట్టి మహానురాగమునకుఁ గారణ మాపుత్త్రిఁడే యని గ్రహించి దారుణచిత్తలె యాతనికి విషమిడిరి. ఆబాలుఁడు సుఖనిద్రితునివలె వెంటనే మరణించెను. రాజును రాణియు నీదుఃఖవార్తను విని యాత నిపైఁ బడి తలమొల యెఱుంగక పెద్దపెట్టున విలపించుచుండిరి.

ఈసంగతియంతయు నెఱింగి కరుణాళుఁడై యంగిరసుఁడు నారదునితోఁ గూడి యట కేతెంచి దుఃఖమూర్ఛితుఁ డైన చిత్రకేతుని గనుంగొని 'రాజా! ఏమిట్లు మతి దొరఁగి విలపింతువు? నీకు వీఁ డెవఁడు? నీవెవ్వనివాఁడవు? ఈనీపుత్త్రి మిత్త్రాదులు పూర్వజన్మ మున నెవరిపుత్త్రి మిత్త్రాదులో నీ వెఱుంగఁ గలవా? నదీవేగమునఁ జేరి తొలఁగుచున్న యిసుకరేణువుల వలెఁ బ్రాణులు పుట్టుచుఁ జేరుచుఁ జచ్చుచుండును. విష్ణుమాయవలన భూతములకు భూతములు పుట్టి నశించును. దీని కింత విచారించుట ప్రాజ్ఞులక్షణము కాదు. నీవు, మేము, తక్కినవారు కూడ ఈకాలమున జన్మించితిమి. మటి మృత్యు వువలన విరామమందుదును; అచిరముననే చచ్చినవార మగుదుము. చావుపుట్టుకలు సత్యములు కావు. ఈశ్వరుఁడు లీలాలోలుఁడై భూత ములచే భూతములఁ బుట్టించును. వానిచే వానిని పెంచును. వానిచే వానిని నశింపఁ జేయును. ఆతనిచే సృజింపఁబడిన దేనికిని స్వతంత్రత లేదు. ఆతఁడు ఖాలునివలె నిరపేక్షుఁడు. దేహియైన పితృదేహము చేత దేహియైన పుత్త్రిదేహము మాతృదేహమువలనఁ గలుగుచుం డును. ఈరితినే బీజమువలన బీజము పుట్టుచుండుట దేహికి శాశ్వత ముగా జరుగుచుండును. సామాన్యవిశేషములు సన్మాత్రవస్తువునకుఁ గల్పింపఁబడినట్లే దేహమునకు జీవునకు ననోన్యవిభాగ మజ్ఞానమునఁ గల్పింపఁబడెను. దహనక్రియల నగ్ని యొక్కఁ డయ్యుఁ బెక్కురూపం బులఁ గానఁబడునట్లు, ఒక్కఁడైన జీవుఁడు పెక్కుఖంగులఁ గాననగు

చుండును. ఆత్మజ్ఞానరహితులు దీని నెఱుంగలేరు. దేహి దేహసంయో గము కలలో భయమునుగొలుపు ప్రయోజనమును నడపి మేలుకని యాకలలో జరిగినది తనకుఁగాదని యెఱుంగురీతిని జీవుఁడే తానని జ్ఞానగోచరుఁ డెఱుంగును. కావున, అన్నియు మనోమాత్రములే యని మోహతమమును విడిచిపెట్టి భగవంతుఁ డైన వాసుదేవునిపైఁ జిత్తము నిలిపి నిర్మలాత్మకుఁడ వగు"మని బోధించెను.

చిత్రకేతుఁ డీయుపదేశామృతమునఁ దెలివందియు దుఃఖ భారమున వారిని గుర్తింపఁజాలక మీరెవ్వ రని యడిగెను. అందులకు అంగిరసుఁ డిట్లనియె. "ఓరాజా! పుత్త్రికామి వైన నీకుఁ బుత్త్రి ననుగ్రహించిన యంగిరసుఁడను నేను. ఈతఁడు నారదసుహోముని. దుస్తరపుత్త్రిశోకమున మునిఁగిన నిన్నుఁ గరుణించి పరమజ్ఞాన ముపదేశింప వచ్చితిమి. నీదుఃఖమును మాన్పుఁ బుత్త్రిని బదికించితి మేని పుత్త్రివంతు లగువా రనుభవింపవలసిన మహాతాపము నీ వను భవింపవలసి వచ్చును. లోకమున సతీసుతులు, సర్వసంపదలు, భోగ భాగ్యములు, అతిచంచలములు. రాజ్యము, భూమి, బలము, ధనము మొదలగున వెల్ల శోకము, మోహము, భయము, బాధ వీని నెడ తెగక కలిగించుచుండును గాని సుఖముల నీయఁజాలవు. మఱియు నివి గంధర్వనగరమువలెఁ, గలలోఁ గనవైనసంపదఁ బోలి, కానఁబడు చుండునే కాని మనోభవములగు నర్థములఁ గూడి స్వార్థంబులై కానఁబడవు. కర్మములచే ధ్యానము చేయుమనములు నానాకర్మ ములు గలిగించుచుండును. ఈదేహి దేహము ద్రవ్యము, జ్ఞానము, క్రియ యను మూఁడింటితోఁ గూడుకొని దేహి కనంతము లగు దుఃఖ ములను గలిగించుచుండును. కావున, నీవు నిర్మలమగు మనస్సుతో నాత్మగతిని బెదకికొని శాశ్వతపదవి నందుము." అని బోధించెను. చిత్రకేతుఁ డీయుపదేశమునఁ దెలివందియుండ నారదుఁడు తనప్రభా

వసునఁ జచ్చినపుత్త్రిని బ్రదికించి యాతనిచేతనే యాతనికిని జిత్ర కేతునకు లవమాత్రము సంబంధము లేదనియు:

"సతు లెవ్వరు సుతు లెవ్వరు
పతు లెవ్వరు మిత్త్రిశత్రుబంధుప్రియసం
గతు లెవ్వరు సర్వాత్మక
గతుఁడై గుణసాక్షి యైనఘునుఁ డొక్కనికిన్."

అనునాత్మజ్ఞానమును బోధింపఁ జేసెను. అపుడు చిత్రకేతుఁడు వగ లుడిగి సర్వసంపదలు త్యజించి నారదోక్తమార్గమున మోక్షపద మంది వెలుఁ గొందెను. ఇట్లు అంగిరోమహర్షి భక్తితత్పరులు సంసా రార్ణవములో మునిఁగి వివేకహీను లైనపు డఖండజ్ఞానబోధామృత మున నెందఱనో తరింపఁ జేయుచుండెడివాఁడు. అనంతరము నార దాంగిరసులు సరససల్లాపములతో నాత్మజ్ఞాన రహస్యములను బెక్కు వక్కాణించుకొనుచు యథేచ్ఛాగమనమున బ్రహ్మలోకమున కేఁగిరి.

అంగిరసుని తీర్థయాత్ర

అంగిరసుఁ డొకానొకప్పుడు కశ్యపమహర్షి వలన సమస్త తీర్థ ముల ప్రభావము నెఱిఁగి యెల్లతీర్థముల నోలలాడి విచ్చేసెను. ఆపిమ్మటఁ గొంతకాలమునకుఁ గౌతమమహర్షి యంగిరసునిపాలికి విచ్చేసి "మహాత్మా! పరమార్థసారము కడముట్ట నెఱిఁగిన పుణ్య పురుషుఁడవు నీవు. నీమానసము నిష్కల్మషము. శాంత్యానందములు నీపాలికాఁపులు. నీవు నాయందు దయయుంచి సర్వతీర్థ రహస్యము లను దేటతెల్ల మొనరింపవే" యని ప్రార్థించెను. అంగిరసుఁ డానం దియ్యై యాతనితో "గౌతమా! నీవడిగిన విషయము మహోన్నత మైనది. శ్రద్ధాభక్తులతో దీనిని విన్నవా రమర్త్యత్వముఁ గన్నవా రే. కావున, వినుము:

'చంద్రభాగ' యనుతీర్థమున వరుసగా నేడుదినములు స్నాన ముచేయువారు సర్వపాపములు పోఁగొట్టుకొని పరమపుణ్యు లగు దురు. అందలి జలములు తరంగపరంపరలచే నృత్యము సలుపుచుం డును. నరుఁ డందు సుస్నాతుఁడై యుపవసించి యేఁడుదినము లా జలములఁ గ్రుంకు లిడినచో నాతనిసద్గతిని వర్ణింప శేషున్నైన నలవి కాదు.

కాశ్మీరదేశమున నెన్నియో నదులు జనించి సింధునదిలోఁ గలియుచున్నవి. ఈతీర్థముల నోలలాడిన నరులు సత్ప్రవర్తనము కలిగి ఈలోకమున సమస్తైశ్వర్యములు గని తుదకు ముక్తి నందుదురు.

పుష్కరతీర్థమునను, ప్రభాసతీర్థమునను, నైమిషతీర్థమునను, దేవిక, ఇంద్రమార్గ, స్వర్ణబిందు అను తీర్థములందును నోలలాడిన వారు స్వర్లోకమునంది యప్సరోపనీతనృత్యగానముల నానందింతురు.

'హిరణ్యబిందు' వనుతీర్థమునఁ బ్రశాంతచిత్తముతో స్నానము చేసినను, దానిని బహుముఖములఁ గొనియాడినను, 'కుశేశయ' 'దేవాంతము' లను తీర్థముల నోలలాడినను మానవుఁడు సమస్తపాప రాసులను ఱాళన మొనర్చుకొనఁగల్గును.

గంధమాదనపర్వత ప్రాంతమునఁ గల 'ఇంద్రతోయ' మను తీర్థమున మునుక లిడినచో ముక్తి కలుగును. మఱియుఁ గురంగ దేశమునఁ గల 'కరతోయ' తీర్థమున స్నానము చేసిన నరుఁడు మూఁడుదినము లుపవసించి మఱుల స్నానము చేసినచో అశ్వమేధ యాగఫలము నందఁ గాంచును.

గంగాద్వారమునను, నీలభూధరణమునను, కుశావర్తమునను, కనఖలమునను, బిల్వకతీర్థమునను స్నాన మాచరించిన నరుఁడు పాప దూరుఁడై పుణ్యగతి నందును.

బ్రహ్మచర్య వ్రతపాలనము, ఇంద్రియనిగ్రహము, క్రోధవిజయము, సత్యదీక్ష కలిగినమానవుఁడు 'అపాంప్రదము' నఁ గ్రుంకులిడుచో నశ్వమేధయాగఫల మందఁగనును. గంగానది యుత్తరమున శివునిస్థానమునుండి చనుచోట స్నానము చేసినవా రమృతాశను లగుదురు. మఱియు 'మహాశ్రమ' మనుతీర్థముల కడ నరుఁ డాహారము మాని యొకనెల యున్నచో సకలసిద్ధులు కాంచును. 'భృగుతుంగ' మను మహాహ్రదముదగ్గఱ మూఁడుదినము లుపవసించిన బ్రహ్మహత్యా దోషము తొలఁగును. 'కన్యాకూప' మనుతీర్థమున నగ్నిహోత్ర ముతోఁ గూడ నున్నవాఁడు భూలోకమునను, స్వర్లోకమునను గూడఁ గీర్తి కాంచును. 'సుందరికాహ్రద' మను తీర్థమున స్నానము చేసినచో నరుఁడు సుందరుఁడై జన్మించును. 'వైమానిక' మనుతీర్థమున మునిఁగిన స్వర్గము లభించును. 'విపాశ' తీర్థమున మునక లాడినవారికి సమస్తపాపములును బోవును. మూఁడుదినములు 'కాళికాశ్రమము' న బ్రహ్మచర్య దీక్షతో నున్న నరుఁడు జన్మరాహిత్యమును గాంచును. కృత్తికాశ్రమమున' స్నానముచేసి పితృతర్పణ మిచ్చిన నరుఁడు శివలోక మందు నని మునీశ్వరులు తెలిపిరి. 'ద్రోణ శర్మపదము', 'శరస్తంబము' 'దేవదారువనము' అను తీర్థములు తమ్ము సేవించినవారికి స్వర్గసుఖము లొసంగును. 'చిత్రకూటము', 'జనస్థానము' నను తీర్థసేవవలన రాజ్యలక్ష్మి లభించును. 'శ్యామాశ్రమ' మనుతీర్థమున శుచియై పఱుమునుదినము లుపవసించిననరుఁడు ధ్యానయోగఫలమును గాంచును. 'కౌశికవాల' మనుతీర్థమున నుపవాసము చేసి మౌనముతో నిరువదియొక్క దినము లున్ననరుఁడు పరమగతి నందును. 'మతంగవాపిక' యను తీర్థమున నొక్కనాఁడు నిలిచినవాఁడు సిద్ధుఁడగును. నెల యున్నచో 'నైమిశము' మహాయజ్ఞఫలము నిచ్చును. 'ఉత్పలావనమున' నున్నవాఁడశ్వమేధఫలము, నైశ్వర్యము గడించును.

గంగా యమునా సంగమమున నరుఁడు స్నానము చేసి కాలాంజన మను శైలమున నియతితో నిలచినచో ముక్తిగాంచును. "వైవస్వతి" యను తీర్థమును సేవించినచో మానవుఁడు తీర్థభూతత్వముఁ గాంచును.

మఱియు, ప్రయాగ కెన్నియో తీర్థములు వచ్చి చేరుచుండును. అందు నెలదినము లున్ననరుఁడు ముక్తిలక్ష్మిని సునాయాసముగా సంపాదింపఁగలఁడు.

అష్టావక్రము, కలవింకము, దేవహ్రదము, మున్నగుతీర్థముల సంసేవ నరునకు బ్రహ్మభావనము నొసంగును. ఊర్వశీ కృత్తికా యోగసిద్ధకీర్తి యైన 'లౌహిత్య" మనుతీర్థమును సేవించి మానవుఁడు పుండరీక మనుయాగమును జేసినఫలము నందును. "రామ హ్రదమునఁ" బండ్రెండు దినములు నిరాహారియై యున్న నరుఁడు సకలపాపములను బోఁగొట్టుకొనును. 'మహాహ్రద" మను తీర్థమున నెలదినము లుపవసించినవాఁడు జమదగ్నిమహర్షి కన్న పుణ్యలోకమును గాంచును.

వింధ్యమున నెలదినము లేకాగ్రతతోఁ దపముచేసిన మహాత్ముఁడు ధర్మజ్ఞుఁడై విలసిల్లును. 'నర్మద"లో స్నానముచేసి చక్రవర్తిత్వమును, "జంబూనదీ" మార్గమున సంయతచిత్తముతో మూఁడు మాసములయొక్క దినముండి సర్వసిద్ధులను మానవుఁడు పొందఁగనును.

"కోకాముఖ" మనుతీర్థమున మునిఁగి "తండులికాశ్రమమున" కేగి యట వల్కలములు ధరించి శాకాహారియై ప్రశాంతమనస్కుఁడై యున్న నరుఁ డటనున్న దశకన్యకామణుల కధిపతియై యజరామరత్వము నందును.

"కుల్య" యనుతీర్థమున మూఁడురాత్రు లుపవసించి శౌచియై యఘమర్షణజపము చేసినమానవుఁడు మహాశ్వమేధయాగఫలము నందును. 'ఆర్ష్టిసేనాశ్రమమున" నున్న మనుజుఁడు సర్వపాపములను బోఁగొట్టుకొనును. 'పిండారకమున నొక్కరాత్రి నిలిచిన నరుఁడగ్నిష్టోమయాగఫలముఁ గాంచును. 'ధర్మారణ్యము"నఁ గల "బ్రహ్మసరస్సు"న నోలలాడినవాఁడు పౌండరీక మహాయజ్ఞఫలమును గడించును. పార్వతికిఁ దండ్రియుఁ బరమేశ్వరునకు మామయు, సర్వరత్నాకరవిశ్వపుణ్యస్థానము నైనహిమాలయ పర్వతమున శాంతచిత్తుఁడై మునిసేవ, తపము, చేయఁగలిగిన నరుఁడు సిద్ధపురుషుఁడై బ్రహ్మలోకమును గాంచి చెలువొందును.

ఓ గౌతమా! కామక్రోధలోభ మోహమదమాత్సర్యములను విడిచిన నిర్మలచిత్తముతోఁ జేసిన తీర్థసేవయే పురుషునకు ఫలసిద్ధి నొసంగును. కాని, యొండువిధమున నేప్రయోజనమును గలుగదు. పుణ్యతీర్థసంసేవవలన నరునకు దమము, తపము, అహింస, శమము, శౌచాతిశయము నలవడును గాని వ్యర్థజలములవలన శుచిత్వము కలుగదు.

కాని, గౌతమా! ఒకరహస్యము కలదు. అలభ్యపదార్థములయందావంతయును గోరికలేక, లభించినపదార్థములు స్వల్పములైనను వానియెడ నసంతృప్తి కాని మమత్వము కాని లేక నిస్పృహులగు నీవంటివారు నిత్యశుచులు. వారికి నేఁ జెప్పిన తీర్థసేవలతోఁ బనియే లేదు. మఱియు నింకొక రహస్యము చెప్పుచున్నాను. వినుము, దుర్గమములు నతివిషమములు నగు తీర్థములను బోయి సేవింపలేకున్నను వాని నధికభక్తి యుక్తులతో నాత్మఁ దలంచినఁ జాలును. మానవునకుఁ గల సర్వపాపములు నశించిపోవును.

సర్వతీర్థ మహిమాశంసన మను వాక్యరత్నములు పరమ పవిత్రములు, అనుపమములు,మాననీయములు, స్వర్గదములు, పరమరహస్యములు. శ్రద్ధాభక్తి విధేయుఁడగు శిష్యునకు, నిజసుతునకు, ఆప్తమిత్రునకు,ఉత్తములకు దయతో నీవిషయములు తెలుపఁదగినవి. ఈతీర్థయాత్రాకథనము నిర్మలచిత్తముతోఁ బఠించినను, శ్రద్ధతో విన్నను నరునకు జాతిస్మరణము తోడిజన్మమును, అతిపుణ్య పురుషసంతతియును గలుగును." (భారతము. ఆనుశాసనిక పర్వము.)

ఈమాటలు గౌతము నానందవార్నిధిని ముంపఁగా నాతఁడంగిరసు నెంతయు స్తుతించి నిజాశ్రమమును కేఁగెను. అంగిరసుఁడు బోధించిన యీతీర్థసేవా ప్రసంగము మహాపుణ్య ప్రదమై విలసిల్లెను.

అంగిరసుఁ డగ్నిని ఋషిపత్నులను శపించుట.

తొల్లి యొకప్పుడు స్తవనీయ రూపసౌందర్యయుతలు, భువన మోహినులు, మంగళగుణాఢ్యలు, శృంగారవతులు, నవయౌవనాంగలు నగు సప్తర్షిపత్నులు వహ్నిమందిరమున వర్తిల్లుచుండిరి. అపుడగ్ని వారలఁ గనుంగొని కామమోహితుఁడై రతికాంక్ష కలుగ వారియంగములు ముట్టి భయపడి వారిసౌందర్యమున కచ్చెరువందుచు వారిని గాంచుచుండెను. ఆయతివలు పతిపద సరోజసమర్పిత స్వాంత లగుటచే అగ్నిసంపర్కము నెఱుంగఁజాలరైరి. కాని, పరస్త్రీవాంఛాకల్మషుఁ డగు అగ్ని యంతరంగము నాతని కాంతి విహీనతచే వెంటనే కనిపెట్టఁగల్గిన యంగిరసుఁడు కోపించి సర్వభక్షకుఁడవు కమ్మని యగ్నిని శపించెను. అగ్ని సచేతనుఁడై భయము చేతను లజ్జచేతను భక్తిచేతను అంగిరసుని స్తుతించి యథాపూర్వము వెలుఁగుచుండెను.

కాముకుఁ డగు పరపురుషునిస్పర్శవలన నపవిత్రలైన ఋషిపత్నులఁ గనుంగొని యంగిరసుఁడు "ఓకాంతలారా! మీదోషము

లేకపోయినను, కాముకుఁడగు అగ్నిస్పర్శవలన మీకును బరపురుష స్పర్శదోషము కలిగినది. ఆదోషమునకు మీరు ఫలమందనినాఁడు మీ సంపర్కమున మాకు మహాదోషము కలుగును. కావున, మీరు విప్రకులమున సుందరులై జన్మించి విప్రులభార్యలుకం"డని శపించెను.

అంత ఋషికాంతలు సంతాపస్వాంతలై రోదనము చేయుచు "మునికులతిలకా! మే మెన్నఁడును బరపురుషస్పర్శ మెఱుంగని వారము. పాప మెఱుంగనిపరమసతులము. అనఘమతులు, బ్రహ్మ నిష్ఠులు, భూరితపఃప్రభావయుతులు, మహనీయచరితులు నగు మాపతు లను విడిచి భూలోకమునకేఁగి యెట్లు జన్మముఁ గాంచి మనఁగలము?" అని పలికిరి. అంగిరసుఁ డాపలుకు లాదరించి దయాళుఁడై వారి ముఖ పద్మములఁ గాంచి తాను సర్వజ్ఞుఁడు వేదవేదాంగపారగుఁడు జ్ఞాన యోగసంపన్నుఁడయ్యు శోకపరవశత మూర్ఛిలి కొంతవడికిఁ దెలి వంది సోదరఋషులతో నాలోచించి యాపడఁతుల కిట్లనియెను.

"కాంతలారా! పుడమిలో నిజకర్మభోగులభోగము ఆక ర్మాంత మని శ్రుతులు పలుకును. మాతోడిభోగము మీకు గతమ యెయ్యెను. గతభోగము మరలఁ గలుగఁబోదు. ఎవరికైనను శుభాశుభ కర్మఫలము కుడువకపోరాదు. మీకు నాశాపము శుభప్రతిపాదకమే కాఁగలదు. మీరు భూలోకమున కరిగి విప్రభార్యలై వెలయుచు రాధారమణుని గాంచి గోలోకమునకుఁ బోఁగలరు. ఆపై శ్రీకృష్ణ యోగనూయానిర్మితములైన మిఛాయలు మూర్తిమంతములై విప్ర మందిరములకుఁ జని యచటఁ గొన్నిదినము లుండి మామాగృహము లకుఁ జనుదెంచును. నీరు నిజాంశములచే మరల మాకుఁ బత్ను లగుదురు" అని పలికెను.

ఆప్రకారము మునిపత్నులు భూతలమునఁ బుట్టి విప్రభార్యలై భక్తిచే శ్రీహరికి భోజనమిడి యత్యుత్తమమైన హరిమందిరమునకుఁ

జనిరి. వారిసిరి పూర్వమున కంటె నధికతరమయ్యెను. నీచలబ్ధసంపత్తి కంటె ఘనలబ్ధవిపత్తి చాల మేలుకదా! నిజముగా సత్పురుషుల కోపము మిక్కిలియుపకారమే యగును. పతిపరిత్యాగ మను విపత్తు ఋషిపత్నులకుఁ గలిగినను మోక్షసంపద కలిగినకారణమున నాఋషి పత్నుల చరిత్రము మహిమాస్పద మయ్యెను. ఆత్మపత్నులయెడ నల్పాల్పదోషమైనను మహర్షులు క్షమించి విడువరుకదా!

(బ్రహ్మవైవర్త పురాణము.)

అంగిరసుని బ్రహ్మవిద్యాబోధ

తొల్లి యొకప్పుడు శౌనకమహర్షి అంగిరసునికడ కరుదెంచి తనకు బ్రహ్మజ్ఞానము నుపదేశింపు మని శ్రద్ధాభయభక్తులతోఁ బ్రార్థించెను. అపు డంగిరసుఁడు శ్రద్ధ లేనివారికి బ్రహ్మవిద్య బోధించు నెంతదోషమో శ్రద్ధగలవారికి అడిగినప్పుడైనను బోధింపకుండుట అంతదోష మని యిట్లు బోధించెను:

"పరవిద్య యనియు, అపరవిద్య యనియు విద్య రెండు విధములు. ఋగ్యజుస్సామాథర్వవేదములు, శిక్ష, వ్యాకరణము, కల్పము, నిరుక్తము, జ్యోతిషము, ఛందస్సు అనువేదాంగములు—ఇవన్నియు అపరవిద్యలోఁ జేరును. అక్షరస్వరూపుఁడైన పరమాత్మను గూర్చినజ్ఞానమే పరవిద్య. పరమాత్మ కంటికిఁ గాన రానివాఁడు, ఇంద్రియములచే గ్రహింప ననువు కానివాఁడు, నిత్యుఁడు, సర్వవ్యాపకుఁడు, సర్వాంతర్యామి, అతీంద్రియుఁడు, నాశనరహితుఁడు. ఈపర మాత్మవలననే చైతన్యజడవిశిష్టమైన ప్రపంచము సృజింపఁబడినది. అతనియాజ్ఞచే బ్రహ్మ తపస్సంపన్నుఁడై అన్నమును సృజించెను; అందుండి ప్రాణాదులను సృజించెను.

ముక్తి నందుటకుఁ గర్మమార్గము, జ్ఞానమార్గము, నని రెండు మార్గములు కలవు. కర్మమార్గము త్రేతాయుగమున నెక్కువ ఫలప్రదముగా నుండెను. బహునియమనిష్ఠాపరులై యీశ్వరార్పణ

బుద్ధితో నిష్కామముగ సద్రూపపరమాత్మజ్ఞానమునకై కర్మము లాచరించి చిత్తశుద్ధివలన మోక్షము నార్జించినవారిమార్గ మిది. యజ్ఞమూలమునఁ జరుపురోడాశాదిద్రవ్యములను శ్రద్ధాభక్తులతో మంత్రపూతముగ నగ్నియందు హోమము చేయుట, అమావాస్య పౌర్ణములయందు ఇష్టులు చేయుట, చాతుర్మాస్య వ్రతములు చేయుట, నూతనముగా ధాన్యము వచ్చినపుడు 'ఆగ్రాయణము' చేయుట, అతిథ్యభ్యాగతపూజ చేయుట, వైశ్వదేవాదుల నొనరించుట, సకాలమున కాళి, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరూపి యనుసప్తజిహ్వాలు గలయగ్ని నుసాసించు చుండుట—ఇవి కర్మమార్గ క్రియలు. దీనివలన నింద్రలోకము బ్రహ్మలోకము సంప్రాప్తములయి నరునకు ముక్తి కలుగును.

శ్రద్ధాభక్తియుతముగా మహోతపస్సు చేయుచు, విరక్తులై అమనస్కయోగము, అస్పర్శయోగముల నభ్యసించుచు, శమదమాది షట్కసంపత్తి కలిగి, గురుసేవామూలమున జ్ఞానమార్జించి సూర్య ద్వారమున బ్రహ్మలోకము నట సమ్యగ్దర్శనమున మోక్షము నందుట జ్ఞానమార్గము.

పాంచభౌతికప్రపంచ మంతయు పరమాత్మచేతనే సృజింపఁబడి ఆయనయందే లయ మగును. ఆ పరమాత్మ ప్రకాశము రూపుదాల్చిన వాఁడు, అంతట వ్యాపించినవాఁడు, సమస్తజీవరాసులందు, బయట లోపల నుండువాఁడు, జన్మజరాదిషడ్భావ వికారములు లేనివాఁడు, ఊరాఊరముల కతీతుఁడు*, స్థూలసూక్ష్మకారణశరీరరహితుఁ డైన యుత్తముఁడు.

---

* కదలుచున్న జలములో కదలుచున్నట్లు కనఁబడుచంద్రుఁడు ఊరుఁ డనఁబడును. స్తిమితమైన నీటిలో నిశ్చలముగా నున్నచంద్రుఁడు అఊరుఁ డనఁబడును.

ఈపరమాత్మునినుండియే ప్రాణము, మనస్సు, ఇంద్రియములు, పంచభూతములు జనించుచున్నవి. అగ్ని యీతనిశిరస్సు. సూర్య చంద్రు లీతనినేత్రములు. దిశలే చెవులు. వాగ్వ్యాపారమే వేదము. వాయువు ప్రాణము. ప్రపంచము హృదయము. పృథివి పాదములు. అనఁగా నీతఁడు సర్వవ్యాపి. ఇతని నెఱుఁగువారే ముక్తులు.

ఈ పరమాత్మజ్ఞానము నందుటకై ఉపనిషత్తులను ధనుస్సుగాఁ జేసి, అంతఃకరణవృత్తిని బాణముగా నొనరించి, ఉపాసనయను పదును పెట్టి, పరమాత్మయం దేకాగ్రత కలమనస్సును బ్రహ్మముగా భావించి దాని నేయవలయును. అపుడు పరమాత్మయొక్క అపరోక్షజ్ఞానము కలుగును. అదియే మోక్షము.

దీనివలన సమస్తసంశయములు నశించును. అవ్యయానందము కలుగును. అజ్ఞానము రూపడఁగును. ప్రారబ్ధము, ఆగామి, సంచితము అను రూపములుగల కర్మము లన్నియు నిట్టి జ్ఞానమువలన నశించును.

శరీర మనునది వృక్షము. దీనిపై రెండుపక్షులు గలవు. అవి జీవేశ్వరులు. జీవుఁడు వేఱు శరీరము వేఱు అనునట్లు కనఁబడునుగాని యది సత్యము కాదు. కదలుచున్ననీటిలోఁ గదలుచున్నట్లు కనఁబడినను, కదలనినీటిలో నిశ్చలముగాఁ గనఁబడినను, ఆకాశమునందలి చంద్రుఁ డొక్కఁడే యైనట్లు, ఉపాధిదోషముచేఁ బరమాత్మ జీవేశ్వర భేదమునఁ దోఁచినను నిజమున కొక్కఁడే.

పరమాత్మ యాకాశముకంటె నధికపరిమాణము కలవాఁడై, ప్రకాశస్వరూపుఁడై, అవాఙ్మానసగోచరుఁడై యజ్ఞానుల కతిదూరుఁడు జ్ఞానుల కతిసన్నిహితుఁడు నగుచున్నాఁడు. హృదయాకాశ మాతని కుపలబ్ధిస్థానము.

ఈ శరీర మందలిహృదయాకాశ ముపలబ్ధిస్థానముగాఁ గల పరమాత్మ నెఱింగినవారు జన్మరాహిత్యము నందుదురు. ఈయెఱుక కోరికలు గలవారికి లభింపదు. నిత్యతృప్తుఁడగువానికే యపరోక్ష జ్ఞానము కలుగును. ఆతఁడు శుద్ధసత్త్వసంపన్నుఁడై దేహపతనకాల మందు సూర్యమండలముఁజేరి యటనుండి బ్రహ్మలోకముఁ జేరి పునరావృత్తిరహితమగు కైవల్యము నందును."

ఇట్లు బోధింప శౌనకుఁ డానందభరితహృదయుఁడై యంగిరసు నెంతయుఁ గొనియాడి యాతనికడ సెలవుగైకొని నిజాశ్రమమున కరిగెను. అంగిరసుఁ డిట్లు శౌనకునకు బోధించినవిషయములే ముండ కోపనిషత్తునఁ బ్రతిపాదతము లయియున్నవి.

అంగిరస్స్మృతి.

అంగిరసుఁడు మహాతపశ్శాలి, మహాభక్తుఁడు, మహావిజ్ఞాని, బ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁడు. ఇంతేకాక మహాధర్మప్రవక్తగఁగూడ నాతఁడు ప్రఖ్యాతి గాంచెను. ఆతఁడు బోధించినధర్మశాస్త్రరహస్యములే "అంగిరస్స్మృతి" యనుపేర విలసిల్లినవి. నేఁడాస్మృతి పూర్తిగా లభ్యముకాలేదు. కాని, విశ్వరూపుఁడు మున్నగు ధర్మశాస్త్రవ్యాఖ్యా తలు దీనినుండి పెక్కుదాహరణము లిచ్చియుండుటచే అంగిరస్స్మృతి స్వరూపస్వభావములు మనకుఁ జాలవఱకుఁ దెలియుచున్నవి.

"ఉత్తములగు నూటయిఱువదియొక్కమంది బ్రాహ్మణులు కూడినసభయే పరిషత్తు. మానవుఁడు శాస్త్రములు విధించినకర్మలు కాక యథేచ్ఛముగాఁ దనబుద్ధి ననుసరించి చేసిన కర్మములు బాలుని క్రీడాకర్మలవలె నిరుపయోగములు.* బ్రాహ్మణుఁడై మహాదోషము

---

* శ్లో. స్వాభిప్రాయకృతం కర్మ యత్తు ధర్మవివర్జితమ్
క్రీడాకర్మైవ బాలానాం తత్సర్వే నిష్ప్రయోజనమ్.

లొనరించినవ్యక్తి తుంతవ్యుఁడు కాఁడు. కాన ఆదోషపరిహారమున కతికఠోర మైన 'వజ్రవ్రతము' నాతఁ డనుష్ఠింపవలయును. పశు పక్షిసలతతిలో వేనిని జంపినను ప్రాయశ్చిత్తము చేసికొనవలయును. పతితో సహగమనము చేసినసతి చిరకాలము భర్తతోఁ గూడిస్వర్గసుఖ మనుభవింపఁగలదు.† కాని, బ్రాహ్మణస్త్రీ సహగమనము చేయరాదు. మనుధర్మశాస్త్రమునకుఁ బూర్వపు ధర్మశాస్త్రము లత్యుత్తమములు. వీని నతిక్రమించిన వచనము లాత్మహితములుకావు.§ ఇట్టివనేకము లగువాక్యార్థములు అంగిరస్స్మృతి'లోనివని పలుతావుల నుదాహ రింపఁబడి యున్నవి. 'బృహదంగిరస్స్మృతి' 'మధ్యమాంగిరస్స్మృతి' యనిమూఁడు విధముల నీస్మృతి వ్యవహారమునఁ గలదు. మొదటి దానికి మిగిలిన రెండును సంక్షేపగ్రంథములుగాఁ దోఁచుచున్నవి. అంగిరస్స్మృతి యనుపేరఁ ప్రాయశ్చిత్తవిధానముమాత్రము 23 శ్లోకములలోఁ గలదు. వానిలో నీక్రిందివి కొన్ని :

— అథాదౌ ప్రాయశ్చిత్తవిధానవర్ణనమ్ —

గృహాశ్రమేషు ధర్మేషు వర్ణానామనుపూర్వశః
ప్రాయశ్చిత్తవిధిం దృష్ట్వా అంగిరోమునిరబ్రవీత్.
అంత్యానామపి సిద్ధాన్నం భక్తయిత్వా ద్విజాతయః
చాంద్రం కృచ్ఛ్రం తదర్ధంతు బ్రహ్మక్షత్త్రవిశాం విదుః.
రజక శ్చర్మకారశ్చ నటో వరుడ ఏవచ
కైవర్త మేద భిల్లాశ్చ సప్తైతే చాంత్యజాః స్మృతాః.
అంత్యజానాం గృహే తోయం భాండే పర్యుషితంచ యత్
ప్రాయశ్చిత్తం యదా పీతం తదైవ హి సమాచరేత్.

* * *

---

† శ్లో. తిస్రః కోట్యోర్ధకోటీచ యానిలోమానిమానుషే
తావత్కాలం వసే త్స్వర్గే భర్తారం యానుగచ్ఛతి.

§ శ్లో. యత్పూర్వం మనునా ప్రోక్తం ధర్మశాస్త్ర మనుత్తమమ్
నహి తత్సమతిక్రమ్య వచనం హిత మాత్మనః.

ద్వావేతావశుచిస్యాతాం దంపతీశయనం గతా
శయనా దుత్థితా నారీ శుచిః స్యా దశుచిః పుమాన్.

* * *

రజసా శుధ్యతే నారీ నదీ వేగేన శుధ్యతి
భూమౌ నిఃక్షిప్య షణ్మాస మత్యంతోపహతం శుచి.

* * *

రాజాన్నం హరతో తేజః శూద్రాన్నం బ్రహ్మవర్చసమ్
సూతకేషుచ యోభుంక్తే స భుంక్తే పృథివీమలమ్.

అంగిరసుఁ డిట్లు ధర్మశాస్త్రప్రవక్తగాఁ బే రందెను. మహా తపోధనుఁడు, విజ్ఞాననిధి, జ్ఞానవిరాగఖని, గృహస్థరత్నము, ఋషి సత్తముఁడు నగు నంగిరోమహర్షి పుణ్యస్మరణము భారతీయుని భాగ్యవిశేష మనుటలో సందేహము లేదు.

అంగిరసుల మహాన్నత్యము

అంగిరోమహర్షిని వేదఋషులు మహోమహునిఁగ మహావైభవముగాఁ గీర్తించిరి. అంగిరసుఁడును, నతనిసంతతివారును ఆంగిరసు లనుపేరఁ బెక్కుసారులు ప్రబలగౌరవపురస్సరముగా వేదవాఙ్మయమునఁ బ్రశంసింపఁబడియున్నారు. వసిష్ఠుఁడు, భరద్వాజుఁడు, అత్రి, వామదేవుఁడు, విశ్వామిత్రుఁడు, గృత్సమదుఁడు మున్నగుమహర్షు లెల్లరు అంగిరసులను స్తుతించిరి. అంగిరసులు అథర్వవేదద్రష్టలు. యజ్ఞయాగాదిసమస్తకర్మలకు అంగిరసులవాక్యములే పరమప్రమాణములు.

ఋగ్వేదము అంగిరసు ననేకదేవతలతో నందు ముఖ్యముగా నింద్రాగ్నులతోఁ దుల్యునిగాఁ బేర్కొన్నది. కొన్నిచోట్ల అగ్ని యంగిరసుఁ డని, మఱికొన్నిచోట్ల అంగిరసుఁ డగ్ని యని కలదు.

* దీనినిబట్టి అగ్నిదేవుని కంగిరసు లన్న మిక్కిలి గౌరవ మునియు, నంగిరసుఁడే మొదట నగ్నిని ఆవాహనము చేసి మథించి గౌరవించి నట్లును స్పష్టము. ఇందుచేతనే యజ్ఞయాగాదులలో అంగిరసులచేఁ బ్రోక్తమైనపద్ధతి నావాహనము చేసిననే అగ్ని తృప్తుఁడగు నని ప్రతీతి.

పరాశరమహర్షి అంగిరసులు తనపితృదేవత లని పేర్కొనెను. అగ్ని, ఉషస్సు, సోముఁడు, సావిత్రి, మరుత్తులు, యముఁడు మున్నగువా రెల్లరు అంగిరసుల స్తుతించిరి. అంగిరసులు దేవతలను స్తుతింపఁగా వారు సంతోషించి అంగిరసుల యజ్ఞావసరముల కొక కామధేనువు నిచ్చిరి. దానిని అంగిరసులకై అర్యముఁడు పిదికెను. (ఋగ్వేదము 1. 139-7.) ఇంద్రుఁడంగిరసులు చేసినస్తుతికి, వారు తనకుఁ జేసినసాయమునకు వారికి ఋణపడియుండెను. వారి స్నేహము నాతఁడు కోరెను.

అంగిరసులు మొదట నగ్ని నారాధించినవారు. వారు పుణ్యమూర్తులు. వారి గొప్పతనమును మహాతపస్సుచే వృద్ధిచేసికొనిరి. వారి తపశ్శక్తివలన నసేకము లగుగోవులను వారు సృష్టించిరి. (10, 169-2.)

అంగిరసులు పూజనీయులైనపితృదేవు లనియు, వారు న్యాయపథవర్తు లనియు, మహాఋషు లనియు, యజ్ఞయాగాది కర్మ కాండను సృష్టించిన మహనీయు లనియు, అయాస్యాంగిరసుఁడు పేర్కొనెను. (ఋగ్వే. 10. 67-2) బృహస్పతి, అయాస్యుఁడు, ఘోరాంగిరసుఁడు, కుత్సాంగిరసుఁడు, మఱియు విరూపాంగిరసుఁడు, మున్నగుమహనీయు లంగిరసులలో శ్రేష్ఠులు.

---

* అగ్ని కొండొకకారణమున నరణ్యముల కేఁగి చెట్లనడుమ దాఁగుకొనె ననియు, నాతనిని అంగిరసుఁడే పట్టుకొని మథించి తీసికొనివచ్చె ననియు, నందుచే నాతని నంగిరసుఁడందు రని కలదు. (ఋగ్వే 5. 11-6.)

యజుర్వేదసామవేదములలోఁ గూడ ఆంగిరసుల ప్రస్తావన, ప్రశంస, పలుతావులఁ గలదు. ఆంగిరసులే యజ్ఞకర్మవిధాయకులనియు, వారివచనములే తరువాతివారి కెల్లరకు నాదర్శప్రాయములు, ననుసరణీయములు ననియు, తైత్తిరీయసంహితయందుఁ గలదు. ఇంతేకాదు. ఆతరువాతివారు ''ఆంగిరసులు తమయజ్ఞములలో నిట్లు చేసినారు. కావున, మనము నిట్లుచేయవలయును, అంగిరసు లిట్లు చేయలేదు కావున మనము నిట్లు చేయరా'' దను భావముతో అంగిరసులను వరవడులుగా నుంచుకొనువారు.

అంగిరసు లాదిత్యునితోఁ గూడి దర్శపూర్ణమాసయజ్ఞమును జేసి స్వర్గము నందిరి. మఱియు వారు సత్రయాగము, అహీనయాగము, దశరాత్రయాగము చేసి స్వర్గమున కేఁగి వారి యజ్ఞ ఫలమును భూలోకవాసు లగుఋషులకు ధారపోసిరి.* నాఁటినుండి స్వర్గకాము లెల్లరు నాంగిరసులవరవడినే యజ్ఞయాగములు చేసి స్వర్గమును జూఱగొనిరి.†

అథర్వవేదములో అంగిరసులు.

అంగిరసు లథర్వవేదములో దైవములుగను, పిత్రదేవతలుగను, మహర్షులుగను మూఁడువిధములఁ బేర్కొనఁబడిరి. ఆదిత్యులతోపాటు అంగిరసులకును మధుఘృతము లెల్లరు నర్పించెడివారు.$ వసురుద్రాదులతో సమానముగా వీరిని బేర్కొనుచు, వీరిని స్వర్గలోకదేవతలనియు, కష్టపరంపరలను నిర్మూలము చేయుశక్తియుక్తులనియు ఋషులు కీర్తించువారు.

సోమమును స్వీకరించుట కర్హులైనపిత్రదేవతలుగా వీరిందుఁ బరిగణింపఁబడిరి. దుర్మార్గులను శాపమూలమున నాశనముచేయుటకై వీరిని ప్రార్థించెడివారు. (ii. 12–4). ఆదిత్య వసువులతోడను, ఇష్టాపూర్తమమూలమునను, అంగిరసులు తమయాశ్రితులకష్టపరంపరలను

---

*(తైత్తిరీయసంహిత V 4.2-3) † (V 7. 2-2) $ అథర్వవేదము (xii.3-4)

బాఱద్రోలువారు. (ii. 12-4). వారు స్వర్గలోకప్రభువులై విరూపాదులతోఁ గలిసి తమ కిష్టులగుమానవులు చనిపోయినపుడు వచ్చి వారిని దమమార్గమున స్వర్గమునకుఁ దీసికొనిపోవుదురు.*

మహర్షులుగా నంగిరసులు యజ్ఞ కర్మవిధాతలుగను, మంత్ర తంత్రప్రవీణులుగను, తాంత్రికయజ్ఞ నిర్వాహకులుగ నిందు స్తుతింపఁ బడియున్నారు. ఆంగిరసులు భవరోగ వైద్యులే కాక సర్వరోగనివారకులుగఁ బేరొందిరి. వారు కనుఁగొన్న "కుష్ఠ" మనునోషధివలన నెట్టిరోగమైనఁ గుదిరిపోయెడిది.‡ ఆంగిరసులు ప్రయోగించినకృత్యలు శత్రునిర్మూలనము క్షణములోఁ జేసి వైచెడివి. ఈకృత్యలమూలము ననే అంగిరసులు దస్యుల బలదుర్గములను భేదించి విజయము నందఁగనిరి.$ అగ్నివైశ్వానరుఁడు వీరియెడ మిక్కిలి ప్రీతుఁడై వారివేద మంత్రములకు విశేషఫల శక్తు లనుగ్రహించువాఁడు.† వీ రన్న నెక్కువ మక్కువ కలిగి మిత్రావరుణు లెప్పుడును వీరిని గాపాడు వారు.§ అంగిరసులకు ఆదిత్యులకు చాలస్నేహము. అధర్వవేదద్రష్ట లంగిరసులే యగుట నందుఁ బలుతావుల వారిప్రశంస కలదు.

బ్రాహ్మణములలో నంగిరసులు

ఐతరేయబ్రాహ్మణమున నంగిరసులప్రశంస కలదు. ఆంగిరసుని జన్మవృత్తాంత మందుఁ గలదు. ఇంద్రునికిఁ బట్టాభిషేకమైనపుడు సర్వశక్తిసంపన్ను లగు అంగిరసులే మరుత్తులతోపాటు దివ్యసింహాసనమును బంపిరి. * వీరు దేవతాతుల్యులు. అంగిరసులయు ఆదిత్యులయు సంబంధ మిబ్రాహ్మణమునఁ గలదు. ఆదిత్యలోకప్పుడు యజ్ఞము చేయుచుండఁగా వారిపక్షమున అంగిరసులు యజ్ఞకృత్యములు నిర్వర్తించిరి. అందుకు మెచ్చి ఆదిత్య లంగిరసులకు భూమినీదానము చేసిరి. అంగిరసులు గ్రహించిరి. కాని, అభూమి తప్ప

---

* (అ. వే. XIX. 1-10). ‡ (అధర్వవేదము XIX. 39-5). $ (10-6-2) † (VI. 35-3) § (VI. 29-3.) * (ఐతరేయబ్రాహ్మణము 8-12).

మగుచుండుటచే వారు దానిని విడిచివేసిరి. అపుడు భూమిస్వరూపము వారు మార్చివేసిరి. తప్తమగుటయు నుడిపిరి. నాఁటినుండి భూమి యిప్పు డున్నట్లుండుటకు అంగిరసులే కారకులు.‡ ఋగ్వేదమునఁ గొన్నిమంత్రములకు ద్రష్ట యైనఁబట్టి యొకఁ డీబ్రాహ్మణమున అంగిరసుని వంశీయుఁడుగాఁ బేర్కొనఁబడెను.

తైత్తిరీయబ్రాహ్మణమున అంగిరసులనుగుఱించి యొకకథ కలదు. అంగిరసు లొకప్పుడు సత్రయాగము చేయుచుండిరి. వారి కొక తెల్లనియావు గలదు. దానిపాలు వా రాయాగమున నుపయోగింపఁదలఁచిరి. కాని, వానలు లేనికారణమున ఆయావు తినుటకు గడ్డిలేకపోయెను. వెంటనే అంగిరసులు 'కరీరి' యాగమునారంభించిరి. వెనువెంటనే దివ్యవర్షము కురిసి భూమిపై గడ్డి విస్తారము మొలచెను. కాని, వీరిపై నీర్ష్య వహించినపితృ లాగడ్డిని విషపూరితము గావించిరి. అది తెలిసికొని యాంగిరసులు పితృలఁ బిలిచి యట్లు చేయఁ గారణ మడిగిరి. "మీరు చేయునగ్నికర్మములలో మాకును బాలుగొన నవకాశ మిండు. అంత కన్న మా కేమియు వల" దనిరి. అది యాంగిరసు లాదరమున నంగీకరించి వారి కధ్వర కర్మములందు లేపమార్జనక్రియాకలాపముల నిర్వర్తింప ననుజ్ఞ యిచ్చి సంతోషపెట్టిరి. ఆపితృలును సంతోషించి గడ్డినుండి విషమును దీసివైచిరి.* ఆగడ్డి తిని యావు పాలిచ్చెను. దానివలన యజ్ఞకర్మము నిర్విఘ్నసమాప్తిఁ గాంచెను.

అంగిరసులు సామమంత్రప్రవీణులు. వారు స్వర్గమున కేఁగునపుడు వారితోఁ గూడఁ గొందఱు రాక్షసులు పోఁజూచిరి. కాని, అంగిరసులు హరివర్ణసామమంత్రములు చదువఁగా నా రాక్షసులు

---

‡ (తైత్తిరీయ బ్రాహ్మణము II.-11.) * తైత్తిరీయబ్రా. (II. 1. 1.)

పరాజయమంది పాటిపోయిరి.‡ ఇ క్లైన్ని యో విశేషములు చెప్పు సామవేదము అంగిరసులగొప్పతనము నంగీకరించి వారి నాదర్శప్రా యులనుగాఁ జెప్పినది.

అంగిరసులే ప్రథమమున అగ్నిని మథించి జ్వలింపఁజేసి రని శతపథబ్రాహ్మణము తెలుపుచున్నది. (1. 4. 1-25). అంగిరసులు మహా మహు లని వారి నీ బ్రాహ్మణ మెంతయు స్తుతించును. వారు యజ్ఞ కర్మవిధాత లనియు, యజ్ఞకర్మములలో నూతనవిధానములను సృష్టిం చి రనియు నిందుఁ గలదు. అగ్నిష్టోమయాగమున యజ్ఞ మేఖల ధరించుటకుఁ గారణమిం దొక కథలోఁ గలదు. అంగిరసు లొకయజ్ఞ మున 'వ్రతాశను'లై (స్వల్పమాత్ర మగుక్షీరపానము తప్ప నిం కేమియుఁ దినఁగూడ దను వ్రతము కలవారై) యున్నపుడు వారికి నీరసము వచ్చెను. వారు వ్రతభంగము కాకుండ బలము సంపా దించుటకై మేఖల ధరించి బలవంతులై నిర్విఘ్నయాగసమాప్తిఁ గాంచిరి. మేఖల అంగిరసులకు బలకారణ మగుటచే నంతనుండి యెల్లరు యజ్ఞసమయములలో దానిని ధరింప మొదలిడిరి.*

ఈబ్రాహ్మణమునసే అంగిరసులఁగూర్చి యింకొకచిత్రమైనకథ కలదు. బ్రహ్మసృష్టిలో మొట్టమొదటివారు అంగిరసులు. తరు వాతివారు ఆదిత్యులు. మొట్టమొదట యజ్ఞము చేసినవారు అంగి రసులు. అంగిరసులు సోమయాగము చేయఁబూని అగ్నిఁ జిలికి ఆది త్యులను దమపక్షమున నాహ్వానింపు మని యాతనిం గోరిరి. అదేసమ యమున ఆదిత్యులుకూడ సోమయాగము చేయఁబూని అంగిరసులను అధ్వర్యులనుగాఁ బిలువు మని వారును అగ్నిని గోరిరి. అగ్ని వారి యాహ్వానమంగీకరించి అంగిరసులను వారియాగమున నధ్వర్యులుగా

---

‡ తాండ్యమహాబ్రాహ్మణము (II. 2.3.5.7)

* శతపథ బ్రాహ్మణము. III. 2-1-10; III. 2-1-14.

నుండుఁడని కోరెను. అగ్నికోరికనుబట్టి అంగిరసు లంగీకరించి యట్లొ
రించిరి. యాగమైన వెనుక వారికి దక్షిణగా ఆదిత్యులు 'వాగ్దేవత'
నీయఁబోఁగా వా రామెను గ్రహింపక సూర్యుని బరిగ్రహించి తమ
యున్నతిని జాఁటిరి.

అశ్వమేధయాగమున అథర్వవేదమును అంగిరసులు పఠించెడి
వారు. అందుచే ఆవేదభాగమునకు అంగిరోవేద మని పేరు వచ్చెను.
ఈబ్రాహ్మణమున భృగువంశము, అంగిరసునివంశము నొక్కటే
యని చ్యవనుఁడాంగిరసుఁడని కలదు.

గోపథబ్రాహ్మణమున వరుణదేవునివీర్యమున నంగిరసుఁడు
జనించె నని కలదు. ఈయంగిరసునివలనఁ బదిమంది యంగిరసులు
జనించి రనియు వీరే యంగిరోవేదమునకు ద్రష్ట లనియుఁ గలదు.
(1. 1. 7-8). అంగిరోవేదమే ప్రపంచ మాక్రమించిన దనియు
నందుచే నంగిరోవేదమును జదువువిద్యార్థి శిరము నెత్తి యుంచు
కొనవలె ననియుఁ బరిపాటి యయ్యెను. మహాతపోజాతమగు అంగి
రోవేదమే అన్నివేదములలో నధిక మనియు నిదియే బ్రాహ్మణ
యాతువుల నశింపఁజేయు ననియు ఈబ్రాహ్మణము పేర్కొనెను.
అథర్వవేదముఁ జదివినవాఁడన్నివేదములను జదివినవాఁడే. సోమ
యాగములు, పాకయాగములు, హవిర్యజ్ఞములు, తదితరవిధ
యజ్ఞము లన్నియు అంగిరసులచేఁ బ్రతిపాదితము లైనవే. భృగువు,
అథర్వణుఁడు, అంగిరుఁడు ఏకవంశీయులే. కాని, అంగిరసుఁడు
పై యిరువురికంటెఁ బెద్దయగుటచే మిగిలినవారు అథర్వాంగిరసుఁడు,
భృగ్వాంగిరసుఁ డను పేళ్ళతో వ్యవహరింపఁబడిరి. వీరు ద్రష్ట
లైనవేద మగుటచేతనే భృగ్వాంగిరోవేద మని, అథర్వవేదమని,
అంగిరోవేద మని ఈయొక్కవేదమే త్రివిధములఁ బిలువఁబడు
చున్నది. కాని, అథర్వాంగిరులు భృగుమహర్షి నేత్రము లని
(గో. బ్రా. 1. 2-22.) కలదు. అథర్వవేద మందలి శౌనకశాఖ,
పిప్పలాదశాఖ అను రెండుశాఖలకుఁ గూడఁ దొలుత అంగిరోమహర్షి
ద్రష్ట యనియుఁ దరువాత అథర్వుఁడు ద్రష్ట యనియుఁ జెప్పవచ్చును.

ఉపనిషత్తులలో అంగిరసులు

వేదవేదాంగవిదులు, బ్రహ్మవిద్యాబోధకులుగా ఆంగిరసులు ఉపనిషత్తులలో విఖ్యాతి గాంచియున్నారు. అంగిరసుఁడు శౌనకునకు బోధించిన బ్రహ్మవిద్యాదికము ముండకోపనిషత్తునఁ గలదు. వేద పురుషునకు అథర్వవేదము పాదాదినాభిపర్యంత మగు ప్రధానభాగ మని వేరొక్కనఁబడినది. సామవేదోపనిషత్తులలో అంగిరసుఁడు ప్రాణ వాయువును ఉద్గీథరూపమున నుపాసించె ననియు అందుచే అంగి రసుఁడే ఉద్గీథ యని పిలువఁబడె నని కలదు. ఘోరాంగిరసుఁడు శ్రీకృష్ణునకు ఆత్మ యవినాశ మని తెలిపెను. బృహదారణ్యకోపని షత్తునందుఁ దెలుపఁబడిన మధువిద్యాబోధకులలో గౌతముఁడు, అగ్ని వేశ్యుఁడు, భరద్వాజుఁడు, అయాస్యుఁడు మున్నగుఆంగిరసులు కలరు. ప్రశ్నోపనిషత్తులో అంగిరసుఁడే ప్రాణముగా నిరూపింపఁ బడెను. మఱియు, నిందు పిప్పలాదాంగిరసుఁడు బ్రహ్మవేత్తగాఁ బేరొక్కనఁబడెను. పిప్పలాదాంగిరసుని మోక్షవిద్యామహోపదేశము గర్భోపనిషత్తునఁ గలదు. పరబ్రహ్మోపనిషత్తులో పిప్పలాదుఁడే యోగమునుగూర్చి ఓంకారమునుగూర్చి చెప్పియున్నాఁడు.

పురాణములలోఁ గలఅంగిరసునివృత్తాంతమును మనము తొలుతనే పరికించియున్నాము. కాలక్రమమున, మహారాజులకుఁ బురోహితులుగా బ్రహ్మవిద్యాబోధకులుగా అంగిరసులు విఖ్యాతి గడించిరి. కొందఱు క్షత్రియులు తమకుటుంబనామములుగా అంగి రసులను గైకొనిరి. * గౌతమబుద్ధుని తండ్రి యగుశుద్ధోదనుఁడు తనకొడుకునకు సిద్ధార్థుఁ డనియు అంగిరసుఁ డనియుఁ బేరిడియుండె నని క్రిందఁబేరొక్కన్నగ్రంథమునఁ గలదు. ఇట్లు అంగిరసులు జగ దంతర్యాము లైరి.

---

*Life and Legends of the Buddha by Thames, page 22-23.

ఓమ్.

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

* అరుణి మహర్షి

—✻—

స్తుతి

అరుణిమహర్షికిన్ బరమహర్షి కి జ్ఞానసుధాప్రవర్షికిన్
బరమ వివేకికిన్ హృదయపద్మవికస్వరసుప్రబోధికిన్
నిరుపమతత్త్వవేదికి వినిర్మలవాదికి నాత్మమోదికిన్
సురుచిరసుప్రసన్నగుణశోభికి భక్తి నమస్కరించెదన్.

జననము

తొల్లి యరుణుఁ డనుపేరుగల యొకముని యుండెను. ఆతని పుత్రుఁ డగునరుణి బాల్యమునుండియుఁ దపశ్శాలియై తేజోవిరాజితుఁ డయ్యెను.

సన్నుతాచారధుర్యుఁ డగు అరుణి సర్వసుగుణశోభితుఁడు, మౌనవ్రతుఁడునై మహాతప మొనరించి బ్రహ్మతేజస్వియై పరిల్లుచుండెను.

---

* అరుణమహర్షికి జన్మించిన కుమారుఁడు అరుణి. అరుణి బ్రహ్మ మానసపుత్రుఁ డని కొన్నిచోట్లఁ గలదు. ఈతనినే ఉద్దాలకుఁడు, ఆరుణి, యనియు నందురు. అరుణుని కొడుకు ఆరుణి యనియు నాతని కొడుకు ఆరుణేయుఁ డనియుఁ గొందఱి భావము. ఇందు అరుణి, యారుణి యిద్దఱు నొక్కఁడే.

అరుణి తపస్సు

ఆతఁ డొకనాఁడు దేవికానదీతీరమున కేఁగి యాశ్రమము నిర్మించుకొని యందుఁ దపము చేయఁదలఁచి బయలుదేఱెను. ఆతఁ డట్లు పోయి పోయి :

"... ... వా
ర్నిధికల్లోల ఘటావసక్త జలవేణీ నీవికన్ నిర్గళ
న్మధుమత్తభ్రమరీ మిళత్కమల గంధస్రావికన్ బాహుదం
ఢధృతాత్రివిచిత్రసంతరణనానానావికన్ దేవికన్."

కనుంగొని యానందపరవశుఁడై యా నదీతీరమునఁ గల పనస వకుళనారంగ పూగపున్నాగాది ఫలపుష్ప పూర్ణము మనోహరము నగు పుణ్యభూమియందు ఋష్యాశ్రమము నిర్మించుకొని యుండెను. అం దామహాముని నిత్యోపవాసములతో నిర్మల మనస్సుతో నిరుప మాన నిష్ఠాగరిష్ఠుఁడై, నిత్యోజ్జ్వల బ్రహ్మతేజము కనుఁగొన్నవారి యజ్ఞాన తమోరాశిని విరియఁ జేసి దివ్యతేజముఁ బ్రసరింపఁ జేయు చుండఁగా, నత్యుగ్రతపము కావించుచుండెను.

అరుణి నిషాదసమావేశము

ఇట్లుండి యాతఁ డొకనాఁడు దేవికానదిలో స్నానము చేయఁ దలఁచి పోవుచుండఁగా 'ఓరీ! బాపఁడా! పెట్టు పెట్టు''మను కేకలతో నాకట్టుకొన్నపాపకర్ముఁడు, క్రూరదృష్టులఁ గూడినయెఱ్ఱజీఱగ్రుడ్ల వాఁడు, చేత విల్లమ్ములు గలవాఁడు, నగునొక తెరువాటుకాఁడు భయంకరుఁడై యాతనియెదుట నిలిచెను. అరుణియుఁ గలఁగక చెలఁ గక హృదయమున శ్రీహరిని దలఁచుకొనుచు నేఁగుచుండెను.

ఆతనియచంచలతకు దొంగలరాజు నిశ్చేష్టితుఁడై చేతఁ గల విల్లమ్ములు గోతఁ బాఱవైచి యామహర్షికి సాష్టాంగము లొనర్చి:

"ఓసదయాత్మ! సంయమికులోత్తమ! పిన్నటనాఁటనుండి నేఁ
జేసినపాపపుం జెడుగుచేఁతలు చెప్పెద నుప్పుగోకకున్
భూసురకోటి నట్టడవిఁ బొట్టలు చించితి బిట్టు గొంతుకల్
గోసితి నల్ల పూసకొఱకుం బదివేవురు పుణ్యభామలన్.
ఇన్ని చేసినఁ గడపట నింటిలోనఁ
బ్రాపుడికి లేదు పాపంబె తగిలెఁ గాని
వల్కలములకుఁగాఁ జంప వచ్చి నిన్నుఁ గ
నుంగొని మహోద్భుతంబు శాంతుండనైతి.
చౌర్యంబింతటినుండి మానితి ననాచారంబు చాలించితిన్
భార్యాపుత్రధనేషణత్రయపరిభ్రాంతిం బెకందొబాసితిన్
గార్యాకార్యవిచారతన్ వలనిశంకల్ దక్కి నాకుం దప
శ్చర్యాసిద్ధికి నొక్కమంత్ర ముపదేశం బిచ్చి రక్షింపవే."
(వరాహపురాణము ౭.౭౫,౭౬,౭౭).

అని ప్రార్థించెను. కాని, బ్రహ్మహత్యాస్త్రీహత్యాపాతకి యగు వానిని గన్నెత్తి చూడను, వానిమాటలు వినను, ఆతనికొఱకై యూఁగను గొఱ గాదని యామహర్షి ప్రశాంతుఁడై పోపుచుండెను. ఐనను, దొంగ మాత్ర మాతనిని విడువక సద్బుద్ధి గలిగి మనుజుని నీడవలె నాతని ననుసరించెను. ఆముని దేవికానీరముల స్నానము చేయుచో, దొంగయుఁ జేయుచాఁడు. ఆతఁడు నిలిచిన నీతఁడు నిలుచును. ఆతఁడు నడచిన నీతఁడు నడచును. ఆతఁడు భూర్చుండి తపోవృత్తి నుండ నీతఁడు నట్లే యుండును. మఱియు, నాతనియవసర మెఱిఁగి యాతఁడు చెప్పకయే యాతనికి శుశ్రూష చేయుచుండును. ఈవిధ ముగఁ గొన్నివత్సరములు గడచెను. ఇరువుర నడుమను మాట లేదు; మంతి లేదు. ఇరువురు మౌనవ్రత్తులు. ఇరువురు తోడునీడలై యుండిరి.

అరుణి నొక బెబ్బులి ప్రమింగఁ జూచుట

ఇట్లుండ నొకనాఁడు అరుణిమహర్షి దేవికానదిలో స్నాన మాడుచుండఁగా నొకబెబ్బులి ప్రక్క నున్న ప్రేపపొదనుండి వచ్చి నీట మునుఁగు నాతనిని దననోట వైచుకొనఁ దలఁచి విజృంభింపఁగాఁ గని యాదొంగలరాజు తత్క్షణమే చేత నున్న వింట సంధించి పిడుగు తునుకవంటి యొక్క తీవ్రబాణముతో బెబ్బులి నదరంట నేయఁగా నది తగిలి బెబ్బులి మిని కనతిదూరమున గాండ్రు గాండ్రు మని పడి విలవిలఁ దన్నుకొనుచుండెను. ఆధ్వని కులికిపడి యరుణిమహర్షి "నమో నారాయణాయ" యని తనకారుణికత్వ ముట్టిపడ బిగ్గఱగాఁ బలెక్కను.

బెబ్బులి శాప విమోచనము

అరుణిమహర్షినోట వెలువడిన యా నారాయణమంత్రము చెవుల సోకినబెబ్బులి ప్రాణములు విడిచి పురుషశరీరమును ధరించి మునికి నమస్కరించి "మహాత్మా! నీకటాక్షమున నారాయణమంత్రా మృతములు నామీఁద వెల్లివిరియుటచే నేను నిరామయత మురారి పురి కేఁగుచుంటి" నని పలికెను. "ఓయీ! నీ వెవ్వఁడ?" వని మునియాతని నడిగెను. "దేవా! నేను పూర్వజన్మమున నొకమహావీరుఁడను. నేను సంగరరంగమున శత్రురాజుల దేహము లను తటాకములను విసువులేక త్రవ్విన దీర్ఘబాహుఁడను. నేను క్షత్త్రియుఁడనైనను, నాకు సర్వవిద్యలు వచ్చు నని యొకసారి విప్రోత్తములను ధృణీకరించి పరాభవించితిని. దానికి వా రలిగి దుర్విద్యా పాండిత్యమునఁ బ్రల్లదము లాడితివి కావున శార్దూలమువై పుట్టు మని నన్ను శపించిరి. వారి శాపపు దెబ్బకు ధర్మమను బరి దాటిన నామనసులోని విద్యామదము నశింపఁగాఁ జేతులు జోడించి వారికి నమస్కరించి శాపమోచనముఁ దెలుపుఁ డని ప్రార్థించితిని. వా రాదరాయత్తచిత్తులై "రాజా!

నీవు బెబ్బులివై యుండి యొక్కనాఁ డొక్కబ్రాహ్మణశ్రేష్ఠుని భక్షింప మీఁదపడువేళ నొకభిల్లుని భల్లమునఁ బడి విలవిలకొట్టుకొను వేళ నాతనినోట వెలువడిననారాయణస్మరణమును విన్నఫలమున నీవు శార్దూలభావము వీడి పురుషుఁడవై ముక్తి పొందఁగలవు. తథ్య" మని నన్నోదార్చిరి. నీమూలమున నా కిట్లు శాపమోక్ష మైనది. సాక్షాత్పురాణపురుషమూర్తులగువిప్రులసద్భాషణము లమోఘములు.

ఆకర్ణింపు మునీంద్ర! యేనొకరహస్యం బూర్ధ్వబాహుండనై
నీకుం జెప్పెద మేదినీసురవరుల్ నిక్కంబు నిక్కంబు ల
క్ష్మీకాంతప్రతిబింబముల్ జపతపస్సిద్ధుల్ సదాశుద్ధు ల
స్తోకజ్ఞానకళాధురంధరు లనింద్యుల్ వంద్యు లెవ్వారికిన్.

బ్రాహ్మణద్వేషి యైననావంటిమహాపాపకర్ముఁడు సైతము నారా యణమంత్ర మితరునినోట విన్నమాత్రమునఁ బవిత్రుఁ డయ్యెనన్న బ్రాహ్మణ భక్తియుక్తులై భక్తిపూర్వకముగా నారాయణమంత్రము జపించిన పుణ్యుల మహత్త్వము నెవ్వరు కొనియాడఁగలరు?" అని బ్రాహ్మణప్రశంస చేసి నారాయణమంత్రప్రభావముఁ వర్ణించి దీర్ఘ బాహుఁడై యనర్ఘమాణిక్యమయవిమానం బెక్కి స్వర్గంటాపథ మునఁ జనియెను.

ఆయువు నిషాదుని గటాక్షించుట

అప్పు డారుణి దొంగను గటాక్షించి "వత్సా! నీసాహసమునకు, నీపరిచర్యకు, నీసద్బుద్ధికి, నామీఁదివిశ్వాసమునకు మెచ్చితిని. నీ కేమి కావలయునో కోరుకో" మ్మనెను. ఆనిషాదుఁ డాతనికి దండ ప్రణామము లాచరించి "తాపసోత్తంస! ఇంతకాలమునకు సుముఖుఁడవై నాతో సంభాషించితివి. ఇంతకంటె నాకు వేఱువరము లేదు. నన్ను దయఁజూచి నాసేవ ననుగ్రహింపు"మని వేఁడుకొనెను.

అందుల కరుణి యిట్లనియె "ఓయీ! నీవు దొంగతనము మాని తపశ్చరణకాంక్షు నూని నన్నొకమంత్ర మర్థించితివి. అప్పటికి నీ వయోగ్యుఁడ వగుట నీతో మాటలాడనైతిని. నేఁడు నీవు దైవికా జలస్నానము చేతను, నాసందర్శనము చేతను, గోవిందనామస్మరణ శ్రవణమువలనను పావనుఁడవైతివి. కావున, నీవిఁక నిఖలకర్మము లకుఁ దగుదువు. నీవు నిష్కామివై తపమైనఁ జేయుము. లేదా నీకు వలసిన దేమున్నను వర మడిగిన నిచ్చెదను." అందుల కాతఁడు "దేవా! నాకుఁ గాంక్ష దేనియందును లేదు. బ్రహ్మాదిదేవత లెల్లరు నేమహామహునిపాదపద్మముల వ్రాలి ధన్యులైరో యానారాయణుని కటాక్ష మెట్లు సులభమగునో నాకుఁ దెలుపుము. అంతకన్న మిన్న యగువర మిఁక లేదు" అని పలికెను. "ఓయీ! నారాయణుఁడు తన్నుఁగుఱించి పరమవిశ్వాసమున నేవ్రతముఁ బట్టినను బ్రసన్నుఁ డగును. కావున, మాంసము తిన ననియు, అసత్యమాడ ననియు నీవు వ్రతమూని శ్రీహరిఁ గనుమని యాతనిఁ బురికొల్పి పంపివేసెను.

ఈబోయయే మహోగ్రతపస్సంపన్నుఁడై తరువాత దుర్వాసో మహర్షికృపఁ బడసి యాతనివలన సర్వవ్రతములు నెఱిఁగి సత్యతపుఁ డనునామమునఁ బరగి ముక్తినందెను.*

అరుణి గృహస్థజీవనము

అరుణి మహాతపశ్శాలియై బ్రహ్మజ్ఞానముపడసి యాపిమ్మట వివాహ మాడెను. ఇట్టివివాహమే ఆర్షసంప్రదాయసిద్ధ మగువివాహము. ఆత్మజ్ఞానరహితు లగువారియజ్ఞానవివాహములు బొమ్మల పెండ్లిండ్లు. హరి దాంపత్యము గొంగళిపురుగులదాంపత్యము; తోఁకలిబండలదాంపత్యము.

---

* వరాహపురాణము

అరుణి ధర్మబద్ధముగ నగ్నిసాక్షికముగ నొకయుత్తమకన్యకను వివాహమాడి యాపెవలనఁ గాలక్రమమున నొకసుపుత్రుని గాంచెను. ఆతఁడు శ్వేతకేతు వనఁ బరగుచు, బాల్యమును దల్లిదండ్రులకడనే కడపి, పిదపఁ దండ్రియానతిని బండ్రెండేండ్లు గురుకులవాసమున బ్రహ్మచర్యదీక్ష విద్యార్జనము గావించెను.

అరుణి పుత్రునిగర్వ ముడుపుట

కాని, యాతనికి విద్యామద మధికముగాఁ గలిగెను. అది యాతనిమాటలలోఁ జేఁతలలోఁ గానిపింపఁ దొడఁగెను. అది యాత నికిఁ బతనహేతు వని తోఁచి తండ్రి యాతనితో నిట్లనెను. "వత్సా! నీకుఁ దెలిసినదానికంటెఁ దెలిసినదన్న గర్వ మధికముగాఁ గనపడు చున్నది. అనఁగా నీ కేమియుఁ దెలియ దన్నమాట. నీకుఁ దెలియదు. తెలియ దని తెలియదు." అని పలుకఁగా శ్వేతుకేతువు తన కన్నియుఁ దెలియు ననెను. "ఐనచో, నేవిజ్ఞానమువలన సర్వవిజ్ఞానము సంభవిం చునో తెలుపుము. లేదా, రాగద్వేష ప్రధాన మగు ప్రపంచమునకు వాస్తవాధిష్ఠానము పరబ్రహ్మ మని తెలిపి చిత్తశాంతి నొసఁగు పర బ్రహ్మజ్ఞానము నీకుఁ దెలిసునా?" యని యడిగెను.

తండ్రివాక్యములకుఁ గుమారుఁ డాశ్చర్యపడి గర్వ ముడిగి నమస్కరించి "తండ్రీ! నాగురువు సమస్త వేదశాస్త్రములను దెలి పెను గాని యిట్టి ప్రశ్నములకు సమాధానముఁ దెలుపలేదు. నా యజ్ఞానమును దానివలనఁ గలిగిన మదమును మన్నించి నాయందు దయయుంచి యావిషయములు తెలుపు" మని ప్రార్థించెను.

అరుణి బ్రహ్మజ్ఞానోద్బోధము

అరుణిపుత్రుఁడు దారినిబడి శ్రద్ధతో నడుగుట కానందించి యాతని కిట్లు బోధించెను. 'వత్సా! ఈప్రపంచమునకుఁ బ్రధానకారణ

భూతము సచ్చిదానంద పరబ్రహ్మము. ఇది యాత్మస్వరూప మని తెలిసిన ప్రాజ్ఞులు సంసార వ్యామోహము లందక స్వరూప మగు ప్రపంచ మున విశ్రాంతి చెందుదురు.

కంటికిఁ గనఁబడు ప్రపంచ మంతయు సృష్టికిఁ బూర్వము సద్రూప పరబ్రహ్మముగనే యుండెను. * సజాతీయ విజాతీయ స్వగత భేదరహితము పరబ్రహ్మము. ఇది మొదట అవ్యాకృతనామ రూపస్థితి నుండి పిదప వ్యాకృత నామరూపావస్థ యగు ప్రపంచా కారమును బొందెను.

పరమాత్మ సృష్టిచేయఁ దలఁచి యగ్ని యను తేజస్స్వరూ పము నందెను. ఆపిదప ఉదకరూపమును దాల్చెను. ఆపిదప అన్న రూపమును ధరించెను. ఈ తేజము, ఉదకము, అన్నము నన్నమూఁ డును, అండజము, జీవజము, ఉద్భిజ్జము అను త్రివిధసృష్టికి హేతు వులు. అనఁగా ఈ తేజోజలాన్నములు * త్రివృత్కరణమంది సృష్టిని నిర్వహించెను.

అందుచే అగ్నియందు శోణతేజ స్సున్నదనియు, తెలుపు ఉద కము దనియు నలుపు అన్నము దనియు విభజించి చూచినయెడల అగ్ని యను నామరూప వ్యవహారమునకు వాస్తవరూపము తేజో

---

* సజాతీయ భేదము: పనసచెట్టునకుఁ గొబ్బెరచెట్టునకుఁ గల భేదము; విజాతీయ భేదము: చెట్టునకు రాళ్ళకుఁ గల భేదము; స్వగతభేదము: ఒకే చెట్టునందలి ఆకు, పువ్వు, కాయ, కొమ్మ, రెమ్మ మున్నగువానికిఁ గల భేదము.

* త్రివృత్కరణ మనఁగా: తేజములో సగముభాగమును దీసి జలము లోను అన్నములోను గలుపుట, అట్లే జలములో సగము భాగముఁ దీసి తేజములోను అన్నములోను గలుపుట, మటియు అన్నములో నర్ధభాగముఁ దీసి తేజమున జలమునఁ గలుపుట.

జలాన్నములే యని తెలుసు. అట్లే, సూర్యునియం దరుణతేజ మున్న దనియు— తెలుపు ఉదకము దనియు నలుపు అన్నము దనియుఁ దెలిసిన వారికి నట్లే విదిత మగును. మఱియుఁ జంద్రునియం దరుణ తేజ స్సున్నదనియు, తెలుపు ఉదక మనియు, నలుపు అన్న మనియు, తెలిసికొన్న వారికిని చంద్రుఁ డను నామ రూప వ్యవహారమునకు మూలము తేజోజలాన్నములే యని తెలుసు. కావున, ప్రపంచమున నెఱుపంతయుఁ దేజము; తెలు పంతయు నుదకము; నలు పంతయు నన్నము నని తెలిసికొనవలయును."

ఈమాట విని "తండ్రీ! తేజోజలాన్నములకంటె వే ఱయిన ప్రపంచ మంతయు మిథ్య గదా? ఇవి పురుషరూపమును జెంది యెట్లు విభజింపఁ బడినవో తెలుపు" మని శ్వేతకేతువు ప్రార్థించెను.

తండ్రి యిట్లు చెప్పెను. "వత్సా! అన్నము పురుషుని యుదర మును జేరి యొకభాగము పురీషముగాను, ఒకభాగము మాంసము గాను, మూఁడవభాగము మనస్సుగాను మాఱుచున్నది. ఉదకము పురుషునియుదరముఁ జేరి మూత్ర, రక్త, ప్రాణములుగా మాఱు చున్నది. తేజము పురుషునియుదరముఁ జేరి అస్థులు, మజ్జ, వాక్కుగా మాఱును. మఱియు, మనస్సు అన్నమయ మనియు, ప్రాణము ఉదకమయ మనియు, వాక్కు తేజోమయ మనియుఁ దెలియుచున్నది. ఏలన, అన్నము పురుషుని జెందినపిదప సూక్ష్మ భాగము మనోరూపము నందుచున్నది. ఉదకము నందలి సూక్ష్మ భాగము ప్రాణ మగుచున్నది. ఇట్లే, తేజస్సూక్ష్మ భాగము వాక్కగుచున్నది.

పురుషుఁడు పదునాఱు కళలవాఁడు. అన్నము తినక ఉద కము త్రాగుచుఁ బదునైదుదినము లుపవాస మున్నవాఁడు మాన సికముగను బలహీనుఁ డగును. ఆతఁడు మరల నన్నముఁ దిన్నచో

నాతనిమనస్సు మరలఁ బుట్టిచెంది సమస్త కార్యములు నొనరించును. కనుక, మనస్సు అన్నమయ మనియుఁ బ్రాణము ఉదకమయ మనియు, వాక్కు తేజోమయ మనియుఁ దెలియుచున్నది.

వత్సా! పురుషుఁడు నిద్రించునపుడు సచ్చిదానందస్వరూపుఁడగు పరమాత్మతో నేకీభవించి స్వస్వరూపానందము ననుభవించుచున్నాఁడు. మేల్కాంచినపిదప నిజస్థితి మఱచి సంసారలంపటుఁ డగుచున్నాఁడు. శకునపక్షి వివిధప్రదేశములఁ దిరిగి తనయజమాని తనకాలికిఁ గట్టిన దారము మూలమునఁ దనబంధనస్థానమున కే వచ్చి విశ్రమించునట్లు, మనస్సు బహువ్యవహారముల నడపి తన బంధనస్థానమగుప్రాణము నాశ్రయించును. అన్నము ఉదరమున నుదకముతో లయించి యుదకముచేతనే శరీరమున వ్యాపించును. మఱియు, కుండ తనకారణ మగు మట్టిలోనే లయమగునట్లు, అన్నము తనకారణ మగునీటిలోనే లయము నందును. ఉదకము తనకారణ మగుతేజస్సున లయ మందును. తేజస్సు సద్రూప మగుపరమాత్మయందు లయించును. అందుచే, అన్నమునకుఁ గారణ ముదక మనియు, ఉదకమునకుఁ గారణము తేజ స్సనియు, తేజస్సునకుఁ గారణము సద్రూప సుగుపరమాత్మ యనియు నిశ్చితము.

పురుషుని మరణకాలమున నింద్రియములు మనస్సునందును, మనస్సు ప్రాణమునందును, ప్రాణము తేజస్సునందును, తేజస్సు పరమాత్మయందును లయమగుచున్నవి. అందుచే సర్వభూతములు సర్వసృష్టి పరబ్రహ్మమే శాశ్వతనివాసస్థానముగాఁ గలవి; అందే ప్రతిష్ఠితము లగు ననుట నిస్సంశయము. ఈపరబ్రహ్మజ్ఞాన మెట్లు సంభవించు ననిన- అవిద్యోపాధికుఁ డగుజీవుని యవిద్యను, మాయయే ఉపాధిగాఁ గలయీశ్వరునిమాయను పరిత్యజించిననే తురాతురములఁ

కతీతుఁ డగుఉత్తమపురుషుని జ్ఞానము కలుగును. ఇదియే బ్రహ్మ జ్ఞానము.

వత్సా! వివిధపుష్పములనుండి బిందువు బిందువుగాఁ దేనెటీగ పోగుచేసినతేనె యొకచోఁ బోసినపు డేయేబిందు వేయేపుష్పము నుండి కొనివచ్చినదియుఁ దెలియనట్లే, పులి, సింహము, తోడేలు, పంది పురుగు, మిడత, చీమ, దోమ, నల్లి, బల్లి మున్నగు ఉపాధులలో నున్నజీవులు గాఢసుషుప్తియం దేకీభావము నంది యాత్మానంద మందునపు డీయుపాధిగత దేహేంద్రియస్వభావము లేమియుఁ దోఁపవు. అనఁగా, పరమాత్మ అతీంద్రియుఁడు; సర్వవ్యాపకుఁడు; పురుషుఁడు దేశకాలవస్తూపాధ్యవస్థాగతపరిచ్ఛేదమును దాటినచో నట్టి సచ్చిదానందస్వరూప మగుపరమాత్మ తానే యని తెలిసికొనఁ గలఁడు.

మఱికొం డుదాహరణములు: పెక్కు లగునదులు వివిధగతులఁ బ్రవహించి తుదకు సముద్రములోఁ గలిసిన పిమ్మట వానికిఁ బూర్వ నామరూపావస్థాభేదము అుండనివిధమున, ఏకరూప మగుసముద్ర జలము సూర్యకిరణములవలన మేఘరూపము నంది వర్షించి నదీజల రూపమున మరల సముద్రునిఁజేరి వివిధనామరూపరహితమై యేక సముద్రజల మగునట్లు, వివిధరూపములలో నున్నజీవకోటి యంతయుఁ బరమాత్మనుండి బయలుదేఱి వివిధనామరూపావస్థలంది తుద కాపర మాత్మనే చేరి సచ్చిదానందస్వరూప మగుచున్నది. పరమాత్మ అవాఙ్మానసగోచరుఁడు, సర్వవ్యాపకుఁడు, ఆత్మస్వరూపుఁడు.

ఒకపెద్దచెట్టు మొదటికిఁ గొట్టివేసినను అది బ్రదికియుండి ద్రవమును స్రవించి మరలఁ జిగుర్చును. మధ్యభాగమును గొట్టినను నట్లే జరుగును. పైభాగమును గొట్టిన నట్లే యగును. అనఁగా వృక్షము

తనలో జీవభావమును బొందినయాత్మ యనుగ్రహమున వృద్ధిపొందు చుండును. కొమ్మలను ఱెమ్మలను గొట్టిన నవి యెండిపోవును. చెట్టం తయుఁ గొట్టిపాఱవైచిన నదియు నెండిపోవును. అనఁగా, జీవనా ధారము లేనియెడల నెండిపోవుట, చనిపోవుట మున్నగుస్థితులు సంభవించును. అంతేకాని, జీవమునకుఁ జావు లేదు. అందుచే జన్మాదిషడ్భావవికారములు లేనిదియు, ఇంద్రియాగోచరము, ఇంద్రి యాతీతము, సర్వవ్యాపకము, నగుపరమాత్మయే సర్వస్వ స్వరూపము.

వత్సా! న్యగ్రోధ (పెనుమఱ్ఱిచెట్టు) వృక్షము కాయను దెచ్చి పగులఁగొట్టిన నందు గింజ లుండును. గింజలను బగులఁగొట్టిన నందే మియు నుండదు. మహావృక్ష మంతయు నతిసూక్ష్మరూపమున గింజలో నుండునట్లు, సర్వజగత్తు అవ్యాకృతనామరూపము నంది పర మాత్మలో నుండును. అనఁగా జీవునియాత్మస్వరూప మిట్టి యవా జ్మానసగోచర మగుపరమాత్మయే.

కుమారా! ఉప్పు కలిపిననీటిలో ఉప్పు కనఁబడదు. ఆజల మేవైపునుండి రుచిచూచినను ఉప్పగానే యుండును. నీటిలో నుప్పు న్నట్లు ఇతరేంద్రియములకుఁ దెలియక ఒక్కజిహ్వేంద్రియమునకే తెలియునట్లు, అతి సూక్ష్మ మగుపరమాత్మజ్ఞానము శుద్ధసత్త్వప్రధాన మగు అంతఃకరణమునకే తెలియును. ఈయాత్మయే జీవునిసత్య స్వరూపము.

పుత్రా! గంధారదేశమునుండి యొకపురుషుని దీసికొనివచ్చి కాలుచేతులు గట్టి కన్నులకు గంతలుకట్టి యొకయడవిలో విడిచి నచో నాతఁడు స్వగ్రామ మెట్లు చేరఁగలఁడు? ఏపుణ్యాత్ముఁడో వచ్చి యాతనికట్లు విప్పి గంతలు తీసిపాఱవైచి యాతనిగ్రామమార్గముఁ

జూపవలయునుగదా! ఇతఁడును నతఁడు చెప్పినమార్గముచొప్పునఁ బోవుచు సంశయ మున్న నెటిఁగినవారి నడుగుచుఁ బోయిననే యిల్లు చేరఁగలఁడు. లేనిచో మధ్యమార్గమునసే నశించును. అట్లే, సంసారబద్ధుఁ డగు మోక్షకాంక్షి గురువును సేవించి తదనుగ్రహమున సమ్యగ్దర్శనము నంది యాతఁడు చెప్పినచొప్పున నడచుకొన్ననే మోక్ష పరమావధిని గనఁగలఁడు. ఆమోక్షపరమావధి సర్వాంతర్యామి, సర్వవ్యాపకుఁడు, సర్వేంద్రియాతీతుఁడు, జీవస్వస్వరూపము నగు పరమాత్మయే.

మఱియు నోబిడ్డా! మరణవేదన పడుమానవుని జేరి బంధువులు 'న న్నెఱుఁగుదువా? న న్నెఱుఁగుదువా?' యని ప్రశ్నింతురు. ఆతఁ డింద్రియములు మనస్సులోను, మనస్సు ప్రాణములోను, ప్రాణము తేజస్సులోను, తేజస్సు పరమాత్మలోను లయింపనంతవఱకు నెల్లరిని గుర్తుపట్టఁగలఁడు. కాని, లయించినపిదప గ్రహింప లేఁడు. అనఁగా దేనియం దన్నియు లయించునో యది యతిసూక్ష్మ మగుపరమాత్మ. అదియే జీవుని స్వస్వరూపము.

ఇంకొక్కవిషయము. పూర్వము దొంగ యని యనుమానించినవానిని గాల్చిన యినుపగొడ్డలిఁ బట్టుకొను మనువాఁడు. వాఁడు నిజ మగుదొంగయగుచో నది కాల్చి వానిని జంపెడిది లేదా, యది వానికిఁ జల్లగ నుండెడిది. అనఁగా వత్సా! మిథ్యాప్రపంచబద్ధుఁడగు వానికి జన్మజరామరణాదులు తప్పవు. తదతీతునకు ముక్తి కలుగును. కావున జీవుఁడు సాక్షాత్పరమాత్మస్వరూపుఁడే యని గ్రహింపుము".*

ఈవిధముగా అరుణి శ్వేతకేతువునకు జ్ఞానోపదేశము చేసి పుత్ర స్నేహము వీడి పొమ్మని పంపివేసెను. బ్రహ్మర్షి యగుతండ్రివలన జ్ఞానము నంది శ్వేతకేతువును బ్రహ్మర్షియై తరించెను.

---

* ఛాందోగ్యోపనిషత్తు. (ఓ. 1-16.)

ఓమ్.

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

ఔర్వ మహర్షి

స్తుతి

ఔర్వమహర్షికిన్ బరమహర్షికి జ్ఞానసుధాప్రవర్షికిన్
శర్వసమాన తేజునకు సంయమివర్యున కాత్మవేదికిన్
గర్విత దుష్టరాజఘనకావర నిర్దళనాతిశాయికిన్
పర్వతనారదాదిమునివంద్యున కిచ్చెదఁ గేలు మోడ్పులన్.

జననము

భృగుమహర్షి పులోమ యనుభార్యయందు చ్యవనుని గాంచెను. చ్యవనమహర్షి సుకన్య యనుసాధ్వియందు దధీచి, ప్రమతి, ఆప్రవానుఁడు, అనుపుత్త్రులను గాంచెను. ఆప్రవానుఁడు ఋచి యనుకన్యకను భార్యగాఁ గైకొని గృహస్థధర్మమును నిర్వహించుచుండెను.

ఇట్లుండ హైహయవంశీయుఁడు, కార్తవీర్యార్జునుని తండ్రియు, నగుకృతవీర్యుఁడనుమహారాజు భార్గవవంశజు లగుమహాబ్రాహ్మణు లను బిలిచి వారియాధ్వర్యవమున ననేకయజ్ఞము లొనరించి గురుదక్షిణగా వారికిఁ దనసర్వస్వమును భారపోసి కాలక్రమమున స్వర్గమున కేఁగెను.

తరువాతఁ గృతవీర్యునిపుత్త్రులు తమతండ్రిని మోసగించి భార్గవ వంశీయులగుబ్రాహ్మణులు తమసర్వధనములు నపహరించిరని భార్గ

వుల నెల్లరను చూలనాడ మొదలిడిరి. అంతేకాక, తమకుఁ గోపము వచ్చినపుడెల్ల భృగువంశవిప్రులగృహాములు చొచ్చి కొల్లగొట్టి వారిని బాధింపఁ దొడఁగిరి. అంతతో నూఱకుండక రాజధానాపహారు లని భృగు వంశజులఁ బసిపిల్లలనుసైతము రాజకుమారులు మూర్ఖులై వెదకి వెదకి చంపఁదొడంగిరి.

ఈ సంగతి విని భృగువంశ్యు లగువిప్రస్త్రీలు తమపతు లిండ్ల లేనిసమయమున బిడ్డలనుగూడఁ జంపుటకు రాజాధములు వచ్చుచున్నా రని తెలిసి భయసంజాతలై హిమవత్ప్రదేశమునకుఁ బాఱిపోఁజొచ్చిరి. వారిలో గర్భవతి యగుఱుచికూడ నుండెను. పశుతుల్యు లగు నారాజకుమారు లాస్త్రీలవెంట నంటిరి. వారిలో ఱుచి ప్రసవవేదన మారంభము కాఁగా నిఁక బరుగిడలేక యొకచోఁ గూరుచుండి తన యూరువున గర్భమును ధరించియుండెను.

రాఁతను లనఁబరగు నారాజకుమారు లామెగర్భమును భేదింప దగ్గఱ కేఁగిరి. ఆసమయమునఁ బ్రళయకాలసూర్యుని తేజమును మిం చినతేజముతో ఱుచి కొక్కకుమారుఁ డుదయించెను. ఆతని యుద యముతో దిశ లెల్లఁ దేజోభరితములై యా మూర్ఖరాజశ్రేణికన్నుఁ గవలు గప్పివేయ వారెల్ల రంధులై దారి తెన్ను గానక దీనులై యుండిరి. ఱుచి యూరువు మఱుగునఁ బుట్టినబిడ్డఁ డగుటచే ఆబాలు నికి ఔర్వుఁ డనునామము కలిగెను.

పశ్చాత్తాపమున నొడ లెఱిఁగినయారాజకుమారులు తడవు కొనుచు ఱుచిని సమీపించి "తల్లీ ! పరమమూర్ఖుల మగు మాతప్పు సైరింపుము. మహాశక్తిసంపన్ను లగుభృగువంశవిప్రుల ఘనత యెఱిఁ గినమాతండ్రి తనసర్వస్వము వారికి ధారపోసి తాను బుణ్యాగతు లందఁ గనెను. భృగువంశవిప్రుల కలిగి వారియెడఁ గీడుచేసిన మే మిట్టి

దుర్గతిఁ గాంచితిమి. అమ్మా! అధర్మవర్తుల కెప్పుడును దుర్గతులు ప్రాపించుననుట సత్యమేకదా! మాకు బుద్ధివచ్చినది. ఇఁక, భృగు వంశజు లగుపసిబిడ్డలుసైతము మావంశజు లెల్లరికి నారాధనీయులే యగుదురు. కావున, దయదలఁచి యార్తులము నర్థులము నగుమాకు దృష్టిదానముఁ బ్రసాదింపుము. నిన్ను మాకన్నతల్లిగాఁ బూజింతుము. ఱుమింపు" మని లెంపలు వేసికొని దండప్రణామములతోఁ బ్రార్థించిరి.

అంత ఋచి "రాజకుమారులారా! మిమ్ము నిగ్రహించుటకుఁ గాని యనుగ్రహించుటకుఁ గాని నేను శక్తురాలను గాను. భార్గవ వంశదీపకుఁ డగునీబాలుఁడే మీ కీశిక్ష విధించియుండును. కావున మీ రాతనినే శరణుచొచ్చి ప్రార్థింపుఁ" డని పలికెను. వారు నంతఁ "దల్లి! ఇప్పుడు పుట్టినబాలుని కింతశక్తియెక్కడిది? ఇది యంతయు నీమహత్త్వమే యని మాకు స్పష్టముగఁ దోఁచుచున్నది. కావున, మాతప్పు సైరించి రక్షింపు" మని కోరిరి.

ఋచి వారితో "కుమారులారా! అట్లు కాదు. ఈతఁడు నూఱుసంవత్సరములు నాయూరుగర్భమున నుండి సకలవేదవేదాంగములు నేర్చినవాఁడు. మహాతపోనిధి. సర్వశక్తిసంపన్నుఁడు. కావున, నాలసింపక యీతనినే వేఁడికొం" డని భార్యనితో "పత్నీ! పశ్చాత్తప్తు లగునీరాజకుమారులు తమ్ము ఱుమింప నిన్నుఁ గోరుకొనుచున్నారు. దుర్మార్గులను శిక్షించుటయుఁ బశ్చాత్తాపమంది ఱుమ్మఁ దగుమఁ గోరువా రెంతయధములైనను ఱుమించుటయు భృగుకుల ధర్మము. కావున వీరికి దృష్టిదానముఁ బ్రసాదింపు" మని పుత్త్రునితోఁ జెప్పెను. హైహయులు నాతని పాదములఁ దడవితడవి కనుల కద్దుకొని తమ్ము రక్షింపఁ గోరుకొనిరి. భార్యఁ డప్పటికి శాంతచిత్తుఁడై మాతృవచనములను మన్నించి యారాజకుమారులెల్లరికి దృష్టిదానము చేసెను. వా రెల్ల రాతనికి మరలమరల నమస్కరించి

యిఁక బుద్ధి కలిగి యుండు మని యాతనిసెలవు గైకొని తమతమ గృహముల కరిగిరి.

ఔర్వుని ఁపళయతపము

ఔర్వునిఁ దల్లి యాశ్రమమునకుఁ దీసికొనిపోయి యట నల్లారు ముద్దుగాఁ బెంచుకొనుచుండెను. ఆతఁడు బాల్యమునఁనే తనపితృ బంధుజను లెందఱో దుష్టరాజులమూలమునఁ బరలోక గతు లైరన్న సంగతి విని దుఃఖించి సకలలోకప్రళయము సంకల్పించి మహోతపస్సు చేయఁదొడఁగెను.

తదేకనిష్ఠతో నిద్రాహారములు మాని పంచాగ్నిమధ్యమున నాతఁడు చేయుమహోతపస్సువలన ముల్లోకములు నల్లాడఁ జొచ్చెను. చరాచరప్రపంచ మంతయుఁ జలించిపోఁదొడఁగెను. ప్రాణిసంతతులు భయవిహ్వలము లయ్యెను. ఇది పితృలోకనివాసు లైనఁయౌర్వుని పితృదేవతలు బంధుజనములు విని భూలోకమునకు విచ్చేసి మహాతేజ శ్శాలియై వెలుఁగుచున్నఔర్వుని సమీపించి శాంతచిత్తులై యాతనికిఁ ద మ్మెఱుకపఱుచుకొని యిట్లు పలికిరి. "వత్సా! నీతపోబలమహత్త్వ మున లోకములు భయవిహ్వలము లయ్యెను. నీవు కోపము విడు వుము. మే మసమర్థులమై ఋత్తియులచే నిహతులముకాలేదు. మేము ధనలుబ్ధులమై వారిధనములు గ్రహించినవారమును గాము. మాకు ధనమె వలసినచోఁ గుబేరుఁడే వచ్చి మాయడుగులకు మడుఁగులో త్తి యెంత ధనమైన నిచ్చిపోయెడివాఁడు. తపోమహత్త్వమున మా కపరి మిత మగునాయుష్యము కలిగెను. కాని, మాకు మనుష్యలోకమున నుండుట కిష్టము లేదు. మరణించినపిదపఁ గాని స్వర్గమున కేఁగ నవ కాశము లేదు. ఆత్మహత్య చేసికొంటిమా యది మహాదోషము. దాని వలనఁ బుణ్యలోకప్రాప్తి లేదు. అందుచే హైహయవంశక్షత్తియు

లతో వైరము కల్పించుకొని వారిమూలమున మరణించితిమి. అంతే కాని భార్గవులతేజ మొరు లెన్నఁడును బరిహరింపఁజాలరు. కావున దానికై నీవిట్లు లోకోపద్రవము కలుగఁజేయుట మా కిష్టము లేదు. నీవు శాంతచిత్తుఁడవై మాకోరికఁ దీర్పుము."

అపు డౌర్వుఁడు వారికి సాష్టాంగ మెరఁగి "మహాత్ములారా! మీదర్శనమున నాజన్మము ధన్య మైనది. మీచెప్పినది సమంజసమే కాని నాతపస్సునఁ ద్రిలోకపరాభవము కావింపఁ బ్రతిజ్ఞ పూనితిని. నాప్రతిన యమోఘము. మటియు, నాకోపము నుపసంహరించితినేని యది నాదేహమునే దహించివైచును. తగిననిమిత్తమునఁ గలిగిన యలుకను విడచి శాంతుఁడగునాతనివలన ధర్మార్థకామములు సమ రక్షితములు కావు. పాపు లగుక్షత్త్రియులు భార్గవుల హింసచేయు చుండ వారియార్తనాదము మాతృగర్భస్థితుఁడ నగునాకు వినిపించి నపుడే నాకు వారిపైఁ గోపము కలిగెను. అది యిపు డసహ్యమై యీపనికి దింపినది. ఇంతకుఁ దెలిసి శక్తి యుతుఁడయి యొక రొకరికి హింస గావింపఁ జూచి యూరకున్నవాఁడు హింసాత్మకుఁ డేగుదుర్గతికిఁ బోవును. అందుచే నేనలిగితిని. కాని మీరు హితులరు. మీమాట కా దననోప. నాకును లోకములకు సర్వహిత మగునట్లు మీరు చెప్పిన చొప్పున నొనరింతు" నని పలికెను.

అంత వా రానందించి "వత్సా! జలములలో సర్వలోకములు నుండును. కాన, నీకోపవహ్ని యందు వీడిచి సత్యప్రతిజ్ఞుఁడ వగుము. అది జలధిజలముల దహించు" నని పలికిరి. ఔర్వుఁడట్లే యని తన కోపానలమును సముద్రమున విడువ నది యౌర్వానల మనుపేర నశ్వముఖమున నబ్ధిజలములు త్రాగుచుండెను. పితృదేవతలు సంత సించి ఔర్వు నాశీర్వదించి వెడలిరి. ఇట్లు ఔర్వుఁడు ధర్మవిదుఁడు,

పితృదేవతావిధేయుఁడు, మహాతపశ్శక్తిసంపన్నుఁడు, అతిలోకతేజస్వి, నిగ్రహానుగ్రహసమర్థుఁడు నని పేరుగాంచెను. (భారతము. ఆదిపర్వము.)

ఔర్వుని బ్రహ్మచర్యవ్రతము

పిదప, ఔర్వుఁడు బ్రహ్మచర్యవ్రతపరిపాలనము నతినిష్ఠాగరిష్ఠుఁడై యొనరించుచు మహాతపోనిమగ్నుఁడై యుండెను. ఆతపము వలన మరల సకలలోకములు సంచలింపఁగా మహర్షులను బురస్కరించుకొని దేవతావిభులు, హిరణ్యకశిపుని బురస్కరించుకొని రాక్షసాధిపులు ఔర్వమహర్షికడకు విచ్చేసి యిట్లు పలికిరి. 'ఓ ఋషివర్యా! నీవిచిఱుతతనమున నింతదీక్షఁ బూని బ్రహ్మచర్యవ్రతుఁడవై యుండ నూర్ధ్వరేతోగతుఁడ వగుటవలన సంతతి విచ్ఛిన్నమై భార్గవకులము నశించును. కావున, నీవు ధర్మమూల మగు గృహస్థాశ్రమమును స్వీకరించి సుపుత్రులను గనుము. సిద్ధమును లెల్లరు పత్నీసమేతులై పుత్త్రులను గాంచిరికదా! కావున నీవును మామాట విని వెంటనే వివాహమై సంతతిఁ గనుము." ఆమాటలు విని ఔర్వుఁడు మందహాసము చేసి;

"బ్రహ్మయోని సంజాతుఁడై బ్రహ్మవిద్య
నలవరించుచు బ్రహ్మంబు నాత్మఁ జూచు
బ్రాహ్మణుఁడు బ్రహ్మచారియై పరగవలదె?
బ్రహ్మయైనఁ జాలునే యట్టిభవ్యఁ గలఁప?

(హరివంశము, పూర్వభాగము, ౪ ఆ. ౧౦౭.)

అదికాక, వేదాధ్యయనము, యజనము, పుత్త్రోత్పాదనము నీమూఁడును ఋణత్రయమును బాయుటకు గృహస్థునకు విధింపఁబడినవి. మేము వనస్థులము. నిరాహారులు, పవనజలాదిభోజులు, అశ్మకుట్టా

శులు, దంతోలూఖలులు, పంచతప్తులు నగుట వానప్రస్థధర్మము. మేము బ్రహ్మచర్యమును మున్నిడుకొని బ్రహ్మగతిఁ బ్రాపింతుము. బ్రహ్మచర్యము లేనివాని కేదియు లభింపదు. అజితేంద్రియుఁ డగు దుశ్చరితునియోగము దంభసంజ్ఞమే కాని నిక్కువము కాదు. మఱియు బ్రహ్మదేవుఁడు బ్రహ్మచారియై మానసపుత్త్రులను గాంచెను. బ్రహ్మచర్యము కాదని మీ రనరాదు. నన్ను సంతతిఁ బడయు మని మీరన్న నట్లే చేసెద" నని తపోబలమున నపాయ నిరూఢ మగుశరీర ముతో నగ్నిహోత్రునియందుఁ దనతొడ యొకటి యిడి కుశకాండ ములతో మథించెను. అంత నాతనితొడనుండి యగ్నిహోత్రుఁడు తనయుఁడై జనించి ప్రజ్వరిల్లి యాకసముఁ దాకుచు నినుమిక్కిలి పెరుఁగుచు నౌర్వునియెదుట నిలిచి;

"కడుఁ బెల్లగునాఁకలి నా
యెడ లెరియింపంగఁదొడఁగె నొక్కట జగముల్
బొడిబొడిగా దరికొనియెద
నెడపక యించుక యనుజ్ఞ నిమ్ము మహాత్మా!"

(హరివంశము. ఉత్త. ౧౧౫)

అని పలికెను. అంతలో బ్రహ్మ తత్క్షణ మటకుఁ బరుగున వచ్చి యౌర్వు నిచే నభివాదనము లంది 'ఔర్వముఖీ! నీపుత్త్రుని కాహారము విహార స్థానము నేనొసంగెద. నీవు దయదలఁచి జగద్దాహను నారంభింప నీయ కీతని నాఁపుము" అని కోరెను. ఔర్వుఁ డంగీకరించెను. అంత బ్రహ్మ "ఈమహాగ్ని ప్రస్తుతము సముద్రమున నున్ననీకోపానల మగు ఔర్వాగ్నిఁ జేరుఁగాక! పిదప, ప్రళయసమయమున నా రౌద్రతేజము దీనిఁ గూడ మహోద్ధతితో నిది సర్వలోకములను నీటుచేయుఁగాక!" యని పలికెను. ఔర్వుఁ డజునిపైఁ గలయాదరమున నట్లే జరుగుఁ గాక! యని పలికెను. అంత నాయగ్నియుఁ దనతేజము లోకబాధకము

కాకుండున ట్లుపసంహరించుకొని సాగరమున కేగెను. బ్రహ్మాదు లౌర్వుని గీర్తించి తమతమ నెలపుల కరిగిరి. (హరివంశము.)

ఔర్వుఁడు హిరణ్యాకశిపు ననుగ్రహించుట

అపుడు హిరణ్యకశిపుఁ డాఁగిపోయి ఔర్వునికి సాష్టాంగ నమస్కారము నొనర్చి యతిభక్తివిధేయతలతో నౌర్వునిమనసున కెక్కనాతనిం గొనియాడి

"అజుఁడు చనుదెంచి ప్రార్థించునట్టితపము
లోకమున నెవ్వరికిఁ జెల్లు నీకకాక !
ఏను భవదీయ శిష్యుఁడ నెడరు వొందు
నప్పటికి రఘు యగువిద్య యానతిమ్ము"

(ఆ. ంంం.)

అని ప్రార్థించెను.

ఔర్వుఁడు సంతోషించి "రాక్షసేశ్వరా ! నీవు సర్వభువనము లను జయించినవాఁడవు. మిత్త్రిఁడవై నీవు నన్నాశ్రయించితివి. ఆశ్రితులు కోరినకోరిక లీఁజాలి యీయనివాఁడు దుర్గతి పొందును. అందుచే నాకుఁ బుత్త్రిరూపమున నిర్మిత మైనయనింధనాగ్నిరూప యగువిద్య మాయ నీ కిచ్చితిని. చంద్రస్పర్శచేఁ దక్కఁ దక్కినదేని చేతను దీనికిఁ దిరుగులేదు. నీవంశమున జన్మించిన వారి కెల్లరకు శత్రువులచే నోడిపోయినప్పటికి నీవిద్య మాయవశగతమై యుండును."

అని కనికరమున వర మొసంగెను. హిరణ్యకశిపుఁడు కోరినకోరిక తీరినవాఁడై ఔర్వుని సంస్తుతించి నిజస్థానమున కరిగెను.

ఈమాయ పెంపుననే హిరణ్యకశిపుఁడు, మయుఁడు మున్నగు వారు శత్రువులకు భయంకరమైనవారిని దహించుప్రళయకాలాగ్ని జ్వాలలఁ బేర్చి యేర్చుచుండెడివారు.

సౌర్వుఁడు పుత్రిఁ గని వివాహముచేయుట

సౌర్వుఁడు మఱియొకప్పుడు బ్రహ్మచర్యవ్రతమున నుండియే యొకపుత్రిఁ గన సంకల్పించెను. ఆతఁడు తపోబలమున నాతని మోఁకాలినుండి యయోనిజ యగునొకకూఁతుం బుట్టించి యామెకు 'కందని' (కందళి) యనునామకరణము చేసి పెంచెను.

కాలక్రమమున నామె చక్కనిచుక్కయై తండ్రిహృదయమున కమితానంద మొనరించెను. కాని, యామె యెంతసౌందర్యవతియో యంత కటుభాషిణి యయ్యెను. ఆమె యెంత సుగుణఖనియో యంతకలహప్రియ యయ్యెను. బ్రహ్మదేవుఁడు అమృతము నుంచిన యబ్ధిగర్భమునసే కాలకూటవిషము నుంచినాఁడు. విషజ్వాలలు గ్రక్కుపాముతలపై మణి నుంచినాఁడు. విధివిధానము లత్యాశ్చర్య కరములు.

కందని పెరిగి యౌవనవిలాసము లందినసమయమున నామె యత్రినేత్రసంభవుఁ డగుదుర్వాసోమహర్షి ప్రజ్ఞాప్రాభవముల విని యాతనినే పెండ్లాడఁ దలఁచి తండ్రికిఁ దనహృదయము నెఱిఁగించెను.

వయసు వచ్చినపడుచు సర్వలోకారాధ్యుఁ డగుమహర్షిని వలచియుండుట కానందించి యౌర్వుఁ డామెను దీసికొని దుర్వాసుని యాశ్రమమునకుఁ బోయి యాతని కామె నర్పించి రాఁ బయనమ య్యెను. బ్రహ్మతేజోవిరాజితుఁ డగునౌర్వమహర్షియుఁ బులు గడిగిన ముత్తెమువలె బహుళసౌందర్యశోభిత యగుకందనియు నటు బయలు దేఱి పోవుచుండ దశదిశలు తేజోమయము లయ్యెను. వా రట్లు పోయి పోయి గంధమాదనపర్వత కంధరమును జేరుసరి కచట వారికి దుర్వాసుఁ డెదుర య్యెను. దుర్వాసుఁడు బ్రహ్మనిష్ఠుఁ డగునౌర్వ మహర్షి కెదురేఁగి సముచిత నమస్కారములతో నాతనిఁ బూజించెను.

ఔర్వుఁ డాతని నాశీర్వదించి యిట్లు పలికెను. 'మునివర్యా! కందని యనునీమె న పుత్రిక. నీగుణగణముల నెల్ల విని యీమె నిన్నే పరిణ యమాడఁ గృతనిశ్చయయై యున్నది. ఈమె లోకాతీతసౌందర్యవతి, గుణవతి. కాని, ఈమె కోపినియై కలహముఁ గోరుచుఁ గటువచన ములు పలుకును. ఐనను, ఏకదోషముచేత వివిధగుణవస్తువు విడువ రాదు కదా! కావున, నీ వీమెను బరిగ్రహించి నన్ను ధన్యు నొనర్పు" మని కోరుకొనెను.

అంత దుర్వాసుఁడు నవయౌవనాంగి, మహాసుందరి యగు కందనిం గని యీమె తన్నే యెప్పవాల్పక కనుటయుం గని యౌర్వు నితో నిట్లనెను. 'మహాత్మా! స్త్రీ సందర్శనము రుద్రాదులకైనను ముక్తినిరోధకము, తపస్యాభంగకరము, మోహశోకనిధానము, పుణ్యనాశకము, రాగద్వేషమూలకము, జ్ఞానవిద్వేషకము ననుటలో సందియము లేదు. సంయమీశ్వరా! సంజ్ఞ, ఛాయ, భోగము, ఇంద్రి యము, దేహము, విద్య, మతి, జగమున దేహికిఁ గల్గును. ఇందు సంజ్ఞయు, ఛాయయు, దేహపతనకాలమున దేహిని విడుచును. భోగ మనుభవించినంతనే పోవును. దేహేంద్రియములు జీవత్వవిము క్తితోఁ బోవును. విద్య, జ్ఞానోదయముతోఁ బోవును. కాని, మతి జన్మజన్మమునందును గూడవచ్చును. స్త్రీనిగూడి దేహి యెంతకాలము వర్తించునో యంతకాలము దేహికి జన్మనాశనము లేదు. అంతకాలము శుభాశుభములు కలుగుచునే యుండును. కాని, నేనిపుడే తిలో త్తమా సాహసికుల రహఃక్రీడఁ గాంచి కామసంతప్తుఁడ నైయున్నాను. దానిఫలముగా విధాత యీనీకన్నియను సమకూర్చెను. కావున, నేనీమె కటూక్తుల సహించి యీమెను బరిగ్రహించెదను." అని తన యంగీకృతిఁ దెలిపెను.

ఔర్వుఁడు దుర్వాసునివచనములకు సంతసించి తన కూఁతు నమ్మునిపతి కిచ్చి విధ్యుక్తప్రకారమున వివాహముఁ గావించి యాశీర్వచనమే యరణముగా నొసంగి తిరిగి తనయాశ్రమమునకు వెడలిపోనున్నతటి విరహదుఃఖమున మూర్ఛిల్లిన నిజపుత్రి ననునయించి యిట్లు పలికెను. "తల్లీ! నిగమసూక్తము నీతిసారము నగునామాట వినుము. కులసతికి పతికంటె నెక్కుడు దైవము, బంధువు, గురువు లేఁడు. పతిసేవ చేయుపరమసాధ్వి పుణ్యముతో నేపుణ్యమును సాటి రాదు;

"పతిసేవకంటె ధర్మము
సతులకు శ్రుతులందు లేదు సతతము పతి శ్రీ
పతిఁగా మదిలోఁ దలఁచుచు
నతిభక్తి భజింపు తత్పదాంబుజయుగళిన్.

భ్రమసియైనఁ జాన పరిహాసమునన్నైన
మంచియైనఁ గోపగించియైన
సరగ నెదుటనైనఁ జాటుమాటునన్నైన
వల్లభునిఁ గటూక్తి పలుకరాదు.

ఎన్నినోములు నోచిన నేమిఫలము
పతిని గోపించి పరుషోక్తిఁ బలికెనేని
దానిశతజన్మకృతసుకృతంబు తక్షణంబ నశియించు నింత నిక్కంబు పుత్రి!"

(బ్రహ్మవైవర్త పురాణము)

ఇట్లు హితవచనము లనేకములు పలికి యౌర్వమహర్షి కూఁతు నల్లున కొప్పగించి నిజాశ్రమమునకు వెడలిపోయెను.

ఔర్వుఁడు దుర్వాసుని శపించుట

దుర్వాసుఁడు భార్యాసహితుఁడై యాశ్రమమున కరిగి శుభముహూర్తమున నేకాంతస్థలమున మృదుతల్పమున నయ్యంగనం

గూడి కామినీరసం బెఱుంగనివాఁడయ్యుఁ దపోమహిమమునఁ గామ శాస్త్రవిశారదుఁడై యిష్టోపభోగము లనుభవించుచు భార్యం దను పుచుఁ దాను దనియుచుఁ జాలకాలము గడపెను. ఆతరువాత, దుర్వాసుఁడు కందని కోపస్వభావమును గటూక్తులను జాలకాలము సైఁచియు నొక్కనాఁ డామెపైఁ గోపించి తీక్ష్ణముగాఁ జూచెను.

వెంటనే యాతనితపోగ్నిచేఁ గందని భస్మమై పోయెను. ఈ సంగతి విని యౌర్వుఁడు వచ్చి దుర్వాసుని నిందించి త్వరలో ఘోర పరాభవానలదందహ్యమాన మానసుఁడవు కమ్మని యాతనిని శపించి నిజాశ్రమమున కేఁగి విరాగసంపన్నుఁ డయ్యెను.

ఔర్వమహర్షి సగరవంశమును గాపాడుట

తొల్లి బాహుఁ డనురాజు అయోధ్యానగరమును బరిపాలించు చుండఁగా, హైహయులు మున్నగురాజులు దండెత్తివచ్చి యాతని రాజ్యము నాక్రమించిరి. అప్పుడు బాహుఁడు చేయునది లేక నిండు గర్భిణి యగుపట్టమహిషితోఁ దనకులగురు వగుఔర్వమహర్షియాశ్ర మమున కేఁగి యాతని శరణుచొచ్చి యండుండెను. అచట నాతని మఱియొకభార్య తనకు గర్భము కలుగక తనసవతికిఁ గలిగిన దను నసూయచే నామెగర్భస్తంభనమున కెవ్వరికిఁ దెలియనిరీతిని విషము పెట్టెను. ఆ విషము కారణముగా బాహునిపట్టమహిషి కేడుసంవత్స రము లైనను బురుడు రాదాయెను. ఇంతలో వృద్ధుఁ డగురాజు మృతుఁ డయ్యెను.

అప్పుడు పట్టమహిషి భర్తతో సహగమన మొనరించి పుణ్యాలో కముల కేఁగఁ దలఁచి భర్తచితిలో నురుకఁ బ్రదక్షిణనమస్కారము లొనరించువేళకు, అతీతానాగతవర్తమానకాలత్రయవిజ్ఞానవేత్త యగు నౌర్వమహర్షి నిజాశ్రమము వెలువడి విచ్చేసి యామె నగ్నిప్రవే

శము చేయవల దని నివారించి 'తల్లీ! నీ విట్టిసాహసమునకు దిగ వలదు. నీ కడుపులోనిబిడ్డ మహావీరుఁడు, సూర్యతేజుఁడు నై యేకచ్ఛ త్రాధిపత్యము వహించి భూమియంతయు నేలును. ఆతఁ డనేక యజ్ఞము లొనరించి పుత్త్రపౌత్త్రులం గాంచి వంశకరుఁ డగును." అని పలికెను.

ఆ పట్టమహిషి గురునానతి నౌదలఁదాల్చి సహగమనము మాని పతికి యథావిధి పరలోకక్రియలు నిర్వర్తించి పతిచింత పరమేశ్వర చింత తక్క నన్య మెఱుఁగక యం దుండెను. కొంతకాలమున కామె పుత్త్రుని గాంచెను. ఆతఁడు తల్లిగర్భమునుండి విషముతోఁ గూడి వెలువడినకతమున నౌర్వమహర్షి యాతనికి సగరుఁడు (గర మనఁగా విషము-విషముతోఁగూడఁ బుట్టినవాఁ డని యర్థము) అని పేరిడి జాత కర్మాదిక్రియ లొనరించి పెంచి చౌలోపనయనాదికర్మ లెల్ల యథా శాస్త్రీయము చేయించెను. పిమ్మట, ఔర్వుఁడు వేదశాస్త్రపురా ణములం బ్రవీణునిఁ జేసి, యనేకశాస్త్రవిద్యాదక్షవిద్యలు తెలిపి, రథా శ్వగజారోహణరాజవర్తనముల నేకొఱంతయు లేనట్లు శిక్షణమొసంగి సగరుని సంరక్షించెను.

ఇట్లు సగరుఁడు పెరిఁగి పెద్దవాఁడై యొకనాఁడు తల్లిని "అమ్మా! మన మీయడవులలో నుండవలసినకర్మ మేమి? మాతండ్రీ యేఁడి? మనరాజ్య మెక్కడ?" నని యడిగెను. ఆమాటల కామె కన్నీరు మున్నీరై కాఁ దనయునితో గతచరిత్ర మంతయుఁ జెప్పెను. సగరుఁడు కోపించి యుద్ధసన్నద్ధుఁడై విరోధివర్గము నుక్క డంచి వచ్చెదనని తల్లికడను గురునికడను సెలవుగైకొని వెళ్లి హైహయ వంశరాజులందఱను జయించెను. అపు డాతని విజృంభణమునకు వెఱచి శకయవనకాంభోజపారప్లవాదిదేశములరాజులు ప్రాణభీతిఁ బరుగిడి

పోయి తమకులగురు వైనవసిష్ఠుని శరణుచొచ్చిరి. వసిష్ఠుఁ డారాజు లను నిజకులాచారధర్మముల విడిపించి జీవన్మృతులఁ జేసి సగరునికడ కేఁగి యాతని ననునయించి యారాజుల విడిచిపుచ్చునట్లు చేసెను.

సగరుఁ డిట్లు విజయసంపన్నుఁడై అయోధ్యాపురికి వచ్చి రాజ్యాభిషిక్తుఁడై సప్తద్వీపసమేతముగా భూమండలమును బరిపాలించుచుండెను. ఆతనికి వినతాకశ్యపులతనయ యగుసుమతి, విదర్భ రాజుకూఁతు రగుసుకేశి యనువా రిరువురు ధర్మపత్నులైరి. కాని, యాతనికి వారియందు సంతానము కలుగనికారణమున నాతఁడు భార్యాసహితుఁడై యౌర్వమహర్షియాశ్రమమున కేతెంచి యాతనిని సేవచేయుచు నారాధించెను.

కొంతకాల మైనతరువాత ఔర్వుఁడు రాజుభార్యలం బిలిచి వంశవర్ధనుఁ డగుతనయుఁ డొక్కఁడు కావలయునా? లేక సామాన్యులటువదివేవురుపుత్త్రులు కావలయునా? యని వారి నడిగెను. సుకేశి యొక్కనిం గోరుకొనెను. సుమతి యటువదివేవురఁ గోరుకొనెను. ఔర్వునికటాక్షమున వారట్లే పుత్త్రులం గాంచిరి. ఇట్లు గురుకటాక్షమున సగరుఁడు చక్రవర్తి, పుత్త్రవంతుఁడునై పొలుపారెను.

ఔర్వుఁడు సగరునికి సర్వధర్మములు తెలుపుట

చిరకాలము సగరుఁడు రాజ్యమొనరించి పుత్త్రిపౌత్త్రవంతుఁడై యౌర్వమహర్షికడ కేతెంచి శ్రద్ధాభయభక్తులతో "దేవా! విష్ణువును గొలిచినఫల మేమి? ఎట్లాతఁడు ప్రీతుఁ డగును?" అని యడిగెను. అందుల కౌర్వుఁ డిట్లనెను. "రాజచంద్రా! విష్ణువును సేవించినవా రేమికోరుకొన్నను దాని నందఁగలరు. తమతమవర్ణాశ్రమధర్మములను శ్రద్ధాభక్తులతో నిర్వహించుపారిని విష్ణుమూర్తి కటాక్షించును. పరస్త్రీ పరధనకాంక్షలను విడిచి, జీవహింస సాధుదూషణము పరహీడ దురా

గ్రహము మున్నగుదుర్గుణములఁ బోఁద్రోలి, గురుభక్తి, బ్రాహ్మణ సేవ, సర్వజీవులయం దాత్మభావము గలిగి, శాస్త్రవిధిని స్వకర్మపరులగువా రన్న విష్ణువున కత్యంతప్రీతి. విష్ణువు ప్రీతి నందినచోఁ గలుగఁ జాలనిది త్రిభువనముల నేమియు లేదు.'' ఇట్లు తెలిపి మఱియు నాతనికి వర్ణాశ్రమాచారములు, నిత్యనైమిత్తికక్రియాకలాపములు, సర్వధర్మములుఁ దెలిపెను.

గృహస్థధర్మములు

పిదప, సగరుఁడు పరమపుణ్యు లగుగృహస్థులయాచారనియమ తులు తనకుఁ దెలుపు మని కోరఁగా వౌర్వుఁ డిట్లనెను. ''రాజా! సదాచారవంతు లగుగృహస్థు లుభయలోకముల నత్యంతసౌఖ్యము లనుభవింతురు. తొల్లి స్వాయంభువాదు లగుమనువులు, సప్తమహర్షులు, ప్రజాపతులు, సకలలోకోపకారకములుగా సదాచారమార్గం బులు కల్పించిరి. కావున, నిజవర్ణధర్మను లైనయాచారములు తప్పక యనుష్ఠింపవలయును.

గృహస్థు బ్రాహ్మముహూర్తమున లేచి శ్రద్ధాభక్త్యుత్సాహములతో గురువును ఇష్టదైవమును ధ్యానించి శయ్యాగృహము వెడలి గ్రామనిర్ఋతిభాగమున సుదూరప్రదేశమునఁ గాలకృత్యములు నిర్వర్తించి, మృత్తికాదులతోఁ గాలుసేతులు తోమి కడిగికొని జలముల శుద్ధుఁడై జలమధ్యమున కరిగి యాజలమును విష్ణురూపముగా భావించి సంకల్పపూర్వకముగా స్నానముచేసి జలములు వెడలివచ్చి, తెల్లనిమడిబట్ట కట్టుకొని, దేవర్షిపితృతర్పణము లొసంగి, సంధ్యాది కృత్యములు, సూర్యారాధనము నిర్వర్తించి యింటికి వచ్చి షోడశోపచారములతో దేవతాపూజ గావించి, జపోపాసనవైశ్వదేవము లాచరించి, ఆయాదేవతలకుఁ బ్రీతిగా హుతశేషాన్నంబు బలులుపెట్టి, గృహము వెలుపల భూతప్రేతపిశాచకూష్మాండపిపీలికాదిజంతువులకు నాయామంత్రముల బలులుపెట్టి, గృహస్థుఁడు సకలభూతసమాశ్రి

తుఁడు కనుక, ఆవును బాలుపితుకునంత కాలము బహిఃప్రదేశమున నభ్యాగతులకొఱ కెమరుచూచి, యెవ్వఁ డైన లభించిన నాతని నతి భక్తియుక్తిఁ దనపాలిటిభాగ్యదేవతగా భావించి విష్ణుస్వరూపునిగా నాతనిఁ బూజించి యమృతరసాన్నపానముల నాతనిఁ బ్రీతునిఁ జేసి యాతనితోఁ దానును గుడిచి, భోజనము సుఖజీర్ణ మగుటకొఱ కగస్త్య బడబానలస్తోత్రములు చేసి వేదశాస్త్రప్రసంగములఁ బ్రొద్దుపుచ్చి యపరసంధ్యావిధులు నిర్వర్తించి భోజనము చేసి తాంబూలమును గైకొని శయ్యాతలమునఁ బవ్వళింపవలయును. తూర్పుదక్షిణము లలో నొకదిక్కు తలదిక్కుగఁ జేసికొని, చల్లగాలి ధూపవాసనలు గలయట్లు చూచుకొని, జ్యేష్ఠాదినక్షత్రముల ఋతుదివసములఁ గులాం గనాభోగ మనుభవించి నిద్రింపవలయును.

నీతిపరుఁడై నిజకులాచారధర్మములు వదలక ధర్మార్థకామము లందు సమచర్యయై పాపకర్మములు పరిహరించి సమస్తభూతముల యందు స్నేహబుద్ధి గలిగి, యరిషడ్వర్గమున బద్ధుఁడుగాక సదాచార సంపన్నుఁడు, సాత్త్వికప్రవరుఁడునై, పరపీడ, పరనింద యెనర్పక తనజీవనము సకలప్రాణిసంఘములకు నవికారభూతముగాఁ బ్రికరణ శుద్ధిగా వర్తించుపుణ్యపురుషుఁడే నిజమైనగృహస్థు. ఆతఁడే పుణ్య లోకప్రాప్తుఁ డగును."

ఔర్వుఁడు పిదప శౌద్ధక్రియావిధానములు, వానివానిపరమా ర్థమును సగరుని కెఱిఁగించిన, సగరచక్రవర్తి కృతార్థుఁడై ఔర్వుఁడు చెప్పినచొప్పున సదాచారసంపన్నుఁడు, సుఖీభూతుఁడు, నిష్కలంక చిత్తుఁడు, నిరవధికానందుఁడు నయ్యెను.*

ఇ ట్లౌర్వమహర్షి నిగ్రహానుగ్రహసమర్థుఁడు, అస్ఖలిత బ్రహ్మ చర్యుఁడు, మహాతపోనిధియై యూచంద్రార్కఖ్యాతి నందెను.

---

* శ్రీ విష్ణుపురాణము

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

కండు మహర్షి



స్తుతి

కండుమహర్షిఁ గొల్చెద నఖండతపోధనరాశిఁగూర్చి యూ
ఖండలవై భవోన్నతిని గాంచిన మౌనితంసుఁ, గాముకో
చ్చండత నప్సరోమణులసంగతిఁ దృప్తి వహించి మించి యు
ద్దండతపోమహత్త్వమున ధన్యతఁ గాంచిన యాత్మనిగ్రహున్.

కండుని తపోనిరతి

తొల్లి కండుఁడనుముని బాల్యమునుండియు మహాతపశ్శాలియై గౌతమీతీరమున నొకయాశ్రమమును నిర్మించుకొని జీవించుచుండెను. జనశూన్యమైన ఆయాశ్రమవనమునఁ గందమూలఫలాదులు, పుష్ప లతాగుల్మములు, సువాసనలఁ గొనిపోవుమందమలయవాయువులు, కుశకాశతృణాదులు మిక్కుటములై చాల మనోహరముగా నుండెను. అనేకమృగములు సేవచేయుచు మైత్రి పాటించుచుండ, శుకపికాదులు కలస్వనములచే మనస్సున కానందము కలిగించుచుండఁ బ్రశాంత మన స్కుఁడై కండుముని తపముచేసికొనుచుండఁగా నట నిత్యను వసంత శోభయే చెలువారుచుండెను.

కండుమహాముని కఠినవ్రతము లవలంబించియు, మహోపవా సము లుండియు, స్నానవర్జ్యనియమము లూనియు, గ్రీష్మకాలమున సైతము, పంచాగ్నిమధ్యమునఁ దపించియు, శీతకాలమున మంచువలె

గడ్డకట్టినజలములమధ్యమున నుండియు, నుగ్రతపస్సుచేసెను. ఆతని తపోనిరతికి దేవతలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు మున్నగు వారు పరమాశ్చర్యభయముల నందిరి. క్రమముగా ముల్లోకములందు నీతనితపోగ్రతఁ గూర్చి జనులు చెప్పుకొనుచు నచ్చెరువందు చుండిరి. ఇంతధైర్యము, ఇంతనియమపరత, ఇంతనిష్ఠాగరిష్ఠత, ఇంతసాధు తపము నెక్కడను గనియున్నవారము కాముకదా యని యెల్లరు నాతని వినుతింపఁ దొడఁగిరి.

తపోభంగమునకై ఇంద్రుఁడు ప్రయత్నించుట

ఇట్లుండఁగా నింద్రుఁడు దేవతలతో నాలోచించి కండుమహా మునితపస్సునకు విఘ్నము కలిగింప నెంచెను. వెంటనే యాతఁడు సుందరాంగియు దేవవేశ్యయు నగు ప్రమ్లోచన యనుదానిఁ బిలిపించి యామెతోఁ గండుమని తపోగ్రతఁ దెలిపి, యాతనికిఁ గామరాగముఁ బుట్టించి తపోవిఘ్నముఁ గలిపింపు మని కోరెను.*

అంత నామె "దేవా! బ్రహ్మచర్యనిష్ఠుఁడు మహోగ్రతేజస్వి యగుకండుమునిని వశపఱచుకొన నాకలవి యగునే? ఊర్వశి, మేనక, రంభ, ఘృతాచి, పుంజికస్థల, విశ్వాచి, సహజన్య, పూర్వ చిత్తి, తిలోత్తమ, అలంబుస, మిశ్రకేశి, శశిలేఖ, వామన మున్నగు త్రిదశవేశ్యలు రూపయౌవనగర్వమున నలరుచు సుందరవదనార విందలు, సుమధ్యలు, సుస్తనోన్నతలు, కామప్రచారకుశలలు నైయు న్నారు. వారలలో నొకతెఁ బంపు" మని పలికెను. "కాంతా! వారె వ్వరు నీపనిలో నీకుఁ జాలరు. కామవసంతమలయానిలముల నీకుఁ దోడుగా నిచ్చెదను. నీ వేఁగి యీకార్యము నిర్వర్తింపక తప్పదు. పోయిర" మ్మని యింద్రుఁ డామెను శాసించెను.

---

* కండుఁ డని బ్రహ్మపురాణము. కంధుఁ డని విష్ణుపురాణము.

ఇఁక మాఱుమాటాడనేరక ప్రమ్లోచన మన్మథవసంతమలయా నిలులు తోడురాఁగా భూతలమునకుఁ బ్రయాణమయ్యెను. అపుడు

"పడఁతి బింకపుగుబ్బపాలిండ్లు కంతుని
గిరిదుర్గములతోడఁ గ్రీడసేయ
కమలాక్షినిడువాలుఁగన్నులు కుసుమా స్త్రి
క్రొవ్వాఁడి తూపులఁ గొఱఁతపఱుప
అలివేణినూగారుచెలువు శంబరవైరి
నిడువాలువాలుతో నెయ్యమాడ
చిగురాకుబోఁడిభ్రూయుగ మంగజాతుని
చెఱకుసింగిణివింటి కొఱపు గఱప

సరసిజాయతలోచనజఘనయుగము
మరునిరథచక్రములతోడ మాఱుమలయ
మేఘమండలిలో నుండి మెఱుఁగుఁదీఁగె
వెడలివచ్చినకైవడిఁ బుడమికి డిగి"

(విష్ణుపురాణము. ఎ ఆ. ఎంఴ)

ప్రమ్లోచన కండుమునియాశ్రమముఁ జేరెను. అచట నాశ్రమము పరమశాంతముగా నుండెను. కాని, యీమె యట నడుగుపెట్టఁగనే గండుఁగోయిలలు మనోహరముగాఁ గూయఁదొడఁగెను. వసంతుఁడు కూడ వెంటనే విజృంభించెను. ప్రమ్లోచన సభీసహితయై పూలుకోయఁ బోయెను. అంత

"మలయాస్మాధరకూటదంతురశిలామార్గంబులన్ డస్సిత
ద్వీలసన్నిర్ఝరవారిదీక్షికలలో విశ్రాంతిఁ గావించి పు
ష్పలతామంజులకుంజపుంజముల నిచ్ఛావృత్తి వర్తించుచున్
బొలసెన్ దక్షిణవాతపోతములు సంపూర్ణప్రమోదంబునన్."

(వి. పు. ఎ. ఎంఎ)

ఆగాలికి వనలతలనుండి పుష్పము లెల్ల భూమిపైఁ బడి పుష్పశయ్యలుగా నేర్పడెను. మన్మథుఁడు నిదే సమయమని కండుమునిపై సుమబాణము లేసి యాతనిధైర్యకంచుకమును జెండాడిపై చెను. ముని కన్నులు తెఱచి ప్రస్ఫోచనఁ గని మోహపరవశుఁడయ్యెను.

ప్రస్ఫోచన కండుమహర్షిని చేఁజిక్కించుకొనుటు

అంత

"తనశరీరపు కమ్మతావి మూర్కొనునట్లు
గా వినోదమునఁ బైగాలిఁ బొలయు
తన మోహనాకృతిఁ గనుఁగొనునట్లుగాఁ
ముందర బిబ్బోకముగ నటించు
తనకంఠరవములు వినవచ్చునట్లుగాఁ
బరివాదినులు ముట్టి పాడుచుండు
తనమోవిరుచికిఁ బైగొనివచ్చునట్లుగాఁ
దియ్యనిఫలములు తెచ్చి యిచ్చు

తనకరాలింగనమునకుఁ దగులునట్లు
గా శరీరంబు మోవంగఁ గదిసి మ్రొక్కి
నిత్తెఱంగున నమ్మునిచిత్తవృత్తిఁ
గలఁచి మదనాతురునిఁ జేసె కమలనయన.

(వి. పు. ఆ. 218)

వెంటనే కండుమునీశ్వరుఁడు సమస్తనిష్ఠలు తన్ను విడిచిపోఁగా నామేఁ జేరి యిట్లని ప్రార్థించెను.

"తరుణి! నీ చేత మదనతంత్రంబు లెఱుఁగఁ
గోరియున్నాఁడ నా యాస కొంచెపడక
యుండ సురతసుఖాంబుధి నోలలార్చి
యింపుసొంపార నన్ను మన్నింపవలయు"

(ఆ. 219.)

వెదకఁ బోయినతీఁగ వ్రేలికిఁ దగిలిన ట్లామె యానందించి యాతనిఁ జెట్టపట్టెను. కండుమునీశ్వరుఁడును దనయపారతపోబల మున నవయౌవనుఁడు, నవమన్మథసదృశుఁడు, నవ్యభూషణభూషి తుఁడు, షోడశాబ్దవయస్కుఁడు, దృఢవీర్యుఁడు నై ప్రమ్లోచనఁ దన యాశ్రమమునకుఁ గొనిపోయి యానందాంబుధినోలలాడఁ దొడఁగెను.

తరువాత నాతఁడు తనవలపుక త్తెతోఁగూడి మందరగిరికంద రంబులయందు దివారాత్రము లెఱుఁగక యయ్యిందువదన తోడికం దర్పరతిక్రీడానందంబుల నూఱుసంవత్సరంబులు వినోదించెను. ఆపిదప నామె యెన్నియెోమాఱులు తాను ద్రివశవేశ్యననియు నగ్నిసాక్షిగఁ బెండ్లాడినయాలిఁ గా ననియుఁ దనకు స్వర్గమునకుఁ బోవ ననుమతి యిమ్మనియు నాబుషిఁ గోరెను. కాని, యాతఁడు వలపుతమి విడువ లేక యంగీకరింపఁ డాయెను. ఆతని యానతిఁగొనక యామె యరి గినచోఁ దనకు శాప మొసంగు నని వెఱచి యామె యెన్నియెా యేం డ్లాతనితో నుండిపోయెను.

ఒకనాఁడు కండుముని యెుడ లెఱింగి యెాగదృష్టిని జూచి తాను జిరకాలమునుండి వారవనితవాగురులకుఁ జిక్కి తపోమహ త్త్వముఁ గోలుపోవుచుండుటఁ గనిపెట్టి ప్రమ్లోచనఁ బిలిచి "ఓసీ! నీ వింతకా లము నన్ను సంతోషపెట్టితివి కాన నిన్ను శపింపను. నీవు వెనువెం టనే నీయిచ్చవచ్చినచోటికిఁ బొమ్ము. పోకుందువేని తృణములో భస్మ మగుదు" వని హుంకరించెను. ప్రమ్లోచన గడగడ లాడుచు నాబుషి పాదపంకజముల కెఱఁగి సెలవుగైకొని గగనమున కెగసి వెడలిపోవు నపు డామె లేఁతచూలు గలగర్భము స్రవింప నామెశరీరావయవముల నుండి యాబుషివీర్యము చెమటరూపమున బయలువెడల నామె చంచలించి బాలతరుపల్లవములఁ దుడుచుకొనుచు దేవలోకమున కరిగెను. ఆలేఁతయాకులనుండి యామునివీర్యము వాయువశమునఁ

జంద్రకిరణములఁ బరివృతమై క్రమముగ నొక స్త్రీరూపమున జన్మముఁ గాంచెను. ఈ స్త్రీయే మారిష. ఈమెను బ్రచేతసులు భార్యగాఁ గైకొనిరి. ఈమెకే దక్షప్రజాపతి జన్మించెను.

కండుఁడు పశ్చాత్తప్తుఁడై మరల తప మొనరించుట

కండుమహర్షి యింద్రునికపటమునఁ దాను దపోమహత్త్వమును గోల్పోవుటకు విచారించి యటనుండి బయలుదేఱి పురుషోత్తమక్షేత్రమునకుఁ బోయెను. మునిపతు లగుభృగ్వాదులకు, మోక్షమార్గపరినిష్ఠితులు, గంధర్వయక్షాదులు, తపోమహిమాఢ్యులు నగువారికి నివాసస్థాన మగునాప్రదేశమునఁ గండుమహర్షి యూర్ధ్వబాహుఁడు, మహాయోగనిరతుఁడునై బ్రహ్మపారజపపరాయణుఁడై* తపోనిరతినుండెను.

ఆతనిభక్తికి మెచ్చి పురుషోత్తముఁడు ప్రత్యక్షమై మధురముగ "మునివరా! నీతపమునకు మెచ్చి వచ్చితిని. వర మేదైనఁ గోరుకొనుము. ఇచ్చెద" ననెను. అంత, కండుమహర్షి యాతనికి సాష్టాంగనమస్కారము లొనరించి భయభక్తిశ్రద్ధలతో నాతని నిట్లు స్తుతించెను. "నారాయణా! సర్వలోకప్రభూ! నీకు నమస్కారములు. నీవు

---

* ఈబ్రహ్మపారజపభావ మిది: పరమాత్మరూపుం డగుహరి పరాత్పరుఁడు. అపారపారుఁడు, బ్రహ్మపారుఁడు, పర పారభూతుఁడు, అని యాతనినే యందురు. పరమేశ్వరులకుఁ బరమేశ్వరుం డగుట పారపారుఁ డని యాతనిని మునులు వినుతింతురు. కారణసంశ్రితుఁ డగునాతఁడే కారణము. ఆతఁడే పర హేతు హేతువు. సర్వకార్యములయందు నాతఁడే కర్తృకర్మక్రియారూపములచే సర్వముఁ బాలించుచుండు. ఆబ్రహ్మమే ప్రభు వని పిత యని సర్వభూతుఁ డని, అవ్యయము, నిత్యము, అజము నసువర్ణములకుఁ బాత్రుఁడై అసంగుఁడై వెలుఁగును. బ్రహ్మము. అక్షరము, అజరము, నిత్యము నగువాఁడే పురుషోత్తముఁడు. అతనిదయచే రాగాదు లగునాసర్వదోషములు నశించుఁగాక యని చేయుప్రార్థనముతోఁ గూడినజపమే బ్రహ్మపారజపము. ఇది విష్ణుప్రీతికరము. (బ్రహ్మపురాణము.)

విశ్వకర్మవు, శంభుఁడవు, వృషాకృతివి, శంకరుఁడవు, ఉశనసుఁడవు, సత్యస్వరూపుఁడవు, జపస్వరూపుఁడవు, తపస్స్వరూపివి, ఆదిత్యుఁడవు, ఓంకారుఁడవు, ప్రాణరూపుఁడవు, పర్జన్యప్రథిత వేధోసురేశ్వరనామ ధరుండవు, ఋగ్యజుస్సామసమ్మతుఁడవు, పరమాత్మవు.

దేవదేవా! నీవు దశాంగుళమాత్రరూపుఁడవు, మృతామృత శబ్దములు నీవు. నీవలన జగము లుదయించు. మహీయాంసుఁడవై దశధాస్థితిం గాంచిననీవు నవభాగంబులుగ దివియందును, నవభాగములుగ నంతరిక్షంబునందు నివసింతువు. భాగద్వయంబున భూమినుందువు. చతుర్భాగంబులఁ బురుషోత్తమక్షేత్రమున నుందువు. మహాభాగా! నీకు నమస్కారములు'' అని పెక్కువిధంబులఁ గండు మహర్షి చేసినస్తుతి కానందించి విష్ణుమూర్తి వరము కోరుకొమ్మని మరల నడిగెను. అంత, కండుఁడు "దేవా! అతిదుస్తరము, నతివిస్తరము, భయావహము, శ్రేయోరహితము నగుసంసారసాగరమును దరింపఁజేసి పరమపద మనుగ్రహించి రక్షింపు" మని ప్రార్థించెను. విష్ణు వట్లే యగునని వరమిచ్చి యంతర్హితుఁ డయ్యెను.

అనంతరము కండుమహర్షి రాగద్వేషాదులనెల్ల వర్జించి కామక్రోధాదులు తన్ను విడిచి పారిపోఁగా శమసత్త్వసంపన్నుఁడై, అహంకారమును విడిచి, ఇంద్రియముల నిర్జించి, యేకాగ్రత శ్రీహరిని ధ్యానించి ధ్యానించి యమరులకైన సాధ్యముకాని మోక్షపదమునంది దివ్యతేజోలీనుఁడై సిద్ధినందెను.

ఇట్లు కండుమహర్షి బాల్యమునుండియుఁ దపస్సంపన్నుఁడై నడుమఁ గామమోహితుఁడై కాంతాసుఖముల మఱిగి కాలమును వ్యయించియుఁ బశ్చాత్తప్తుఁడై నిరుపమనిష్ఠాగరిష్ఠత మరల మహోగ్రతప మొనరించి బ్రహ్మ పారమంత్రసిద్ధుఁడై యోగీశ్వరులు గాంచు దివ్యపదవిఁ జూఱగొనెను.

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

కణ్వ మహర్షి



స్తుతి

"పరమార్థ తత్త్వానుభవము వక్కాణించు
సమధిక బ్రహ్మవర్చసమువాని
కైవల్యవాంఛానుకలనంబు వివరించు
వ్యాఘ్రాజినోత్తరీయంబువాని
వెలిచూడ్కి లోలక్ష్య మలఁతి బాహిరముగా
మునుకొన్న శాంభవీముద్రవాని
వేదముల్ మూర్తిభవించు మేఁదలపించు
సముచితాధ్యయనఘోషంబువాని
హుతహుతాశనతేజుఁడై యొప్పువాని
హరిచరణభక్తి పుంభావమైనవాని
దయయు ధర్మంబుఁ దానయై తనరువాని"
కణ్వమౌనీంద్రుఁ గొల్తు నస్ఖలితభక్తి.
(కృష్ణకవి శకుంతలాపరిణయము ౩-౫౩)

కణ్వుని మంత్రద్రష్టృత్వము

కశ్యపప్రజాపతివంశమున జనించినమహనీయులలో మునికుల చూడామణి యనఁదగినకణ్వమహర్షి యొకఁడు. ఈతఁడు బాల్యము

నుండియు మహాతపోనిష్ఠలో నుండి యాజీవితబ్రహ్మచారి యైనఋషి వర్యుఁడు. ఈతఁడు కొన్ని సామవేదమంత్రములకు ద్రష్టయై కాణ్వ శాఖీయు లగువేదవాదులకు మూలపురుషుఁడైన మహాత్ముఁడు.

ఈతఁడు బాల్యమునఁ దనకుఁ దోఁచినసామమునకు నిదానము కానరాక వ్యాకులపడుచున్నసమయమున నీతనిసమీపమున నున్న యొకపిల్లి మెల్లఁగా నొకతుమ్మి తుమ్మెను. ఆతుమ్మినే యాతఁడు నిదానముగాఁ గైకొని సామమంత్రమునకు ద్రష్టయై మహర్షులమన్న నలఁ గాంచెను. ఇట్లే కణ్వుఁడు పెక్కుసామఋక్కులకు నిదానముఁ గనిపట్టి జగజ్జేగీయమానుఁ డయ్యెను.

కణ్వుని యాశ్రమము

కణ్వముని నిరంతరతపోవృత్తి, వేదగోష్ఠి, మునిజనసహవాసము, ముఖ్యములుగా నెంచుకొని మాలిని యనునదీతీరమున మహాప్రభావ నిలయ మగునొకవనమునఁ దనయాశ్రమమును నిర్మించుకొని యందు నివసించెను. ఆతనియాశ్రమవనము దేవేంద్రునిఖాండవనమునకుఁ గుబేరునిచైత్యరథమునకు సరిపోలుచుఁ గొన్ని యెడల వానికి మిన్నగా నిలువ భూలోకమున దీనిని సృష్టించినాఁడా యన్న ట్లుండెను. ఆయడవి యందలితీఁగ లను స్త్రీలు మందమలయానిలములవలన రాలినపూవు లనునఱుతలను అందుండి బయటపడి తుమ్మెదలుచేయుఝుంకార మను ఆశీర్వాదముతో అచటి కరుదెంచినవారికి, అట నున్నవారికి నెల్ల ప్పుడు నొసంగుచుండుట పరిపాటి-ఆయాశ్రమప్రదేశమున నొత్తుగాఁ బెరిగి మనోహరముగాఁ గానవై చక్కఁగాఁ బుష్పించినయెట్టిగోరఁటలు, పూలతో వానిసౌరభముతో నెంతోసంతోషము కలిగించు నశోకవృక్షములు- పొన్నచెట్లు మున్నగునవి, చక్కఁగాఁ గాచి పండిన తీపుమామిడి, యరటి, మున్నగుఫలజాతివృక్షములు లెక్కకు మిక్కిలియై యటనుండెను. వేయేల! ఆయాశ్రమమే భూలోకస్వర్గము.

కణ్వమహర్షి యాశ్రమమున నిరంతరము పదము క్రమము పఠించువేదవిదులవేదనినాదము నింగిముట్టుచుండెను- ఎడతెగక యగ్నిహోత్రమున నాజ్యము సమిధలు కర్మిష్ఠు లగుఋషులు "స్వాహా"యనుశబ్దములతో వేల్చుచునే యుండిరి. అంతేకాదు. ఆయా శాస్త్రములలో నిష్ణాతు లయినఋషీశ్వరులు రచించిన న్యాయాదిక శాస్త్రములప్రవచనములవలన విద్వత్సభాసంభాషణోపణమట నెప్పుడును వినఁబడుచుండెడిది. మఱియు వేదార్థమీమాంసకగోష్ఠివివాదనాదములు నట వినఁబడుచునేయుండెను. ఇంకను, యజ్ఞప్రయోగప్రవీణు లయినయాజ్ఞికులకును, విహితానుష్ఠానాసక్తు లయినయనుష్ఠాతలకును, అధికతపోనిరతులయినమహాతపోనిధులకును కణ్వునియాశ్రమము నివాసస్థానమయ్యెను. మఱియు నీయాశ్రమము గంగాతీరమునందలినరనారాయణదివ్యాశ్రమమువలె జగత్పావనమై యలరారెను.

కణ్వమునియాశ్రమముపొంత శుకపికములు శ్రవణసుఖముగా సామగానములు చదువుచుండెడివి. అవి వినుచుఁ గదలక నిలుచునేనుఁగులు, ఆయేనుఁగులతొండములచల్లనినీడను జల్లనిగాలికొఱకై చేరి సుఖముగా సింహములు నుండెడివి. అచటి ఋషివరులు భూతబలులుగాఁ బెట్టునీవారన్నపిండములు తినుటకై చేరవచ్చి పరస్పరస్నేహముతో నెలుకలు పిల్లులు పంతులు పంచుకొని కుడుచుచుండెడివి.

ఇట్టిపవిత్రాశ్రమమునఁ గణ్వమహర్షి యేకైకధర్మస్వరూపుఁడని జగమునందలిసమస్తజనులు తన్నుఁ బ్రశంసించుచుండఁగా జగదారాధ్యుఁడై, దయామయుఁడై, యూర్ధ్వరేతుఁడై, మహోమహుఁడై విలసిల్లుచుండెను. సహస్రసంఖ్యాకు లగుశిష్యులాతనిఁ జేరి శుశ్రూషాపరత భయభక్తియుక్తులై యుండఁ గణ్వమహర్షి కులపతియై వారలకుఁ దోడునీడగాఁ గన్నతండ్రిగాఁ బరమహితుఁడుగా వర్తించుచు

నెల్లరిమానసములను వశమొనరించుకొని వారెల్లరకు నారాధ్యుడైవ మయ్యెను.

కణ్వమహర్షి కారుణికత్వము

అఖండబ్రహ్మచర్యవ్రతుఁడు, జ్ఞానసంపన్నుఁడు, యోగా రూఢుఁడు, మునిగణసేవితుఁడు నగుకణ్వమహర్షి యపారభూతదయా పరుఁడై యుండెను. అచట నివసించునాతనిశిష్యగణమేకాక యావన మందలి పశుపక్షిక్రిమికీటకములుసైత మామహనీయుని దయావిశేష మునకుఁ బాత్రములై యుండెను. ఆప్రాంతములకు వచ్చినరాజర్షి బ్రహ్మర్షి మునిపుంగవు లెల్లరును గణ్వునియాశ్రమమును దర్శించి యాతనిపాదరజోలేశమును గన్నుల కద్దుకొని యాతనిని సన్మతించి యాతనిసన్నుతు లంది యరుగుచుండిరి.

కణ్వమహర్షి శకుంతలం గాంచి పెంచుట

ఒకనాఁడు కణ్వమహర్షి యుదయవేళ మాలినీనదీస్నానము నకై బయలుదేఱి వెడలుచుండఁగా మార్గమధ్యమున నొక్కబాలిక రోదన మాతనికి వినఁబడెను. ఆధ్వని ననుసరించి కణ్వుఁడు వెదకఁగా నట నొకచోట, తామరపాకుపొత్తికయం దొకబాలిక చేతులు కాళ్ళు కదుపుచు నేడ్చుచుండుటఁ గాంచెను- కరుణారసభరితమైన యామహా నీయునిహృదయము వెంటనే ద్రవించిపోయెను. చలిచీమలైనైన జాలిపడునాకరుణాసముద్రుని కాబాలికపై ననుకంప జనింప యోగ దృష్టిని బాఱించి యామెజన్మాదివృత్తాంత మంతయుఁ దెలిసికొనెను. ఇంతలో నశరీరవాణి "మునీంద్రా! ఈమె మేనకావిశ్వామిత్రుల కుదయించిన బాలారత్నము. నీవీబాలికభయముం బాపి పెంచుము. 'భయత్రాత తండ్రి' యనునుడివలన నీవీమెకుఁ దండ్రి వగుదువు. ఈమెకు జనించుపుత్రుఁడు చక్రవర్తియగును. విశ్వామిత్రతపఃప్రభావ

మునఁ గ్రవ్యాదగోచరము కాక శకుంతరక్షితయై నవనలినపలాశ తల్పమునఁ బొరలు నీమె శకుంతల యనుపేరఁ బరగుఁగాక! యని పలికెను.

ఇది విని కణ్వమహర్షి యానందించి యంగీకరింప నాబాలికపై నాతనికిఁ బుత్త్రికామోహ ముదయించెను. వెంటనే యతఁడాబాలికను దనపొదిగిటఁ బొదివికొనెను. అంతేకాదు:

"పుట్టు బ్రహ్మచారి పుత్రమిత్రకళత్ర
యోగభోగరహితుఁ డూర్థ్వరేతుఁ
డహహా! దైవఘటన మాపిన్నపాప మే
నలమికొనుచు ముద్దులాడఁ దొడఁగె!"

(కృష్ణకవి శకుంతలాపరిణయము. ఎ.గుఒ)

కణ్వమహర్షి యాబాలికను దీసికొనిపోయి తనపర్ణ శాలయందు లలితకుశశయ్యపయిఁ బరుండఁబెట్టి తానే తల్లియుఁ దండ్రియు దాయి యునై పెంచఁదొడఁగెను. ఆహా! విధిచైదములు విచిత్రములుకదా! ఆలుబిడ్డల నెఱుఁగనియచ్చపుజడదారిని శకుంతలకు దాదిని జేసినవిధి యిఁక నేమి చేయఁజాలఁడు?

శకుంతలా వివాహము

కాలక్రమమున శకుంతల యల్లారుముద్దుగాఁ బెరుగుచుఁ గణ్వ మహర్షిని దండ్రిగాఁ జూచుకొనుచు నాతనివలన విద్యావినయవివే కాది సుగుణసంపదల నెన్నిటినో యలవఱచుకొని యవనీతలమున కవతరించినతరుణశశిరేఖవలె దినదినప్రవర్ధమాన యగుచుండెను.

కాలప్రవాహమున కెట్టియాతంకములు కలుగఁబోవు. పసిపా పల బాలురగాఁ బాలుర యువకులఁగా యువకుల వృద్ధులఁగాఁ గాల

పురుషుఁడు మార్చి వేయుచు జరామరణములఁ గూర్చుచు లోకము లేలుచుండెను. మూర్ఖమానవులు కాలప్రభావ మెఱుఁగక యేదశ కాదశయే శాశ్వత మనుకొని క్రీడాపరులై యిహపరములకు రెండిటికి దవ్వగుచుందురు.

కాలక్రమమున శకుంతల యువతియై నవలావణ్య విలాసహాస ముల నొప్పారెను. సఖీజనముతో నా మెయుద్యానవనములఁ బెంచుట, తండ్రి దేవపూజకు వలయుపుష్పపత్రాదులఁ దెచ్చుట, ఆశ్రమమృగ ముల నాదరించుట మున్నగుపనులు నిత్యకృత్యములుగాఁ బెరిగెను.

ఒకప్పుడు కణ్వుఁడు నిజాశ్రమ ప్రదేశమున లేనిసమయమున దుష్యంతమహారాజు వేఁటకై వచ్చి వేఁటాడి డస్సి కణ్వమహర్షిని జూచి పోవుద మని కణ్వాశ్రమమున కేతెంచెను. అపు డాతనికి శకుం తల లోచనగోచర కాఁగా నా మె సౌందర్యమున కచ్చెరువంది యా మె ఋషికన్య యైనచోఁ దన కా మెపై నట్లు వలపు కలుగుట సంభవింపదని యు నా మె ఉత్త్రియకన్యయై యుండవలయుననియు నిశ్చయించు కొనెను. తదనంతర మా మెవృత్తాంతముఁ దెలిసికొని యా మెను జెట్టవట్ట నుంకించెను. శకుంతలయు నవమన్మథుఁ డగునారాజేంద్రుని మక్కువఁ దగిలెను. ఆతఁడు గాంధర్వవిధిని వివాహమయి సంగమ సౌఖ్య మిమ్మని యా మెను వేగిరపెట్టెను. శకుంతలయుఁ దనకుఁ బుట్టఁ బోవుపట్టి యువరాజు కావలయు నని కోరెను. దుష్యంతుఁ డందుల కంగీకరించి గాంధర్వవిధి నా మెఁ జరిణయమై యిష్టోపభోగము లంది యా మెకు గర్భము నిలిపెను. పిదప, దుష్యంతుఁడు తనప్రధానవర్గ మును గణ్వమునిపాలికిఁ బుత్తెంచి యా మెను దీసికొనిపోయి పట్టమ హిషిం జేసికొందు నని చెప్పి యా మె నూఱడించి నిజనగరమునకు వెడలిపోయెను.

కణ్వుఁడు శకుంతలకు వరమిచ్చుట

శకుంతలయు జరిగినదానిని విని కణ్వమహర్షి యేమనునో యేమినింప వచ్చునో యని భయపడుచుండెను. ఇంతలోఁ గణ్వ మహర్షి విచ్చేసి తనకెదురు వచ్చి నమస్కరించినకూఁతుం జూచి లలిత శృంగారభావమున లజ్జావనతవదనయు, అతిభీతచిత్తయు నైనశకుంతల సంగతి దివ్యదృష్టిని దెలిసికొని యది యంతయు విధివిలసితముగాఁ దలపోసి శకుంతల నూఱడించి యిట్లని పలికెను.

"తల్లి! నీకులగోత్రసౌందర్యములకుఁ
దగినపతిఁ గంటి దానికిఁ దగఁగ గర్భ
మయ్యె నీదుగర్భమునవాఁ డఖిలభువన
వహనమహనీయుఁ డగుచక్రవర్తిసుమ్ము."

(భార. ఆది. ౪-౬౫.)

నీధర్మచరితమునకు మెచ్చితిని. నీవు కోరినవర మిచ్చెదను వేఁడు" మని పలికెను. అంత నామె మిక్కిలి సంతసించి "తండ్రి! నీదయకన్న నాకు వలసిన దేమున్నది? నాచిత్త మెప్పుడును ధర్మము నందే తగిలియుండునట్లు, నాకుఁ బుట్టునట్టిపట్టి దీర్ఘాయురారోగ్యైశ్వ ర్యబలసమన్వితుఁడు, వంశకర్తయగు నట్లనుగ్రహింపు" మని కోరెను. కణ్వుఁ డావర మనుగ్రహించి యామెకు యథాకాలవిధుల గర్భసం స్కారరక్షణములు చేయించియుండ మూఁడేండ్లకామె యొక సుపుత్రుని గాంచెను.

కణ్వమహర్షి యాబాలునికి భరతుఁ డనునామకరణముచేసి జాతకర్మక్రియాకలాపముల నెల్ల నొనరింప నాబాలుఁడు శుక్లపక్షచం ద్రునివలెఁ బెరుఁగుచుఁ గరతలాలంకృత చక్రుఁడు, చక్రవర్తిలక్షణ లక్షితుఁడు, సింహసంహననుఁడు, దీర్ఘబాహుఁడు, అనంతజవసత్త్వ సంపన్నుఁడునై పెరుగుచుండెను.

భరతుఁడు వనములోనిక్రూరమృగముల నెల్లఁ దనబలమునం జేసి దమియించుచుండుటఁ జూచి ఋషు లాతనికి సర్వదమనుఁ డని పేరిడిరి.

కణ్వుఁడు శకుంతలను బుత్రుని బంపివేయుట.

కణ్వమహర్షి భరతునియుదార తేజోరూపవిక్రమగుణములకు సంతోషించి యాతఁ డఖిలభువనయౌవరాజ్యాభిషేకమునకు సమర్థుఁ డగుసమయ మరుదెంచిన దని యెంచి యాలోచించి యొకనాఁడు శకుంతలతో నిట్లనెను. తల్లీ!

"ఎట్టిసాధ్వులకును బుట్టినయిండ్లను
బెద్దకాల మునికి తద్ద తగదు
పతులకడన యునికి సతులకు ధర్మ్మవు
సతుల కేడుగడయుఁ బతులచూ వె."

(భార. ఆది.౪-౬౬.)

కావున, నీన్ను దుష్యంతుపాలికిఁ బంపుదు నని యనఁగానే దుష్యంత ప్రణయవశంవద యగుశకుంతలకు మహానందమయ్యెను.

ఇది కని కణ్వమహర్షి షడ్రసోపేత మగువిందు కావించి యాశ్రమవాసులకు సంతర్పణము కావించి మనుమనిఁ గూఁతు నలంకరించుటకుఁ బ్రియంవదాదులఁ బిలిచి ప్రయాణసన్నాహము చేసెను. అపుడు సాలంకృత యగుశకుంతలను భూషణభూషితుఁడగుమనుమనిఁ గాంచి వారిమ్రొక్కు లంది యాశీర్వదించి వియోగభరమునఁ గన్ను లనీరు క్రమ్మ నెట్లో వారించుకొని శిష్యచూడామణులవెంట వారిని దుష్యంతునింటికిఁ బంపివేసెను.

తదనంతరము, తొలుత దుష్యంతుఁడు నిరాకరించియుఁ బిదప నాకాశభాషితమున శకుంతలఁ జేరఁదీసి పట్టమహిషి నొనర్చి భరతునికి

యౌవరాజ్యాభిషేకముఁ గావించినసంగతి విని కణ్వమహర్షి బ్రహ్మానంద మందెను. ఇఁక, నాతఁడు సమకారబంధములను బటాపంచలు చేసి యోగనిష్ఠుఁడై దివ్యతపస్వి యయ్యెను.

కాణ్వధర్మశాస్త్రము.

కణ్వమహర్షి మహాధర్మోపదేశకుఁడుగా విశ్వవిఖ్యాతి నార్జించెను. ధర్మప్రవక్తలలో నొక్కఁడుగా నీతనిని ఆపస్తంబాదులు వేర్కొనిరి. ఆహ్నికశ్రాద్ధధర్మసందర్భమున స్మృతిచంద్రికలోఁ గాణ్వధర్మశాస్త్రమునుండి కొన్నియుదాహరణములు కలవు. ఇట్లే గౌతమయాజ్ఞవల్క్యస్మృతిభాష్యకారులు కణ్వుని ధర్మశాస్త్రము నుండి మఱికొన్నివాక్యము లుదాహరించియున్నారు: ("అధ్వరే వేదేతిహాసపురాణానీతిధ్యాయన్ బ్రాహ్మణ తీర్థే నౌష్ఠయోఃసలో మదేశమున్మృజేత్" (స్మృతిచంద్రిక) "సంవత్సరేణ పతతి పతితేన సమాచరన్, యానాశనాసనౌర్నిత్య మిత్యాహుర్బ్రహ్మవాదినః" (హరదత్తుని గౌతమధర్మశాస్త్రవ్యాఖ్య.)) మున్నగునవి కాణ్వధర్మశాస్త్రమునందలివి.

మహాతపస్వి, బ్రహ్మనిష్ఠుఁడు, ధర్మప్రవక్త, మహర్షియైన కణ్వమహాముని మనకు నిత్యస్మరణీయుఁడు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R I.
Acc. No.
1810

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

కర్దమ మహర్షి



స్తుతి

పారులలోన నెన్న సరివారలె లేని తపోమహత్త్వవి
స్ఫారుని రూపమన్మథునిఁ బంకజనాభుననుంగునున్ జగ
ద్భారము సృష్టిభారమును దాల్చి ప్రజాపతి నాఁగ ఖ్యాతిఁ బెం
పారిన సత్తపోధనుని భవ్యునిఁ గర్దమమౌనిఁ గొల్చెదన్.

జననము

బ్రహ్మ సర్వదేవతలను గంధర్వాప్సరోగణములను సిద్ధకిన్నర కింపురుషమన్వాదులను సృష్టించి యనంతరము తపోయోగ విద్యా సమాధియుక్తుఁడు, ఋషివేషధరుఁడు, హృషీకాత్ముఁడునై యా తండు కర్దమాదిఋషివర్యులఁ బుట్టించెను. వెంటనే యాతఁడు సమాధి యోగైశ్వర్యతపోవిద్యావిరక్తియుక్త మగు తనశరీరమునుండి ఆయాయంశలు వా రెల్లరకు నిచ్చి ప్రజాసృష్టి యొనరింప వారిని నియమించెను.

బ్రహ్మ నియోగము

కృతయుగమున నొకప్పుడు బ్రహ్మ తపోవిద్యానవద్యుఁడై యోగీశ్వరుఁడైనకర్దముని బిలిచి వివాహమాడి సంతానమును బడసి సృష్టికార్యమునఁ దనకు సాయము కమ్మని కోరుకొనెను. కర్దముఁ డాతనిమాట కా దనఁజాలక యట్లే యని యాతనిఁ బంపి వేసెను.

కర్దమ నితప స్సు

పిదప ధైర్యస్థైర్యవిరాజితుఁ డగుకర్దముఁడు సరస్వతీనదీ తీరమున కేఁగి యట నొకయాశ్రమమును నిర్మించుకొని యందుండి మహాదీక్షతోఁ బదివేలసంవత్సరములు తపమొనరించెను. అనంతరమొకనాఁ డాతఁడు జపసమాధినుండి యేకాగ్రచిత్తుఁడై వరదుఁడు ప్రసన్నుఁడు మనోరథవరదానశీలుఁడు రమేశుఁడు నగుహరిఁ బూజించిన నాతఁడు కరుణాళువై ప్రత్యక్ష మయ్యెను. శంఖచక్రగదాపద్మహస్తుఁడు, పీతాంబరధరుఁడు, శబ్దబ్రహ్మశరీరవంతుఁడు, సదాత్మకుఁడు, జ్ఞానైకవేద్యుఁడు, వైనతేయవాహనుఁడు నయినహరిని గనుఁగొని కర్దముఁడు సాష్టాంగదండప్రణామము లాచరించి యమితానందుఁడై యిట్లని స్తుతించెను.

"అబ్జాక్షా! యోగీశ్వరేశ్వరులు నీదర్శనముఁ గోరి కడముట్టఁగందురు. కాని, నాభాగ్యమున నీపాదారవిందదర్శనముఁ గంటిని. భవవార్ధిఁ గడగంటిని. దేవా! నీమాయవలన మోహితుఁడై మేధనశింప సంసారసముద్రమునుండి వెలువఱచునీపాదపద్మములను భజింపఁ జాలక తుచ్ఛుఁడై నరకమునఁ గూలువారి నేమందును? తండ్రీ! అట్టికోరికలు గలవారిని నిందించుచేనును గృహమేధధేనువు, అశేషమూల, త్రివర్గకారణ, సమానశీల యగుభార్యను బరిణయమాడఁదలఁచి కల్పవృక్షసదృశము లైననీపాదారవిందముల సేవించితిని. ఐనను, ఒక్కవిశేషము కలదు. కాలాత్మకుఁడవైననీయభిమతము సిద్ధింపఁజేయుటకే కాని కాముకుఁడవై వివాహ మాడఁగోరుటలేదు. దేవా! నీమాయచే నిర్మితమై కాలవేగముతోఁ గూడి యపారమైన బ్రహ్మమునందుఁ గాలచక్రము సకలజీవనికరములయాయువు క్రమింగి వేయఁజాలును గాని కామభూతము సోఁకినపశుప్రాయు లగుమాన

వుల విడిచి సంసారదుఃఖములను బోఁగొట్టునీచరణముల నాశ్ర యించి నీగుణకథన మనునమృతముఁ ద్రావుచు బ్రహ్మజ్ఞానమత్తులై న భగవద్భక్తులయాయువునుమాత్రము హరింపఁజాలదు. సర్వేశ! నీవు సృష్టిస్థితిలయకారకుఁడవు. విశ్వేశ్వరుఁడవు. శబ్దాదివిషయసుఖకర మగు నీరూపము వా కిట్లు విస్తరింపఁజేయుట న న్ననుగ్రహించుటకే కాని, నీకొఱకుఁ గాదు. నీమాయచే లోకతంత్రము నడపించుచు నాకోరిక దీర్ప నిటు విచ్చేసిననీ కివే నానమస్కారములు."

హరి కర్దమునకు వరమిచ్చుట

ఈపలుకులు విని విష్ణుమూర్తి "మునివరా! ఏకోరికతో నీవు నన్ను భజించితివో యాకోరిక నీకు సిద్ధించుఁగాక! బ్రహ్మపుత్రుఁడు, సమ్రాట్టు, నగుస్వాయంభువమనువు బ్రహ్మావర్తదేశముఁ బాలించు చున్నాఁడు. ఆమహాత్ముఁ డపరదివసమున భార్యాసహితుఁడు, భర్తృ కామ యగుతనూజాయుతుఁడునై నీకడకు వచ్చి యనుగూపవయశ్శీ లసంకల్పగుణాకర యగుకూఁతును నీకిచ్చి పరిణయముచేయును. ఆమనుకన్యయం దతిసౌందర్యయుత లైననవకన్యలు నీకుదయింతురు. వారియందు మునీంద్రులు పుత్రులం బడయుదురు. నీవు నాశాసన మును బాలించి సర్వకర్మములు నాయం దర్పించి ఏకాంతికుఁడవై, భూతభయరహితుఁడవై, జ్ఞానివై నాయందే జగములు కల వనియు నీయందు నేను గల ననియు నెఱిఁగి నన్ను సేవించుచుండుము. అట్లుండి చరమకాలమున నన్ను నీవు పొందఁగలవు. మఱియు, నాకళాంశమున నీభార్యయందుఁ బుత్త్రుఁడనై జనించి నేను నీకుఁ దత్త్వసంహిత నుపన్యసింతు" నని చెప్పి యంతర్హితుఁ డయ్యెను.

కర్దమునివివాహము

కర్దముఁ డాపిమ్మట బిందుసరోవరతీరమున కేఁగి తప మొనరించు చుండెను. అపుడు బంగరురథ మెక్కి శతరూప యనుభార్యతోడను

దేవహూతి యనుపుత్రికతోడను స్వాయంభువుఁడు విచ్చేసి కర్దమ మహర్షి దివ్యాశ్రమమును బ్రవేశించి దూరమునఁ గర్దమమహర్షిని గాంచెను. కర్దమమహర్షి బ్రహ్మచర్యవ్రతమున మహాతపోమూల మున దివ్యతేజస్వియై యుండెను. ఆతనిశరీరము కృశించినను, ఆతఁడు హరికథాపూరితుఁడగుటచేఁ గృశీభూతుఁడు కాక జటావల్క లాజినలక్ష్మితోఁ బద్మదళములవంటి విశాలనేత్రము లొప్పుచుండ సాన వెట్టిన దివ్యరత్నమువలె నాతఁడు మెఱయు చుండెను. స్వాయంభువాకర్దముని సమీపించి నమస్కరించి స్తుతించి తనవృత్తాంతమును, గర్దమునిదక్క నన్యుని వరింప నను తనతనయ వృత్తాంతమును, దెలిపి యామెను వివాహ మాడుమని కోరెను.

కర్దముఁ డంగీకరించి "అయ్యా! ఈమెను వివాహమాడుట నాకంగీకారమే కాని యొక్కసమయము కలదు. ఈమెకు బిడ్డలు పుట్టువఱకు నే నీమెతోడనే యుందును. ఆపిదప నేను సన్న్యసించెద" నని పలికెను. స్వాయంభువు భార్యాపుత్రికల కీవార్తఁ దెలిపి వారంగీరింపఁ దాను నంగీకరించి విధ్యుక్త ప్రకారమున దేవహూతి నిచ్చి కర్దమునికి వివాహముచేసెను. శతరూప బారిబర్హ్మసంజ్ఞకములైనవివాహో చితదివ్యాంబరాభరణములను దంపతుల కొసంగెను. ఆపిమ్మట శతరూపాస్వాయంభువులు పుత్రికను విడువలేక కౌఁగిలించుకొని చుబుకము పుడుకుచుఁ జెక్కిలి ముద్దుగొని శిరము మూర్కొని ప్రేమాతిశయమునఁ గన్నీరు మున్నీరై కాఱు, "తల్లీ! పోయి వచ్చెద"మని చెప్పి కూఁతు నల్లున కొప్పగించి కర్దమునిచే నామంత్రితులై రథ మెక్కి తమదేశమునకు వెడలిపోయిరి.

దేవహూతి కర్దముల సంసారయాత్ర

పిదప, దేవహూతి పతిభక్తి కలిగి భవునికి భవాని పరిచర్య చేయువిధమునఁ గర్దమునికిఁ బరిచర్యచేయుచుండెను. ఆతఁడే తనకు

సమస్తము నని యెఱిఁగి యాతనిచిత్తవృత్తిని బట్టి యాతని కనుసన్నల మెలఁగుచు, పదపద్మములఁ గొలుచుచు, దినదినము భక్తితాత్పర్యస్నేహములు రెట్టింపఁ బతిశుశ్రూష చేయుచుండెను. అందుచే నామె యనూనతేజోవిరాజితయు, కామక్రోధాది గుణవిరహితయు, నయి శరీరశుద్ధి పొంది శౌచలక్ష్మి యననొప్పుచు, చతురసౌహార్దస్నేహములు కలిగి పతియే దైవముగా భావించి మృదుమధురవచనముల నాతని మనస్సును రంజింపఁ జేయుచుండెను.

ఇట్లుండ, దైవయోగమునైనను దప్పింపఁ సమర్థుఁ డైన కర్దముఁడు తన సేవలోఁ గృశించినశరీరము గలదేవహూతిపతిభక్తికిఁ బరిచర్యకు మెచ్చి దయాసముద్రుఁడై యామెతో నిట్లనెను. "తరుణీ! దివ్యభోగములు, సమస్త శుభములు నా సేవ వలన నీకు లభింపఁగలవు. నీకు దివ్యదృష్టి నిచ్చెదను. దానివలన నీకు సమస్తము గోచరించును. తృణమాత్రమున నశించు తుచ్ఛభోగములు మన కేల? మహారాజాధిరాజులై చక్రవర్తులైనవారును నెఱుంగనిదివ్యభోగములు నీపాతివ్రత్యనిష్ఠవలన సిద్ధించును. నీవు వాని ననుభవింపు" మని పలుక నామె యిట్లనెను. "దేవా! అమోఘయోగమాయావిభవుఁడ వగునీ కెందు సమర్థత లేదు? అనుపమదివ్యభోగములు నీశక్తిని సమకూరు నని నే నెఱుఁగుదును. నాకు సమస్తాభరణ మాల్యానులేపన మందిరారామాదుల నెల్ల ననుగ్రహించి శరీరసౌందర్యవర్ధకసమస్తభోజనములు సమకూర్చి యాపిదప నీతనుసౌఖ్య మొసఁగు" మని కోరెను.

కర్దముని యోగబలము

కర్దముఁ డంత యోగమాయాబలంబున వెంటనే యనేక దివ్యభవనములతోఁ గూడి, అనేకదివ్యవస్తుసంచయముతో నొప్పి, లలితోద్యానవనయుతమై, దివ్యసుందర నగరముల నొప్పు నొకదివ్య

విమానరాజము నాతఁడు సృష్టించెను. అది యామె భౌతికనేత్రము లకుఁ గానరాకపోవు నెఱిఁగి కర్దముఁడు బిందుసరోవరమున స్నానము చేయు మనియు నపుడు దివ్యదృష్టి కలిగి యన్నియుఁ గాననగు ననియు భార్యకుఁ దెలిపెను. ఆమె యట్లు చేయసమకట్టి యానీటిలో దిగుసరి కందు రుచిరసూక్ష్మాంశుకధారిణులు, కిశోర వయఃపరిపాకశోభితలు, ఉత్పల గంధులు నగుకన్యాసహస్రములు కానై యామె కభ్యంజనాదులు తీర్చి షడ్రసాన్నభక్ష్యములఁ దనిపి కనకపాత్రికలఁ గర్పూరనీరాజనము లిచ్చి యాసనమున నునిచి యద్దము చేతి కిచ్చిరి. ఆమె యచ్చెరువడి తన్నుఁ జూచుకొని యది యంతయు భర్తయోగవిభవ మని యుప్పొంగి భర్తఁ దలఁచెను. కర్దముఁడటఁ గానై ఆకన్యలతో దేవహూతితో విమానమునెక్కెను.

అనంతర మావిమానము దేవతోద్యానములకు సమస్తభూభాగ దివిభాగసమస్తదివ్యప్రదేశములకు వాయువేగమునఁ గొనిపోయి వారల నానందాబ్ధి నోలలాడించెను. మోక్షదాయకుఁడు, తీర్థపాదుఁడు నగుపుండరీకాక్షునిఁ గొలిచినవారికిఁ బొందరాని పదార్థములు కలవే!

అనంతరము వారు నిజనివాసమునకుఁ జనుదెంచి సమస్తభోగము లనుభవించిరి. శతవత్సరములు వార లిట్లు క్రీడించిన పిదప నొకనాఁడు కర్దముఁడు తనవీర్యమును నవవిధముల భార్యగర్భమున నిలిపెను. దేవహూతి గర్భముధరించి కాలక్రమమునఁ దొమ్మండ్రు కూఁతుండ్రను గనెను.

కర్దముఁడు వివాహకాలమునందలి సమయమును స్మరించి తాను నన్నవ్యసింపఁ దలఁచెను. దేవహూతి దీనవదనయై పుత్త్రికలకుఁ బెండ్లిండ్లయి వార లత్తవారిండ్ల కేఁగు వలికును, ఒక సుపుత్త్రుఁడు

జనించి తన్నుద్ధరించువఱకును సన్న్యసింపవలదని ప్రార్థించెను. కర్దముఁ డంగీకరించి విష్ణుమూర్తిని నియమవ్రతముల సేవింపు మనియు నాతఁ డామెగర్భమున నర్భకుఁడై పుట్టఁగలఁ డనియుఁ దెలిపెను. ఆమె యానందించి హరిపరతంత్రయై దివ్యదీక్షఁ దేజరిల్లఁ జొచ్చెను.

ఇట్లుండఁ గొంతకాలమునకుఁ గర్దమవీర్యమున దేవహూతి మరల గర్భము ధరించి విష్ణుమూర్తి నే సుతునిగాఁ గనెను. అపుడు దివ్యదుందుభులు దేవతూర్యములు మ్రోఁగి పుష్పవర్షములు కురిసి శుభములు సూచించెను. మరీచిప్రముఖులైన మునిజనములతో బ్రహ్మ దేవుఁ డచటికి విచ్చేసి యాపుట్టినబిడ్డఁడు దేవదేవుఁడని దేవహూతీకర్దములకుఁ దెలిపి యాతఁడు సాంఖ్యతత్త్వమును లోకములఁ జాటి యెల్లర నుద్ధరింపఁ గలఁ డని తెలిపి కర్దమునిపుత్రికలను ఋషివరుల కిచ్చి పెండ్లి చేయు మని చెప్పి వెడలిపోయెను.

బ్రహ్మ చెప్పినప్రకారము కర్దముఁడు మరీచిమహర్షికిఁ గళను, అత్రి కనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హవిర్భువును, పులహునకు గతిని, క్రతువునకుఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠున కరుంధతిని, అధర్వునకు శాంతిని నొసంగి నిజకులాచారము ననుసరించి దివ్యవైభవముతో వివాహములు చేసివైచెను. పిదపఁ దొమ్మండ్రను దొమ్మండ్రల్లుండ్రకు నొప్పఁ జెప్పి సకలసత్కారములతో వారి వారిని వారివారియిండ్లకుఁ బంపివేసి దేవహూతీకర్దములు సుతుఁ డగుకపిలుని గనిపెట్టుకొని యింట నుండిరి.

కర్దముఁడు మోక్షము నందుట

కర్దముఁడు కొంతకాలమునకు దేవోత్తముఁ డగువిష్ణుఁడు తనమందిరమున నవతరించి వసించియుండుట తన చిత్తమున నెఱింగి వివిక్తస్థలమునకుఁ జని యచటఁ గపిలునకు వందన మాచరించి యిట్లు

పలికెను. "దేవాదిదేవా! ఆదివిష్ణుఁడ వగునీవు నాయింటఁ బుట్టితివి. సంసారచక్రమునఁ బడి తిరుగుచు గ్రామ్యుల మయినమాఁవర్తనము లను గణింపక తొల్లి! నీ వానతిచ్చినట్లే నాయింటఁ బుట్టితివి. నీవు నాకుఁ బుట్టుటచే నేను ఋణత్రయము నీఁగఁగంటిని. నీపాదారవింద ములు నాడెందమునఁ జేర్చి దుఃఖములఁ బోఁద్రోలి యేకాంతికుఁడ నగుదును." కపిలుఁ డది విని "మునీంద్రా! నావచనము తప్పక నీకిట్లు జనించితిని. తత్త్వజ్ఞానము సకలమునులకుఁ దెలిపెదను. నీవు సన్న్యస్తచిత్తుఁడవై మోహముఁ బాసి భక్తిచే మోక్షము నందుము. పరమేశ్వరుఁడను పరంజ్యోతిని నగునన్ను మనమున నిలిపి మోక్షము నందెద" వని బోధించెను.

కర్దముఁడు కపిల దేవునికిఁ బ్రదక్షిణము చేసి నమస్కరించి యిలు వెడలి మునిగణసేవిత మగువనమునకుఁ జని మౌనమున నిస్సంగుఁడై, ఆత్మైకశరణతత్పరుఁడై పరబ్రహ్మమునఁ జిత్తము నిలిపి సర్వసముఁడై సర్వము వాసుదేవమయముగాఁ దెలిసి భక్తియోగమున భాగవతగతి నందెను.

ఇట్లు కర్దమప్రజాపతి దేవదేవుని కరుణచే మోక్షలక్ష్మిని జూఱగొని యాచంద్రార్కవిఖ్యాతి నార్జించెను.

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

కాశ్యప మహర్షి



స్తుతి

ధర్మ, జ్ఞాన, వివేక, పారగసమస్తబ్రహ్మకర్మప్రభా
మర్మజ్ఞుం డగుసిద్ధవర్యుకరుణన్ మాన్యాత్ముఁ డైజ్ఞాన స
త్కర్మప్రాభవ మంది వెల్గినయనంతబ్రహ్మతేజస్వినిన్
నైర్మల్యాంచితుఁ గాశ్యపుం డనుమునిన్ ధన్యాత్మునిన్ గొల్చెదన్.

కశ్యపప్రజాపతివంశమున జనించిన మహనీయుఁడే కాశ్యపుఁడు. ఈతఁడు బాల్యమునుండియు దయాపరుఁడు. ధర్మనిరతుఁడు. తపోధనుఁడు. తేజస్వంతుఁడు. బహ్మచర్యమున నియమవృత్తిఁ దపము చేయు నీతని కపరిమిత మగుభూతదయ కలిగెను. ఆకాలమునఁ బాములబాధ యధికముగా నుండెను. పాములు స్వేచ్ఛగా సంచరించుచు, తమవిషాగ్నిజ్వాలలవలనఁ జరాచరభూతప్రపంచమును మిక్కిలి బాధించి గగ్గోలుపఱుచుచుండెను. సహజదయాస్వభావుఁడగుకాశ్యపముని యీబాధనుండి సకలజీవుల సంరక్షింప దీక్షఁ బూని తనతపము లోకహితమునకు వినియోగింపఁ దలఁచెను.

బ్రహ్మవరము

అపుడు కాశ్యపుఁడు బ్రహ్మదేవునిగుఱించి ఘోరతప మొనరింపఁ బూనెను. ఆతనియుద్దేశము లోకహిత మగుటచేతను, అతని

దీఱు యకుంఠిత మగుటచేతను, అతనిశక్తి యనుపమాన మగుటను, అతనిసంకల్పము వజ్రసదృశ మగుటను, నాతనితపమునకు మెచ్చి బ్రహ్మ ప్రత్యఱమై వచ్చి "వత్సా! నీసత్సంకల్పమునకు, సద్వ్రతమునకు, సత్తపమునకు, సంతసించితిని. నీకోరిక లోకహితకరము. అది నీ కిచ్చుట నాధర్మము." అని చెప్పి కాశ్యపునకు ఉరగవిషాపేతజీవసంజీవనోపదేశముఁ జేసి కరుణించి యదృశ్యుఁడయ్యెను.

నాఁటినుండి కాశ్యపుఁడు దుష్టోరగములబారిఁ బడి నశించు జీవలోకమును దనసంజీవనీబలమున సంరక్షించుచు లోకహిత మొనగూర్చుచుండెను. స్వార్థమునకుఁ గాకయిట్లు పరార్థము లోకహితముఁ గోరి తనతపోధనమును ద్యాగము చేసినకాశ్యపునివంటి మహనీయుల మూలమునఁ జే "ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకమ్' (ఉదారపురుషులకు యావత్ప్రపంచమును దమకుటుంబమే యగును) అన్నలోకోక్తి యేర్పడినది.

కాశ్యపుఁడు పరీక్షిత్తుఁ గాపాడఁబోవుట

ఇట్లు లోకములకు మేలు చేయుచుఁ గాశ్యపుఁడు తపోవ్రతముల విడువక బ్రహ్మర్షియై విరాజిలుచుండ నొకనాఁడు శృంగిశాపమునఁ బరీక్షిత్తు ఏడుదినములలో తక్షకవిషదష్టుఁడగుననియు నది యేడవదిన మనియు విని "అయ్యో! ధర్మప్రభు వగుపరీక్షిత్తుపాలన మాతనిమరణమున నంత మగుచో లోకములకుఁ గీడు వాటిలును. ఎట్లైన నేఁగి నే నాతనిని తక్షకవిషాగ్నిజ్వాలలనుండి కాపాడి లోకశ్రేయముఁ గూర్చెదను. మఱియు :

ధరణి యెల్లను రక్షించుధర్మచరితు
నాపరీక్షితు రక్షించి యతనిచేత

నపరిమితధనప్రాప్తుండ నగుదుఁ గీర్తి
యును ధనము ధర్మ్మవును నాకుఁ గొనుట యుఱదె?"
(భార. ఆది. ౨-౧౪౭.)

అని యనుకొని హస్తినాపురమునకుఁ బయన మయ్యెను.

తక్షకకాశ్యపసమాగమము

ఈసంగతి యెఱిఁగి తక్షకుఁ డాతనిదారిని వృద్ధబ్రాహ్మణ వేషమున నెదురువచ్చి "మునీంద్రా! ఎటనుండి యెట కేఁగు చున్నావు? నీవు చనుపని యేమి?" అని యడిగెను. అందుల కాతఁ "డయ్యా! తక్షకుఁ డనుపాములరాజు పరీక్షిన్మహారాజు నీదినమునఁ గఱచునఁట. అజాతశత్రు వగు నాతనిని రక్షించి లోకహితముఁ జేయ నేఁగుచుంటి"నని తెలిపెను. అప్పుడు తక్షకుఁడు "మునీంద్రా! ఆతక్షకుఁడను నేనే. అశనిపాతమున నెవ్వరైన బ్రతికినం బ్రదుక వచ్చును గ్కాని నేను గఱచినవారు బ్రదుకుట దుర్ఘటము. నీమందు మాకులు మంత్రతంత్రసులు నాయందుఁ బనిచేయవు. వెట్టిమొట్టి మాట లాడక వచ్చినదారిం బొమ్ము. కాదేని నేనీవటవృక్షమును గఱచి నావిషానలమున భస్మముచేయుదును. నీకు శక్తియున్నచో దానిని బ్రతికింపుము చూచెద" ననియట నున్న పెనుమట్టిచెట్టుఁ గఱవ వెంటనే విస్తారము లగుకొమ్మలతో ఱెమ్మలతో నాకసమంటఁ బెరి గియున్న యావృక్షము భస్మమైపోయెను.

కాశ్యపుఁడును వెంటనే యాభస్మమంతయుఁ బోగుచేసి తన మంత్రతంత్రబలమున నెప్పటియట్ల నావృక్షము విరాజిలునట్లు చేసెను. అది చూచి తక్షకుఁ డాశ్చర్యపడి "మహాత్మా! నీబలమున నిది బ్రదికిన బ్రదుకవచ్చుఁ గాని నావిషముచేఁ గాక అతికుపితవిప్రశాపమున విగతజీవుఁ డగుపరీక్షిత్తుమాత్రము బ్రదుకలేఁడు. బ్రహ్మబ్రాఁతకైనఁ

దిరు గున్నది కాని బ్రహ్మర్షి శాపమునకుఁ దిరుగు లేదు. నీకు ధనము వలసెనేని నేన యిచ్చెదను. గొని పొ"మ్మని పలికెను.

అంతఁ గాశ్యపుఁడు దివ్యదృష్టిం జూచి పరీక్షిత్తు నియోయువు సమాప్త మగుటయు, బ్రహ్మర్షి యగుశృంగిశాపము తిరుగులేని దగుటయు దానికిఁ గట్టువడి యమధర్మరాజు తనపని సాధించుకొను టకుఁ దక్షకుని నియోగించుటయు నందుచేఁ బరీక్షిత్తు చనిపోక తప్పని సరి యగుటయు గమనించి తక్షకునికడ వలసినంత ధనముఁ గొని వెడలిపోయెను. *

సిద్ధకాశ్యపసమాగమము

కాశ్యపుఁ డట్లు ధనసంపాదకుఁడై చిరకాలము గృహస్థధర్మ ముల నిర్వర్తించి ధర్మవేత్త తపోధనుఁడు నైనయాతఁ డొకపరి నొకపరమసిద్ధుని చూడఁగాంచెను. ఆతఁడు గతాగతజ్ఞుఁడు, విజ్ఞాన సాగరుఁడు, లోకతత్త్వార్థవేత్త, సుఖదుఃఖజ్ఞుఁడు, జననమరణతత్త్వ జ్ఞుఁడు, పుణ్యపాపపరిజ్ఞాత, కర్మపరిపాకవిజ్ఞాని. ఆతఁడు సిద్ధుఁడై చరించుచుఁ బ్రశాంతుఁడు, నిర్జితేంద్రియుఁడు, బ్రహ్మతేజోవిరాజి తుఁడు నై యుండెను. ఆతఁ డంతర్ధానగతిజ్ఞుఁడు. ఒకప్పు డాతఁ డంతర్హితుఁడై పోవుచున్నసిద్ధులతోఁ గలిసి పోవుచుండుటఁ గనిపెట్టి కాశ్యపుఁడు వెంబడించెను. ఆసిద్ధుఁడు రహస్యముగాఁ దోడిసిద్ధులతో సంభాషించుచు గాలివలె నెవ్వరికిని జిక్కక స్వేచ్ఛగాఁ బోవుచుండఁ గాశ్యపుఁ డాతనిపాదపద్మముల కెఱఁగి యాతఁ డాగినచోటుల నాఁగి యాతనికి సమస్తోపచారములు చేయుచు, గురుభావము వహించి హృదయ మాతని కర్పించి భయభక్తిప్రతిపత్తుల సేవింప నాతఁడు శ్రుతచారిత్రసంపన్నుఁ డగునీతని శ్రద్ధాభక్తుల కానందించి "వత్సా! నీ కేమి కావలయు?" ననెను. కాశ్యపుఁ "డయ్యా! తా మెవ్వరో తమచరిత్ర మేమో తెల్పుఁ" డనెను. "వత్సా! నేను బుణ్యకర్మము

---

* భారతాదిపర్వము.

లను విసువువిశ్రామము లెఱుంగక చేసి యైహికసుఖము నాముష్మిక సుఖము కూడఁ గాంచితిని. అత్యంతయత్నములవలన లభించిన నాయుష్మికసుఖమునుండి కొంతకాలమునకుఁ గారణాంతరమున భ్రంశము నంది కామక్రోధాదు లగుచిత్తమలవిశేషములవలన మరల మరల జన్మమరణము లందితిని. అనేకు లగుతలిదండ్రులను బంధుమిత్రులను పుత్రకళత్రాదులను అనేకజాతులవారిని గాంచితిని. పెక్కుఱుతల్లులపాలు త్రాగితిని. పెక్కురుభార్యలతో సుఖంచి దుఃఖం చితిని. పుత్రమిత్రకళత్రవియోగదుర్వ్యథ లందితిని. ధనాగమన ధననాశసుఖదుర్దశల నందితిని. మానసశారీరకము లగునానావేదన లందితిని. వివిధనరకదుర్దశ లనుభవించితిని. బహుళదుఃఖములను బహుళ యాతనలను, అష్టకష్టములను, వధబంధనమర్దనాదులను అనుభవించితిని. విసిగివేసారి లోకతంత్రము పరిత్యజించి పిమ్మట నాత్మ ప్రసాదమున నిట్టిసిద్ధిఁ గాంచితిని. ఇంక, లోకము వైపే నేను జూడను. ప్రజాసర్గ మున్నంతకాలము నాకు శుభము పై శుభమే కలుగు చుండును. నే నింక నింతకన్నఁ గోటిమడుంగు లధిక మగుయోగ వైభవములను శుభదశలను గాంచెదను. నాకు బ్రహ్మానందము కరతలామలకము.

ప్రీతుఁడ నైతి నీదెసఁ బరిస్ఫుటభంగిని జెప్పు మెద్ది నా
చేత నుపాస్తిమైఁ బడయఁ జేరితి నీ కది కల్గునట్లుగాఁ
జూతు నవశ్యమున్ వినయసుందర ! నన్ను నెఱింగి వచ్చి తీ
వీ తెలి వస్మదీయమతి కించిన నిన్నుఁ బరిగ్రహించితిన్."
(భార. అశ్వ. ౧. ౧౬౦.)

అని పలికెను.

కాశ్యపుఁడు బ్రహ్మానంద మంది "మహాత్మా ! పరతత్త్వ ప్రబోధమున నన్నుఁ గృతార్థునిఁ జేసి దయతో జన్మమృత్యుదుఃఖ నిరాస మొనర్పు" మని ప్రార్థించెను.

అందులకు సిద్ధుఁ డిట్లు నుడివెను. "వత్సా! సమస్తముఁ దెలుపుదును. శ్రద్ధతో వినుము. ఈ శరీరము ధర్మసాధనము. ధర్మము పరిజ్ఞానమువలనఁ గలుగును. కావున, ఆత్మహితముఁ గోరిన మానవుఁ డేవిధమున నైన ఈ శరీరమును గాపాడుకొనవలయును. ఈ దేహ రక్షణము నశ్రద్ధచేయుట యనఁగాఁ దనబలమునకు మించినపనులు చేయుట, హిత మగునాహారమును మితముగ భుజింప కుండుట, ఐనవి కానివి యనువివేకము లేక యేది దొఱికిన నది తినుట, బహుళభోజన మొకమాఱు, ఉపవాస మింకొకమాఱు చేయుట, గతకాలము, అపక్వము, దుష్టము, నగునన్నముఁ దినుట, భోజనము చేసినవెంటనే భోజనముచేయుట, దిననిద్ర, సురతపరత. ఇవి దోష త్రయమును గలిగించి మానవునిమూఢునిఁ జేయును.

శ్లేష్మాదిరోగవికారములు, సన్నిపాతాదిజ్వరములు మున్నగునే వెన్నియో మానవునిబట్టి పాలార్చును. వీనివలన దేహమును విడిచిన జీవుఁడు తనకర్మములంబట్టి యాయాగతులు కాంచుచు, సుఖదుఃఖము లనుభవించుచు, చేసినకర్మములఫల మనుభవించి మరలఁ బుట్టుచు మరలఁ గర్మము లాచరించి మరలఁ జచ్చుచు నిట్లు జీవాత్ముఁడు గతాగతము లనుభవించును. పాపులు నరకము పుణ్యులు స్వర్గము ననుభవింతురు కాని ఈరెండిటికి నతీత మగుమోక్ష మందలేరు. ధర్మపరు లగువారు సూర్యచంద్రనక్షత్రలోకముల నుందురు. ఆయాపుణ్యఫలము లనుభవించినపిదప వా రటనుండి త్రోయఁబడి మరల భూమిపైఁ బుట్టుదురు.

శరీరగత మయినయాత్మకు శుభాశుభకర్మములఫలము అనుభవింపక తప్పదు. ఈకర్మఫలానుభవమే జన్మకారణము, బ్రహ్మశక్తి బీజత్వమును ధరించి శుక్లశోణితసంయోగమున స్త్రీగర్భమున నెలకొనును. ఆబీజము పిండమై చైతన్యరూప మంది తల, కాలు సే

తులు, ఉదరము, వెన్ను అనునంగముల నేర్పఱుచుకొనును. జనన మునకుఁ దగినవేళ మాతృగర్భమునుండి వెలువడి తన తొల్లిటికర్మ ములకుఁ దగినవివిధవర్తనములఁ గాంచి యాకర్మఫలానుభవము పూర్తియైనపిదపఁ జచ్చి, కర్మసంతతికిఁ దగినట్లు మరలఁ బుట్టు నరుఁడు పరమ మగు ముక్తిపదముఁ గననంతవఱకు నీవిధమునఁ జావు పుట్టుక లందుచుండును. కావున, నీవు తప్పక ముక్తి సంపాదింప వలయు. అది యెట్లు లభించునో చెప్పెద వినుము.

దానము, శమము, దమము, బ్రహ్మచర్యము, వ్రతరక్షణము, దయ, పరధనపరదారవర్జనము, నియమము, యమము, ఇంద్రియనిగ్రహము, జననీజనక గురుపూజనము, దేవతాతిథి పితృ దేవతార్చనము, సత్యము, శౌచము, శుభసంవిధాననిరతి, ధైర్యము, క్రౌర్యములేమి, మున్నగు పుణ్యలక్షణములఁ గాంచి నరుఁడు వీని నూఁతగాఁ గొని మోక్ష మందవలయును. ధర్మాచరణము చేయుచు ధర్మసూక్ష్మములను బుధవరులకడ నెఱిఁగికొనుచు, వారు చెప్పు శాంతవచనములు విని, వాని నంతఃకరణమునఁ బట్టించుకొన్నచో నాపదలు కలుగవు.

సుప్రతియై వర్తించుచు నింద్రియ విజయము, శాంతి గాంచి బ్రహ్మైకభజనతత్పరుఁ డగువానికి నగ్నిహోత్రము, సమిధలు, జలము, మంత్రము, గురువు సమస్తము బ్రహ్మమయముగాఁ దోఁచును. దీనినే సూక్ష్మబ్రహ్మచర్య మందురు. దీనియం దుత్తమస్థిరత్వ నుందినమహా నీయుఁడు హర్షశోకములకు బెదరఁడు; మోహాంధకారమున సంచరిం పఁడు; ఆతఁడు కాలక్రమమున సంసారనిస్సంగవృత్తిఁ గాంచఁగల్గును.

బ్రహ్మదేవుఁ డాదిసృష్టియందు ప్రధాన మనుతత్త్వముం గల్పించి దానికిఁ జేతనత్వ మొసంగెను. దానినే 'ఋత' మందురు. దానికిఁ బర మగుతత్త్వమే 'అఋతము', 'అమృతము'నని యార్యులు

పిలువ నొప్పును. ఈ రెండుతత్త్వములయందు సమస్తభూతజాలసం జనకము లగుబీజములు గలవు. ఇది శ్రుతివాక్యముల తాత్పర్యము. జీవరాశికి గమనాగమనము లజుఁడు కల్పించెను గాన నది యట్లే భ్రమించుచుండును. పుణ్య మతిశయమై జీవాత్ముఁడు తన్నుఁ దాఁ గన్నపుడు సుఖములు తృణికము లనియు, శరీర మశుచి యనియు, అఖిలపదార్థములు నశించునవే యనియు, కర్మనిమూఢతయే జాడ్య మనియు నూహించును. అట్లూహించి యాతఁడు తన్నుఁ గప్పు మోహావేశముఁ ద్రోచి మోక్షకాంక్షయై సంసారాబ్ధి మునుంగ కుండును.

జన్మమృత్యుజరావ్యాధులు ప్రకృతి విధము లని యెఱింగి వానివలనం గలిగిన బహుక్లేశములకు విసివినమనుష్యులు పరమపద మునకై ప్రాకులాడుదురు. పవిత్ర మైనయేకాంతప్రదేశమునఁ గూర్చుండి హృదయమున నావంతయుఁ జింత లేక ప్రశాంతిగాంచి, తనకుఁ గలుగు సంకల్పముల నెల్ల వెంటనే యణఁచివేసికొని నిరాలం బనుఁడైనవాఁడును, సర్వమిత్రుఁడు, సర్వసహుఁడు, నిర్జితేంద్రి యుఁడు, నిర్భయుఁడు, కామహీనుఁడు, కోపరహితుఁడు, శమఘ నుఁడు నైనవాఁడు; మానాభిమానముల జయించి, సర్వభూతాత్మ కత్వదర్శనమునఁ జెలంగువాఁడు — ఈము త్తెఱంగులవారు ముక్తి గందురు.

లాభాలాభములు, ప్రియాప్రియములు, సుఖదుఃఖములు సమము లయినవారు, ఆశానిరాశ లనునవి లేక సర్వతంత్రలోలత ధర్మశీలత రెండిటికి నతీతు లైనవారు, శత్రుమిత్రభేదము లేక ధర్మార్థ కామతృష్ణలను విడిచిపెట్టువారు, అకర్మభావము, తాపత్రయాప గమము, వైరాగ్యసుస్థిరత్వను కలుగువారు ముక్తి నందుదురు. ఆలంబము లేనిది, శబ్దము లేనిది, రసగంధస్పర్శ లేనిది, గుణము

లేనిది యగునానందస్వరూప మగువెలుంగు నభ్యసననియతిపరుఁడగు వాఁడు పొందును. సర్వసంకల్పములను విడిచిపెట్టినవాఁడు, పరమ ప్రశాంతచిత్తము గలవాఁడు, సర్వవికృతులకు దవ్వగునిర్వృతి నందఁ గాంచును.

ఇఁక యోగివరునివిధ మెఱిఁగించెద వినుము. ముంజగర్భ మగునిషీకవలెఁ దనువును ఆత్మను జూడవలయును. తనువు ముంజము; ఆత్మ దానియిషీకము. తనువువలన నిష్కర్ష మొనర్చి జీవాత్మం గాంచుయోగివరుఁడు తన్నుఁ దాఁ గని జననమరణాదుల జయించును. ముక్తుఁడు జరామరణ విముక్తుఁడై హర్షశోకాదుల కతీతుఁడై బ్రహ్మచర్యవ్రతమునఁ దనభక్తులకును ముక్తి నొసఁగం గలసమర్థుఁ డగును. దేహ మస్థిర మని యెఱిఁగి యాత్మయం దధిక నిష్ఠగల మహాత్ముఁడు భూతకోటికి భయపడఁడు; రాగాదిదుఃఖముల కగపడఁడు. యోగయుక్తుఁ డింద్రపదవినైనఁ దృణీకరించును. ఆత నీకి శస్త్రాజలాగ్నిదహనబాధలు లేవు. లోకములో నెంతవారికైనఁ దన్నుఁ దాఁ గన్నసుఖముం బోలినసుఖమే లేదు. దానిం బడయుటకు 'విసువు' అనుదానిం జయింపవలయు. జయించి మనస్సును అంతర్వర్తిని జేసి బాహ్యమునకుఁ బోనీక, యది యెం దనువుపడునో యందే నిలుపవలయును."

ఇట్లు చెప్పినసిద్ధునిమాటలు విని కాశ్యపుఁడు కేలు మొగిచి వినయశాలియై "మహాత్మా! మోక్షముఁ గాంచుసూక్ష్మోపాయ మును దయదలఁచి తెలుపు"మని ప్రార్థించెను.

"వత్సా! దంతములు, జిహ్వా, కుత్తుక, తాలువు, కంఠ నాళము, హృదయము వీనిలో మన స్నేట నాఁగునో దానిఁ గదల్పక యటనే యుంచవలయు. ఇట్లుంచిన మన స్వాత్మను వెదకునట్లు చేయ వలయును. చతురుఁ డగుయోగి తెలివొందినమనమును వివేకము

వైపు త్రిప్పి బ్రహ్మముం గనును. అనాది యగుబ్రహ్మము పంచేంద్రి యములకు గ్రాహ్యము కాదు. సకలమలములనుండి వై దొలఁగిన మనస్సే దానిఁ గనఁగలదు. బ్రహ్మ ముజ్జ్వలమై యెల్లెడలఁ దలలు, కన్నులు, కాళ్లు, చేతులునై వెలుంగును. దానిని యోగి కాంచును. తా నన నేమియో తెలిసికొని కేవలము, శాంతము నైనతత్త్వము నెప్పుడును గాంచుచున్నచో త న్నెంతయుఁ బూర్తిగా నెఱుఁగు వెలుఁగు కలుగును.

బ్రహ్మవిద్యారహస్యము సర్వము నీ కెటింగించితిని. పరమ సిద్ధునిం గన్నఫలితము నీ వందినావు. నీయోగ మగణ్యము. పోయి సుఖ ముండు" మని యంతర్హితుఁ డయ్యెను.

కాశ్యపుఁడు నలభ్యయోగ మగుసిద్ధసందర్శనసమ్యగ్జ్ఞాన లాభముఁ గాంచి బ్రహ్మర్షిశేఖరుఁడై వెలుఁగొందెను.

కాశ్యపస్మృతి

కాశ్యపమహర్షి స్మృతికర్తగాఁ గూడఁ బేరంది యున్నాఁడు. కాశ్యపస్మృతి సమగ్రముగా లభింపలేదు. ప్రాయశ్చిత్తవర్ణన మను నేకాధ్యాయము లభించినది. ఇందు ఆహితాగ్నిలక్షణము, ఆవు మున్నగు జంతువులను హింసాదిపశులను జంపినవచ్చుపాపమునకుఁ బ్రాయశ్చిత్తము, పంచమహాపాతకములు, వానిప్రాయశ్చిత్తము, మున్నగు విషయములు గలవు. *

---

* అథ కాశ్యపీయాన్ గృహస్థధర్మాన్ వ్యాఖ్యాస్యామః. ఆహితాగ్నిః స్వదారనిరతోఽచాగ్న్యగ్నిహోత్రీస్నాతామృతుకాలగామీ దేవపితృమనుష్యభూతబ్రహ్మయజ్ఞానుసేవమానః ఏకద్విత్రిచతుర్ణాం బ్రాహ్మణాన్ కుర్వాణో వ్రతనియమహోమజాప్యపరో మాతృపితృభక్తో దారాపత్యపోషకః శేషానుభోజీ ఉపవాసీ త్రైవర్ణికమేదకసూతకాన్నపరిహరమాణోఽలాంగల

వృత్తిః. తత్ర చ భూమ్యుపోధనే వృక్షచ్ఛేదనే నాస్త్యధర్మో భవతి.
కూపసేతుతడాగవిప్రదేవతాయతనభేదనే ప్రాయశ్చిత్తం బ్రాహ్మణేభ్యో
నివేద్య చ తప్రసాహుతీర్జుహుయాత్. ... ...

అథ పంచమహాపాతకాః ప్రవక్ష్యంతే–

బ్రాహ్మణో నైవ హంతవ్యః స్వస్వప్రజ్ఞోపయా ద్విజైః
సువర్ణ హరణం చైవ కర్తవ్యం న కథంచన.
గురుపత్నిం న గచ్ఛేత సంస్పర్శశ్చ న తైశ్చరేత్
మహాపాతకసంజ్ఞేయా నిర్దిష్టానాం మనీషిభిః,
వత్సరత్రితయం కుర్యాత్ నరః కృచ్ఛ్రం విశుద్ధయే
ఆత్మతుల్యసువర్ణం చ దద్యాద్వా విప్రతుష్టికృత్.

ఆత్రేయీగర్భం రాజన్యవైశ్యా యజ్ఞగతాహత్వా ఏతదేవకుర్యాత్.

అథపూర్వపాపకర్మణాం చిహ్నం వ్యాఖ్యాస్యామః.

వర్జనీయాద్విజాహ్యేతే శ్రాద్ధకర్మసు నిత్యశః
దారాధీనాః క్రియాః సర్వాదారాః స్వర్గస్యసాధనం.
ఇత్యేతత్ బ్రహ్మణా ప్రోక్తం కాశ్యపస్యానుశాసనమ్
సప్తపౌనర్భవా కన్యా వర్జనీయా కులాధమాః.
వాచాదత్తా మనోదత్తాకృతమంగళకౌతుకా
ఉదకస్పర్శకా యా చ యా చ పాణిగ్రహీతికా.
అగ్న్యుపాయం గతాయా చ పునర్వాహ్యస్య వాదికా
ఇత్యేతాః కాశ్యపప్రోక్తా దహేయుః కులమగ్నివత్.

ప్రరోహత్యగ్నిమాదాయ పాదపానాం కులంమహత్
నహి పునర్భవాదీనాం కులంతస్యప్రరోహతి.
పితా వా యది వా భ్రాతా మాతావా యదివేతరః
నరశ్చకృతపాపానాం గతి యాం యాతిగాం శృణు.

మనివర్తి యథాశ్యేనో గచ్ఛత్యేనయమాలయం
ఏవంచ నరకం యాతి కన్యా అమృతకారకా.

పునఃసంపద్యతేనారీ గతమాత్మనమాత్మని
అస్థిమాత్రం త్వచం భిత్వా శుక్రం తేజోబలం తథా.

శుద్ధిం నయే ప్రయచ్ఛంతి దుహితరం లోభమోహితాః
తేషాంతు నరకే ఘోరే యాతిపై సప్తమం కులం.

గమనాగమనాయోగాత్ ఏవం శుక్రో విధీయతే
ఏవం జ్ఞాత్వా యుక్తకన్యాం విందేత స తత్కులాత్.

నస్యాద్దైవే చ పిత్ర్యే చ దాసీస్యాదథ సంచితా
క్రయక్రీయా తు సా దాసీ నసా పత్నీ విధీయతే.

అగ్నిష్టోమాతిరాత్రాణాం శతం శతగుణీకృతమ్
ప్రాప్నోతి పురుషోదత్వా హోమమంత్రై రలంకృతామ్.

యస్తు సాత్యమ (సాత్త్విక) ధర్మేణ పితాసమర్పయేత్సుతామ్
స ప్రేత్య లభతే స్థానం యథా దక్ష ప్రజాపతిః.

ఇతి కాశ్యపప్రణీతం ధర్మశాస్త్రం సమాప్తమ్.

MEMORIAL LIBRARY V.R. NARLA
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

గర్గ మహర్షి

స్తుతి

"సీ. తప్తకాంచనవర్ణతతజటాజూటుండు
బహువేదవేదాంగపారగుండు
గౌరవర్ణుఁడు దరత్కంజాతనేత్రుండు
శరదిందుసన్నిభచారుముఖుఁడు
బ్రహ్మతేజుండు ధూర్జటిముఖ్యశిష్యుండు
బహుశిష్యసందోహపరివృతుండు
రమణీయసాక్షాత్సరస్వతీకంఠుండు
హరిశుద్ధభక్తుండు పరమయోగి

సకలసిద్ధాంతశాస్త్రవిశారదుండు
మాధవపదాంబుజాసక్తమానసుండు
సర్వవిదుఁడు సిద్ధేశుండు సర్వదర్శి"
గర్గబుధుఁ గొల్వ నగు నపవర్గసుఖము.

(బ్రహ్మవైవర్త పురాణము. కృష్ణజన్మఖండము, ౨ ఆ.)

*గర్గుఁడు బాల్యమునుండియు శివునిఁ గొలిచి యాతని కటాక్షము గడించి యాతనినే గురువుగా వరించి సకలవిద్యలు నేర్చెను. ఆతఁడు మూర్తిగైకొన్న తేజస్సమూహమువలెఁ గరడుగట్టిన శ్రుతి

---

* గర్గుఁడు బ్రహ్మమానసపుత్రులలో నొకఁడు. ఆంగిరసుఁడగువితథుని కొడుకని కల్పద్రుకోశమ్ము.

సారముపగిది దశదిశలు వెలుఁగఁజేయుచుఁ దన్నాశ్రయించినవారి కెల్లరకు సంసారతాపత్రయములఁ బోఁగొట్టుచు విరాజిల్లుచుండెను.

"గర్గుఁడు సతతారాధిత
భర్గుఁడు దూరీకృతారివర్గుఁడు మునిసం
సర్గుఁడు కలితశ్రేయో
మార్గుఁడు..." అనుకీర్తిఁ గని యాతఁడు

వేనకువేలు శిష్యులు వచ్చి తన్నాశ్రయింపఁగా వారికి వేదశాస్త్రములు చెప్పుచు మహామహుఁడై యుండెను.

ఇట్లుండ హైహయవంశీయు లగుక్షత్త్రియులు, సమస్త యాదవులు, మఱెందఱో క్షత్త్రియవంశజులు తమకుఁ గులగురువుగ నుండుమని వచ్చి గర్గు నర్థించిరి. గర్గుఁ డంగీకరించి యాయావంశజుల కెల్లరకును గులగురువై వారిక్షేమముఁ గోరుచు వారిచే మన్నన లందుచుండెను.

గర్గుఁడు కృష్ణబలరాములకు జాతకర్మాదు లొనరించుట

దేవకీవసుదేవులచే రహస్యముగా నియుక్తుఁడై గర్గమహర్షి శిష్యసమేతుఁడై వ్రేపల్లెకుఁ జని నందునిమందిరమున కరిగెను. అపుడు యశోద శ్రీకృష్ణునకుఁ బాలిచ్చుచు నొకకనకాసనమునఁ గూర్చుండి యుండెను. సశిష్యుఁ డగుమహర్షిని జూచి యశోద యమితానంద మంది వారి కర్ఘ్యపాద్యాదులను, ఆసనములను సమకూర్చి తనచిన్నబిడ్డనిచే నాతనికి ప్రొక్కించి తాను వందనశతము లర్పించి యిట్లని పలికెను. "ఓఋషివర్యా! చెప్పఁదగుచోఁ దమనామధేయముఁ జెప్పి నన్నుఁ గటాక్షింపుము. నీవు నరరూపము ధరించిననారాయణుఁడవో శ్రీశుకుఁడవో యని నే ననుకొనుచున్నాను.

భవద మోఘాంఘ్రి రేణుసంస్పర్శనమున
జన్మకోట్యార్జి తాఘంబు సంక్షయించె
సంయమీంద్ర ! నాపుట్టువు సఫలమయ్యె
ధన్య నతిమాన్య నధిక సౌజన్య నైతి.

భవదంఘ్రిరజము సోకిన
నవనీతల మతిపవిత్ర మగుఁ దత్క్షణమే
భవదీయాగమనముచే
భువి మద్దేహంబు తీర్థభూతం బయ్యెన్,

శ్రుతులయం దెవ్వ రధికవిశ్రుతి వహించి
రట్టిశ్రుతిసారభూతమహాజనంబు
లందు ని న్నొక్కరుని గంటి నరిది నాదు
పూర్వపుణ్యమహోదయంబున మహాత్మ !

(బ్రహ్మవైవర్తపురాణము. కృష్ణజన్మఖండము)

మహాత్మా ! బ్రాహ్మణాశీర్వచనము పూర్ణస్వస్త్యయనము కావున, నీవును శిష్యులును నాయీచిన్నికుమారుని దీర్ఘాయురుపేతునిగా నాశీర్వదింపుఁ'' డని ప్రార్థించెను. గర్గుఁడు ''తల్లి! నేను గర్గుఁడను ఋషిని. వసుదేవునిపురోహితుఁడను. నీ కేకాంతముగా సర్వవిషయములు చెప్పెద'' ననెను. ఇంతలో నందుఁడు విచ్చేసి సశిష్యుఁడగుఋషివరునకు సాష్టాంగనమస్కారము లొనరించి సన్మానించెను. పిదప నందుని యశోదను రహస్యముగఁ బిలిచి వారితో గర్గమహర్షియిట్లనెను: ''మీచిన్నకుమారుఁడు వసుదేవునిపుత్త్రుఁడు. రోహిణీపుత్తుఁడీతని కన్న. కంసభయమున నితనిఁ దెచ్చి వసుదేవుఁడు రహస్యభంగినిట నుంచి నీకుఁ బుట్టిన పుత్త్రి నెత్తుకొని మధురాపురి కేఁగెను. ఇపుడు వసుదేవుఁడు న న్నీబాలునికి విధివిధానమున అన్నప్రాశన, జాతకర్మ

నామకర్మాదు లొనరింపఁ బంపినాఁడు. ఈబాలుఁడు పరబ్రహ్మము. ఈరూపమున దుష్టసంహారార్థము శిష్టసంరక్షణార్థము నుద్భవించి నాడు. రాధేశ్వరుఁడు, భార్గవీకాంతుఁడు, నలినాక్షుఁడు, నరనారాయణులు, కపిలాదికనారాయణాంశజాతు లందఱు నొకరాశియై మూర్తి భవించి యీబాలుఁ డయిరి. ఈతఁడు పుట్టఁగనే దేవకీవసుదేవులకు నిజరూపముఁ జూపియున్నాఁడు. ఈతనికిఁ బ్రతియుగమున వర్ణభేదము, నామభేదము నుండును. కృతయుగమున శ్వేతవర్ణుఁడై త్రేతాయుగమున రక్తవర్ణుఁడై ద్వాపరమునఁ బీతవర్ణుఁడై యుండును. ఇపుడు కృష్ణవర్ణముఁ దాల్చుటచేఁ గృష్ణుఁడనఁ బరగు. మఱియు నోనంద యశోదలారా! కకారము బ్రహ్మవాచకము, ఋకార మనంతవాచకము, షకారము శంకరవాచకము, ణకారము ధర్మవాచకము, అకారము విష్ణువాచకము, విసర్గము నరనారాయణార్థవాచకము. మఱియు, కృషి యనునది నిర్వాణవచనము. ణకారము మోక్షవాచకము,అకారము విమలాత్మధాతృవచనము. ఇంకను, కృషి నిశ్చేష్టవాచకపరము, ణకారము భక్తివాచకము,అకారము ధాతృవచనము. ఇంతేకాదు. కృషి కర్మ నిర్మూలవచనము. ణకారము దాస్యవాచకము, అకారము ప్రాప్తివచనము. ఇన్ని విధములఁ గృష్ణనామము సర్వశక్తియుతము. ఈనామము నుచ్చరించుట వలనిఫల మనంతము.

వల్ల వేంద్రా! ఈబాలునకు శ్రీకృష్ణుఁడు, పీతాంబరుఁడు, కంసధ్వంసి, విష్టరశ్రవుఁడు, దేవకీనందనుఁడు, శ్రీమంతుఁడు, యశోదానందనుఁడు, హరి, సనాతనుఁడు, అచ్యుతుఁడు, విష్ణుఁడు, సర్వేశ్వరుఁడు, సర్వరూపధరుఁడు, సర్వాధారుఁడు, సర్వగతి, సర్వకారణకారణుఁడు, పరిపూర్ణతముఁడు, పరబ్రహ్మ, గోవిందుఁడు, గరుడధ్వజుఁడు, రాధాబంధుఁడు, రాధికాంతరాత్మ, రాధికాజీవనుఁడు మున్నగుశుభనామములు వేదములందు వినఁబడును. ఈనామములు

సర్వమంగళప్రదములు. సర్వపాపప్రణాశకములు, జన్మమృత్యుజరా వ్యాధినివారకములు.

మఱి, నీజ్యేష్ఠపుత్రునినామము లెఱింగించెద. వినుము. గర్భ సంకర్షణమున నాతనికి సంకర్షణుఁ డని పేరు. వేదములం దీతని కంతు లేకపోవుటచే అనంతుఁడు. బలవిశేషమున బలదేవుఁ డనియు, హల ధారణమున హరి యనియు,నీలచేలధారి యగుట నీలాంబరుఁ డనియు, ముసలమును ధరించువాఁ డగుట ముసలి యనియు, నీతనికిఁ బేళ్ళు. రౌహిణేయుఁడు, రేవతీనాథుఁడు మున్నగు నామములు నీతనికిఁ గలవు.

పిదప, గర్గుఁడు రాధాకృష్ణులు గోలోకవాసు లగు శ్రీదామ రాధిక లనియు వారే యిపు డిటు జనించి రనియుఁ దెల్పి కృష్ణుఁ డాజన్మమునఁ జేయఁబోవుసమస్తకార్యములను బూసగ్రుచ్చినట్లు తన దివ్యదృష్టిచేఁ దెలిసికొని వారికి వినిపించెను. పిదప బలరామకృష్ణులకు నిర్వర్తింపవలసినజాతకర్మాదులకు శుభముహూర్తమును నిశ్చ యించి రహస్యమందిరము నుండి బాహ్యమందిరమునకు వచ్చి గర్గుఁడు సుఖాసీనుఁ డయ్యెను.

గర్గమహర్షి రాక విని నందవ్రజమునఁ గలగోపగోపికలు బాలక బాలికాసహితముగా గర్గుని దర్శనము చేసికొనుటకు నందమందిర మునకు వచ్చిరి. వచ్చి వారు :

"సలలితబ్రహ్మతేజంబున గ్రీష్మను
ధ్యాహ్నభాస్కరుభంగి నలరువాని
చెలువొప్పఁ గాంచనసింహాసనంబుపై
యోగముద్ర ధరించి యున్నవాని
విజ్ఞానదృష్టిచే వెస భూతభవ్యభ
విష్యదర్థజ్ఞుఁడై వెలయువాని

సస్మితుండై నంద సదనపరిచ్ఛదం
బంచితంబుగ విలోకించువాని

సిద్ధమంత్రప్రభావవిశేషకలనఁ
గాంతుతో మది గోవిందుఁ గాంచువాని
నఖిలశిష్యగణాన్వితుం డైనవాని
గర్గు విజితాఖిలారిషడ్వర్గుఁ గనిరి.

ఆపిదప వా రెల్లరు నాతనికి నమస్కరించి యాతనిదీవన లందుకొని తమతమగృహముల కరిగిరి.

నందుఁడు గర్గమహర్షి యేర్పఱిచిన శుభముహూర్తమునకు సమస్తరాజబంధుమిత్రులను విప్రులను బిలిపించి సమస్త వైభవోపేతముగా శ్రీకృష్ణునకు నామకరణాన్నప్రాశనాదులు చేయించి సర్వసత్కారపరంపరలచే నెల్లరను సంతోషపఱిచెను.

గర్గుఁడు శ్రీకృష్ణుని స్తుతించుట

ఒకనాఁడు గర్గమహర్షి శ్రీకృష్ణు నేకాంతమునకుం గొనిపోయి ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి హర్షమునఁబులకలుపొడమ భక్తినమ్రాత్మకధరుఁడై నిటలమున నంజలి ఘటించి బాహ్యాభ్యంతరములయం దమ్మహనీయమూర్తినే యఖలోకించుచు నిట్లు స్తుతించెను. "శ్రీకృష్ణా! జగదీశా! శ్రితజనమందారా! నీపదములయందు నిశ్చలమైనభక్తిని నీదాస్యమును నాకు నిత్య మొసంగుము. అంతకు మించి ధనధాన్యసంపదలు నా కేమియు వలదు. నాకు సాలోక్యసామీప్యముక్తులే వలదు. నాకు వలసినది నీదివ్యపాదార్చనము. ఈశ్వరుఁడు నిన్ను భజించియే సర్వజ్ఞుఁడై మృత్యుంజయుఁడై విలసిల్లెను. బ్రహ్మదేవుఁడు నీపాదపద్మములను భజించియే సృష్టికర్త యయ్యెను. ధర్ముఁడు నీపాదములు గొల్చియే కర్మసాక్షియై యఖలలోకసంర

తకుఁ డయ్యెను. శేషుఁడు నీపాదసేవ చేసి ధర మోవఁ గలిగెను." అని పెక్కుభంగుల స్తుతించుగర్గునిఁ గని కృష్ణుఁడు భక్తవత్సలుఁడై "ఋషీంద్రా! నీకోరినట్లే నీమన మెల్లప్పుడు నాపాదపద్మములందే అగ్న మగుఁగాక" యని కటాక్షించి ప్రసాదమొసంగెను.

పిదప గర్గుఁడు కృష్ణునికడను నందయశోదలకడను సెలవు గైకొని శిష్యసహితుఁడై స్వీయాశ్రమపదమును ప్రవేశించి సుఖ ముండెను.

గర్గుఁడు రామకృష్ణుల కుపనయనము చేయుట

కొంతకాలమునకు గర్గమహర్షి తపము చాలించి కంసవధా నంతరము శ్రీకృష్ణబలరాముల కుపనయనము చేయింప సమకట్టి దేవకీవసుదేవులకడకు సశిష్యుఁడై విచ్చేసెను. దేవకీవసుదేవు లాతని నెంతయుఁ బూజించి యర్ఘ్యపాద్యాదులు, మధుపర్కము, కామ ధేనువు మున్నగువాని నొసంగిరి. గర్గుఁ డానందించి రామకృష్ణుల కుపనయనకాలము సమీపించుటచే నది నిర్వర్తింప విచ్చేసితి ననియు ముహూర్తము చెప్పి యాకాలమునకు సమస్తపదార్థములు సిద్ధము చేయు మని వసుదేవునికిఁ జెప్పెను. తదనంతరము కృష్ణుఁడు స్మరించి నంతమాత్రమున సర్వదేవతలు ఋషిపుంగవులు బంధుమిత్రులు నెల్లరు విచ్చేసిరి. గర్గుఁడు వసిష్ఠభరద్వాజాదిఋషిపుంగవుల యనుమతిఁ గొని బలరామకృష్ణుల కుపనయనసంస్కారము నిర్వర్తించి వారిని సాందీ పని యను నుత్తమవిప్రునికి శిష్యుల నొనరించెను. ఉపనయనమహో త్సవము నిర్విఘ్నముగా నెఱవేఱినపిదప గర్గమహర్షి శిష్యసహితుఁడై సంభావన లంది నిజాశ్రమమున కేగి తపోధర్మము నిర్వర్తింపఁ దొడఁగెను.

గర్గమహర్షి కార్తవీర్యార్జునునిమేలు కోరుట

హైహయవంశీయులు తమ కులగురు వగుగర్గమహర్షిని మిక్కిలి మన్నించి దైవముగాఁ జూచెడివారు. కార్తవీర్యార్జునుఁడు రాజ్యమునకు వచ్చినపిదప నాతనికి గొప్పవైరాగ్యము జనించెను. వనమున కరిగి తప మాచరించి యధ్యాత్మయోగసిద్ధి పొందెద ననియాతఁడు నిశ్చయించుకొనెను.

కార్తవీర్యుని నిశ్చయ మెఱిఁగినగర్గమహర్షి యాతఁ డేవిధమునఁ జెప్పినను రాజ్యము చేయనొల్లఁడని తెలిసి యాతని క్షేమముఁ గోరి యిట్లు పలికెను. "ఓయీ! నీనిశ్చయముపట్ల నీకుఁ జలనము లేనిచో హరియవతారము, యోగతత్పరుఁడు నిర్జరమునిసేవితుఁడు నగుదత్తాత్రేయమహర్షిని విడువక సేవింపుము. ఆతఁడు నీకు సమస్త వరములు ప్రసాదింపఁ గలసమర్థుఁడు. ఆతని నాశ్రయించియే తొల్లి రాజ్యభ్రష్టుఁడైనయింద్రుఁడు తిరిగి స్వారాజ్యము నందఁగనెను." అని యింద్రునివృత్తాంత మంతయుఁ బూసగ్రుచ్చినట్లు గర్గుఁ డాతనికిఁ జెప్పెను. గర్గుని యీయుపదేశమును వినియే కార్తవీర్యుఁడు దత్తాత్రేయవరప్రసాద మందఁగనెను.

దిగ్విజయి యైన కార్తవీర్యార్జునుఁ డొడ లెఱుఁగని గర్వమున జమదగ్ని హోమధేనువును బలాత్కారముగాఁ గొనిరా సైన్యములఁ బంపునపుడును గర్గమహర్షి యాతనిని వారించెను. కాని, యాతనికిఁ గీడుమూడుకాల మాసన్న మయియుండుటచే గర్గవచనములు వినక కార్తవీర్యార్జునుఁడు తుదకు పరశురాముని చేతిలో మృతుఁ డయ్యెను. గర్గమహర్షి యంతటివాఁడు కులగురువై మేలుకోరి చెప్పినమాట వినక పోయిన నెంతవాఁడైన నశించునుగదా యనియెలరు ననుకొనిరి.

గర్గునకుఁ గాలయవనుఁడు కలిగినవిధము

ఒకప్పుడు గర్గమహర్షి యాదవులలో నుండఁగా నొక యాదవుఁడు మిడిసిపాటున నాతనిఁ బరిహసించెను. గర్గుఁ డది సహింపఁజాలక "మూర్ఖులారా! మీమేలు కోరి మీకడ నున్ననన్నుఁ దెలిసికొనలేక పరిహసించుచుంటిరా?" యని యడిగెను. అందుల కాయాదవుఁడు

"నీవు మాకు గురువువై యుండియుఁ బలుమాఱు జరాసంధాదులవలన మాకు బాధ కలుగనిచ్చుచుంటివి. నీవు స్త్రీవి కాని పురుషుఁడవు కా" వని మరల నిందించెను. యాదవు లెల్లరు నది విని నవ్విరి. అపు డాగర్గుఁడు వారిగర్వమును హరించు కాలయవనుఁడు తనవలన జన్మించుననియు నాతనివలన వారికి బహుబాధలు కలుగు ననియు శపించెను. యాదవులు భయపడి యాతనిపాదములపైఁ బడి క్షమింపఁ గోరిరి. ఆతఁడు దయదలఁచి కృష్ణుఁ డుపాయాంతరమున నాతనిఁ జంపి వారికి మేలు చేకూర్చు నని పలికి తనదారిఁ బోయెను. ఈసంగతి విని యాదవులపై శత్రుత్వము వహించినయొక యవనరాజు గర్గుని సేవించి యాతనిఁ దనయాలమందలో నుంచి పూజించుచుండెను. ఆకాలమున నొక యప్సరస గర్గునికిఁ గానవై యాతనిమనసు హరించెను. గర్గుఁడు తాను యాదవుల కిచ్చిన శాపమును బురస్కరించుకొని తనకుఁ బరిచర్యచేయునాయప్సరస కొకపుత్రు ననుగ్రహించెను. పిదప గర్గుఁడు నిజాశ్రమమునకు నప్సరస నిజలోకమునకుఁ బోయిరి. ఆయప్సరసకుఁ గల్గిన పుత్రుని యవనరాజు తనపుత్రునిగాఁ బెంచుకొని రాజ్య మొసంగెను. ఆతఁడే కాలయవనుఁ డనఁ బరగి నారదప్రేరితుఁడై యాదవులద్వారకానగరమును ముట్టడించి వారి ననేకవిధములఁ బాధించి తుదకుఁ గృష్ణుని మాయోపాయమునకు గుటిలై ముచికుందునికంటమున భస్మీభూతుఁ డయ్యెను.

గర్గసంహిత

గర్గమహర్షి మహాధర్మప్రతిపాదకుఁడుగా ధర్మశాస్త్రముల వలనఁ దెలియుచున్నది. మహాధర్మప్రవక్తగా వృద్ధయాజ్ఞవల్క్యమున గర్గప్రశంస కలదు. గర్గునిధర్మసంహిత కే గార్గ్య* మని పేరు. మఱియు,

---

*గర్గుఁడు వేఱు గార్గ్యుఁడు వేఱు నని నిత్యాచారప్రదీప మనుధర్మ శాస్త్ర గ్రంథమునఁ గలదు. కాని "ఇది పొరపాటు. ఇరువురు నొకఁ" డని కాణేగా రభిప్రాయపడిరి

మితాక్షరము, స్మృతిచంద్రిక, గర్గసంహితనుండి యనేకశ్లోకము లుదాహరించియున్నవి.

"పతితాఃస్త్రీయస్త్యాజ్యా భర్తృవధప్రతిజ్ఞాయాంచ" మున్నగు వాక్యములు గర్గసంహితనుండి విశ్వరూపుఁడు పేర్కొని యుండెను. ఇంతేకాక, గర్గమహర్షి యొకఖగోళశాస్త్రగ్రంథకర్తగా అపరాదిత్యుఁడు అపరార్క యాజ్ఞవల్క్యవ్యాఖ్యానమునఁ బేర్కొనియున్నాఁడు. *ఈవిషయములన్నిటివలన గర్గమహర్షికిఁ గలబహుశాస్త్రవేత్తృత్వము తేటతెల్ల మగుచున్నది.

"గర్గుఁడు పరివేష్టితమునివర్గుఁడు సంపాదితాపవర్గుఁడు భవనైసర్గుఁడు పరతత్త్వకళామార్గుఁడు" రక్షించుఁగాక! మమ్మెల్లపుడున్.

(విష్ణుపురాణము. ౭. ౧౨౩)

---

*ఋతువంతుఁ డను ఋషి తనకుఁ గలిగినకుమారుఁడు దుశ్శీలుఁడై తన కవమానముఁ గొనితెచ్చుటకుఁ గారణ మేమని గర్గమహర్షి నడిగెను. గర్గుఁ డాతని నక్షత్రముఁ దెలిసికొని యది రేవతి యని రేవతీనక్షత్రమున నాతఁడు జనించుటచే నక్షత్రదోషమున నట్లయ్యె నని చెప్పినట్లు మార్కండేయపురాణమునఁ గలదు. దీనివలన గర్గుఁడు జ్యోతిశ్శాస్త్రమునను దిట్ట యని తెలియుచున్నది.

"గర్గ ఉవాచ: చతుష్షష్ట్యంగ మదదత్ కాలజ్ఞానం మమాద్భుతమ్,
సరస్వత్యాస్తు తే తుష్టో (శివః) మనోయజ్ఞేన పాండవ."

అని వ్యాసభారతానుశాసనిక పర్వమునఁ గలదు. దీనినిబట్టి గర్గమహర్షి చతుష్షష్ట్యంగ జ్యోతిషజ్ఞాని యని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

గౌరముఖ మహర్షి



స్తుతి

"కదలు పాదపములు కల్లోలములు గాఁగ
విరులమంజరులు పెన్నురువు గాఁగ
హోమధూమంబులు జీమూతములు గాఁగ
ధవళాతపతములు ముత్యములు గాఁగ
దేవపూజావితర్దికలు దీవులు గాఁగఁ
గ్రతుహవ్యవాహ మౌర్వంబు గాఁగ
పర్ణశాలలు గూఢపర్వతంబులు గాఁగఁ
జదువులు సహజఘోషములు గాఁగ
తూలఁబట్టిన నీరాఁకవిదోవతులు ప్ర
వాళలతికలు గాఁగఁ గైవల్యలక్ష్మి
పుట్టినిల్లై సుధాంభోధిఁ బోలె నిత్య
మహిమముల మించు పుణ్యాశ్రమంబు నందు."

(వరాహపురాణము. ఆ.౯౦.)

జలధి వటపత్త్రశాయి యో జలరుహాక్ష
పగిది బ్రహ్మణ్యుఁడై శాంతి పరిఢవిల్ల
నిరతిశయమైన యానంద నిభృతుఁ డగుచు
వెలయు గౌరముఖర్షీంద్రుఁ గొలుతు సతము.

గౌరముఖుఁడు శమీకమహాముని శిష్యరత్నము. బాల్యము నుండియు శమీకమునిఁ నాశ్రయించి యాతఁడు సమస్త వేదశాస్త్ర ములు నభ్యసించి తపోధ్యానపరాయణుఁ డయ్యెను. తండ్రిమెడలో మృతసర్పమును బడవైచి పోయినాఁ డని శమీకపుత్రుఁ డగు శృంగి పరీక్షితుని శపించినపిదప శమీకుఁ డావృత్తాంత మెఱిఁగి విచారించి పరీక్షితున కావర్తమానము తెలిపి రమ్మని గౌరముఖుని బంపెను. గౌరముఖుఁడు పరీక్షిత్తున కీవార్తఁ దెలిపి తక్షకవిషాగ్నిపాలు గాక మున్నే మోక్షసామ్రాజ్యమును జూఱగొను నుపాయ మూహించుకో మ్మని చెప్పి వచ్చివేసెను.

గౌరముఖుని పుణ్యాశ్రమము

కాలక్రమమున గురుసపర్యచే బ్రహ్మవిద్యానిధియై గురునను మతిని వేఱొక యాశ్రమమును నిర్మించుకొని తనకడఁ జేరిన ముని కుమారులను శిష్యులుగా నంగీకరించి తపోజీవనమున గౌరముఖుఁడు దివ్యతేజోనిధి యయ్యెను.

గౌరముఖుని పుణ్యాశ్రమము మోక్షలక్ష్మికిఁ బుట్టిన యిల్లైన సుధాసముద్రమువలె నుండెను. ఆయాశ్రమవనముల మునికుమా రులు వచ్చి గురువులు చేయుయజ్ఞయాగములకు సమిధలు కావల యు నని కోరఁగనే చెట్లమీఁదనుండి శాఖామృగములు సమిధ లంది చ్చును. చల్లని చెట్టునీడలఁ గూర్చుండి బ్రహ్మచారులు వేదములందలి పనసలు చెప్పుకొనుచుండఁగా నెటనైన వారు మొదలు మఱచిన నం దలి చిలుకవటువు లందిచ్చును. అచటి యుద్గాతలతోఁ గూడి చక్కని స్వరములతోఁ గోయిలలు దేవతాహ్వానము లొనరించును. అచటి మునిపత్నులు తమ్మఁ జూచి బెదరి తల్లులవెనుకఁ జేరులేడిపిల్లలకు లేఁత తృణకణము లందిత్తురు. ఆమునిపత్నులు బిందెలతో బృందావనము

లకు నీరుపోయునపుడు భూదేవి వారి యడుగులకు మడుఁగు లొత్తు చున్నదో యన్నట్లు వారి పాదములందలి వ్రేళ్ళగోళ్ళ కాంతులు ముందు ప్రసరించుచుండును.

అచ్చటి వృక్షములయాకులు పానపాత్రములకుఁ బనికిరాకుండఁ బోదు మనుభయమున ముదురుటకు వెనుదీయును. తమసార భము క్షీణింపవచ్చు నని దేవతాపూజాసమయమువచ్చువఱకు నందలి పూలు వికసింపనే వికసింపవు. అచటి చెట్లకొమ్మలకు ఋషిపత్నులు కట్టిన మడిచీరలు చిరిఁగిపోవు ననుభయమున నవి యాఱి ఋషిపత్నులు విప్పుకొనిపోవువఱకుఁ జెట్లు కదలనే కదలవు.

అందలి మునీశ్వరులు నిష్కామకర్మములే చేయుచుఁ బ్రత్యక్షాగ్నులవలె, జగత్ప్రాణమిత్రులై, తేజోభరితులై, సదాశివతనులై విహరింతురు. అందలిమును లందఱకును గౌరముఖమహర్షి పెద్ద, గురువు, దైవము.

గౌరముఖుఁ డొకచల్లనిచెట్టునీడను దనహృదయ మనుమడిలో మెలచి నలువైపుల విస్తరించిన కారుణ్య లతల విధమునఁ గెంజడలు మనోహరములై యుండ, సత్త్వగుణమే యెుడ లెల్ల దట్టముగా నావరించి యున్నట్లు దేహ మంతయుఁ దెల్లని విభూతి కాననగుచుండ, నిరంతరము పురశ్చరణ చేసి మంత్ర దేవతను మెప్పించి యామె కంఠహారమును బహూకృతిగాఁ గైకొన్నట్లొప్పురుద్రాక్షమాలికాభరణము మెఱయుచుండ, మిక్కుట మగు తపమునఁ గోటికిఁ బడగ యెత్తినటు ప్రక్క బద్ధకౌపీన మగుదండ మొప్ప, సకలపుణ్యతీర్థములు సంగ్రహించి సూక్ష్మరూపము వహించి వచ్చిన బ్రహ్మాండమురీతిఁ గమండలువు దండ నుండ, శిష్యులకుఁ బరతత్త్వము బోధచేయుచుండెను.

దుర్జయుఁ డనుమహారాజు ససైన్యుఁడై వచ్చుట

ఆసమయమున దుర్జయుఁ డనుమహారాజు సైన్యసమేతుఁడై యావనమున వేఁటాడ వచ్చి వివిధజంతువుల వేఁటాడి యలసి ముని

సందర్శనము చేసికొని పోద మని యాప్రదేశమునకు వచ్చెను. సైన్య పరివారములను దూరమున నిలిపి దుర్జయుఁడు ముందుకు వచ్చి గౌరముఖునికి సాష్టాంగవందనములు చేసి నిలిచెను.

గౌరముఖుఁ డాతని నెంతయు నాదరించి యర్ఘ్యపాద్యాదు లొసఁగి నాఁటికిఁ దనయాశ్రమమున నిలిచి స్నానపానముల నేదదేఁ బోవలసిన దని కోరెను. దుర్జయుఁ డసూయపడి యాముని యెక్కడ ససైన్యుఁ డగు తనకు విందు చేయఁగలుగు నెక్కడ యని యాతని పస దెలిసికొని పరాభవింత మనుకొని యట్లే యనెను.

గౌరముఖునకు విష్ణువు మణి నిచ్చుట

గౌరముఖుఁడు తాను గంగకేఁగి స్నానము చేసి వచ్చెదను విడిసియుండు మని రాజుతోఁ జెప్పి గంగానది కేఁగి యట శ్రీహరి నిటు ప్రార్థించెను.

"జలరూపాయ! చరాచరాత్మక జగత్సంస్థాయ! లక్ష్మీమహీ లలనేశాయ! కరాళకాళియఫణాలాస్యాయ! దేవోత్తమా య! లయోత్పత్తి వివర్జితాయ! సుజనాయత్తాంతరంగాయ! కే వల కారుణ్య కటాక్ష వీక్షణ పరీవాహాయ! తుభ్యం నమః."

(వరాహ పురాణము. ౪.౧౦౬)

దేవా ! ఓంకారము నీవ. భూర్భువస్స్వరాదిలోకములు నీవ. విశ్వప్రపంచము నీవ. నీవలననే ఋగ్యజుస్సామాథర్వణములు మున్నగు సమస్తము జనించె. నన్నుఁ గృపఁజూచి సైన్యసమేతుఁడగు రాజున కాతిథ్య మీఁగల సామర్థ్య మి" మ్మని కోరెను. దయాసము ద్రుఁ డగుశ్రీహరి ప్రత్యక్షమై గౌరముఖుని దీవించి యొక రత్న మిచ్చి దానివలన నన్నియు సమకూరు నని చెప్పి యదృశ్యుఁ డయ్యెను.

గౌరముఖుఁ డామణినిఁ గైకొని పూజించి యాశ్రమమునకు వచ్చుసరి కదియొక గొప్ప పట్టణమయ్యెను. అందుఁ గని విని

యెఱుఁగనంత మనోహరములైన భవనములు మహాభోగములతో నలరారెను. గౌరముఖుఁడు రాజును సైనికులను ఆభవనముల విడియుఁ డని కోరెను. దుర్జయుఁ డాశ్చర్యమంది సైనికులతో నాయా మందిరముల నాక్రమించెను.

పిదప గౌరముఖుఁడు మణిని దలఁచినంతనే సంపెఁగ నూనెలు, గంధాపులకములు, దివ్యాంబరాభరణములు, నీరాజనభాజనములు, రత్నకంబళ్ళు మున్నగు సమస్తవస్తుసంచయములు గొని వేలకు వేలుగా నప్సరసలవలె సుందరీమణు లగు యువతు లవతరించి యరుదెంచి సమస్తజనులకు సమస్తవిధములైన స్నానపానకృత్యములు శరవేగ మున నిర్వర్తించిరి. తదనంతరము చీఁకటివడినవెనుకఁ బ్రతివానికి నొకదివ్యపర్యంకము, ప్రతివానికి వలపులు గులుకు నొక్క-చిగురుఁబోణి యమరెను. దుర్జయుఁడు, నాతనిపరివారములోఁ బ్రతివ్యక్తి నారీతి రేయెల్ల సరససంభాషణములతోడను, ఇష్టోపభోగములతోడను బ్రహ్మానంద మంది నిద్రించిరి.

మఱునాఁ డుదయమున లేచి కాలకృత్యముల నెఱవేర్చి దుర్జ యుఁడు గౌరముఖమహర్షికడకు వచ్చి నమస్కరించి నిలిచినంతనే యాసమస్తసౌధాదికములు నంతర్హితము లై పోయెను.

దుర్జయుఁడు మణికొఱకు యుద్ధము చేయుట

తరువాత దుర్జయుఁడు సైన్యపరివారసమేతుఁడై గౌరముఖుని కడ నెలవుఁ గైకొని తన పట్టణమున కేఁగ నాశ్రమము బయటికి వచ్చెను. అపు డాతని కాబుషి మణిని గొనిపోవ దుష్కాంక్ష జనిం చెను. వెంటనే యాతఁడు తన మంత్రిని బిలిచి ఋషికడ కేఁగి యే మడిగిన నది యిచ్చెదము, ఆమణిని మా కిమ్మని నామాటగా నడిగి రమ్మని పంపెను. మంత్రి గౌరముఖునికడ కేఁగి నయమున భయ మున మణి నడిగెను. ఈయనిచో ముని కనేకబాధలు కలుగు నని హెచ్చరించెను. అంత గౌరముఖుఁడు :

"దుష్టచరిత్రులైనృపతుల్ ధర యేలుటకంటెఁ గల్గునే
కష్టము. శిష్టలోకము సుఖస్థితి నుండదు గాన నిట్టి ష
ష్టాష్టక మెట్టు పుట్టె నకటా వికటాలపితంబు లేటికిన్
భ్రష్ట! పొకాలి పొ"

మ్మని పలికిన మంత్రి భయపడి పోయి దుర్జయునితో జరిగినసంగతి విన్నవించెను.

దుర్జయుఁడు కోపించి నీలుఁడను సేనాపతిఁ బిలిచి సైన్యముతో నేఁగి మునికడనుండి రత్నమును బలవంతముగాఁ గొనితెమ్మని పంపెను. నీలుఁడు బయలుదేఱి వెళ్ళి మున్యాశ్రమము సమీపింపఁగనే రత్నమువలన నిర్యత్నముగ ననేకవేలసైనికు లుద్భవించి నీలుని నీలునిసైన్యమును ఱణములో నశింపఁజేసిరి. ఇది విని దుర్జయుఁడే సమస్తసైన్యములను దీసికొని స్వయముగా యుద్ధమునకు బయలుదేఱి వచ్చి రత్నసంభవ సైన్యములను జెల్లాచెదరు చేయుచు ఘోరయుద్ధ మొనరించుచుండెను.

అపుడు గౌరముఖ మహర్షి తన యిలవేలుపు నాత్మరక్షకుఁడు నగు విష్ణుమూర్తిని దలఁపఁగా నాతని యాజ్ఞవలన విష్ణుచక్రము విచ్చేసి క్షణమాత్రలో దుర్జయుని నాతని సమస్త సైన్యములను నాశనముచేసి తిరిగి విష్ణుమూర్తిని జేరెను. విష్ణు వచటికి విచ్చేసి గౌరముఖునితో "మునీశ్వరా! నిమిషమాత్రలో నాచక్ర మిచట శత్రువుల నుఱుమాడినకారణమున నీప్రదేశము నైమిష మనఁ బరగు. నే నిచట యజ్ఞపురుషుఁడనై నివసింతును. అని చెప్పి" యంతర్హితుఁ డయ్యెను. గౌరముఖుఁ డానందించి శిష్యసమేతుఁడై యథారీతిఁ దపమొనరించుచుండెను.

గౌరముఖుఁడు మార్కండేయుని బోధఁ గాంచుట

ఇట్లుండి కొంతకాలమైనపిదప గౌరముఖమహర్షి విష్ణుపూజా నిమిత్తము తపఃఫలదకల్పభూజ మనఁదగు ప్రభాస మను సోమతీర్థ

రాజమున కేఁగి యటఁగల విష్ణుమూర్తిని బూజించుచుండఁగా నొక నాఁడు మార్కండేయమహర్షి యచటికి విచ్చేసెను. గౌరముఖుఁ డాతని కెదు రేఁగి సాష్టాంగనమస్కారము లొనరించి తనయాశ్రమమ్మ్గె నకుఁ దెచ్చి దర్భాసనమునఁ గూర్చుండఁ జేసి నానావిధములగు నతిథి పూజలు చేసి ముకుళితహస్తుఁడై ముందట నిలిచి "మహామహా! నన్నిట్లు కటాక్షించి విచ్చేసినపని యే" మని యడిగెను. మార్కండేయుఁ డానం దించి "ఋషీంద్రా! మీవంటి ఋషివరులనుగాంచుట యే మాకార్యము. నీకేమైన సందేహము లున్న నడుగుము. వానిం దీర్చి పోవుదు" నని దయతోఁ బలికెను. గౌరముఖుఁడు నమస్కరించి "అయ్యా! వేద వేదులు పితరులు కల రందురు. వా రెవరు? ఎట్టివారు? దయతోఁ దెలుపు" మని కోరెను.

మార్కండేయుఁ డిట్లు సమాధానమిచ్చెను. "ఆర్యా! విశ్వము నకు విష్ణువు తండ్రి. ఆతనివలన బ్రహ్మ జనించెను. బ్రహ్మ యేడుగురు ఋషుల సృజించి వారిఁ గని తన్నుఁ బూజింపుఁ డని కోరెను. వారటు చేయక ఆత్మలోఁ బరమాత్మునే గనుచుండిరి. బ్రహ్మ వారిపైఁ గోపించి మీబ్రహ్మ విజ్ఞానగర్వము పదటిపాలగుఁగాక యని శపించెను. ఆయేడు గురు ఋషులు వంశకరులగు తనయులఁ గాంచి విమానస్థులై స్వర్గము నకుఁ బోయిరి. వారి తనయులు వారికి శ్రాద్ధమూలమునఁ దృప్తిఁ గూర్చుచుండిరి. ఇట్లు సుపుత్రమూలమున నాయేడ్వురు స్వర్గమున సుఖముండిరి. వీరిలో అమూర్తులు మువ్వురు. సమూర్తులు నలుగురు. వీరు దేవతలకుఁ బితరులై యాదేవతలు పూజించు నూఱుయుగములు సనాతనలోకమున వసించి పిదప బ్రహ్మవాదులై జనించి తమపూర్వ సాంఖ్యమతమునఁ గొంతకాలము వర్తించి పునరావృత్తిరహిత మగు యోగసిద్ధిం గని యోగబలమున సకలయోగులకు యోగాభివృద్ధిఁ గావించుచుందురు. అందుచే వారికి శ్రాద్ధము లొనరించుచుండవల

యును. ఇది ప్రథమ పితృసర్గము. మఱి యనేకవిధములఁ బితరులు సప్తలోకముల నిలిచియుందురు. భూలోకవాసు లగుజనులు భువర్లోక వాసు లగుపితరులను బూజింతురు. భువర్లోకవాసులు మరీచ్యాదు లైన సువర్లోకవాసులు కల్పోపవాసిసంజ్ఞు లైన మహాలోకవాసులు సనకాదు లైనజనలోకవాసు లగుపితరులను గొలుతురు. జనలోక వాసులు వైరాజు లైనతపోలోకవాసులు సత్యలోకవాసులగు పితృ గణములను సేవించెదరు.

పసుసాధ్య రుద్రాదిత్యాశ్విమరు దృషులు, వారి కూఁతుండ్రకుఁ బుట్టినవారు, వసిష్ఠ బ్రహ్మపితరులైన అగ్నిష్వాత్తాదులు బ్రహ్మక్షత్ర వైశ్యులకు సమానపూజనీయులు. భట్టారకా! ఎట్టివారికైనను పితృ సర్గము సమస్తము వివరించుట సాధ్యముకాదు. కాన, నేను సంక్షేప ముగాఁ జెప్పితిని.

ఆయాపితృదేవతల నెప్పుడెప్పుడు పూజింపవలెనన్న— వ్యతీ పాతము, అయనము, విషువత్తు, చంద్ర సూర్యగ్రహణములు, సంక్ర మణము మున్నగు పుణ్యవేళలందు, నక్షత్రగ్రహపీడాసమయములందు, చెడ్డకలలు వచ్చినపుడు, నూతనధాన్యములు వచ్చినపుడు, విశిష్ట ద్రవ్య పాత్ర లాభంబులు కలిగినపుడు, గంగాదిమహాతీర్థముల కేఁగినయపుడు యథాశక్తి శ్రాద్ధకర్మలు చేయవలెను. ధనము లేనివారు తిలతర్పణము లిచ్చిన శ్రాద్ధఫలము వారికి లభించును. అదియు సాధ్యముకానివారు ఆవున కొకపూఁటకు సరిపడు గడ్డి నొసఁగినచో శ్రాద్ధఫలము సిద్ధిం చును. అదియుఁ జేయలేనివారు వనమున కేఁగి సూర్యాదిలోక పాలురు సాక్షులుగాఁ జేతులు పైకెత్తి బిగ్గఱగాఁ దమ యసమర్థతం దెలుపు కొన్నఁ బితృదేవతలు తృప్తులగుదురు.

యోగి, యతి, శిష్యుఁడు, సోమయాజి, ఋత్విజుఁడు, సోదరి కొడుకు, అల్లుఁడు, మేనమామ మున్నగువారు పైతృకకర్మకు

యోగ్యులు. నపుంసకుఁడు, దొంగ, నిందితుఁడు, రోగి, గ్రామయాజ్ఞికుఁడు మున్నగువా రిందుల కనర్హులు.''

పిదప, మార్కండేయుఁడు గౌరముఖునకు గౌరముఖుఁ డొనర్చిన పితృదేవతా పూజాఫలముగా గత నూఱుజన్మముల వృత్తాంతముఁ దెలియఁజేసెను. అపుడు గౌరముఖుఁడు బ్రహ్మచే శాపమునందిన మరీచ్యాదిమానస పుత్రు లేడ్వురలో భృగుఁ డొకఁ డనియు, ఆభృగుని వంశము నందే తాను జన్మించితిననియుఁ దెలిసికొనెను. అనంతరము మార్కండేయుఁ డాతని నాశీర్వదించి త్వరలోనే విష్ణుమూర్తిలో నైక్యమై ముక్తిఁ గను ముపాయముఁ దెలిపి వెడలిపోయెను.

గౌరముఖుని సాయుజ్యప్రాప్తి

గౌరముఖుఁ డధికానందమునఁ బితృదేవతాపూజ లనేక సంవత్సరము లొనరించి ప్రభాసతీర్థవాసుఁ డగు శ్రీహరినే మనమునఁ దలఁచుచు మహాతప మొనరించెను. పిదప నొకనాఁడు గౌరముఖుఁడు :

"జలజగర్భుని చదువులచెఱ వీడ్కొలు మంథానకుధరధురంధరుండు
విషధి మునింగిన విశ్వంభరకుఁ దేప సుమనోవిపక్షవక్షోవిదారి
కుంభినీ నభములు కొలిచిన కొలగోల పార్థివరుధిరతర్పణ పరుండు
లంకాధిపతితలలకు గండక త్తెర రేవతీహృదయరాజీవహేళి

త్రిపురవనితల యీలువు తెక్కలీఁడు
ఖురఘుర్ట్ట విఘుట్టితక్షోణితలుఁడు
చింతితఫలప్రదాత రక్షించుఁగాత!"

(వరాహపురాణము ౫. ౫౬.)

అని ప్రార్థింపఁగనే దయామయుఁడు, భక్తవత్సలుఁడు నైన శ్రీహరి కోటిసూర్య దివ్య ప్రభతో నాతనియెదుటఁ బ్రత్యక్షమయ్యెను. వెంటనే గౌరముఖుఁడు యోగబలమున శ్రీహరిలో నైక్యమై పోయెను.

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

జడ మహర్షి

స్తుతి

బహుగతపూర్వజన్మముల బ్రాహ్మణుఁడై బహువేదశాస్త్రిస
ద్విహితసమస్తకర్మములు దీఱ నొనర్చి జరాదిమృత్యుదు
స్సహపరివేదనంబుల నసహ్యపడంగని ముక్తిఁ గోరి య
న్వాహమును, జ్ఞానియై జడుఁడనన్ జనియించినమౌనిఁ గొల్చెదన్.

జనాదికము

తొల్లి భార్గవుఁ డనుబ్రాహ్మణుఁ డొకఁడు సమస్తవేదశాస్త్రి పారంగతుఁడు, సజ్జనస్తుతిపాత్రుఁడు, గృహస్థధర్మావలంబి యై విరాజిలుచుండెను. కాలక్రమమున నాతనికి ధర్మపత్నియం దొకసుపుత్త్రుఁ డుదయించెను ఆతనికి జాతకర్మచౌలోపనయనాదులు యథావిధి వయఃక్రమమున నొనరించి యొక్కనాఁ డతివిమలాకారుఁ డగు సుతునిం గాంచి ధర్మజ్ఞుఁడు, వేదవిదుఁడు, కర్మావలంబి యగుతండ్రి యిట్లనెను. "వత్సా! నీ కుపనయన మైనది. ఇఁక నీవు పోయి గురువరు నొక్కని నాశ్రయించి మాధుకరభిక్షాన్నమునఁ దృప్తుఁడ వగుచు బ్రహ్మచర్య మవలంబించి గురుప్రీతి గావించుచు వేదము లభ్యసింపుము. ఆపిమ్మట చక్కనికన్నె నొక్కతెం బరిగ్రహించి గృహస్థుఁడవై యజ్ఞయాగము లొనరించి యనంతసంతానవంతుఁడవై

యాపిమ్మట వానప్రస్థాశ్రమమున ఫలమూలశాకాహారము లారగిం చుచుఁ దపోవృత్తి నుండుము. తదనంతరము సమస్తమును బరిత్య జించి యతీశ్వరుఁడవై నిర్మోహివి, నిర్జితేంద్రియుఁడవు, నిరహంకారివి, నిర్మత్సరుఁడవు, నిత్యోపవాసివి యై చరింపుము."

ఈమాటలు విని, యాతనిపుత్రుఁ డేమియు మాటాడఁ డయ్యెను. పుత్రప్రేమమునఁ దండ్రి పెక్కుమారు లీమాటలే పదింబదిగఁ జెప్పెను. తుదకు జడుఁడు తండ్రిం గాంచి నమస్కరించి యిట్లనెను : "తండ్రీ! నీచెప్పినచొప్పున నెన్నిజన్మములందో చేసితిని. పూర్వజన్మములం దెన్నింటనో నేను బ్రాహ్మణుఁడనై పుట్టి వేదశాస్త్రాదు లెల్ల నభ్యసించి తిని. ఈప్రకార మైదువేల జన్మము లెత్తితిని. అందు నానాసుఖదుఃఖ ములు ననుభవించితిని. పుత్రమిత్రకళత్రశత్రుభ్రాతృవియోగసంప్ర యోగము లంగీకరించితిని. వేలకొలఁదితల్లుల చనుబాలు ద్రాగితిని. బాల్యయౌవనజరావికారజనితబాధ లన్నియు నతికష్టవృత్తి ననుభవించి తిని. గర్భవాసజన్మదుఃఖమరణసమితి నెన్నిపర్యాయములో కాంచి తిని. ఈసంసారచక్రమున సకలదుఃఖానుభవములఁ గాంచుచు వికల మనస్కుఁడనై యెన్నివేలపర్యాయములో పరిభ్రమించితిని. నేఁటికి నీకడుపునఁ బుట్టితిని. నేను జ్ఞానినై పుట్టితిని. నాకు మరల నీయుప దేశము విన్నంత నవ్వువచ్చుచున్నది. తండ్రీ! ఈకర్మభ్రాంతియు, నీవేదాభ్యాసములు నాకింక వలదు. త్రయీవిహితధర్మము లెల్ల పాప భరితములు. పరమపద మగుమోక్షముఁ గోరునా కీకర్మకాననముఁ బ్రవేశింప నిచ్ఛ పొడమదు. కావున, నాయెడ నీప్రబోధము లన్నియుఁ బూడిదఁ బోసినపన్నీ రే. సమస్తమును దెలిసిననేను మాటాడ నిచ్ఛ గింపక జడత్వముఁ దాల్చితిని. జడనామధేయము నాకు సార్థకము."

ఈమాటలు విని భార్గవుఁ డాశ్చర్యభరితుఁడై "వత్సా! నీ కీవిట్టి జమెక్కడిది? నీ కీజడభావ మేల కలిగెను? ఇంతబుద్ధిమంతుఁడవు నీజ్ఞా న్మించుట కేమిశాపము గలదు? నిజము చెప్పు" మని కోరెను.

జడుఁ డిట్లనెను. ''తండ్రీ! నేను పూర్వజన్మమున నొకబ్రహ్మ
ణ్యుఁడ నగుబ్రాహ్మణుఁడను. నేను గురువునై శ్రద్ధాభయభక్తివినయ
విధేయతలు గలశిష్యరత్నములకు జ్ఞానోపదేశముఁ జేసితిని. ఆపుణ్య
ముపలనను, ఏకాంతవాసినై యజ్ఞానతిమిరమును బటాపంచలు చేసి
కొనఁగలిగినవాఁడ నగుటను, త్రయీధర్మములకుఁ బొందరానిజాతి
స్మరణజ్ఞానము నా కీజన్మమున లభించినది. పూర్వయోగాభ్యాసమున
నామన స్సిపుడు నిర్మలమై యున్నది. ఇఁక, నే నేకాంతప్రదేశమున
కేఁగి నైష్ఠికుఁడనై మోక్షోపాయముఁ జూచుకొందును. నేను నీకడ
కిఁక దిరిగి రాను. కనుక, నీ కేవేనిసంశయము లున్నఁ జెప్పిన వానిని
దీర్చి ఋణవిముక్తుఁడనై పోవుదును.''

ఇది విని భార్గవుఁ డత్యద్భుత మంది "మహానుభావా! నీవు
మాగర్భశుక్తిముక్తాఫలమవై జనించుటకు మే మెన్ని నోములు నోచి
యుంటిమో! ఆగర్భజ్ఞాని వగునిన్నుం గాంచుట మాతపఃఫలము.
ఇట్టి కులదీపకు లగు పుత్త్రులఁ బడయుభాగ్య మెవ్వరి కున్నది? ఇఁక
నేను పుత్రభావము వీడి గురుభావముతో నిన్నుఁ గొన్నిప్రశ్నము లడి
గెదను. నాకు నీవు సమాధానములు చెప్పి యనుగ్రహింపుము" అని
పలికెను. జడుఁ డట్లే యడుగు మనెను.

''ఓవిజ్ఞానీ! భూతములకుఁ బుట్టుక, ఉనికి, మరణము నివి
యెట్టివి? ప్రాణి యెట్లు పుట్టు? నెట్లు చచ్చు? నెట్లు పాపపుణ్యము
లనుభవించు? నెట్లు జ్ఞానమును గాంచు? చెప్పు" మని భార్గవుఁడు
కోరెను.

జడుఁ డిట్లు చెప్పెను. ''మానవుఁడు మరణించువిధము తొలుతఁ
జెప్పెదను. వినుము. మరణకాల మాసన్నమైనంతనే మానవునకు
శరీరమున మిక్కిలివేఁడి యగునావిరులు బయలుదేఱును. వీనివలన
మర్మస్థానము లవిసిపోవును. అప్పుడు లోనియుదానుఁ డూర్ధ్వగతిని

వెలువడును. అపుడు మలమూత్రములు కట్టువడిపోవును; కడుపు బొంగును; వెదవు లెండిపోవును; కుత్తుక తడియాఱు; మాట పడిపోవును; ఉచ్ఛ్వాసనిశ్వాసము లాఁగిపోవును; కన్నులు వికారము నందును; నాలుక వెక్కిపుట్టును; జీవికి వెగడు గదురును. అపుడు, అన్నోదకదానపరుఁ డైనమహానుభావుఁడు బాధ లేక శరీరము విడుచును; శ్రద్ధానుఁడు, నిత్యసత్యవ్రతపరాయణుఁడు, భూసురగురుపూజ్యులఁ బూజించినమహనీయుఁడు, కామాదివికృతులు కలిగినపుడైన ధర్మము తప్పనిమహాత్ముఁడు, అసూయారహితుఁడు, మరణబాధలు లేక సుఖమృతి నందుదురు. ఇట్లే సువర్ణదానపరుఁడు, జ్ఞానదాత, దీపప్రదాత, సత్యవాక్పరిపాలకుఁడు మంచిచావు చత్తురు.

అన్నదానముఁ జేయనివాఁడు, కూటసాక్షి, వేదదూషకుఁడు మున్నగుపాపులమరణవేళ దారుణనేత్రులు, వికటదంష్ట్రలు, ముద్గరపాశహస్తులు, మహాకోపులు, అతిభయంకరులు నగుయమదూతలు వారిని సమీపింతురు. వారిని జూచియుఁ జూడకమునుపే పాపులు భయవిహ్వలులై గడగడలాడుచు, చేష్టలు దక్కి, పలుమాఱు నోరు, కన్నులు తెఱచుచు, తల్లిదండ్రులను, ఆలుబిడ్డలను, తోఁబుట్టువులను బిలువఁ దలఁచియు నోరు మెదప లేక తల్లడిలుచుండఁ బ్రాణములు పోవును. ప్రాణములు పోయినపిదపఁ దల్లిదండ్రులవలనఁ గలిగిన దేహము కాక తమతనుకర్మములం బట్టి వయోరూపప్రమాణములఁ బూర్వదేహములవంటి వేఱు యాతనాశరీరముల జీవులు ప్రవేశింతురు. యమకింకరు లీయాతనాదేహులను దయాదాక్షిణ్యములు లేక దీర్ఘదారుణకాలపాశములఁ గాలుసేతులుగట్టి "మొట్టో మొట్టో" యనుచున్న నినుపగుదియలఁ జావమోదుచు, పురపురఁబొక్కి వేఁడి నేలల నీడ్చుచు, ఱాలుఱప్పలు, ముండ్లుగండ్లు, గుట్టలుపుట్టలు గల భయంకరమార్గములఁ, బెద్దనక్కలు వెంట నంటి పిక్కలు పీకుచు

మాంసములు నాఁకుచు వచ్చుచుండఁ, దీసికొనిపోవుదురు. కాని, ఆఁకొన్నవారి కతిదయతో నన్నము పెట్టిన మహనీయులను, దాహముతోఁ బరితపించువారికిఁ జల్లనిపానీయము లిచ్చి యాదరించిన పుణ్యాత్ములను, ఇల్లు, గొడుగు, చెప్పులు దానముచేసిన సుకృతులను, ఈదారినిగాక సుఖవంతమై, సుగంధభూషితమై సొంపారుమార్గములఁ దీసికొనిపోవుదురు.

ఇట్టి యాతనాదేహమున నున్నజీవుఁ డిట్లు పోవుచుఁ దనపూర్వ దేహమును బంధుమిత్రులు దహనము చేయుచుండ భరింపరాని తాపము నందుచు, బహుళదుఃఖము లనుభవించుచుఁ బండ్రెండుదినము లకు యమపురముఁ జేరును. ఈదినములలో బంధుజనులు చేయుతిలో దకపిండప్రదానాదులచేతను, భూమిశయనముఖ్యవ్రతములచేతను యాతనాదేహి తృప్తిపడుచుండును. పండ్రెండవదినమున బంధు మిత్రాదులు చేయుమైలస్నానము, తైలాభ్యంగనాదులు, తర్పణా దులు, వీనిమూలమున యాతనా దేహి మిక్కిలి సంతోషించును.

పదుమూఁడవదినమున యమకింకరు లీతనిని లాగుకొనిపోయి యమధర్మరాజుకడ నిలుపుదురు. అసలే తల్లడిల్లుపాపజీవులు- కాటుక రాశివంటి కడునల్లనిశరీరము, చింతనిప్పులవలెఁ గణగణలాడు మిడి గ్రుడ్లు, ఎంతటిధైర్యశాలి నైనను తృణమాత్రమున భీతచేతుస్కునిఁ జేయువాఁడికోఱలు, ఇంతకుఁ గోటిరెట్లుభయంకరమగునుదురు గలిగి, వెక్కిరోగములు ముసలితనము ఉగ్రమృత్యువు మున్నగునవి భీకర రూపములు ధరించి వందిమాగధులై స్తోత్రములు చేయుచుండఁగా, గదాదండపాశాయుధములు చేతులలో భీతిప్రదములై యుండ, నెమకలపుజ్జెలహారము మెడలో ధరించినయమునిఁ గాంచి గడగడగడ గడగడగడగడలాడుదురు.

యముఁడు నిర్దయుఁడై చిత్రగుప్తునివలన నాయాజీవులపాప వర్తనము లెఱింగి వారివారికిఁ దగినఘోరనరకశిక్షలు విధించి వీ

రందటి నొక్కయహోరాత్రము రౌరవనరకమునఁ ద్రోయును. ఆరౌరవము రెండువేలయోజనములవిస్తీర్ణము కలిగిన, గనగనలాడు చింతనిప్పులభుగభుగ లెగయుదారుణప్రదేశము. వీనినడుమఁ గింక రులచేఁ ద్రోపువడి పడినజీవులు మలమలమాడుచు, గొల్లున నేడ్చుచు, ఇటు నటు పరుగులిడఁ జరణయుగము కాలి బూడిద యగుచుండ, మరల మొలచుచుండ, హాహారవముల ఘోరభైరవదుఃఖ ములు వర్ణనాతీతములు.

ఆపిదప బహునరకముల బహుదుఃఖము లంది చిరకాలమున కాజీవి భూమిపైఁ గ్రిమికీటకాదిబహుజన్మము లెత్తి క్షీణపాపియై మనుష్యత్వము నంది సకలహీనజాతులకు జనించి శూద్రవైశ్యక్షత్రియ బ్రాహ్మణత్వముల నంది పుణ్యఫలమువలన నారోహిణి యైనదేవగతి నందును. పుణ్యపరు లైననరులుమాత్రము యమశాసనమున దివ్యా భరణములు, దివ్యాంబరములు, దివ్యసుగంధములు ననుభవించుచు దివ్యవిమానారూఢులై స్వర్గమున కరిగి కిన్నరగంధర్వగీతముల వినుచు, అప్సరసలఁ జూచుచు వారినృత్యములం గాంచుచు దివ్య సుఖము లంది పుణ్యక్షీణ మైనపిదప అవరోహిణి యైనమనుష్యగతు లందుదురు.

పురుషునిరేతోబీజము సతిఋతుపుష్పరసమునఁ బడుసమయ మునఁ బరలోకసమాగతుఁ డైనజీవుఁ డతిరయమున వాయుభూతుఁ డై యందుఁ జేరును. శుక్లశోణితద్వయమున జీవసంక్రమణము సుస్థిర మగును. అంత నది కలలము, బుద్బుదము లై బలిసి కరడుగట్టును. దానఁ బంచాంగములు మొలచును. దానఁ గ్రమక్రమమున నుపాం గము లన్నియుఁ బుట్టును. సహజకఠినకోశవృద్ధితో వృద్ధినొందునారి కేళమువలెఁ గోశపంజరమున జంతు వుండి దానితోనే వృద్ధిపొందును. పిదప సకలావయవసంపూర్ణత నంది యొకయంగుటముపై నొక

యంగుటము మోపి, తొడలప్రక్కలఁ జేతులు చేర్చి, అంగుళులు జానువులయగ్రముల నిడి, కన్నులఁగవ జానువులవెనుక నుంచి, నాసిక జానువులనడుమఁ జేర్చి రెండుపిక్కలు దగ్గఱకుఁ జేర్చి మిక్కిలి యొదిఁగి జానుమధ్యమున నుండఁగా, తల్లికడుపులోనివేఁడిమి కఠిన త్వమును గూర్చును; ఆమె తిననన్నము క్రాగుపానీయములు తను వును బెంచును; ఈదశలో శిశువును బుణ్యాపాపము లాశ్రయించును. అందుచే, శిశువు విజ్ఞానసంపదఁ గాంచును. నవమాసములు నిండినపిదప, ప్రాజాపత్యమారుతమున నధోముఖత్వముఁ గాంచి భ్రమపడుచు, తల్లడిల్లుచు, పైవాయువున శరీరమునకు బాధకలుగ బహువేదనలం గనుచుఁ బుట్టి మూర్ఛపోయి, బాహ్యవాయువు చల్లఁదనమునఁ దేఱుకొని పూర్వజ్ఞానమంతయు నశింపఁగా శిశువై యాక్రందించును. మరల :

మాయావేశమునన్ విమోహరసనిర్మగ్నాత్ముఁడై బాల్యదుఃఖాయత్తుండును యౌవనోద్ధతవికారావిష్టుఁడున్ వృద్ధతా హేయప్రాప్తుఁడునై పునర్మృతిభవానేకత్వదుఃఖాకులుం డైయుండున్ నరుఁ డిట్లు సంసరణచక్రాక్రాంతి విభ్రాంతుఁడై.

(మార్కండేయపురాణము. ఎ. ౬౦.)

తండ్రీ! తల్లికడుపునఁ బడినదిమొదలు మనుష్యత్వమున సుఖ మావంతయు లేదు. స్వర్గముకూడఁ బుణ్యక్షీణ మైనంత భూమిం బడవైచునదే కనుక భయాన్వితము, దుఃఖప్రదమే కాని సుఖకరము కాదు. నరకము ఘోరదుస్తరతీవ్రవ్యాతనాకరము. దానిని గూర్చి పే ఱొకఁ జెప్పవలసినపని లేదు. పశుపక్షికృమికీటకాది తనువులందలి వ్యాతన లనంతములు. అందుండి బయలుపడుట దుష్కరము. అందు చేతనే నే నీక్రియామార్గమునుండి బుద్ధి మరల్చి నైష్కర్మ్యనిష్ఠఁ బూనితిని."

ఈమాటలు విన్న భార్గవుఁడు తనపుత్త్రుని జ్ఞానసంపద కాశ్చర్య చేతస్కుఁడై యాతనియెడఁ బుత్త్రిభావముఁ దొలఁగించి గురు భావము నెలకొల్పి వివిధనరకములఁ గూర్చినవిశేషములఁ దెలుపు మని కోరెను.

అందులకు జడుఁ డిట్లు పలికెను. "అయ్యా! రౌరవమును గూర్చి నీ కిదివఱకే చెప్పితిని. మహారౌరవ మనునింకొకనరకము గలదు. ఇది యనేకవేలయోజనములవిస్తీర్ణము గలది. తామ్రమయ మగుదారుణాగ్నితప్తమై, విద్యుద్ధామకాంతి దేదీప్యమానమై తేజి చూడఁజాక యత్యంతభైరవమై యుండును. ఇందు యముని భటులు కాలుసేతులు గట్టి పడవైతురు. వెంటనే కుక్కలు, నక్కలు, కాకులు గ్రద్దలు, పాములు, జెట్టులు, దోమలు, చీమలు, తేళ్ళు, కోళ్లు ,మీఁదఁ బడి పొడిచి పొడిచి కఱచి కఱచి ఎముకలు బొమికలు రక్తమాంసము నమలి నమలి జుట్టి జుట్టి విచ్చలవిడి నేడ్పించును. అందు మహాబాధలుపడి జీవి పాపక్షయమైనంత బయటపడును. పిమ్మట, అతిఘోర మగుతమోనరకము గలదు. ఇందుఁ బడ్డపాపాత్ములు మహోగ్ర మగుశీతబాధచేఁ గాళ్ళుచేతులు కొంకరలువోవ, ఱుత్పి పాసాపీడితులై, శీతవాతములచే బయలువడుననోన్యదేహశోణిత మద్యములు గ్రావుచు మహాబాధలు పెక్కు లనుభవింతురు. నిక్కంత మనునరకమునఁ గులాలచక్రము లెడతెగక తిరుగుచుండును. యమ కింకరులు పాపాత్ములఁ దెచ్చి వానిపైఁ బెట్టఁగనే పాపులశరీరములు ముక్కలు ముక్కలుగఁ గోయఁబడుచుండును. ఆముక్క లన్నియు మరల మరల నదుకుకొనుచుండ, మరల మరల వారిని ముక్కలు చెక్కలుగా నాచక్రము నఱుకుచుండును. అప్రతిష్ఠనరకమునఁ బాపా త్ముని బెక్కువేలేండ్లు రక్తములు గ్రక్కుకన్నులతోఁ బ్రేవులు పిండి పిండియై రాల, మెడలు వ్రేలాడ రాట్నములపైఁ ద్రిప్పి యేడ్పిం

తురు. అసిపత్త్రవన మనునరకము సహస్రయోజనవిస్తరము. మహా జ్వలనమయము. దానిమధ్యమందు మిక్కిలిశీతలమును, మిక్కిలి పదునైనకత్తులవంటియాకులు పూవులు కాయలు గలది, బలవంత ములు భయంకరములు నగుపెద్దకుక్కల భయంకరధ్వనులతో నెట్టి వానిగుండెలైన బ్రద్దలుకొట్టుచుండఁగా నొప్పుచు నొకమహావన ముండును. పాపాత్ములను యమకింకరులు మొదటియగ్నికుండ మునఁ బడవైతురు. కుతకుత నుడికి యాబాధ పడలేక పాపులు పాటి పోయి యాయసిపత్త్రవనముఁ జొత్తురు. వారిపై గాలిసోకున నాయసిపత్త్రములు మిక్కిలి రాలిపడఁగా, వానిసోకున పాపులదేహ ములు పుక్కపుక్కలై క్రిందఁబడఁగా నాపుక్కలను గుక్కలు నోటఁ గఱచుకొని కాండవమాడుచుండును. తప్తకుంభనరకమున నితంత రము నగ్నిహోత్రము మండుచుండఁగా సలసలకాఁగునూనెలతో నిండినపెద్దకడవలలోఁ బాపులను యమభటులు తలక్రిందులుగాఁ బడ వైతురు. వారు "కుయ్యో! మొఱ్ఱో"యని గోలుగోలున నేడ్చు చుందురు. ఇందు :

> తలలును నెమ్ములుం బగుల దండడి శోణితమజ్జతోయముల్
> గలయఁగఁ జర్మమాంసములు గ్రక్కునముద్దలుగట్టఁ జేరి గ్ర
> ద్దలు వడిఁ బీఁకఁ గింకరులు దప్పులఁ ద్రిప్పఁగఁ బ్రాణవాయువుల్
> వెలువడకుండఁ బాపులను వేఁతురు దారుణతైలవహ్నులన్.
>
> (మార్కండేయపురాణము. అ.౭౧.)

అమితకర్దమనరకమునఁ బాపుల నినుపముక్కలు గలపడు లనేకము లనేకవిధములఁ జీల్చి చెండాడును. వారికి ఆఁకలిదప్పు లపరిమితములై నోర నెత్తురు గాఅ మహాబాధలు కలుగును. నీ కొకవిచిత్రవిషయముఁ జెప్పెద వినుము. నాయేడవజన్మమున నేను వైశ్యుఁడనై పుట్టి నీరు త్రాగ నేగుగోవుల నాపినపాపమునకై యీయమితకర్దమనరకమునఁ బడియుంటిని. నూటయేఁబది సంవత్స

రము లట్లుండఁగా నొక్కనాఁ డొక్కచల్లనిగాలి వీచి నారకుల మగుమాకు మహాసుఖము నొనగూర్చినది. ఇంతయానందమునకుఁ గారణ మే మని మే మాలోచించునంతలో నొకయమభటుఁడు విదేహరాజగు జనకచక్రవర్తిని దీసికొని యచటికి వచ్చెను. వా రిరువు రకు జరిగిన సంభాషణమును నేను వింటిని. నరుఁ డెట్టిపాపములు చేసి యానరకము లనుభవించునో చెప్పు మని జనకుఁడు దూతను గోరెను. ఆతఁ డతని కిట్లనెను. "అయ్యా! కర్మములు ప్రబలములు. మానవుఁడు చేసినపుణ్యపాపము లెప్పుడు ననుభవింపక తప్పదు.

ఉత్సవంబులమీఁదనె యుత్సవములు
పొందుచుండుదు రెప్పుడుఁ బుణ్యనరులు
పాపపరులకుఁ బైపయి నాపదలు మ
హాభయంబులు చావులు నడరుచుండు.
ఎంతెంత చేసెఁ బుణ్యం
బంతంతయె సుఖము నిచ్చు నది నరునకుఁ దా
నెంతెంత చేసెఁ బాపం
బంతంతయె దుఃఖ మిచ్చు నది తటీతోడన్.

(మార్కండేయపురాణము. అ. ౨౫ ; ౨౮.)

కావునఁ బుణ్యపాపోద్భవము లైనసుఖదుఃఖము లవశ్యభోక్తవ్యము లగుటి వి రందఱు నరకదుఃఖానుభవములఁ బాపములు పాపుకొని స్వర్గమునఁ బుణ్యములఫలము లనుభవింతురు." అని పలికి, ఆయానారకులు తొలిజన్మములఁ జేసిన యాయాపాపము లన్నియుఁ బూసగ్రుచ్చినట్లు జనకునికి వర్ణించి చెప్పి "నీవును గించిత్పాపకృత్య మున నీనారకులఁ గాంచుట కైన నరకముఁ జేరితి" వని పలికెను.

"అయ్యా! నరకబాధ లనుభవించినపిదప, నేయేపాపములు చేసినవా రేయేజన్మము లందుదురో, తెలుపు" మని జనకుఁ డడుగ యమదూత యిట్లు బదులు చెప్పెను. 'రాజా! బ్రాహ్మణుఁడు

నీచునికడ దానము పట్టినచో గాడిదయై పుట్టును; ఆతనికి యాజకత్వము చేసినవిప్రుఁడు క్రిమియై పుట్టును; గురువును మోసగించినవాఁడు కుక్క యగును; గురుభార్యం గూడినవాఁడు గాడిదయగు; తల్లిదండ్రులయాజ్ఞ మీఱినవాఁడు గోరువంకయై పుట్టును; వారికి మనోబాధ కలిగించువాఁడు తాఁబేలై పుట్టు; ఒకనియుప్పు దిని యాతనిశత్రువుఁ జేరినవాఁడు కోఁతియై పుట్టును; విశ్వాసహీనుఁడగు వాఁడు చేఁపయై పుట్టు; అసూయాగ్రస్తుఁడు డేగయై పుట్టును; ధాన్యాదులు తస్కరించినవాఁడు కొంగయై పుట్టును; మిత్రద్రోహియాచార్యభామను గూడినవాఁడు పందియై పుట్టును; యజ్ఞదాన వివాహములకు విఘ్నముకలిగించినవాఁడు, కన్య నొకని కిచ్చి తగవులాడి మరల నామె నింకొకని కిచ్చి పెండ్లిచేయువాఁడు క్రిములై పుట్టుదురు; దేవతలకుఁ బితరులకు నతిథులకు ముం దన్నము పెట్టక తానే తినువాఁడు కాకి యగును; శూద్రస్త్రీతోఁ బోవుబాహ్మణుఁడు కట్టెలోనిపురు గగును; కృతఘ్నుఁ డగువాఁడు క్రిమికీటకపతంగ వృశ్చికమత్స్యాదులలో నొకటియై పుట్టును; స్త్రీలను వృద్ధులను బాలురను జంపినవారు క్రిము లగుదురు; అన్నము దొంగిలించిన వాఁడు ఈఁగ యగు;" ఇట్లు పెక్కువిధములఁ జెప్పి దూత యిట్లనెను:

"పరుసనిపల్కులం బరులఁ బల్కుట మర్మము నాటనాడుటల్
నరుఁ ను నెగ్గుసేఁత కృపణత్వ మశౌచము దేవదూషణం
బొ బధనంబుఁ గొంట కృపనొందమి యల్క కృతఘ్నభావ మీ
నిరయముఁ బాసిపోయి ధరణిం బ్రభవించినవారిచిహ్నముల్.

గురుదేవర్షిపితృప్రపూజనము సద్గోష్ఠిప్రియత్వంబు సు
స్థిరసత్యోక్తి సమస్తభూతదయ మైత్రీసాధుసాంగత్యముల్
పరలోకాభ్యుదయక్రియారతి శ్రుతిప్రామాణ్యసందర్శనం
బరయన్ స్వర్గముఁ బాసి పుట్టినమనుష్యశ్రేణిసంజ్ఞల్ నృపా!"

(మార్కండేయపురాణము ౨. ౧౨౧. ౧౨౨.)

ఇట్లు చెప్పి యిఁక జాలు స్వర్గమునకుఁ బోవుదము రమ్మనఁగా నాతఁడు పోఁబోవ "ఓమహాత్మా! పోకు పోకుము. నీ విట నున్నంతసేపు మేము మాయాతన లన్నిటిని మఱచి పోయి పరమ సుఖముఁ గంటిమి. ఇంకం గొంతసేపు మాకు సుఖమును బ్రసాదింపు" మని నారకు లందఱు మొఱవెట్టఁ జొచ్చిరి. అంత, జనకుఁడు యమదూతను "నావలన నింత సుఖము వీరికిఁ గలుగుటకు హేతువే" మని యడిగెను. యమదూత "మహారాజా! నీవు చేయని పుణ్యము లేదు. పితృదేవాతిథిభుక్తశేషమునే భుజించువాఁడవు. అనేకక్రతువు లొనరించి దేవతలకుఁ దృప్తి గూర్చితివి. అట్టిపుణ్యాత్ముఁడ వగునీశరీరసుగంధమే నారకుల యాతనలను మటుమాయము చేయ సమర్థమైన" దని బదులుచెప్పెను.

"ఐన, నే నిటనే యుండి వీరి కానంద మిచ్చెదను. స్వర్గమునకు రా" నని పలుకుచుండఁగా యముఁడు, ఇంద్రుఁడు జనకమహారాజు నభినందించి స్వయముగాఁ దీసికొని పోవ విచ్చేసిరి. వారును గనకమయవిమానము నెక్కి స్వర్గమునకుఁ బోవుదము రమ్మనఁగా నారితోడను జనకుఁ డట్లే బదులుచెప్పెను. జనకుఁడు కోరినట్లు ఇంద్రయమములు నారకులను పుణ్యలోకములకుఁ బంపఁగా జనకుఁడు యమేంద్రులతో స్వర్గమునకుఁ బోయెను. నేను జనకునిధర్మమున నరకవిముక్తి నంది జన్మాంతరము నందితిని."

ఈవిషయము లెల్ల విన్న భార్గవుఁడు పుత్రుఁ డగుజడునితో నిట్లనెను. "వత్సా! నాకుఁ గర్తవ్యముపదేశించి తరించునుపాయముఁ జెప్పుము." జడుఁడు "నీవు సద్బ్రాహ్మణుఁడవు. నీవు గృహస్థధర్మము విడిచి వానప్రస్థధర్మము నడపి తపస్సిద్ధి పడసి పిదప నేకాంతప్రదేశమున కేఁగి సంగములు పాసి యాత్మ నాత్మయందునిచి ద్వంద్వాతీతుఁడవై నిర్జితేంద్రియుఁడవై భిక్షాశివై అఖరైక

హేతువు, దుఃఖాపహము, అధికసుఖదము నగుయోగ మభ్యసింపుము. అని బోధించెను. తండ్రి చేతులు జోడించి "యోగీంద్రా ! నాయందు దయయుంచి నీవే ఆయోగమును నాకుఁ దెలిపి రక్షింపు"మనికోరెను.

అపుడు జడుఁడు తండ్రికి దత్తాత్రేయజన్మప్రకారము, అతని మహత్త్వము, అలర్కుఁడు పుట్టి రాజర్షి యైనవిధము, మదాలసా కువలయాశ్వులవివాహవృత్తాంతము; మదాలస పుత్త్రునిం గాంచి ''నీవు నిర్మలుఁడవు. నీకుఁ బేరు లేదు. ఉన్న పేరు కల్పనావికారము. దేహము నీది కాదు. నీవు దేహమవు కావు. ఏడ్వకుము. నీయేడుపు ధ్వని భూపృ్యాదులం బొందివిశ్వజ మైనశబ్దము కాని నీస్వనము కాదు. నీవు హానివృద్ధులం బొందవు. భోజ్యాన్నపానభోక్తవు నీవు కావు. ఇతఁడు తండ్రి ఇది తల్లి నేను కొడుకును మున్నగుమాటలు విడిచి మమత్వ ముడిగి యాత్మజ్ఞాని వగుము." అని బహుప్రకారముల దేహ జీవాత్మతత్త్వరూపము లాలాపవిధమున నుపదేశించి పరమయోగిం జేసి పంపివై చుటయుఁ దెలిపెను. పిమ్మట మదాలస అలర్కుఁడను పుత్త్రునిం గనిభర్తకోరిక ననుసరించి యాతనికిఁ గర్మమార్గముపదేశించి యతఁడు పెరిగి పెద్దవాఁడై యైహికాముష్మికసుఖప్రద మగుకర్తవ్య మెఱింగింపు మని తల్లిని గోరుటయు నామె ''వత్సా! రాజునకుఁ గర్తవ్యము ప్రజారంజనము. సప్తవ్యసనములఁ దగులక తన్నుఁ దా నేమఱక, హితాహితుల నెఱిఁగి సంచరించుట, నెమ్మనమున నెఱిఁగి నమ్మకునికి, శత్రు నై న నమ్మినట్ల యుండుట నయవిధము. రాజు స్థానవృద్ధి త్రయజ్ఞానసంపన్నుఁడు, దానషాడ్గుణ్యమంత్రప్రవీణుఁడు, కామ్యవర్జితుఁడై వర్ధిల్లును. కామమునఁ బాండుఁడు, క్రోధమున ప్రహ్లాదునికొడుకులు, లోభమున నైలుఁడు, మదమున వేనుఁడు, మానమున నహుషుఁడు, హర్షమునఁ బురంజయుఁడు, హతు లైరి. కామాదినిర్జితుఁడు కాక మరుత్తుఁడు లోకోత్తరుఁడయ్యెను. కావున, కామాదిషడ్దోషములఁ బరిహరింపుము. మధుకర పరభృత కలహంస బర్హి పన్నగ బక సూకర చరణాయుధ బాలుర చరితమ్ములు రా జలవఱచుకొనవలయు." ననియు మఱియు నెన్నో రాజధర్మము లామె యెఱింగించి వర్ణాశ్రమ ధర్మనిరూపణము చేసి, అతిథిపూజావిధానాదు లెఱింగించి, సదాచార

ప్రకారము నుడివి, హిత ముపదేశించుటయుఁ దెలిపెను. పిదప, అల ర్కుఁడు చక్కగ రాజ్యము చేసి దత్తాత్రేయమహర్షి వలన నాత్మ నాత్మవివేక మెటీఁగి యోగమార్గముఁ దెలిసి ప్రాణాయామాదిలక్ష ణము లరసి యోగీంద్రుఁ డగుటయుఁ దెలిపెను. 'యోగి కవమాన మమృతము. గౌరవము విషము. ప్రాపునుదకము వస్త్రపూతము, అడుగుపెట్టుచోటు దృష్టిపూతము, పలుకు సత్యపూతము, తలఁపు బుద్ధిపూతము యతికిఁ గావలయు. జనులు తన్నుఁ జూచి యవమాన పరాభవములు చేయువర్తనము వేషము యతి ధరింపవలయును. అహింసాస్తేయబ్రహ్మచర్యాలోభత్యాగములు యతి గ్రహించి మనో దండవాగ్దండకర్మదండములు ధరించి నిర్మలజ్ఞాని, సమలోష్టాశ్మకాంచ నుఁడు, సమస్తభూతదయాళుఁడు, సంతతధ్యానపరాయణుఁడు నైన యోగి పరబ్రహ్మానందభరితుఁ డగును. యోగీశ్వరుఁ డెప్పుడును బ్రణ వము జపింపవలయును. కలలోను బ్రత్యక్షమునఁ గలుగు నరిష్టముల వలన యోగి మరణకాల మెటీఁగి యోగస్మరణపరుఁ డైన నపుడు సిద్ధిం పకున్న నాయోగము మఱుచటిజన్మమున సిద్ధించు" నని దత్తాత్రేయుఁ డలర్కున కెటింగించినవిధము, అలర్కుఁడు యోగాతిశయము, వై రా గ్యముఁగాంచి 'యోగసుఖముకంటె నొండుసుఖము లే' దని గ్రహించి ప్రమోదభరితుఁ డయ్యె ననియు జడుఁడు తండ్రికి బోధించి "నీవును అలర్కునివలె నిర్మలినాత్మయోగమంది ముక్తిసౌఖ్య మనుభవింపుము. నేనును నింకఁ గర్మములబ్రికిక్కునఁ జిక్కను. మోక్షలక్ష్మిం గూడి సుఖించుటకై యడవి కేఁగి యత్న మొనరింతు" నని జనకుననుమతిఁ గాంచి జడుఁ డేఁగి యనుపమవై రాగ్యసంపదమలాత్మకుఁడై మోక్షముఁ జూఱగొనెను. ఆతనితండ్రి యగు భార్గవుఁడును గృహస్థత విడిచి వానప్రస్థతఁ బూని యింద్రియముల గెలిచి మనోజయము నంది పరమ సిద్ధిం బొందెను.

ఇట్లు జడమహర్షి యాజన్మజ్ఞానియై తాను దరించి తండ్రిని ధరింపఁ జేసినపుణ్యపురుషుఁ డయ్యెను. (మార్కండేయపురాణము)

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

జాబాలి మహర్షి

—※—

స్తుతి

శ్రీదము లైనవిష్ణుపద సేవనముల్ నెఱనమ్మి నాస్తికా
పాదక వాక్యముల్ పలికి పావనరామరుషాప్రసంగసం
వాదము లాచరించియును భవ్యచరిత్రుఁడు సత్తపస్వియై
వాదము ఖేదమున్ గననివానినిగొల్తు జబాలపుత్త్రునిన్.

సామవేదోపనిషత్తులలో జాబాల మనునొకయుపనిషత్తు కలదు. ఈ యుపనిషత్తును బ్రతిపాదించిన మహానుభావుఁడే జాబాలి. జాబాలిని బట్టి దీనికి జాబాల్యుపనిష త్తనియుఁ బేరు. మఱియు నీతఁ డుపస్మృతి కర్తలలో నొకఁడు. దశరథునిఁ జేమముఁ గోరిన యాతనిగురువులలో నీతఁ డొకఁడు.

జననము

మహానదులయు, మహాపురుషులయు జన్మవృత్తాంతములు చిత్రములుగా నుండును. జబాల యనువిప్రస్త్రీకి దేవతావరప్రసాద మునఁ గన్యాత్వదశయందే యీతఁడు జన్మించెను. తల్లిపేరునుబట్టి యీతనికి జాబాలి యనునామకరణ మయ్యెను.

జబాల తనకుమారుని యుక్తవయసు రాఁగానే హారిద్రుమతుఁ డనుగురువున కొప్పగించెను. ఆగురువును గొంతకాల మాతనిఁ దన శుశ్రూషలో నుంచుకొని పిదప నాతనికి బ్రహ్మవిద్యాబోధ కర్హునిఁ

జేయ నుపనయనము నొనరింపఁ దలఁచి యాతని కులగోత్రనామము లడిగెను. ఆతఁడు తనకుఁ దెలియ వని చెప్పెను. పోయి మీయమ్మ నడిగి తెలిసికొని రమ్మని గురువు పంపెను. జాబాలి తల్లి నడుగ వామె తనకుఁ బతియే లేనిసంగతిఁ దెలిపి తనపేరు సత్యకామఁ డనుజాబాలి యని చెప్పు మనెను. జాబాలి గురువుకడ కేఁగి తల్లి చెప్పినరీతినే చెప్పెను. గురువు దివ్యదృష్టి నాతని జననకథఁ దెలిసికొని యాతని కుపనయన మొనరించి గాయత్రీమంత్రోపదేశముఁ జేసెను. బ్రహ్మ విద్యాబోధ కర్హత గడించువఱకుఁ దన గోవులను మేఁపుచుండు మని గురువు జాబాలి కాదేశించెను.

జాబాలి దేవతలవలన బ్రహ్మజ్ఞాన మందుట

జాబాలి గురుధేనువులఁ దోలుకొని వనమున కేఁగి యట సత్య సంధుఁడై గోసేవఁ జేయుచు గురుభక్తితత్పరుఁడై యుండెను. కొంత కాలమున కాగోవులు సహస్రసంఖ్యాకములై జాబాలిరక్షణమునఁ బుష్టియుఁ దుష్టియు నందెను. ఈతని సత్యనిష్ఠకును, గురుభక్తికిని, గోపూజాపరతకు దేవత లీతనిని మెచ్చుకొని యీతనికి మహోపకృతిఁ జేయఁ దలఁచిరి.

ఒకనాఁడు వాయుదేవుఁ డొకవృషభమున నావేశించి జాబాలితో నిట్లనెను. : "ఆర్యా! నీవు మన్మమితదయతోఁ గాపాడుటవలన మేము సహస్రసంఖ్యాకుల మైతిమి. మమ్మిపాటి గురు గృహమునకుఁ దోలుకొని వెళ్లుము. మేము నీకుఁ జేనైన యుపకృతి నొనరింతుము. మీగురువు నిన్నుఁ గని సంతోషించు" నని చెప్పెను. జాబాలి యట్లే యని గోవులను మరలించుకొని గురుగృహమున కేఁగుచుండెను.

దారిలో వాయుదేవుఁ డావేశించినవృషభ రూపుతనికి బ్రహ్మ జ్ఞానప్రబోధక మగునొకదివ్యమంత్రపాదమును దెలిపెను. మఱియొక

వృషభము నావేశించి యగ్నియు, నింకొకవృషభము నావేశించి సూర్యుఁడు, మధ్యీయ మనుపక్షియు నాతనికి మిగిలిన మంత్రపాద ములు బోధింపఁగా నాతఁడు బ్రహ్మజ్ఞానసంపన్నుఁడై దివ్యతేజస్వి యయ్యెను.

గురూపదేశము

జాబాలి యింటికి వచ్చుసరికి హారిద్రుమతుఁ డానందించి గోవు లను స్వీకరించి "వత్సా ! నీవు దివ్యతేజస్వివైతివి. నీ ముఖము వలననే నీవు బ్రహ్మజ్ఞానివైతి వని స్పష్టమైనది. కావున, నీకు బోధింపఁగల దేమియు లేదు. నీవు యథేచ్ఛ మేఁగి యాశ్రమమును నిర్మించుకొని దివ్యజీవితమును గడపు" మని పలికెను. అందులకు జాబాలి యిట్లనెను : "గురుదేవా ! నీకటాక్షమున దేవతలు ప్రత్య క్షమై నాకు బ్రహ్మజ్ఞాన ముపదేశించిరి. కాని, గురుముఖమున నేర్వని బ్రహ్మజ్ఞానము శాశ్వతముగ నిలఁబడదు. కావున, నీముఖ మున నేను బ్రహ్మజ్ఞానముఁ బడసిననే యది నిశ్చలము, శాశ్వతము నగును. కావున నన్ననుగ్రహించి యుద్బోధింపు" మని కోరెను. గురు వాతని నిగర్వితకును, గురుభక్తికిని సంతోషించి యుక్తకాల మున నాతనికి బ్రహ్మజ్ఞానము నుపదేశించి పంపివేసెను.

జాబాల్యుపనిషత్తు

తరువాత జాబాలి చిత్రకూటపర్వతప్రాంతమున నొకయాశ్ర మమును నిర్మించుకొని యందు జపతపస్స్వాధ్యాయప్రవచన పరుఁడై యుండి కాలక్రమమున సుబ్రహ్మణ్యస్వామి నారాధించి పరతత్త్వ రహస్యముల నెన్నిటినో గ్రహించి యాతనిదయకుఁ బాత్రుఁడయ్యెను. పిదప నొకనాఁడు పిప్పలాదమహర్షికుమారుఁడగు నొక మహర్షి విచ్చేసి జాబాలి నాశ్రయించి బ్రహ్మజ్ఞాన సంశయములఁ

దీర్పు మని కోరెను. పరమజ్ఞానార్థం డగుపైప్పలాదికి జాబాలి మహర్షి సర్వమును బోధించెను. ఈబ్రహ్మజ్ఞానబోధనమే జాబాల్యోపనిషత్తు.

[1]పైప్పలాది యనుమహర్షి భగవత్స్వరూపి యగుజాబాలి మహర్షిం జూచి యిట్లు పలికెను. "భగవానుండా! పరమతత్త్వరహస్యమును నాకుం జెప్ప వేండెదను. తత్త్వ మేది? జీవుం డెవండు? పశు వేది? ఈశానుం డెవ్వండు? మోక్షోపాయ మేది?"

జాబాలి:—[2]మంచిప్రశ్న మడిగితివి. నేను దెలిసికొన్న రీతినే నీకుం జెప్పెదను.

పైప్పలాది:—[3]నీ వెవరివలనం దెలిసికొంటివి? అని మరల నడిగెను.

జాబాలి:—[4]నేను సుబ్రహ్మణ్యస్వామివలనం దెలిసికొంటి నని మరలం జెప్పెను.

పైప్పలాది:—[5]సుబ్రహ్మణ్యస్వామి యెవరివలనం దెలిసికొనెను.

జాబాలి:—[6]ఆతం డీశానునివలనం దెలిసికొనెను.

---

1 మూలము: "ఓమ్. అథ హైనం భగవంతం జాబాలిం పైప్పలాదిఃపప్రచ్ఛ. భగవన్మే బ్రూహి పరమతత్త్వరహస్యం. కిం తత్త్వం? కో జీవః? కఃపశుః? క ఈశానః? కో మోక్షోపాయ? ఇతి సతం హో వాచ."

2 మూలము: "సాధుపృష్టం. సర్వం నివేదయామి యథాజ్ఞాత మితి."

3 "పున స్సతమువాచ. కుతస్త్వయాజ్ఞాత మితి."

4 "పున స్స త మువాచ. షడాననా దితి."

5 "పున స్స త మువాచ. తే నాథ కుతో జ్ఞాత మితి."

6 "పున స్స త మువాచ. తే నేశానా దితి."

పైప్పలాది:—[7]ఈశానునివలన నెట్లు తెలిసికొనెను?

జాబాలి:—[8]ఈశానోపాసనమున.

పైప్పలాది:—[9]భగవంతుఁడా? నాకు దయతో నది యెల్లఁ దెలుపుము.

జాబాలి:—[10]అట్లే. నీ వడిగిన సకల తత్త్వములను నివేదింతును. పశుపతి యగు నీశ్వరుఁ డహంకారముచే వ్యాపింపఁబడియున్నపుడు సంసారియై జీవుఁ డగుచున్నాఁడు. ఆతఁడే పశువు. సర్వజ్ఞుఁడు, సృష్టిస్థితిలయతిరోభావానుగ్రహము లనుపంచకృత్యములు గలవాఁడు సర్వేశ్వరుఁడు నగు నీశ్వరుఁడే పశుపతి. జీవులు పశువులు, జీవులకుఁ బతియగుటఁబట్టి పశుపతి యగుచున్నాఁడు."

పైప్పలాది:—[11]జీవులు పశువు లెట్లగును? వాని కీశ్వరుఁ డెట్లు పతి యగును ?

జాబాలి:— [12]గడ్డితినుచు వివేకములేక పరులచేఁ గృషి మున్నగు కర్మములందుఁ బేరేపింపఁబడి సర్వకష్టములు సహించు తనయజమానిచేఁ బశువులెట్లు కట్టఁబడునో యట్లే జీవులు సర్వేశ్వరునిచేఁ గట్టువడుటచేఁ బశువులనఁ బడును. వాని యజమానివలె సర్వజ్ఞుఁడైనయీశ్వరుఁడు జీవులకుఁ బతి. కానఁ బశుపతి.

---

7 "పున స్స త మువాచ. అథ కస్మా త్తేన జ్ఞాత మితి."

8 "పున స్స త మువాచ. శదుపాసనాదితి."

9 "పున స్స త మువాచ. భగవన్ కృపయామే శహస్యం సర్వం నివేద యేతి."

10 "స తేన పృష్ట స్సర్వం నివేదయామాస త త్త్వం.
పశుపతి రహంకారా విష్ట స్సంసారిజీవ స్స ఏవ పశుః. సర్వజ్ఞ పంచకృత్య సంపన్న స్సర్వేశ్వర ఈశః పశుపతిః. కే పశవ ఇతి పునస్స త మువాచ. జీవాః పశవ ఉక్తాః. తత్పతి ర్యా త్పశుపతి స్స పున స్తం హోవాచ."

11 "కథం జీవాః పశవ ఇతి కథం తత్పతిరితి సతమువాచ."

12 "యథా తృణాశినో వివేకహీనాః పరప్రేష్యాః
కృష్యాది కర్మసు నియుక్తా స్సకల దుఃఖసహా స్స్వస్వామి బద్ధ్యమానా గవాదయః పశవః యథా తత్స్వామిన ఇవ సర్వజ్ఞ ఈశః పశుపతిః."

పైప్పలాది:— [13]ఇట్టి జ్ఞాన మెట్లు కలుగు నని మరల నడిగెను.

జాబాలి:— [14]విభూతిధారణమువలననే.

పైప్పలాది:— [15]విభూతి యె ట్లేయేతావుల ధరింప వలయును?

జాబాలి— [16]సద్యోతాదితి పంచబ్రహ్మమంత్రముల చేత భస్మమును గ్రహించి 'అగ్నిరతి భస్మ' అనుమంత్రముచే నాభస్మము నభిమంత్రించి 'మానస్తోకేతనయే' అనుమంత్రమున జలమునఁ గలిపి, శిరస్సు, లలాటము, వక్షము, భుజములు వీనియందు 'త్ర్యాయుషం జమదగ్నేః, త్ర్యంబకం యజామహే' అను మంత్రముల చేత అడ్డముగా మూఁడు రేఖ లేర్పడునట్లు ధరింప వలయును. ఇది శాంభవవ్రతము. వేదవాదులందఱు నిట్లు వేదములలోఁ జెప్పియున్నారు. దీనిని జక్కఁగా ననుష్ఠించినవాఁడు పునర్జన్మము నందఁడు. [17] ఈభస్మధారణమునకుఁ బ్రమాణము సనత్కుమారులు చెప్పిరి.

[18] త్రిపుండ్రధారణము యొక్క మూఁడురేఖలు లలాటము మొదలు కనుబొమల మధ్యవఱకు నుండవలయును.

---

13 "తద్ జ్ఞానం కేనోపాయేన జాయతే పున స్స త మువాచ."

14 "విభూతి ధారణాదేవ."

15 "తత్ప్రకారం. కథమితి తత్ర తత్ర ధార్యమ్."

16 "సద్యో జాతాది పంచబ్రహ్మ మంత్రైః భస్మసంగృహ్య 'అగ్నిరితి భస్మ' ఇత్యనే నాభి మంత్ర్య 'మానస్తోక' ఇతి సముద్ధృత్య జలేన సంస్పృజ్య శిరోలలాటవక్షస్కందేష్వితి తిసృభిస్త్ర్యాయుషేణ త్ర్యంబకేణ త్రిర్యథాక్రమం త్రిరేఖాః ప్రకుర్వీతవ్రత మేత చ్ఛాంభవం సర్వేషు వేదేషు వేదవేదాభిరుక్తం భవతి. తత్సమాచరే న్ముముక్షు ర్న పున ర్భవాయ!

17 "అథ సనత్కుమారం ప్రమాణం నదతి."

18 "త్రిపుండ్ర ధారణస్య త్రిధా రేఖా ఆలలాటా దాచక్షుషో భ్రువో ర్మధ్యతశ్చ."

[19] వీనిలో మొదటిరేఖ గార్హపత్యాగ్ని అకారము. రజో గుణము, భూలోకము, స్వాత్మ, క్రియాశక్తి, ఋగ్వేదము, ప్రాతస్సవనము, బ్రహ్మ అధిదేవత.

[20] రెండవరేఖ దక్షిణాగ్ని, ఉకారము, సత్త్వగుణము, ఆకాశము, భువర్లోకము, అంతరాత్మ, ఇచ్ఛాశక్తి, యజుర్వేదము, మధ్యాహ్నసవనము, విష్ణువు అధిదేవత.

[21] మూడవరేఖ ఆహవనీయాగ్ని, మకారము, తమోగుణము, స్వర్గలోకము, పరమాత్మ, జ్ఞానశక్తి, సామవేదము; సాయంసవనము, మహాదేవుడు అధిదేవత.

[22] ఇట్లు త్రిపుండ్రమును దెలిసికొన్న విద్వాంసుడు, బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్న్యాసి - వీరిలో నెవరైనను, విభూతి ధారణము చేసినయెడల మహాపాతకములనుండియు, ఉపపాతకముల నుండియు విముక్తి నందుదురు. త్రిపుండ్రధారణము చేయువాడు సకలవేదాధ్యయనము చేసినవాడగుచున్నాడు; సకలదేవతలను

---

19. "యాఽస్య ప్రథమరేఖా సా గార్హపత్యశ్చాకారో రజో భూర్లోకస్స్వాత్మా క్రియాశక్తి ఋగ్వేదః ప్రాతస్సవనం ప్రజాపతిర్దేవో దేవతేతి."

20. "యాఽస్య ద్వితీయారేఖా సా దక్షిణాగ్ని రుకారస్సత్త్వమంతరిక్షమంతరాత్మా చేచ్ఛాశక్తి ర్యజుర్వేదో మాధ్యందినం సవనం విష్ణుర్దేవో దేవతేతి."

21. "యాఽస్య తృతీయరేఖా సా ఆహవనీయో మకార స్తమోగుణో ర్లోకః పరమాత్మా జ్ఞానశక్తి స్సామవేద స్తృతీయసవనం మహాదేవో దేవతేతి."

22. "త్రిపుండ్రం భస్మనా కరోతి యోవిద్వాన్ బ్రహ్మచారీ గృహీ వానప్రస్థో యదిర్వా స మహాపాతకోపపాతకేభ్యో ముక్తో భవతి. స సర్వాన్వేదా నధీతో భవతి. స సర్వాన్ దేవాన్ ధ్యాతో భవతి. సర్వేషు తీర్థేషు స్నాతోభవతి. సకలరుద్రమంత్రజాపీ భవతి. స పునరావర్తతే, నస్స పునరావర్తత ఇతి. ఓం సత్య మిత్యుపనిషత్."

V.R. NARAYANA MEMORIAL LIBRARY V.R. NARAYANA D.P.R.I. Acc. No.

ధ్యానించినవాఁ డగుచున్నాఁడు; సమస్తతీర్థములయందు స్నానము చేసినవాఁ డగుచున్నాఁడు; సకలరుద్రమంత్రములను జపించినవాఁ డగుచున్నాఁడు. వాఁడు మరల జన్మించుట కాని, జన్మదుఃఖము ననుభవించుట కాని యుండవు."

జాబాలి శ్రీరాముని రాజ్యముచేయు మనుట

తొల్లి సీతారామలక్ష్మణులు చిత్రకూటాద్రిఁ జేరినతరువాత భరత శత్రుఘ్నులు వసిష్ఠాదులతో నచటికి విచ్చేసిరి. భరతుఁడు రాముని పాదములపైఁ బడి తిరిగి యయోధ్యకు వచ్చి రాజ్యము స్వీకరించి తన్ను బ్రజలను రక్షింపు మని కోరెను. అపుడు రాముఁ డాతని నోదార్చి యింటి కేఁగి రాజ్యము చేయుచుండు మనియుఁ బదు నాలుగేం డ్లయినపిదప వచ్చెద ననియుఁ జెప్పెను.

ఆసమయమున నట నున్న జాబాలిమహర్షి శ్రీరాముని చిత్తశుద్ధి పరీక్ష చేయుటకును, ఏమాత్రము వీలైనను రాముఁ డయోధ్య కేఁగి రాజ్యము స్వీకరించుటచే లోకశ్రేయ మగు నని చెప్పి చూచుటకును శ్రీరామునితో నిట్లనెను: "రామా! బుద్ధిమంతుఁడవు, ధైర్యశాలివి, నీవే యిట్లు సామాన్యునివలె మాటాడుదువేల? ఈ జగమున నెవని కెవరు? తలిదండ్రు లన నెవరు? వారియాజ్ఞ పాలించుట యెట్టిది? ఒకనరుఁ డొక గ్రామమునుండి మఱియొక గ్రామమున కేఁగుచు దారిలో నొక చెట్టు నీడను క్షణము నిలిచి మరలఁ బయనమై పోవునటు భూమిపై జీవులు సంసారయాత్ర సాగించెదరు. చెట్టునీడలవలె నాశ్రయమొసంగిన జననీ జనకులఁ గూర్చి ప్రీతి చూపుట సజ్జనలక్షణము కాదు. చక్కఁగా రాజ్యము చేసి ప్రజాసుఖముఁ గూర్చుటకు బదులు నీవు దుర్మార్గ మును బటినావు. వెఱ్ఱివై చెడిపోక అయోధ్య కేఁగి హాయిగా రాజ్య సుఖము లనుభవింపుము. నీతండ్రి నీకు బీజమాత్ర సంబంధియే

అంతకు మించి నీకు నాతనికి సంబంధము లేదు. ఆతనిగతి యతనిది. నీగతి నీది. ప్రత్యక్షసుఖముల ననుభవింపక చచ్చినవానిఁ గూర్చి చింతిల్లుచు ననేక కష్టములకుఁ బాల్పడుచున్నావు. శ్రాద్ధాదులందుఁ జని పోయినవారి నుద్దేశించి యింకొకరి కన్నము పెట్టుదురు. ఇది యెంత తెలివితక్కువ పని ?

కాన, నీవు పరోక్షసుఖ మనుకొను పిత్రపాలన మను చేతకాని మాట మాని ప్రత్యక్షసుఖకర మగు రాజ్యమును స్వీకరింపుము."

రాముఁ డందుపై జాబాలితో నిట్లనెను : "అయ్యా! నీవు చెప్పినది హితమువలెఁ దోఁచునే కాని యది హితము కాదు. అపూర్గము దుఃఖప్రదము. సత్పురుషు లెన్నఁడు గౌరవములను, రాజ్యములను స్వీకరింపరు. ఎవఁ డెంత యోగ్యుఁడో వానియాచారమును బట్టియే తెలియును. వైదికక్రియలు మాని విశ్వసంకరకర మైన నీ చార్వాక మతము నే నంగీకరింపఁజాలను. వనవాస నియమ ప్రతిజ్ఞను మాని జ్ఞను నీవు చెప్పినట్లు వర్తింతునేని నే నొరులకు ధర్మము బోధించు హక్కుఁ గోల్పోవుదును. ధర్మరీతి నేను విడిచి యొరులను ధర్మముగా నడువుఁ డని నేను బోధించిన నామాట వినువా రెవరు? 'యథారాజా తథాప్రజా' కదా !

సత్యమే పరమధర్మము. సత్యమే స్వర్గహేతువు. సత్యమునే లక్ష్మి యాశ్రయించును. సత్యవంతున కైహికాముష్మిక సుఖములు సమకూరు. నేను సత్యవాక్పాలనమే పిత్రాజ్ఞాపాలనమే నియమముగాఁ గలవాఁడను.

కర్తవ్య మేదియో అకర్తవ్య మేదియో నే నెఱుఁగుదును. నాకుఁ గృత్రిమబుద్ధి లేదు. కావున, శ్రద్ధాయుక్తుఁడనై శుద్ధచిత్తుఁడనై వనవాస మొనరించుచు, పితరులకు దేవతలకుఁ దృప్తిగూర్చుచు జనకుని

వాక్యము గావించి జీవయాత్ర గడపెదను. నీకంటె శ్రేష్ఠులైన ఋషులు చెప్పినవైదిక మార్గమునే నే ననుసరించెదను. నీవు చెప్పిన యవైదిక మార్గము దుష్టము. దానిని నే నిరసించెదను."

ఆమాటలు విని జాబాలి రామునికి నమస్కరించి "రామా! నేను నాస్తికుఁడను గాను. ఆస్తికుఁడనై నాస్తిక మతముల ఖండించు చుందును. కాని, ఈతరుణమునఁ గార్యసిద్ధికై నాస్తిక్యబుద్ధి గలట్లు నటించి నీ హృదయ మెఱుఁగఁగంటిని. నీవు నగరమున కేఁగి రాజ్యము స్వీకరించిన నెల్లరు సంతసింతు రని యిట్లంటిని" అని పలికెను.

అపుడు రాముఁ డింకను బ్రసన్నుఁడు కాకుండుటఁ గని వసిష్ఠ మహర్షి యాతనితో నిట్లనెను: "రామా! జాబాలిమహర్షి యిహ పరములు కల వని వైదికమార్గమును నమ్మినవాఁడే. ఆతనివంటి యాస్తికుఁడు లేఁడు. నాయూహ యెటేఁగి తన ధర్మమును దాను నిర్వర్తించుట కే యట్లు నీతోఁ బలికినాఁ"డని చెప్పఁగా రాముఁడు జాబాలికి నమస్కరించి యాతనియెడఁ బ్రసన్నుఁడయ్యెను. జాబాలియు రాముని బూజించి వీడ్కొనియెను. (రామాయణము.)

జాబాలిబుతంభరసంవాదము

పూర్వము యతిమఠములు, దేవాలయములు, విప్రమంది రాగ్నిహోత్రధూమములు, గంగావిమలసలిలప్రవాహములు మున్నగు వానిచే విస్మయావహ మైనతేజఃపుర్ణమును బుతంభరుఁ డనురాజు పరిపాలించుచుండెను. అతఁడు సర్వలోకసౌందర్యనిధు లగుకన్యలను బెక్కండ్రను బెండ్లాడెను. కాని, వారెవ్వరివలనను సంతానము మాత్రము కాంచఁజాలఁడయ్యెను. సర్వైశ్వర్యసంపన్నుఁ డయ్యు నారాజు సంతానము లేక పోయినదిగదా యని మిక్కిలి చింతాపరుఁడై యుండఁగా నాతనియింటి కొకసారి జాబాలిమహర్షి విచ్చేసెను.

ఋతంభరుఁ డాతని నర్ఘ్యపాద్యాదుల గౌరవించి సాష్టాంగనమస్కార ము లొనరించి యిట్లనెను. "మహానుభావా ! నాకుఁ బుత్త్రులు లే రన్నవంత హృదయమును దహించివేయుచున్నది. నీవు దయఁదలచి నావంత తొలఁగించునుపాయము చెప్పి నావంశాభివృద్ధిగాఁ గటా క్షింపు" మని కోరెను.

అందులకు జాబాలి యిట్లనెను. "రాజా ! మూఁడుమార్గముల వలన సత్సంతానము కలుగును. వాసుదేవార్చనము, వామదేవార్చ నము, గోసేవ యీ మూఁడింటివలన నెంతటిపాపికైనను సత్సంతా నము కలిగితీరును. నీ విందు గోసేవ చేసి నీయభీష్టసిద్ధిఁ గనుము. ధేనువు దేహమున దేవత లుందురు. కావున, ప్రతిదినము గోవున కెవఁడు గ్రాసాదులచేఁ దృప్తి కలిగించునో వానికి దేవతలు, పితృ దేవతలు శుభము లొనగూర్తురు. రాజా ! ఋతుమతి యైనకన్య, ఆఁకలితో నున్నయావు, నిర్మాల్యముతోఁ గూడినదేవత యేయింట నుందురో యాయింటియజమానిపుణ్య మంతయు నశించును. ఆవును గొట్టినపాపాత్మునికరము ఖండితమై యాతఁడు నరకము ననుభ వించును. గడ్డి తినుగోవు నడ్డగించువాఁడు పితృదేవతల నేడ్పించిన వాఁడు పోవునరకమునకుఁ బోవును. ఆవును గాలితోఁ దన్నువాఁడు నఱుకబడిన కాళ్లుగలవాఁడై యమునింటఁ బడియుండును. గోపూజా ఫలమును దెలుపునితిహాస మొక్కటి చెప్పెద నాలింపుము. జనక చక్రవర్తి యోగబలముచే మేను విడిచి దివ్యవిమానమున యమపుర మార్గమునుండి పోవుచుండఁగా నాతనిదేహవాయువు తగిలి సౌఖ్యము కలుగఁగా నరకవాసు లానందముతో "మహాత్మా ! నీదేహవాయువు వలన మానరకసంతాపము తీఱె. నీవు దయదలఁచి నీ విటనే కొంతసే పుండు" మని ప్రార్థించిరి. ధర్మశీలుఁ డగుజనకుఁ డట్లే యని వారి ప్రార్థనము మన్నించి నిలిచెను. వెంటనే యముఁ డటకు విచ్చేసి

''మహాత్మా! పరాపవాదపరాయణులు, పరద్రవ్యాపహారకులు, పరద్రోహకరులు, మిత్రవంచకులు, మున్నగుపాతకులు నాశాసనమున నరకబాధ లనుభవించుచోటికి నీవు రాఁదగదు. కావున, నీవు స్వర్గమున కేగి సుఖము లందుము. పొ'' మ్మని పలుకఁగా జనకుఁ డాతనితో నిట్లనెను." కృతాంతా! నాశరీరవాయువు సోకుటచే నీనారకులు సుఖ మనుభవించుచున్నారు. పరహితకాములకుఁ బరుల సౌఖ్యముకంటెఁ బరమహితము లేదు. కావున, నే నిటనుండి పోవలయు నని నీకుఁ గలదేని యీనారకులను విడిచిపుచ్చుము. నే నేఁగెదను.'' యముఁ డాయీనారకులను వేఱువేఱ చూపి వా రెట్టిట్టి ఘోరపాపము లొనరించిరో విదితముచేసి ''రాజర్షి! నీవు వీరివిడుదలఁ గోరితివేని నీ వొక్కనాఁడు ప్రాతఃకాలమున లేచి పరిశుద్ధభావముతోఁ గావించినరామస్మరణవలనిపుణ్యము ధారపోయుము. వీరు నిరయనిర్ముక్తు లగుదు"రని పలికెను. జనకరాజర్షి సంతోషముతోఁ దనపుణ్యమును ధారపోయఁగనే వా రందఱు దివ్యదేహములు ధరించి దివి కేఁగిరి. అపుడు జనకుఁడు యముని ''అయ్యా! పాపాత్ములే కాని పుణ్యపురుషులు నీనిలయమునకు రా రంటివి. నే నేపాపమున నిచటికి వచ్చితి" నని యడిగెను. "రాజర్షి! నీచేసినంతపుణ్య మెవరును జేసియుండ లేదు. నీనామస్మరణ మెట్టివారినైనఁ బావనులను జేయును. కాని, నీ వొకనాఁడు మేయుచున్నగోవును ద్రోలితివి. దాన నీ వెటకు వచ్చితివి. ఆపాపము పోయినది. ఇఁక, నీవు దివి కరుగు" మని యముఁడు చెప్పెను. జనకుఁడు యమధర్మరాజునకు మ్రొక్కి దివ్యవిమాన మెక్కి పైలోకములకుఁ బోయెను. అందుచే నీవు తప్పక గోవులను సేవించినచో నీకోరిక తీరు" నని జాబాలి బుతంభరునితోఁ జెప్పెను.

అపుడు బుతంభరుఁడు గోసేవావిధానముఁ దెలుపు మని జాబాలిని ప్రార్థించెను. జాబాలి గోసేవావిధమును దెలియఁజెప్పఁగా

ఋతంభరుఁ డాతఁడు చెప్పినట్లే నడచుకొనెను. కాని, యొకనాఁ డాతఁడు గోవువెంట నరుగుచుండఁగా నొకసింహము వచ్చి గోవుపైఁ బడి దానిని జంపివేసెను. అది చూచి రాజు మిక్కిలి వంతఁ జెంది కడువేగమున జాబాలిమహర్షి కడకుఁ బరుగునఁ బోయి జరిగినది విన్న వించి "అయ్యో! పుణ్యమునకుఁ బోవఁ బాప మెదురయ్యె ననుటకు నేనే నిదర్శనము నైతిని. నా కీపాపమునుఁ బాపుకొను నుపాయమునుఁ దెలుపు" మని ప్రార్థించెను. జాబాలి యాతనిని ఋతుపర్ణునికడకుఁ బోయి యడుగు మని పంపెను. ఋతంభరుఁ డట్లు ఋతుపర్ణుని కడకుఁ బోయి యడుగఁగా నాతఁడు "రామస్మరణము చేయుచు మటి యొక గోమాతను సేవించిన నీపాపము పోవును. ఉత్తమ మగు గోవు నలంకరించి బ్రాహ్మణున కొక్కని కిచ్చిబుత్త నజ్ఞప్రాప్తి కలుగు" నని బదులు చెప్పెను. ఋతంభరుఁ డాతఁడు చెప్పినట్లు చేయఁగా నొక్కసుపుత్త్రుఁ డుదయించెను. ఈతఁడు సత్యవంతు డనుపేర రామభక్తుఁడు ధర్మ్మపియుఁడునై పేరు గాంచెను. *

ఈవిధముగా జాబాలిమహర్షి జగద్విఖ్యాత చరిత్రుఁడు, పూజ నీయుఁడు నయ్యెను.

---

* (పద్మపురాణము. పాతాళఖండము.)

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

మతంగ మహర్షి



స్తుతి

పరమతపఃప్రభావమునఁ బట్టుదలన్ వ్రతనిష్ఠ నింద్రుచే
వరమునఁ జండదేవుఁ డన వర్తిలు నెవ్వఁడు కామరూపియై?
తరుణులు క్రొల్తు రెవ్వని వ్రతంబులచే ? విహగత్వభావసు
స్థిరుఁ డగు నెవ్వఁ? డాతనిఁ బ్రసిద్ధు మతంగమహర్షిఁ గొల్చెదన్.

జననము : బాల్యము

గౌతమమహర్షి వంశమున జన్మించిన యొకబ్రాహ్మణుఁడు తన ధర్మపత్నియం దొకపుత్త్రునిం గాంచెను. అతఁడు మతంగుఁ డనుపేర విరాజిల్లుచుఁ దలిదండ్రుల యాజ్ఞలు శిరసావహించి విధేయప్రవర్తన విహరించుచుండెను. మతంగుఁడు కాలక్రమమున నుపనీతుఁడై వేద శాస్త్రముల నభ్యసించి యజ్ఞకర్మముల నేర్చియుండెను. ఒకప్పు డాతఁడు తండ్రి నియోగింప యజ్ఞార్థమగు పనికిం బోవుచు దారిలో నొకగాడిదకొదమ నొకకోలఁ గొని యడఁచెను. అది మిక్కిలి బాధ పడి దగ్గఱనే యున్నతనతల్లితో మతంగుఁడు తన్నడఁచె నని చెప్పి యేడ్చెను. ఆగాడిదతల్లి "వాఁడు పూర్వజన్మమునఁ జండాలసదృశుఁడు. క్రూరకర్ముఁడు గాక శాంతియుతుఁ డెట్లగు?"నని పలికెను. పూర్వజన్మ కర్మవిశేషమునఁ దిర్యగ్జాతిభాషావిదుఁ డయినమతంగుఁ డాగాడిద తల్లి మాట విని "ఇది నిందావాక్యము కాదు; నిరూపణవాక్యము

వలెఁ దోఁచుచున్నది. నేను బూర్వజన్మమున మాలవాఁడనై యుండ నోపుదు" నని గాడిదతల్లి దగ్గఱకుఁ బోయి "ఓకళ్యాణీ! నీవు శాప జాతవుగాఁ దోఁచుచున్నావు. దయదలఁచి నేను బూర్వజన్మమునఁ జండాలుఁడ నెక్కైతినో తెలుపుము. నిన్నుఁ దప్పువట్టను" అని యడి గెను. అపు డాగార్దభి "నీవు పూర్వజన్మమున విప్రస్త్రీయందు మంగలి వానికిఁ బుట్టితివి. ఆసంస్కారము నీకుఁ బోలేదు. అందుచే జీవ హింసకు వెనుకంజవేయవైతి"వని పలికి తనదారింబోయెను.

పూర్వజన్మజ్ఞానము

మతంగుఁ డాశ్చర్యపడి తండ్రి పంపినచోటికిఁ బోక తిరిగి తండ్రి కడకు విచ్చేసి జరిగినయుదంత మంతయు నివేదించి "తండ్రీ! పూర్వ భవమునఁ గలిగినచెడ్డపుట్టుకవలన నే నిపుడును దుష్టసంస్కారము లందితిని. శూద్రబీజమున బ్రాహ్మణియందుఁ బుట్టినవాఁడు చండాల సదృశుఁ డనుటలో సందేహము లేదు. నేను దప మాచరించి యుత్తమ బ్రాహ్మణుఁడ నగుదు" నని తండ్రి యనుమతి గైకొని తపశ్చర్యకుఁ బోయెను.

తపో నిరతి

మతంగుఁడు బ్రహ్మజ్ఞాతఁ గన నెంచి మహోగ్ర మగుతపము కొన్ని వేలసంవత్సరములు చేయఁగా నొకనాఁ డింద్రుఁ డాతనికిఁ బ్రత్య క్షమై వరము కోరుకొను మనియెను. ఆతఁడు బ్రహ్మవిద్వరుఁడు గా నభ్యర్థించెను. అంత నింద్రుఁ "డోయీ! వరుసగా నెన్నిజన్మము లందో బ్రాహ్మణుఁడవై పుట్టియున్ననే కాని నీవు బ్రహ్మవిద్వర్యుఁ డవు కాలేవు. మఱియొకవర మేదైనఁ గోరుకొను మిచ్చెద" నన నాతఁ డొల్లఁ డయ్యెను. ఇంద్రుఁడు తనదారిం బోయెను.

మతంగుఁడు దీక్ష సడలనీక, పట్టుదల విడువక బ్రహ్మవిద్వత్కుఁ డుగా నభిలషించి యేకపాదమున నిలిచి నూఱేండ్లు తప మొనరించెను. మరల నింద్రుఁడు వచ్చి "ఓయీ! బ్రహ్మవిద్వరుఁడ వగుట నీతరము కాదు. ఇట్టి తపమునకుఁ బదిరెట్లు చేసి చండాలుఁడు శూద్రుఁ డగును. దానికి నూఱుమడుఁగులు తపముచేసి శూద్రుఁడు వైశ్యుఁ డగును; దానికి వేయిమడుఁగులు అధికతప మొనరించి వైశ్యుఁడు క్షత్త్రియుఁ డగు; దానికిఁ బదివేలరెట్లు అధికతప మొనరించి క్షత్త్రియుఁడు దుర్బ్రాహ్మణుఁ డగును; ఆనియమమునకు లక్షమడుఁగు లధికము చేసి శమదమసత్యాహింసలచేతను, నిర్మాత్సర్యముచేతను ఆర్యబ్రాహ్మణ హృదయములను సదయములు చేయుదుర్బ్రాహ్మణుఁడు సద్బ్రాహ్మణుఁ డగును; అట్టి సద్బ్రాహ్మణుఁడు నిరంతరబ్రహ్మపదార్థసందర్శనలాలసుఁడై పెక్కుజన్మములకు బ్రహ్మ విదుఁ డగును; అట్టిబ్రహ్మవిదుఁడు త్వగస్థిభూతశరీరుఁడై మహాతప మొనరించి బ్రహ్మమును దప్ప నన్య మెఱుఁగ కహోరాత్రము లనేకవేలయేండ్లు గడపి బ్రహ్మవిద్వరుఁ డగును. నీ వాదిలో నుండి యంతమునఁ గలపద మభిలషించుచుంటివి. నీవు కేవలబ్రాహ్మణుఁడవు. దానఁ బ్రయోజనము లేదు. బ్రాహ్మణుఁడై పుట్టియు నాజాతిమహత్త్వము నిలుపుకొనుట చాలఁ గష్టము. అనేకజన్మముల కొకపర్యాయము బ్రాహ్మణజన్మ మందియు ధనకాంక్షావిషయలౌల్యములచే నూటికి దొంబది తొమ్మండుగురుపైఁగా సదాచారము దిగవిడిచి బ్రాహ్మణధర్మము మంట గలిపి తాము చెడి తమవంశమున కపఖ్యాతి గొనితెచ్చుచుందురు. నీ యాస లడియాసలే కాని యన్యములు కావు. ఇఁకనైన వర మేదైనఁ గోరుకొని పొ" మ్మని పలుక మతంగుఁడు మాటాడఁ డయ్యెను. ఇంద్రుఁడు తనదారిం బోయెను.

పిదప, మతంగుఁడు కాలిబొటనవ్రే లొక్కటిమాత్రము నేల మోపి నూఱు సంవత్సరములు మహోగ్రతప మొనరించెను. ఆమహా

తపమున నాతని కస్థిపంజరము మాత్రమే మిగిలి సర్వశక్తులు నుడుగ నాతఁడు నేల వ్రాలెను. వెంటనే యింద్రుఁడు విచ్చేసి యాతనిం బట్టుకొని ''వెట్టివాఁడా! నేను నీకెన్నిసారులు చెప్పలేదు? బ్రహ్మవిద్వ ర్యతఁ బడయ నీతరము కాదు. మహామహులకే సాధ్యము కాదు. నీ వన నెంత? ఇఁక నైనను నేఁ జెప్పినమాట విని నే నిచ్చిన వరము గైకొని పో''మ్మనఁగా మతంగుఁడు వల్లె యనెను. అప్పు డింద్రుఁడు ''వత్సా! నీవు ముందుజన్మమునఁ జండదేవుఁ డనఁ బ్రశస్తి వహించి, స్త్రీలు నిన్నుఁ బూజింప విహంగభావము నంది కామరూపధారివై విహరింపఁగలవు. దానివలన నీకును లోకమునకును బ్రమదము కల్గు ను. మఱియు, నీవు తరువాత నుత్తమ బ్రహ్మణ్యుఁడ వై, పిమ్మట నీకోరిక కనుగుణముగా బ్రహ్మవిద్వరుఁడ వగుదు'' వని వర మొసఁగి యంతర్హితుఁ డయ్యెను.

మతంగుని సాంసారికజీవనము

ఇట్లింద్రునిచే వరముఁ బడసి మతంగుఁ డటనే యొకయాశ్ర మమును నిర్మించుకొని తపముచేయుచుఁ గాలక్రమమున నొకకన్యఁ బరిణయమాడి యామెవలన నిష్టోపభోగము లంది యొకపుత్త్రునిం గాంచెను. ఆతఁడు 'ప్రసన్నుఁ' డనుపేరఁ దలిదండ్రులకు సేవచేయు చుఁ బెరుగుచుండెను. ఇట్లు సాంసారిక జీవనముఁ గడపుచునే మతంగ మహర్షి బ్రహ్మజ్ఞాన సంపాదనార్థియై నిజాశ్రమమున మహాతపము చేయుచునే యుండెను. అతనియాశ్రమము లవంగ, నారంగ, పూగ, పున్నాగ, వకుళ, కురువక, ప్రియాళు, రసాలప్రముఖ వృక్షవికాస మానము, నానాసూనవితానసుగంధసంవాసితము, పవిత్రపవమాన నిరస్తసమస్తపాంథశ్రమము, పరస్పరవైరవిహీనజంతుసంతానసదాశ్ర యము, అమృతోపమానస్వచ్ఛజలసంపూర్ణసరోవరసంయుక్తము,నయి యుండెను. అందు నిరంతరాహ్నిక క్రియాకలాపములు నిర్వర్తిం

చుచు, వేదవేదాంతశాస్త్రవ్యాఖ్యానగోష్ఠినిరంతరానందకందళిత హృదయారవిందు లగుచాత్త్రిలనడుమఁ జుక్కలనడిమి సుధాకరునిఁ బోలి మతంగమహర్షి వెలుఁగొందుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు ధర్మవ్యాధుఁ డను చెంచులరాజు అర్జునకి యను తనపుత్త్రికకుఁ దగినవరు నన్వేషించుచు మతంగమహర్షికడకు విచ్చేసి యాతనిపుత్త్రిఁ డగు ప్రసన్ననకుఁ జేసికొమ్మని యర్థించెను. అపుడు మతంగుఁడు సంతసించి ధర్మవ్యాధునిధర్మమహత్త్వ మెఱిఁగినవాఁ డగుట ధర్మవ్యాధుని నాతనిపుత్త్రిని దనకొడు కగు ప్రసన్నుఁ డున్నకడకుం దీసికొనిపోయెను. ప్రసన్నుఁ డాకన్నియం జూచి యువ్విళులూరెను. అర్జునకియుఁ బ్రసన్నుఁ గన్నంతనే సుప్రసన్న యయ్యెను. పిరివీఁకానురాగములఁ గన్నమతంగధర్మవ్యాధులు సుముహూర్తనిశ్చయము చేసి యచటనే వా రిరువురకును వివాహ మొనరించిరి. పిదప, ధర్మవ్యాధుఁడు కూఁతునకు బుద్ధులు గఱపి యత్తింట విడిచి వెడలిపోయెను.

అర్జునకి యత్తమామలసేవ నద్వితీయముగాఁ జేయుచు భర్త యడుగులకు మడుఁగులొత్తుచు నుండెను. ఆమె పద్మములకన్న మున్నుగనే మేల్కాంచి శుచిభూతయై, పర్ణశాలముందు గోమయ జలములు కలయంపిగాఁ జల్లి, లోపలిప్రదేశము లలికి ముగ్గులు వెట్టుచు, అగ్నిహోత్రమున కన్నియు ననువుపఱుచుచు, దేవపూజావితర్దికలం దర్చనకై గంధాక్షతప్రసవమాల్యములు నిలుపుచు, ప్రొద్దుపాటువేళకు భక్ష్యభోజ్యలేహ్యచోష్యపానీయములు పాకశుద్ధిగా నాయితముచేయుచు, గృహభర్త లతిథియుక్తులై భుజించినపిమ్మట నత్తకుఁ బెట్టి తాను దిని బిందెలతో జలములు తెచ్చి బృందావనములఁ బెంచుచు, హరిణీబృందములకు, ధేనువులకుఁ బ్రియముగా దూర్వాంకురముల మేపుచుండెడిది. ఆమె నిత్యము నిట్లు నడచుకొనుచుండెడిది. ఇట్టికొడుకుఁగోడల్లతో మతంగమహర్షి జీవించుచుండెను *.

(* వరహపురాణము)

మతంగుఁడు ప్రియంవదుఁ డను గంధర్వుని శపించుట

మతంగమహర్షి కొంతకాల మట్లుండి తరువాత నేకాకియై తపస్సు చేసికొనుచుండెను. అపుడు ప్రియంవదుఁ డనువాఁడు ప్రియదర్శనుఁ డనునొకగంధర్వరాజుకుమారుఁడు వచ్చి మహాగర్వియై యట నిష్టవిహారము సలుపుచు మతంగునికిఁ దపోభంగము కలిగించెను. మతంగుఁ డంతఁ గోపముతెచ్చిపెట్టుకొని "ఓరీ! నీవు మదించి మహాతపోమగ్నుఁడనైన నాకు విఘ్నము కలిగించితివి. కావున, నీవు మదగజమవై చరింపు" మని శపించెను. అపు డాగంధర్వుఁడు గర్వముడిగి తప్పిదమును సైరింపు మని మతంగమహర్షిపాదములపైఁ బడి బతిమాలుకొనెను. దయామయుఁడగుమతంగుఁ డాతనిఁ గనికరించి "ఓయీ! విచారింపకుము. ఇక్ష్వాకువంశ్యుఁడగుమహారాజు తనబాణమున నీకుంభస్థలమును గొట్టినపుడు నీకు శాపవిమోక్షమై నీపూర్వరూపమును నీవు ధరింపఁ గలవు. పొ" మ్మని పంపివేసెను.

మతంగునిశాపమువలన మదగజమై చరించుచు నజమహారాజు సైన్యములఁ జెల్లాచెదరుచేయుచు నుండ నాతఁడు తనబాణమున దీని నివారింపఁదలఁచి కుంభస్థలమునఁ గొట్టినంతనే యామదగజము గజశరీరము విడిచి దివ్యశరీరము, పూర్వరూపము ధరించి తనశాపవృత్తాంత మారాజకుమారునికిఁ దెలిపి కృతజ్ఞతాపూర్వకముగా నాతనికి దివ్యాస్త్ర ముపదేశించి యథేచ్ఛముగాఁ బోయెను *.

మతంగమహేంద్రసంవాదము

గౌతమవంశజుఁ డగుమతంగుఁడు గౌతమనామమునఁ గూడఁ బరఁగుచు నిష్ఠాగరిష్ఠుఁడై యేకాంతమునఁ దప మొనరించుచుండెను. ఆతఁడు తపము చాలించి యొకనాఁడు బయటికి రాఁగానే సమీపమున

(* రఘువంశము ౫.౫౩-౫౫.)

నొక యాఁడేనుఁగు పిల్లను గని మరణించుటఁ జూచెను. దయామయుఁ డగునాతఁ డాయేనుఁగుపిల్లఁ గని కనికరించి నెమ్మదిగాఁ దీసి కొనివచ్చి తనయాశ్రమముఁ జేర్చి యల్లారుముద్దుగాఁ బెంచుచుం డెను. అదియు నామునీంద్రునిపోషణమునఁ జక్కఁగాఁ బెరిగి పెద్ద దయ్యెను. మతంగుఁడు దానిని బుత్త్రిసమముగాఁ జూచుచుండెను. అదియు నాతనిని దండ్రివలె గౌరవించుచు నాతనియగ్నిహోత్ర మునకు సమిధలు తానే తెచ్చి యిచ్చును. ఆతనిదేవపూజావేళ కాగజ రాజము సరోవరమున స్నానము చేసి పవిత్రముగాఁ బద్మములను పుష్పములను దనతొండముతోఁ దెచ్చి యిచ్చును. ఆమునీంద్రునా శ్రమస్థల మెల్లను దనతొండమునఁ గొనితెచ్చిన పవిత్రజలములఁ జల్లి పరితినిత్యము పరిశుద్ధ మొనరించుచుండును. ఆతఁడు నిమీలితాక్షుఁ డై సమాధిస్థితి నున్నపు డదియు విశ్రాంతి గై కొనును. అతఁడు తపము చాలించి బయటికి రాఁగానే యది లేచి నిలిచి యాతనికనుసన్నల మెలఁగుచు నాతఁడు కోరినది చెప్పకుండఁగనే తెచ్చియిచ్చెడిది. ఆతఁ డాశ్రమము విడిచి నదీస్నానాదుల కేఁగినపు డాశ్రమము నెల్లవిధ ములఁ గాపాడుచు నెల్లకృత్యములు నిర్వర్తించుచు మానవునిమించిన మహితభక్తివిశ్వాసములతో మసలుచుండుటవలన నది మతంగుని హృదయ మపహరింపఁగలిగెను.

ఈపితాపుత్రిస్నేహమున కిందుఁ డాశ్చర్యపోయెను. మొద టినుండియు మతంగమహర్షి యన్న నిందుని కెంతయో యిష్టము. ఆతని కెన్నఁడును మేలుచేయనే యిందుఁడు కోరుచుండువాఁడు. మతంగుని బరీక్షించి యాతనికిఁ బుణ్యలోకములు ప్రసాదించునుద్దేశ మున నిందుఁడు రాజరూపమును ధరించి మతంగమహర్షి కడకు వచ్చి "మహాత్మా! నీవు పెంచుచున్నయీ యేనుఁగుగున్నను నాకిమ్ము. నేను రాజేందుఁడను. దీని యవసరము నా కెంతేని గలదు. నేను

దిని నిపుడే తీసికొనిపోవుట కనుజ్ఞ ని" మ్మని కోరెను. అంత మతంగుఁ ''డయ్యా! ఇది నాపుత్రిసమముగ ననుఁ గాపాడుచున్నది. నా కిది సమిధలు తెచ్చి యిచ్చును. నేను లేనపు డాశ్రిమమును గంటికి ఱెప్పవలెఁ గాపాడుచుండును. దీనిబుద్ధి మనుష్యబుద్ధికంటె గొప్పది. కావున, దీనిని నీ కీయఁజాల" ననెను. అంత నింద్రుఁడు ''మునిరాజా! నీకు వేయిగోవుల నిచ్చెదను. వలసినంత బంగార మిచ్చెదను. వేయేల! నీ కేమి కావలసిన నదియే యిచ్చెదను. పేదబాపఁడవు, నీ కీమృగ మేల? పట్టు పట్టకు" మని పలికెను. అంత మతంగుఁడు "రాజా! నీచెప్పినమాట చిత్రిముగా నున్నది. బ్రాహ్మణుని కేనుఁ గేల యన్న నీవే గోనిష్కవివిధరత్నము లిచ్చెద నందువు. అవి మాత్రము నా కేల? నే నెంతమాత్రిము నేనుఁగు నీయ" నని జవాబిచ్చెను. రా జందులకు ''మునీ! నీ వీక దీనిపై నాశ విడువుము. నేను రాజును. నావాహనముగా దీనిని నేను గైకొన్నచో నావంత యు దోషము లేదు. కానఁ గైకొందు" ననెను. ఆతనిరాజసమున కెంతయు వంత నొంది మతంగుఁ డిట్లనెను:

''పుణ్యకర్ములు హర్షంబుఁ బొందఁ గనుట
పాపకర్ములు శోకార్తిపాలు పడుట
యెచటఁగల్గు నయ్యాయసభ కేఁగుదెమ్ము
దంతి నచ్చట నిచ్చెద ధరణినాథ! ''

(భార. ఆను. ౪.౬౧.)

ఆమాటలకు రా జిట్లనెను: "అయ్యా! యమునిసభకు నాస్తికులు పాపాత్ములు వచ్చెదరు. కాని, నేను రాఁజాలను''. ''యముఁడు నిన్నాదరించును. రమ్మని" మని యనఁగా "నా కాగౌరవము కలుగదు. తల్లిదండ్రిల నధికభక్తిఁ బూజించువానినే యాతఁడు గౌరవించును", అని రాజు బదులు చెప్పెను. ''ఐనచో, మందాకినీతీరము

నకు రమ్ము. అచ్చట నీ కిచ్చెద" నని మతంగుఁ డనెను. "అయ్యా! అతిథిశిష్టాన్నభోజులు, అపరిగ్రహులుమాత్రమే గంగాతీరముఁ జేరఁగలరు. నే నందుల కోప" నని రాజు జవాబిచ్చెను. "ఐన, మేరు వనమున కరుదెమ్ము. అచట నేనుఁగును నీ కిచ్చెద" నని ముని పలి కెను. "అయ్యా! మృదుస్వభావులు, సత్యసమన్వితులు, భూతదయా పరులుమాత్రమే యావనముఁ జేర నర్హులు. నే నచటికి రానోప" నని రా జనెను. "ఓయీ! నారదవిహారభూమికి రమ్ము. అచట నప్సరోమణుల యాటపాటలనడుమ నీ కీమదగజము నిత్తు ర" మ్మని ముని పలికెను. "అయ్యా! గీతనృత్యాదులఁ జతురులై దేవతలను, మునీంద్రులను సంతోషపెట్టినమహనీయు లచటి కేఁగఁగలరు. నే నందుల కనర్హుఁడ" నని రాజు పలికెను. "పోనిమ్ము, దేవతలు నివ సించుచోటు, ఇందుఁడు సర్వకామ్యములు వర్షించుప్రదేశము నగు ఉత్తరకురుభూములకు ర మ్మచట నిచ్చెద" నని ముని పల్కెను. "మునిచంద్రా! కామహింసావిరహితు లైనవారికే కాని కాని వారికిఁ జొరరానిచోట్లకు నన్ను ర మ్మన్న నేను వచ్చెద ననుకొం టివా?" యని రాజు పలికెను. "రాజా! పోనిమ్ము, చందినియిం టికి రమ్ము. అచట నిచ్చెద" నని ముని యనఁగా" అయ్యా! నిరంతర దానవ్రతులు, ఋమాయుక్తులు, ఆదానవిముఖులు నగుమహాత్ములు పోవుచోటికి నన్ను ర మ్మందువేల? రాఁజాల" నని రా జనెను. "పో నిమ్ము, సూర్యునికడ నిచ్చెద ర" మ్మని ముని యనెను. "అయ్యో! అది తపస్స్వాధ్యాయనిరతులకే చొర శక్యమైనది. నేను రాలే" నని రా జనెను. "వరుణపురికో?" యని ముని యన నిరతాగ్నిహో త్రిలు, అవిరళజపహోమయజ్ఞయాగక్రియాకలాపులు నట కేఁ గుదురు. నేను రాఁజాల" నని రా జనెను. ఈవిధముగా ముని యింద్రునిలోకమునకు రమ్మన నది శూరులు, సోమయాజులు, శత వర్ష వేదు లగుపుణ్యపురుషులు పోవుచో టనియు, ప్రాజాపత్యలో

కమునకు రమ్మన్న నది యశ్వమేధులపద మనియు, గోలోక మన నది తీర్థనిషేవులు, గోదానపుణ్యపరులు, బ్రహ్మచర్యవ్రతులు పోవు చోటనియు, శీతోష్ణసుఖదుఃఖాదిద్వంద్వాతీత మగుబ్రహ్మలోకము నకు రమ్మన, నది యసంగులు, వ్రతాత్మ్ములు, కృతపుణ్యులు, అధ్యాత్మ నిరతులు నుండుచోటనియుఁ జెప్పి నే నచటికి రాలే ననెను. ఈ సమాధానములు విన్న మతంగుఁడు "సరే! ఇఁక దెలిసినది. నీవు రాజమాత్రుఁడవు కావు. రాజరూపమున వచ్చినయింద్రుఁడవు. నీ విట్టి కపటవ్యాపారమున నేమి యనుభవింప నిట వచ్చితి" వని యడిగెను. ఇంద్రుఁడపుడు నిజరూపమునఁ బ్రత్యక్షమై "మతంగ మునీంద్రా! నీ కేమి కావలయునో యాదేశింపు" మని పలికెను. మతంగుఁడు "ఇంద్రా! పుత్రసదృశ మగునీయేనుఁగును నన్నును విడఁ దీయకుము. దీని నిట విడిచి పో" మ్మని కోరెను. ఇంద్రుఁ "డయ్యా! అట్లే యగు. నన్నుఁ దెలిసికొనఁ గలవో లేవో యని నిన్నుఁ బరీక్షింప వచ్చితినే కాని నీయేనుఁగు నాకుఁ గావలసి కాదు. నిగూఢుఁడవై యున్న న న్నెవ్వరును గనుఁగొన లేరు. నీవు కనుఁగొనఁ గలిగితివి. నీతపస్సునకు ఫలముగా నీకును నీయేనుఁగుఁబుత్త్రినకును స్వర్లోక సౌఖ్యము సిద్ధింపఁజేసెదను. ఇదే యీవిమాన మెక్కి వచ్చేసి నాకు స్నేహితులై యుండుఁ" డని యింద్రుఁడు పలుకఁగనే మాతలి విమానముతో నటకు వచ్చిచేరెను. ఇంద్రునియాదేశమున మతంగుఁడు ముందుఁ దనగజపుత్త్రి నెక్కించి తరువాతఁ దాను విమాన మెక్కి ఇంద్రుఁడు కూడ నుండి తీసికొనిపోఁగాఁ దపస్సిద్ధులు గాంచలేని యింద్రలోకమున కేఁగి చిరకాలము సుఖించి పిదపఁ జండదేవుఁడై సర్వప్రజారంజకుఁడై విలసిల్లెను.*

(* భారతము, ఆనుశాసనికము.)

ఓమ్

శ్రీ మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు

శంఖలిఖిత మహర్షులు

—✻—

స్తుతి

వేదశాస్త్రపురాణవిద్యానవద్యులై
బ్రహ్మతేజంబునఁ బరిఢవిల్లి
ధర్మశాస్త్రసమస్తమర్మవిద్వర్యులై
స్మృతికర్తలందు విశిష్టు లగుచు
జపతపస్స్వాధ్యాయసారమూర్తు లనంగ
నిర్మలాత్మజ్ఞాననిరతు లగుచు
ధర్మదీక్షయె యసిధారావ్రతంబుగా
నాచరణంబున నమలుజరిపి

బాహుదాతీరభూభాగపరమపుణ్య
పర్ణశాలాంతరతపఃప్రభావు లగుచు
సూర్యచంద్రులవోలెను సొబగు మిగులు
శంఖలిఖితమహర్షుల సన్నుతింతు.

జననము

బాహుదానదితీరమునఁ గలపరమపావన మగువనవాటిక యందుఁ దపస్స్వాధ్యాయప్రవచనదీక్షాదక్షుఁడై యొకబ్రాహ్మణోత్తముఁడు ధర్మపత్నిసమేతుఁడై నివసించుచుండెను. ఆతనితపఃఫలముగా

నాతనిభార్యారత్నము నోచిననోములపంటగా వారి కిరువురుపుత్త్రులుదయించిరి. వారిలో మొదటివాఁడు జ్ఞానయోగసూచక మగు శంఖచిహ్నము హస్తమునఁ గలిగియుండుటచే నాతనికి శంఖుఁడనియు రెండవవాని లలాటలిఖిత మాతఁడు తపోధర్మదీక్షానవద్యుఁడని చెప్పక చెప్పుటచే లిఖితుఁడనియుఁ దలిదండ్రులు నామకరణము చేసి యల్లారుముద్దుగాఁ బెంచిరి.

తపస్సు

శుక్లపక్షపాకరులవలె శంఖలిఖితు లిరువురును బెరిఁగి పెద్దవారైనంతనే యుక్తవయస్సున నుపనయనాదులు చేసి తండ్రి వేద వేదాంగము లెల్ల వారికి నేర్పెను. అన్నదమ్ము లిరువురు నన్యోన్య ప్రేమవాత్సల్యములతో రామలక్ష్మణుల మఱపించుచు, సూర్యచంద్రుల వలెను, అశ్వినీదేవతలవలెను వెలుఁగొందఁ జొచ్చిరి. విధివిహితముగా శంఖలిఖితులు వేదశాస్త్రముల నన్నిట నాఁటితేరి, ధర్మవేదులై, జ్ఞాన పిపాసువులై తలిదండ్రులపాదసేవ లొనరించి వారియనుమతిఁ గొని తపోమహత్త్వమున ధర్మదీక్ష నాత్మజ్ఞానసంపన్నులుగా నభిలషించి బాహుదానదీతీరమునఁ గలవనరాజముల నిరువురును జెరియొక యాశ్రమను నిర్మించుకొని బ్రహ్మచర్యదీక్షఁ బూని మహాతపమునకుఁ గడంగిరి.

ఇట్లు నిరంతరతపోధ్యానామృతమునఁ జుబ్బనచూఱలాడు నాజడదారు లగుశంఖలిఖితులు సాక్షాత్కరించిన ధర్మదేవతలో, మూర్తీభవించినజపతపస్స్వాధ్యాయములో, పుంభావులైనసరస్వతులో, అవతార మెత్తినయాదివిద్యలో యనఁ జెలువారుచు దివ్యశక్తి యుక్తులంది దివ్యజీవితములఁ గడపఁ దొడంగిరి.

సకలఫలపుష్పవిరాజమానము లైనయాయన్నదమ్ముల యాశ్రమములు రెండును నరనారాయణులయాశ్రమములవలె సర్వసుమనో

రంజకములుగా నుండెను. అందలిఫలపుష్పము లాఋషిచంద్రుల యద నెఱిగి పండి పుష్పించి యామహనీయులయారగింపుననే ధన్యత నందుచుండెడివి. పరమశోభాయమాన మగునిట్టిపవిత్రపరిసరములు గన్నధన్యులై శంఖలిఖితు లిరువురు తపము చాలించి విశ్రాంతి గైకొనువేళ నిరువు రొకేయాశ్రమమునఁ బ్రొద్దుపుచ్చి సద్గోష్ఠివైభవమున సంతుష్టస్వాంతులై మరలఁ దమతమయాశ్రమముల కేఁగి తపోధర్మముల నిర్వర్తించుచుండిరి. ఇది వారికి నిత్యముఁ బరిపాటి యయ్యెను. ధర్మదేహు లగునాపవిత్రసోదరులు పరిహాసమునకైన నసత్యమాడరు; బాధ లేనియెఱఁగలను నధర్మ మొనరింపరు; తపోమయ జీవనమే వారి కింద్రభోగము; మోక్షలక్ష్మియే వారికి ధర్మపత్ని; ఆశ్రమజంతుసంతానమే వారియాత్మసంతానము; తపోధనమునుగూడఁ బెట్టుకే వారియుద్యోగము; ఏమటికైనను, సుప్రత్యవస్థయందైనను, వారినోటి కసత్యవచనము, వారిచేత కధర్మాచరణము, వారియూహ కనుమానము మందునకైనఁ బొడచూపవాయెను. ధర్మదేవత యిటు రెండురూపములు ధరించినదేల? తపోలక్ష్మి యిట్లు ద్విధాత్వ మందిన దేల? ద్వైతహీన మగునాత్మజ్ఞాన మిట్లద్వైతభావము నందినదేల? యనున ట్లానోదరు లిరువురు సంచరించుచుండఁగా వారిని జూచి దేవతలు మెత్తురు; గంధర్వు లాడుదురు; కిన్నరులు పాడుదురు.

లిఖితునియపరాధము

ఇట్లు చిరకాలము కడచినపిమ్మట నొక్కనాఁడు లిఖితుఁడు శంఖునాశ్రమమునకు వచ్చుసరి కాతఁ డందు లేకుండెను. ఆతనిరాక కెదురుచూచుచు లిఖితుఁ డచటనే కూర్చుండి సమీపమునఁ గలయొక చూతవృక్షమునఁ జక్కఁగ బండి ఫలసౌరభముఁ బ్రసరించుచుండ రెండుపండ్లు కోసికొని తినుచుండఁగా శంఖుఁడు వచ్చెను. లిఖితుఁడు

పండ్లు తిని చేతులు మూతి కడుగుకొని యన్నపాలికి వచ్చి కూర్చుండెను. శంఖుఁడు "తమ్ముఁడా! ఎంతసే పయి వచ్చితివి? నీ విపుడు తిన్నపండ్లెక్కడివి?" అని యడిగెను. లిఖితుఁ "డన్నా! నేను వచ్చి చాలసే పైనది. నీరాకకై ప్రతీక్షించుచుఁ గూర్చుండ నాదృష్టి యీమాత వృక్షముపైఁ బడినది. దాని కొమ్మల యెమ్మల నారఁబండినపండ్లు నాకన్నులకు, వానిఘుమఘుమవాసన నానాసికకు, నాహ్లాదము కలిగింప రెండుపండ్లు కోసికొని తింటిని. ఇంతలో నీవు వచ్చితి" వనెను.

సునిశితధర్మదీక్షాదక్షుఁ డగుశంఖునిమనస్సు చివుక్కు మనెను; ఆతనిముఖారవిందమున విచారరేఖ లంకురించెను. "అయ్యో! యెంత పని జరిగిన!" దని యాతఁ డనఁగానే లిఖితుఁడు భయసంభ్రమములఁ జేతులు జోడించి "అన్నా! ఏమి జరిగినది! ఏమి ప్రమాదము వాటిల్లిన?" దని యాతురతతో నడిగెను. "వత్సా! దైవ మనుకూలింపనిసమయమున నెంతటివానికైన బుద్ధివికారము పొడఁచూపి యాతనిచే నధర్మకృత్య మొనరింపఁ జేయునుగదా! సునిశితధర్మదీక్షలో నగ్నిహోత్రుఁడవగునీకును నధర్మకార్యకరణమా? తమ్ముఁడా! నాయనుమతిఁ గొనక నీవిపండ్లు కోసి తింటివి. నీవస్తుపు కానిది నీ దని నీ వెట్లనుకొందువు? అన్యవస్తువు నన్యునియనుమతిఁ గొనక యాహరగించుటవలన నీకుఁ జౌర్యదోషము, అధర్మఫలానుభవదోషము, కలిగినవి. నాయనా! పరమపరిశుద్ధప్రవర్తనమునఁ బ్రఖ్యాతి గన్ననీ కీదోషము సహింపరానిది. స్వచ్ఛ మగుతెల్లనిబట్టపై నెంతచిన్నమరక పడినను గానిపించునుగదా!" యని శంఖుఁడు పలికెను.

లిఖితుఁ డనాలోచితముగాఁ దనచేసినపని యధర్మ మని యపుడు గ్రహించి "అన్నా! ఈయపరాధమునకు తగుంతవ్యుఁడ" నని శంఖునిపాదములపై వ్రాలెను. శంఖుఁడు లిఖితుని లేవనెత్తి "వత్సా! నీవు నాయెడ ద్రోహము చేసితి వని కాని నాఫలములు నీ వపహరించుటచే నేను

నష్టపోతి నని కాని నేను బాధపడుట లేదు. ధర్మప్రపంచమునకు మన మెరవడులము. ఎంతటిమునీశ్వరులును ధర్మసంశయములు కలిగిన వేళల మనకడకు వచ్చి మనయాచరణమునే ప్రమాణముగాఁ గైకొ నుచుఁ దృప్తులై పోవుచుండిరికదా! లవమాత్ర మైనయధర్మము మన ప్రవర్తనలో నున్నను మనము ధర్మము బోధించునధికారమును గోల్పోయినవార మే. నుజీయు, నిట్టిస్వల్పదోషమునకుఁగాను మనము యమదండన మందక తప్పనిసరి యగును. కనుక, సర్వధర్మవిదుఁడ వగునీవే బాగుగా నాలోచించుకొని యీపాపమును బాపుకొను నుపాయముఁ జూచుకొను" మని పలికెను. అన్ననునిశితధర్మపరత కానందించి తమ్ముఁడు "ప్రాజ్ఞుఁడవు, ధర్మమర్మవేదివి నీకడనే నేను దప్పుచేసితిని నీ వేశిక్ష విధించినను దానిని నే నానందముతో ననుభవించెదను. కావున దయదలఁచి దీనికి నిష్కృతి యేమియో చెప్పు" మని ప్రార్థించెను.

శంఖుఁడు తమ్మునివినయమున కానందించి "వత్సా! నీచేసిన పని దొంగతనమే. దొంగవాఁడు రాజదండన మందినచోఁ బిమ్మట యమదండన మందవలసినయవసరము కలుగదు. మనకు రాజు సుద్యుమ్నుఁడు. ఆతఁడు ధర్మప్రభువు. నీవు శీఘ్రమే యాతనికడ కేఁగి నీచేసినతప్పు చెప్పి యొప్పుకొని దానికిఁ దగినదండన మభ్యర్థించి యాతఁడు విధించినశిక్ష యనుభవించి విచ్చేయు" మని యాదేశించెను.

లిఖితుఁడు వెంటనే యన్నపాదములు కన్నుల కద్దుకొని యాతనికడ సెలవు తీసికొని యతిశీఘ్రగమనమున సుద్యుమ్ననినగరు సమీపించి నగరివాకిట నిలిచి తనరాకను దౌవారికునిమూలమున రాజున కెటింగించెను.

లిఖితుఁడు సుద్యుమ్నుని శిక్షింపఁ బ్రార్థించుట

లిఖితమహర్షి యాగమనవార్త విన్న రాజు వెనువెంటనే లేచి యుచితపరివారమును వెంటఁ గొని భయభక్తితాత్పర్యములతో

నెదురువచ్చి లిఖితునికి స్వాగతమిచ్చి యర్ఘ్యపాద్యాదు లొసఁగి లోనికిఁ దీసికొనిపోయి యుచితాసనమునఁ గూర్చుండఁజేసి సన్నిధికేఁగి యాతనిచరణకమలములపైఁ దనకరకమలములఁ జేర్చి "తపోనిధీ! నాజన్మ మిపుడు సఫల మైనది. నాయిల్లు పవిత్ర మైనది. ధర్మావతారమూర్తి వగునీపాదము లాన, నీ వేమి కోరిన నది యిచ్చెదను. నా కానతిచ్చి నన్ను ధన్యు నొనర్పు" మని ప్రార్థించెను.

"రాజా! నాకోరిక యపుడే సిద్ధించినది. నీ వాడితప్పనిమహానీయుఁడవు. నే నేది కోరిన నది తప్పక యిచ్చెద నంటివి. నీ వామాటపై నిలఁబడినఁ జాలు" నని లిఖితుఁ డనఁగానే సుద్యుమ్నుఁడు "మహాత్మా! అం దావంతయును సందియము లేదు. సూర్యచంద్రులు దారితప్పినను, మేరువు తలక్రిందైనను, నాసర్వస్వము నాశనమేయైనను, నీయెడ నే నాడి తప్పను. నీ వడిగినంతనే నాప్రాణ మైనను, నాసర్వస్వ మైనను ధారపోసెదను. నా కాయవకాశము వెంటనే లభింపఁజేసి ధన్యు నొనరింపు" మని మరల శపథము చేసెను.

అపుడు లిఖితుఁ డానందమున జరిగినసంగతి యంతయుఁ బూసగ్రుచ్చిన ట్లాతనికిఁ దెలియఁజెప్పి "రాజా! గురుననుమతి గొనక యాతని తరుఫలములఁ దినుట ముమ్మాటికి ప్రుచ్చిమి. ప్రుచ్చుల దండించు తెఱఁగున నన్ను దండించి గతకల్మషు నొనరింపుము. రాజదండితునికి యమదండము లే దని పెద్ద లందురు. దండ్యుని దండింపకుండుట రాజదోషము. నీ వాదోషమును బొరయకుండుటకు, నాదోషమును బాపుటకు వెంటనే శిక్షింపు" మని ప్రార్థించెను. ఆమాటలు విని సుద్యుమ్నుఁడు "హా! హతోస్మి" యని నేలఁ గూలెను. మంత్రులు శైత్యోపచారములు చేయ లిఖితుఁడు లేవ నెత్త సుద్యుమ్నుఁడు లేచి "మహాత్మా! నిప్పునకుఁ జెద లంటినను, సూర్యునకుఁ జీకటి సోకినను, నే నంగీకరించెదను గాని ఋషిసత్తముఁడవు, ధర్మమూర్తివి,

అస్ఖలితబ్రహ్మచర్యుఁడవు, పరమపుణ్యుఁడవు నగునీకుఁ జోరత్వ దోష మెక్కడిది? మునీంద్రా! నామాట వినుము. నే నాడితప్పినదోషమున యమునిపాలికాపునైనను, రౌరవాదినరకముల నందినను, క్రిమికీటక జన్మములఁ గాంచినను, అంగీకరించెదను. కాని, నాచేత నిన్ను శిక్షింపఁ జాలను. అయ్యో! నే నెంత యనాలోచితముగ నీ చెప్పినట్లు చేయుదు నని మాట యిచ్చితిని! ఎంతమంచిపని యైన ననాలోచితముగాఁ జేయ రాదనుట కింతకన్న నిదర్శన మేమున్నది? ధర్మదేవా! నీవు నన్ను రక్షించినను శిక్షించినను, లేదా భక్షించినను, శాపాగ్నిచే భస్మపటల మొనర్చినను, నేను సిద్ధమే. ఆడినమాట తప్పకుండుట ధర్మము. మహాత్ములకు హాని కలుగునపుడు ఆడినమాట తప్పుటయే ధర్మ సూక్ష్మము. నేను ధర్మజ్ఞుఁడను. ధర్మసూక్ష్మజ్ఞుఁడను, నాయెడఁ దప్పు కలుగదు. కావున నన్ను మన్నింపుము. నీకు శిక్ష విధింపఁజాల" నని ఘంటాపథముగాఁ జెప్పి వేసెను.

సుద్యుమ్ననిమాటల కాశ్చర్యపడి లిఖితమహర్షి యాతని నోదార్చి యిట్లు పలికెను. "రాజా! నీవు నామాట వినవలసినదే. గత్యం తరము లేదు. శ్రేష్ఠు లెట్లాచరింతురో లోకు లందఱు దాని ననుసరింతురు. పాంచభౌతిక మగుశరీరమునకు శిక్ష కాని యాత్మకు శిక్ష లేదు. తృణప్రాయ మగుదేహమునకు బాధ కలుగు నని ధర్మము తప్పితిమా యాత్మద్రోహము చేసికొన్నవార మగుదుము. రాజధర్మ మీఱుపట్ల ముని యైనను గిని యైనను నీవు వెనుదీయరాదు. ధర్మ పాలన మసిధారావ్రతమువంటిది. తత్త్వజ్ఞుఁడ వగునీ కింతగాఁ జెప్ప వలసినస్థితిలో నేను బడరాదు. ధర్మవిషయమునఁ బేదసాదులు, పెద్ద పిన్నలు, శత్రుమిత్రులు, ఆప్తానాప్తులు ననుభేదముఁ జూపరాదు. నేను బనికట్టుకొని వచ్చి దండింపు మని ప్రార్థించుచుంటినేకాని దానికి వ్యతిరేకముగాఁ గోరుట లేదు. కావున, ధర్మముపట్ల, చండశాసనుఁ

డవై యిహపరముల సుఖంపుము. నన్నుఁ దృణీకరించితివా, నీకును నాకును లోకములకును గలుగుశ్రేయస్సును జేతులార నాశనము చేసిన వాఁడ వగుచున్నావు. నీకు నాయెడ గురుభావమే యున్న, నామాట మఱింత తప్పక వినవలసినవిధి నీయెడఁ గలదు. నిజ మైనశిష్యుఁడు గురు వేది చెప్పిన నది విని తీరవలయును. గురువాక్యముపట్ల సందేహము, విచారణ, ఆలస్యము పనికిరావు." ఇట్లు పెక్కువిధముల లిఖితమహర్షి సుద్యుమ్ననకు బోధించి, యాత్మానాత్మవివేకము, ధర్మాధర్మవిచారము, దేహిదేహవిభాగము, కర్మాకర్మభావము నన్నియుఁ జెప్పి యెట్టకేల కాతనిమనస్సు మార్చఁగలిగెను.

సుద్యుమ్నుఁడు లిఖితమహర్షిచేతులు గొట్టించుట

సుద్యుమ్నుఁ డంతఁ గేవలధర్మపక్షపాతబుద్ధియై మనస్సున భగవంతుని ధ్యానించి గురుచరణములఁ గన్నుల కద్దుకొని సముచిత దండనీతివ్రతశీలత మెఱయఁ గరకమలచ్ఛేదనమున మహాఋషి యగు లిఖితుని దండితుని జేసి ఖిన్నవదనమున విన్నవాఁడై మిన్నకుండి కన్నుల నీరు గ్రమ్మఁ జేతులు జోడించి నిలిచెను. తత్త్వవేత్తయు, ధర్మావలంబియు, యోగమూర్తియు నగులిఖితమహర్షి యానందబాష్పములు రాల్చి సుద్యుమ్నుని మోమెత్తి యభినందించి, యభినుతించి, యభిధానించి దీవించి నిర్మలిన మగునాననపద్మము వికసింప, నిరపరాధత నిశ్చింతుఁడై వెంటనే యన్నకడ కేఁగి యానతముఖముననే యభివందన మొనరించి "అన్నా! సమ్యగనుభూత దండితుఁడ నైతిని. ఇవే నికృత్తకరము" లని చూపెను.

లిఖితుఁడు మరల చేతులుగాంచుట

శంఖమహర్షి యానందాశ్రువులు కన్నులఁ గ్రమ్మ "వత్సా! కల్లుత్రావుట, గురుపత్నిం గూడుట, బ్రాహ్మణుని జంపుట, బ్రహ్మఘ్నుని

యింట దొంగతనముచేయుట, ఇవి చేయుక్రూరజను లన్నఁ బ్రీతి గలిగి యుండుట ఇవి పంచమహాపాతకములు. ఏజాతివాఁ డైనను, ఏకారణమున నైనను, వీనిలో నేది చేసినను, దండనీయుఁడే. విశేషించి దొంగ శరీరదండనమున కర్హుఁడు. రాజదండితులు పుణ్యాత్ములవలెఁ బుణ్యలోకప్రాప్తి లగుదురు. నీవు సుద్యుమ్ననిచే దండితుఁడ వగుట వలనఁ బుణ్యాతిశాయివి, వంశోద్ధారకుఁడవు, పరమపూజ్యుఁడవు నైతివి. నే నెంతయో సంతోషించితిని. నీవును సంతోషింపుము.

"ధర్మమార్గ ముల్లంఘింపఁ దగదు కాన
వలసె నిష్కృతి కుల మెల్ల వెలసె నీక
తమున సురమునిపితృతర్పణములు సేయు
మరిగి బాహుదాపుణ్యతోయముల ననఘ!"

(భార. శాంతి. ౧. ౧౬౬.)

అని పంపెను. అన్నయాజ్ఞఁ బాలించునాతురతలోఁ జేతులు లేవు కదా! యెట్లు తర్పణము లొసంగుదు నన్నయూహయే లేక లిఖితుఁ డతివేగమున నేఁగి బాహుదానదిలో మునిఁగి తేలఁగనే యత్యద్భుత ముగా నాతనికిఁ జేతులు మొలచి పూర్వదేహమున కంటె నధికాధిక మగుతేజము, రూపము, శాంతి, దాంతి గలిగెను.

లిఖితుఁ డాశ్చర్యమానసుఁడై శ్రద్ధాభక్తులతో సురపితృమునితర్పణములు నిర్వర్తించి యన్నకడ కేఁగి యరుణకమలములం దెగడు తనకరకమలములఁ జూపి దివ్యప్రభలఁ దేజరిల్లుచుండ శంఖుఁడు తమ్ముని గ్రుచ్చి కౌఁగిలించుకొని "వత్సా! ఇందు నా కాశ్చర్యము లేదు ఇది మనతపఃప్రభావమే కాని యన్యము కాదు. మనయాత్మశుద్ధికి దైవ మలరి యనుకూలించెను. సుద్యుమ్నుఁడును నీపుణ్యానుష్ఠానము కతమున నిజపితృవర్గసహితముగా నిర్మలాత్మఁ డగును. ఇఁక, నీ వేఁగి

నీయాశ్రమమున నిత్యకృత్యములు నిర్వర్తించుకొను" మని పలికెను. లిఖితుఁ డన్న కభివందనము లాచరించి నిజాశ్రమమున కేఁగి పూర్వము వలెనే తపోజీవితము గడపుచుండెను. *

లఘుశంఖస్మృతి

శంఖలిఖితమహర్షు లిరువురును గొప్పస్మృతికర్తలు. వారు సదాచారసంపన్నులు, ధర్మజీవననిరతులు నయి బోధించినధర్మములు మిక్కిలి గణన కెక్కినవి. లఘుశంఖస్మృతి, శంఖస్మృతి, లిఖితస్మృతి, శంఖలిఖితస్మృతి యని వీరిపేర నాలుగుస్మృతులు విరాజిల్లుచున్నవి

లఘుశంఖస్మృతియందు ఇష్టాపూర్తకర్మఫలము, గంగాస్థిమజ్జన స్వర్గప్రాప్తివర్ణనము, వృషోత్సర్గాదిఫలవర్ణనము, సపిండీకరణవర్ణనము, అనేకశ్రాద్ధవివేకము, బ్రహ్మఘాతుకలక్షణము, మృతాశౌచకాదిక నిరూపణము, మున్నగు విషయములు కలవు.

శంఖస్మృతి

ఇందు బ్రాహ్మణాదికకర్మవర్ణనము, బ్రాహ్మణాదికసంస్కార వర్ణనము, బ్రహ్మచర్యాద్యాచారవర్ణనము, వివాహసంస్కారవర్ణనము, పంచమహాయజ్ఞములు, గృహస్థాశ్రమప్రశంస, అతిథివర్ణనము వానప్రస్థధర్మనిరూపణము, సన్న్యాసధర్మప్రకరణము, ప్రాణాయామలక్షణము, ధారణాధ్యానయోగనిరూపణము, నిత్యనైమిత్తికాది స్నానలక్షణవర్ణనము, క్రియాస్నానవిధివర్ణనము, ఆచమనవిధివర్ణనము అఘమర్షణవిధివర్ణనము, గాయత్రీజపవిధివర్ణనము, తర్పణవిధివర్ణనము, శ్రాద్ధాదిసమస్తకర్మవివరణము, జననమరణాశౌచవర్ణనము, ద్రవ్యశుద్ధి,మృణ్మయాదిపాత్రశుద్ధివర్ణనము, వివిధవ్రతవిధానవర్ణనము

* (భారతము—శాంతిపర్వము.)

V.R. NARAYANA MEMORIAL LIBRARY D.P.R.I. Acc. No.

అఘమర్షణ, పరాక, వారుణకృచ్ఛ, అతికృచ్ఛ, సాంతపనాదివ్రత వర్ణనము మున్నగునవి కలవు.

లిఖితస్మృతి

ఇష్టాపూర్తికర్మవృషోత్సర్గగయాపిండదానశోషడశశ్రాద్ధవర్ణనము, ఉదకకుంభదానము, అగ్నిస్థానము, అపుత్రిణోద్దిష్టశ్రాద్ధవర్ణనము, మున్నగువిషయము లిందుఁ గలవు.

శంఖలిఖితస్మృతి

ఇందు వైశ్వదేవము, అతిథిపూజనము, పరాన్నభోజనదోష నిరూపణము, రాజప్రశంస, బ్రాహ్మణప్రశంస మున్నగునవి కలవు.

"పరాన్నం పరవస్త్రం చ పరయానం పరాస్త్రియః!,
పరవేశ్మని వాసశ్చ శక్రస్యాపి శ్రియం హరేత్."

లఘుశంఖస్మృతినుండి కొన్నిశ్లోకములయుదాహరణము:

"ఇష్టాపూర్తౌ తు కర్తవ్యౌ బ్రాహ్మణే న విశేషతః
ఇష్టేన లభతే స్వర్గం మోక్షం పూర్తేన విందతి.
వాపీకూపతటాకాని దేవతాయతనాని చ,
పతితాన్యుద్ధరేద్యస్తు స పూర్తఫల మశ్నుతే.
అగ్నిహోత్రతపస్సత్యం వేదానాంచై వధారణమ్,
ఆతిథ్యం వైశ్వదేవంచ ఇష్ట మిత్యభిధీయతే."

శంఖస్మృతినుండి:

"స్వయంభువే నమస్కృత్య సృష్టిసంహారకారిణే,
చాతుర్వర్ణ్యహితార్థాయ శంఖ శ్శాస్త్రమథాకరోత్,
యజనం యాజనం దానం తథై వాధ్యాపనక్రియాం
ప్రతిగ్రహం చాధ్యయనం విప్రకర్మాణి కారయేత్.

సా భార్యా యా గృహంరక్షా సా భార్యా యా పతివ్రతా,
సా భార్యా యా పతిప్రాణా సా భార్యా యా ప్రజావతీ.
లాలనీయా సదా భార్యా తాడనీయా తథైవ చ,
లాలితా తాడితా చైవ స్త్రీ శ్రీర్భవతి నాన్యథా."

లిఖితస్మృతినుండి యొక్కటి:

"అధ్వగామీ భవేదశ్వః పునర్భోక్తా చ వాయసః,
కర్మకృజ్జాయతే దాసః స్త్రీసంగేన చ సూకరః."

శంఖలిఖితస్మృతినుండి :—

"వాసుదేవం నమస్కృత్య శంఖస్యలిఖితస్య చ,
ధర్మశాస్త్రం ప్రవక్ష్యామి దధ్నిచైవ ఘృతం యథా.
"అగ్రం వృక్షస్య రాజానో మూలం వృక్షస్య బ్రాహ్మణాః
తస్మాన్మూలం నహింసీయా న్మూలాదగ్రం ప్రరోహతి.
ఫలం వృక్షస్య రాజానః పుష్పం వృక్షస్య బ్రాహ్మణః
తస్మాత్పుష్పం నహింసీయాత్పుష్పాత్సంజాయతే ఫలమ్,
పక్షిణాం బల మాకాశమ్ మత్స్యానా ముదకం బలమ్
దుర్బలస్య బలం రాజా బాలస్య రుదితం బలమ్,
అగ్నిదగ్ధం ప్రరోహేత సూర్యదగ్ధం తథైవచ,
దండ్యస్తు సంప్రరోహేత బ్రహ్మశాపహతో హతః".

శుక్లయజుర్వేదశాఖీయు లగువాజసనేయులు శంఖలిఖితధర్మ శాస్త్రమును బ్రత్యేకముగా నభిమానించి యనుసరింతు రని తంత్ర వార్తికమునఁ గలదు. యాజ్ఞవల్క్యుఁడు శంఖలిఖితస్మృతిని బెక్కు సారు లుదాహరించినాఁడు. పరాశరధర్మశాస్త్రమున కృత, త్రేతా, ద్వాపర, కలియుగములలో వరుసగా మను గౌతమ శంఖలిఖిత పరాశరస్మృతులే ధర్మములకుఁ బరమప్రమాణము లని యున్నది.

అనుబంధము

అంగిరసధర్మశాస్త్రము

ఇది పూర్వాంగిరస మని ఉత్తరాంగిరస మని రెండుభాగము లుగాఁ గలదు. పూర్వాంగిరసమునఁ గలప్రధానవిషయము లివి : ఋషీశ్వరు లాంగిరసునిఁ జేరి ధర్మస్వరూపమును దెలుపు మనియు వైదికకర్మలను వివరింపు మనియుఁ గోరిరి. ఆతఁడు శ్రాద్ధపాకా నంతరాశౌచనిర్ణయము, శిఖానిర్ణయవర్ణనము, అనాథప్రేతసంస్కార మున నశ్వమేధఫలవర్ణనము, స్త్రీ పునర్వివాహప్రాయశ్చిత్తవర్ణనము, గృహస్థులు రాత్రి చేయునుష్ణోదకస్నానవర్ణనము, భ్రాతృపుత్రాది పరిగ్రహణవర్ణనము, శ్రాద్ధాదిదివ్యశాకవర్ణనము, నిమంత్రణార్హా విప్రవర్ణనము, పరివేషణపౌర్వాపర్యవర్ణనము, నిమంత్రణబ్రాహ్మణ పూజావర్ణనము, అన్యగోత్రదత్తకపుత్రకృత్యవర్ణనము మున్నగునవి వారికి బోధించెను.

పూర్వాంగిరసస్మృతి యారంభ శ్లోకములు :

"పావకప్రతిమం సాక్షా న్మునిమాంగిరసమ్ ద్విజాఃు,
బ్రూహిధర్మానశేషాన్న ఇత్యూచుఃు ప్రణిపత్యతం."
"న వైదికఃు పురాణోక్తైఃు కర్మాణి మనుభిశ్చరేత్,
వేదోక్తైరేవ త్రైర్మంత్రైఃు నిఖలాని సమాచరేత్.
కర్మమధ్యే పురాణోక్తమంత్రోచ్చారణమాత్రతఃు,
నశ్యేత్తు వైదికం కర్మ తస్మాత్తు న తథాచరేత్."

అంత్యశ్లోకములు :

"సర్వేషాం కర్మణామాద్యా ఆపపవ విశేషతఃు
పరమాఃు కారణానీహ తస్మాద్బ్రాహ్మణపుంగవఃు.
ఆప ఏవ సమాశ్రిత్య వర్షంతే తోయదా మహత్
జలం తత్రైవ వర్తంతే తదేవ పరమం స్థలమ్.
ప్రభూతైధోదకగ్రామఃు సర్వదేశోత్తమోత్తమఃు
నదీతీరం విశేషేణ తచ్ఛతాధిక ముచ్యతే.
తత్రైవసకలాధర్మా అనుష్ఠేయాహి సంతతమ్
నదీ చ సజలాజ్ఞేయా న తచ్ఛూన్యా కదాచన."

ఇత్యాంగిరసస్మృతౌ పూర్వమాంగిరసమ్ సమాప్తమ్.

ఉత్తరాంగిరసమందలిప్రధానవిషయములు : ఆరంభము :

"విశ్వరూపం నమస్కృత్య దేవం త్రిభువనేశ్వరం
ధర్మస్యదర్శనార్థాయ అంగిరా ఇదమబ్రవీత్."

ధర్మపర్షద్భ్రాయశ్చిత్తవర్ణనము, పరిషదుపస్థానలక్షణము, ప్రాయశ్చిత్త విధానవర్ణనము, పరిషల్లక్షణవర్ణనము, ప్రాయశ్చిత్తనియంత్రకథనము, ప్రాయశ్చిత్తాచారకథనము, పాపపరిగణనము, శూద్రాన్నగర్హితవర్ణనము, అభక్ష్యభక్షణప్రాయశ్చిత్తము, హింసాప్రాయశ్చిత్తకథనము, గోవధప్రాయశ్చిత్తకథనము, కృచ్ఛ్రాదిస్వరూపకథనము మున్నగునవి.

మచ్చు శ్లోకములు :

"ప్రమాణాభిహితం యత్తు సర్వమంగిరసా తదా,
అప్రమేయప్రమాణస్య దుఃఖేనాధిగమో భవేత్.
తస్మా దంగిరసాపుణ్యం ధర్మశాస్త్రమిదంకృతం
ఉపస్థానవ్రతాదేశచర్యాశుద్ధిప్రకాశనమ్.
సధర్మస్తు కృతోజ్ఞేయః స్వాధిష్ఠానక ఏవవై
చతుర్భిః సాధనైశ్చైన ధర్మఃప్రోక్తః సనాతనః."

అంత్యశ్లోకములు :

"బ్రాహ్మణాపవ చ క్షేత్రం బ్రాహ్మణాపవ దైవతం
బ్రాహ్మణానాం ప్రసాదేన సూర్యో దివి విరాజతే.
న బ్రాహ్మణ సమం క్షేత్రం న బ్రాహ్మణసమోఽనలః
విధి ర్నబ్రాహ్మణా దూర్ధ్వం న దైవం బ్రాహ్మణాత్పరం.
జపతాం జిహ్వాతాంశ్చైవ యచ్ఛతాం చ సతామపి
క్షేత్రేఽగ్నేస్తు సుసంభూతో బ్రాహ్మణోద్య విశిష్యతే."
"యోహియాం దేవతామిచ్ఛేదారాధయితుమవ్యయం
సర్వోపాయప్రయత్నేన దోషయేద్బ్రాహ్మణాన్ సదా.
సతస్తసంపత్సమవాప్తి హేతవః
సముత్థితాపత్కలఘూమకేతవః,
అపారసంసారసముద్రసేతవః
పునంతుమాం బ్రాహ్మణపాదపాంసవః."

కణ్వస్మృతి

తొల్లి యొకప్పుడు బ్రహ్మవిత్తము లగుమునీశ్వరులు కణ్వ మహర్షిని జేరి సర్వయుగసనాతనసర్వధర్మములు తమకుఁ దెలుపు మని ప్రార్థించిరి. వేదవిదులలో నగ్రేసరుఁడు, సర్వలోకహిత కరుఁడు, మహాభాగుఁడు నగుకణ్వమహర్షి సర్వవైదికకృత్యములు ముఖ్యాముఖ్యగుణాగుణవిభజనమున సువిస్పష్టముగా వారికిఁ దెలి పెను. ఇదియే ''కణ్వస్మృతి'' యనఁ బ్రసిద్ధికెక్కెను. ఇందు ధర్మ సారవర్ణనము, ధర్మకర్తవ్యవర్ణనము, నిత్యనైమిత్తికకర్మఫలనిర్ణ యము, నిత్యకృత్యవర్ణనము, ప్రాతఃస్మరణకీర్తనవర్ణనము, ప్రాయ శ్చిత్తాదికము గలవు.

ధర్మసారనిరూపణమునఁ గణ్వుఁ డిట్లు పేర్కొనెను :

''క్రియా కర్తా కారయితా కారణం తత్ఫలం హరిః
సర్వ మీశ్వర మేవేతి బుద్ధిర్యస్య సదాస్థిరా.
స ఏవ కృతకృత్యోహి స తు జ్ఞానస్య భాజనం
తత్కృతస్యచ కార్యస్య వైగుణ్యం నైవ జాయతే.
కదా చిదపి కేనాపి నాత్రకార్యా విచారణా
యత్కించిద్వా కృతం తేన పరమేశ్వరతుష్టయే.
తదక్షయమమోఘం స్యాత్ బ్రహ్మజ్ఞానైకసాధకమ్
యథాశాస్త్రకృతం చ స్యాదశాస్త్రకృతమప్యలం.
పరమేశ్వరతుష్ట్యర్థకృతం తస్మాత్తథాచరేత్
తస్మాద్గుణసర్వత్ర పరమేశ్వర తుష్టయే.''

ప్రాతఃకాలమునఁ గీర్తింపవలసినవారిలో :

''పతివ్రతాః పార్వతీంవా అహల్యాం ద్రౌపదీం శివాం
తారాం మండోదరీం పుణ్యాం నిత్యకల్యాణసుందరీం.

సీతా మరుధతీం లక్ష్మీం భారతీం పరమేశ్వరీం
ఇంద్రాయణీం పునరన్యాశ్చ నిత్యకల్యాణమూర్తికాః
బ్రహ్మనిష్ఠాన్మహాభాగాన్బ్రాహ్మణాన్సంశితవ్రతాన్
లోకపాలాన్లోకనాథాన్ బ్రహ్మవిష్ణుమహేశ్వరాన్.

స్మృత్వా బహ్వృక్యసంధానం కృత్వా బ్రహ్మేహమిత్యపి
సర్వేభ్యశ్చ నమస్కార్యా న్నమో మహద్భ్యఇతివై వదేత్."

అని కణ్వుడు వక్కాణించెను.

బ్రహ్మవేత్త యగుబ్రాహ్మణునిలక్షణమును, కణ్వస్మృతిమహిమము, నిట్లు తెలుపబడినది :

"వైదికోయం విధిఃప్రోక్తః కర్మాంతే బ్రహ్మయజ్ఞకమ్
ప్రశ్నబ్రహ్మపరో యస్తు శాఖామాత్రేఽతిపావనే.
శాఖాధ్యాయీ మహాభాగః పంక్తిపావనపావనః
శాఖామాత్రైకదేశస్యాధ్యేనాచ్ఛ్రోత్రియత్వకమ్.
న ప్రాప్నోత్యేవ విధినా శాఖాధ్యాయీ తతోభవేత్
నిత్యస్నానస్సదాచారః సదావహ్నిః సదా శుచిః.
సదా తుష్ట స్సదా శాంతః సదా సూయా వివర్జితః
బ్రహ్మమేధక్రియాశుద్ధిః పూర్వతుల్యో భవత్యపి.
ఇత్యేతదుక్తం కణ్వేన మునినా ధర్మముత్తమమ్
శాస్త్రిణాం ప్రవరం శాస్త్రం హితాయ జగతాం తరాం."

ఇతి కణ్వస్మృతి సమాప్తా.

మహర్షుల చరిత్రలు

మొదటిభాగము : అగస్త్య, అత్రి, అష్టావక్ర, ఋష్యశృంగ,
కపిల, కశ్యప, గౌతమ, చ్యవన, జమదగ్ని, దత్తాత్రేయ,
దధీచి, దుర్వాసుల చరిత్రలు. రు. 2-50

రెండవభాగము : నారద, పరాశర, భరద్వాజ, భృగు,
మార్కండేయ, యాజ్ఞవల్క్య, వసిష్ఠ, విశ్వామిత్ర, వ్యాస,
శ్రీశుకుల చరిత్రలు. రు. 2-50

మూడవభాగము : అంగిరస, అరుణి, ఔర్వ, కండు, కణ్వ,
కర్దమ, కాశ్యప, గర్గ, గౌరముఖ, జడ, జాబాలి, మతంగ,
శంఖ, లిఖితుల చరిత్రలు. రు. 2-50

నాలుగవభాగము : జైమిని, దేవల, నర, నారాయణ, పిప్పలాద,
పులస్త్య, బకదాల్భ్య, మరీచి, మాండవ్య, ముద్గల, మైత్రేయ,
వైధ్య, రోమశుల చరిత్రలు. రు. 2-50

ఐదవభాగము : వామదేవ, వాల్మీకి, వైశంపాయన, శమీక,
శాండిల్య, శౌనక, సంవర్త, సనక, సనందన, సనత్కుమార,
సనత్సుజాత, హారీతుల చరిత్రలు. రు. 2-50

ఆఱవభాగము : ఆరణ్యక, ఉదంక, జైగీషవ్య, ధౌమ్య,
బృహస్పతి, మంకణ, మృగశృంగ, వ్యాఘ్రపాద, శుక్ర,
శ్వేతకేతుల చరిత్రలు. రు 2-50

ఏడవభాగము : ఉపమన్యు, ఋభు, కాత్యాయన, గృత్సమద,
తండి, మృకండు, వాత్స్యాయన, విపుల, సాందీపని,
సారస్వతుల చరిత్రలు. రు. 2-50

బి. వి. & సన్స్, రావూరివారిపేట, కాకినాడ.

1. "The history of ancient India is nothing other than the history of the Maharishis who shaped its culture, gave it its law and organised the society. If of all the cultures, our culture stands out as the foremost to-day it is due to the basic foundations laid by the Maharishis of the old. No country will become great unless the youngsters are taught to revere their ancestors who have made great contributions in various fields of human thought and activity. These "Lives of Saints" offer very interesting and useful reading. I feel that they must find a place in every home."

M. Ananta Sayanam Ayyamgar

---

2. "Sri Bulusu is a reputed scholar and a renowned writer on various topics of literary and cultural importance .. His 'Lives of Ancient Saints' give evidence of his profound scholarship in our ancient Indian lore..."

Dr. B. Rama Krishna Rao

---

3. "Sri Bulusu seems to be a great genius. He is partcularly interested in reviving the spiritual life of the people. His services to the Indian literature are marvellous."

A. Kaleswara Rao


---

4. "While yet young, the author felt the call of the higher life and has portrayed the life and the mission of the Ancient Indian Saints... who make our lives rejuvenated and shine with the flowers of Art and the fruits of God-love and God-realisation..."

K. S. Rama Swami Sastri

BCI

వాల్మీకిమహర్షి కిరాతుని శపించుట



"మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమశ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునాదేక మవధీ: కామమోహితమ్."

(చూ. ఐదవభాగము. పుట. 38)

ముసుము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA101B113
పుస్తకం పేరు	ప్రాచీనభారతవర్ష మహార్ష్యంచరిత్రలు03
తారీఖు	31 December 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	183
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	C.I BCI NO
లేని పేజీలు	P.Jayalakshmi
తయారు చేసినది	P.Jayalakshmi
పేజీలు విడదీసినది	Attendant
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	MADHU MATHI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
స్కానింగు చేసినది	
పంపినది	

171 · ~~BCI~~ 174 BCI